సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 278

శుక్రవారం 21-6-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'



అఫ్గాన్‌పై అలవోకగా..

'సూపర్-8' మ్యాచ్‌లో 47 పరుగుల తేడాతో నెగ్గిన భారత్ - 13లో



చల్ 'వాహన' రంగా..!

రూ. 2 లక్షల కోట్ల పెట్టుబడి ప్రణాళికలు.. ఈవీలపై పలు కంపెనీల కసరత్తు - 13లో



కేజ్రీవాల్‌కు బెయిల్

మద్యం స్కామ్‌లో మనీలాండరింగ్ అభియోగాలపై అరెస్టయిన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు కోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది.

వివరాలు 6లో ▸



మోదీ పేపర్ లీకేజీలు ఆపలేరా?

యుద్ధాలను ఆపే శక్తి ఉందనే ప్రధాని మోదీకి దేశంలో పేపర్ లీకేజీలను ఆపే శక్తి లేదా? అని కాంగ్రెస్ నేత రాహుల్ ప్రశ్నించారు.

వివరాలు 6లో ▸



రిజర్వేషన్ల పెంపు చెల్లదు

బీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను 65 శాతానికి పెంచుతూ బిహార్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పాట్నా హైకోర్టు కొట్టివేసింది.

వివరాలు 6లో ▸



నీట్ పేపర్ లీకేజీ నిజమే

'నీట్' లీక్ నిజమేనని బిహార్ పోలీసుల విచారణలో నిందితులు తెలిపారు. పరీక్షకు ముందు రోజు ప్రశ్నపత్రం, 'కీ' ఇచ్చారని చెప్పారు.

వివరాలు 6లో ▸





గురువారం తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో మాట్లాడుతున్న ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ప్రతి కార్యకర్తకూ తోడుగా ఉందాం

వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు వైఎస్ జగన్ దిశా నిర్దేశం

- 'స్థానిక' సంస్థల్లో నాలుగేళ్ల దాకా అవిశ్వాసం కుదరదు.. చట్టం నిరోధిస్తుంది
- చట్టాన్ని మార్చి ఏదో చేయాలనుకుంటే కోర్టులు ఒప్పుకోవు.. మన ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లను బెదిరించే యత్నాలు సాగవు
- ఎవరూ ఆందోళన చెందొద్దని మనవాళ్లకు వివరించండి.. మన సంఖ్యాబలం తక్కువే కాబట్టి అసెంబ్లీలో చేయగలిగేదీ తక్కువే
- స్పీకర్ పదవి చేపట్టనున్న వ్యక్తి ఎలా మాట్లాడారో అందరూ చూశారు
- జగన్ ఓడిపోయాడు కానీ.. చనిపోలేదు.. చచ్చేదాకా కొట్టాలన్న వ్యక్తిని స్పీకర్‌గా చేస్తున్నారు
- ఇలాంటి వ్యక్తుల మధ్య అసెంబ్లీలో మనం ఏదో చేయగలుగుతామనే నమ్మకం లేదు
- మన జెండా పట్టుకున్న ప్రతి ఒక్కరినీ కాపాడుకోవాలి
- మనల్ని నమ్ముకుని కొన్ని కోట్ల మంది ఉన్నారు.. ఏ ఒక్కరూ నష్టపోకూడదు
- ఎట్టి పరిస్థితుల్లోనూ నిరాశకు చోటివ్వద్దు
- మన అడుగులు ముందుకు వేయాల్సిందే

2లో

- ప్రతి అభిమాని, కార్యకర్తకూ భరోసా ఇవ్వాల్సిన బాధ్యత మనదే.. ఇప్పుడిది ఇంటర్వెల్ మాత్రమే.. శకుని పాచికల ఘట్టం
- శ్రీకృష్ణుడు తోడు ఉన్నా.. పాండవులూ ఓడారు.. అంతిమంగా ధర్మం, విశ్వసనీయత, నిజాయితీ గెలుస్తాయి
- ఎన్నికల ఫలితాలపై చాలామంది ఫీడ్ బ్యాక్ ఇస్తున్నారు.. మనం చేసిన మంచి ఇవ్వాళ్టికీ ప్రతి ఇంట్లోనూ ఉంది
- శిశుపాలుడిలా చంద్రబాబు పాపాలు పండే కొద్దీ ప్రజలతో కలసి పోరాడదాం

"ప్రభుత్వ కార్యాలయాల్లో మేనిఫెస్టో కనిపించిన పాలన మనదైతే.. ఇప్పుడు రెడ్ బుక్ హోర్డింగులు పెడుతున్నారు. ఏ అధికారిపై కక్ష సాధించాలి? ఎవరిపై దాడులు చేయాలి? ఎవరిని నాశనం చేయాలి? ఎవరిపై కక్ష సాధించాలి? అని అందులో ఏకంగా పేర్లు రాసుకుంటున్నారు. వాళ్లను కొడతాం, చంపుతామంటూ నిస్సిగ్గుగా దౌర్జన్యం చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. శిశుపాలుడి పాపాల మాదిరిగా ఈ ప్రభుత్వం పాపాలు వేగంగా పండుతున్నాయి. - వైఎస్ జగన్

'ఉక్కు'పాతర

విశాఖ స్టీల్ ఆస్తుల అమ్మకాలు షురూ

- అధికారం చేపట్టిన 10 రోజుల్లోనే బుద్ధిచూపించిన ఎన్‌డీఏ సర్కార్
- ప్లాంట్‌ను దివాలా సంస్థగా ముద్రవేసే ప్రయత్నం
- గత మార్చి 31కి రూ.4,979.15 కోట్ల ప్రతికూల నికర విలువ ఉన్నట్లు వెల్లడి
- మూలధనం సంక్షోభాన్ని అధిగమించే పేరుతో ఆస్తుల వేలానికి ఏర్పాట్లు
- ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, చెన్నైలలో ఖరీదైన ఆఫీస్ భవనాలు, స్టాక్ యార్డులు
- వాటి మార్కెట్ విలువ రూ.476.18 కోట్లు ఉంటుందని లెక్కలు
- నిరర్థక ఆస్తుల నెపంతో ఆస్తుల మానిటైజేషన్‌కు ఆర్ఐఎన్ఎల్ బోర్డు ఆమోదం
- తుది అనుమతుల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఓ వైపు కేంద్ర గనుల శాఖ మంత్రి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఇప్పట్లో జరగదని బాహాటంగా చెబుతుంటే.. మరోవైపు ప్లాంట్‌ని నిర్వీర్యంచేసే పనుల్ని చాపకింద నీరులా చేసుకుంటూపోతున్నారు. వర్కింగ్ క్యాపిటల్ కోసం విశాఖ స్టీల్‌ప్లాంట్ ఆస్తులను అమ్మకానికి పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. అధికారం చేపట్టిన 10 రోజుల్లోనే ఎన్‌డీఏ సర్కారు.. స్టీల్‌ప్లాంటుపై 'ఉక్కు'పాదం మోపుతున్నట్టు తెలుస్తోంది. స్టీల్‌ప్లాంట్ ఆస్తులు విక్రయించి.. దివాలా సంస్థగా చూపించేందుకు కుయుక్తులు పన్నుతున్నట్లు పరిస్థితులను గమనిస్తే అర్థమవుతోంది. మూలధన సంక్షోభాన్ని అధిగమించే పేరుతో ఆస్తుల వేలానికి ఏర్పాట్లు చేయడాన్ని గమనిస్తే

మిగతా 5వ పేజీలో ▶

కొనసాగుతున్న విధ్వంసం

రాష్ట్రవ్యాప్తంగా శిలాఫలకాలపై టీడీపీ శ్రేణుల దాడులు

ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం

వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లపై హత్యాయత్నం

రాయచోటిలో రెచ్చిపోయిన టీడీపీ నేత సయ్యద్ ఖాన్ గ్యాంగ్

రేపే 'సాక్షి'ని మూసేయిస్తా

ఉదయం 10 గంటలకు మూతేయకపోతే చూడండ్రా

టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి

- వివరాలు 10లో

భూములమ్మి రాజధాని నిర్మిస్తాం

అమరావతి పర్యటనలో సీఎం చంద్రబాబు

మొత్తం 55 వేల ఎకరాలు సేకరించాం



'అమరావతి' ప్రాంతంలో నీటిలోని నిర్మాణాలను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

- మిగులు భూములమ్మి రాజధాని కట్టుకోవచ్చు.. రాజధాని సంపదతోనే సంక్షేమ పథకాల అమలు
- రాజధాని పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేస్తాం
- భవిష్యత్తు కార్యాచరణపై అధ్యయనం చేయాల్సి ఉంది
- నదుల అనుసంధానం ద్వారా రాయలసీమ రతనాల సీమ అవుతుంది
- అమరావతి, పోలవరాన్ని సంపద సృష్టి కేంద్రాలుగా తీర్చిదిద్దుతాం
- ఆ రెండింటికీ ఆర్థిక సాయం చేస్తామని కేంద్రం గతంలోనే చెప్పింది

3లో

దాడులు కాదు.. సూపర్ 6 అమలెప్పుడు?

- ఇంకా ఎన్ని విధ్వంసాలు.. ఎంత మందిని చంపుతారు?
- ఊరూరా తిరుగుతాం.. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం
- హామీలు అమలు చేయలేకే రుషికొండపై చంద్రబాబు, ఎల్లోమీడియా దుష్ప్రచారం

2లో

- ప్రభుత్వ, పర్యాటకుల అవసరాల కోసమే ఏడు భవంతుల నిర్మాణం
- ఆ భవనాలన్నీ ప్రభుత్వానివే.. వైఎస్ జగన్‌వి కాదని తెలుసుకోవాలి
- రూ.100 కోట్ల కార్యక్రమంలో రూ.100 కోట్ల స్కామా!?
- నిరుద్యోగ భృతి ఎప్పటి నుంచి ఇస్తారో చెప్పాలి.. మేం ప్రజల మధ్యే ఉంటాం.. ప్రజల కోసమే పోరాడుతాం
- మాజీ మంత్రులు కొడాలి నాని, రోజా, గుడివాడ అమర్నాథ్, సీదిరి అప్పలరాజు, మాజీ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే సుధా ధ్వజం



నాన్ సబ్సిడీ సీడ్ పంపిణీ ఎప్పుడో?

- ఎన్నికలకు ముందే విత్తన కంపెనీలను సిద్ధం చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఎన్నికల కోడ్‌తో ఆగిన ఒప్పందాలు
- ఒక్క అడుగూ ముందుకు వేయని నూతన ప్రభుత్వం.. ఆర్బీకేల ద్వారా నాన్ సబ్సిడీ విత్తన పంపిణీపై నీలినీడలు
- విత్తనాలు ఎప్పుడు వస్తాయో తెలియక రైతుల ఆందోళన

14లో

బోగీల్లో మంటలు

వరుస అగ్ని ప్రమాదాలతో ప్రయాణికుల్లో ఆందోళన | రైల్వేయార్డులు, పిట్‌లైన్‌లలో భద్రత కరువు | అసాంఘిక శక్తులకు అడ్డాగా మారుతున్న వైనం

సాక్షి, హైదరాబాద్/ సికింద్రాబాద్:

నగరంలోని ఏదో ఒక రైల్వేస్టేషన్‌లో తరచు అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. గురువారం ఏసీ బోగీల్లో మంటలు చెలరేగిన సమయంలో అదృష్టవశాత్తు ప్రయాణికులెవరూ లేరు.

→ గతంలో నాంపల్లి స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌పైన నిలిపి ఉన్న నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లోనూ ఇలాగే మంటలు చెలరేగాయి. అప్పటికే ప్రయాణికులు దిగి వెళ్లిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ట్రైన్‌లో పేలుడు స్వభావం ఉన్న పదార్థాల వల్లనే మంటలు అంటుకున్నట్టు అప్పట్లో గుర్తించారు.

→ సికింద్రాబాద్ స్టేషన్‌లోనూ చార్మినార్ ఎక్స్‌ప్రెస్ కూడా ప్రమాదానికి గురైంది. విశాఖ నుంచి నగరానికి చేరుకున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ రైల్వే యార్డుకు చేరుకున్న కొద్ది సేపటికే అగ్నిప్రమాదానికి గురైన సంఘటన నాలుగేళ్ల క్రితం తీవ్ర భయాందోళనకు గురి చేసింది. ప్రయాణికులు సికింద్రాబాద్ స్టేషన్‌లో దిగిన కొద్ది సేపటికే ఈ ప్రమాదం జరగడం గమనార్హం.ఒకవేళ యార్డుకు చేరుకోకముందే అగ్నిప్రమాదం చోటుచేసుకొని ఉంటే భారీ ఎత్తున ప్రాణనష్టం జరిగి ఉండేది. ఇలా తరచుగా ఏదో ఒక ట్రైన్‌లో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. కొన్ని రైళ్లలో పొగలు రావడంతోనే గుర్తించి తక్షణమే చర్యలు చేపట్టిన సందర్భాలు ఉన్నాయి. కొన్నిసార్లు భారీ ఎత్తున మంటలు అంటుకొని ప్రయాణికులు, అధికారులు, సిబ్బందిని భయాందోళనకు గురి చేసిన సంఘటనలూ ఉన్నాయి.



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

ఏసీ కోచ్‌ల్లో అగ్ని ప్రమాదం

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి గురువారం ఉదయం 10.30 గంటలకు ఏసీ కోచ్‌లను వాషింగ్ కోసం మెట్టుగూడ వద్దనున్న క్లీనింగ్ పిట్ యార్డ్ తీసుకెళ్లారు. క్లీనింగ్ పూర్తయ్యాక 11 గంటల ప్రాంతంలో తిరిగి రైల్వే స్టేషన్‌కు తరలిస్తుండగా ఏసీ బోగీల్లో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి, దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. ఇది గమనించిన చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రైల్వే అధికారులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న రైల్వే సిబ్బంది స్టేషన్లో మంటలు ఆర్పే యంత్రాలతో తగలబడుతున్న బోగీలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. మంటలు ఇతర బోగీలకు వ్యాపించకుండా రైల్వే సిబ్బంది జాగ్రత్తలు తీసుకుంటున్న సమయంలోనే అక్కడకు చేరుకున్న ఫైర్ ఇంజన్లు మంటలను అదుపు చేశాయి. రైలు కోచ్‌లలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో రెండు బోగీలు దగ్ధమయ్యాయి. విషయం తెలియగానే దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ సంఘటన స్థలాన్ని సందర్శించారు. ప్రమాదంపై సమీక్షించి, భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డివిజనల్ అధికారులను ఆదేశించారు.

ఇదండీ సంగతి



కమిటీల పనితనంపై కూడా మరో మూడు కమిటీలు వేద్దాం సార్!!

కప్పం కడతారా.. కంపెనీ మూసేస్తారా

లారీకి రూ.వేయి.. నెలకు రూ.1.50 కోట్లు

యూబీ బీరు కంపెనీకి ఎచ్చెర్ల ఎమ్మెల్యే ముఠా అల్టిమేటం

- కాదన్నందుకు కంపెనీపై దాడి.. విధ్వంసం.. కంపెనీ ప్రతినిధులను చితకబాదిన దుండగులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు.. కేంద్ర హోం శాఖ ఆదేశంతో ఎట్టకేలకు కేసు నమోదు
- కంపెనీ ప్రతినిధులపై అట్రాసిటీ కేసు పెట్టిన ఎమ్మెల్యే వర్గీయులు
- మంత్రి అచ్చెన్నాయుడు రంగప్రవేశం
- ఎమ్మెల్యే వెనుక ఎవరున్నారో అర్థం చేసుకున్న కంపెనీ ప్రతినిధులు
- ఎమ్మెల్యే ఇంటికి వెళ్లిన కంపెనీ ప్రతినిధులు
- మామూళ్లకు సమ్మతించి ఉత్పత్తి ప్రారంభించాలని ఎమ్మెల్యే ఆదేశం
- తప్పనిసరై సరేనన్న కంపెనీ ప్రతినిధులు
- అధికార కూటమి నిర్వాకంతో హడలిపోతున్న పారిశ్రామికవేత్తలు

3లో



ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావుతో చర్చలు జరుపుతున్న యూబీ కంపెనీ ప్రతినిధులు



జోసా కౌన్సెలింగ్‌లో

జోష్

- ఐఐటీల్లో ఈ ఏడాది 900 అదనపు సీట్లు
- ఎక్కువ మందికి సీట్లు వచ్చే అవకాశం
- సీట్లు పెరగడంతో భారీగా పెరిగిన కటాఫ్ ర్యాంకులు
- తొలి దశ సీట్లు కేటాయింపు పూర్తి
- టాపర్ల మొగ్గు ఐఐటీ బాంబే వైపే

14లో

క్లుప్తంగా...

రాష్ట్రపతికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వైఎస్ జగన్

సాక్షి,అమరావతి: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పుట్టినరోజు సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

నేటి నుంచి అసెంబ్లీ

సాక్షి, అమరావతి: అసెంబ్లీకి కొత్తగా ఎన్నికైన సభ్యులతో ప్రమాణం చేయించేందుకు శుక్రవారం ఉదయం 9.46 గంటలకు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. శుక్ర, శనివారాలు కొత్తగా ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి శనివారం అసెంబ్లీ స్పీకర్ ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ సమావేశాల లైవ్ కవరేజ్‌ను అసెంబ్లీ ప్రాంగణంలోని మీడియా పాయింట్ నుంచి మీడియాకు ఇవ్వనున్నట్లు సమాచార శాఖ తెలిపింది.

ప్రొటెం స్పీకర్‌గా బుచ్చయ్య



బుచ్చయ్య చౌదరితో ప్రమాణం చేయిస్తున్న గవర్నర్

సాక్షి, అమరావతి: రాష్ట్ర శాసనసభ ప్రొటెం స్పీకర్‌గా గోరంట్ల బుచ్చయ్య చౌదరితో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పదవీ స్వీకార ప్రమాణం చేయించారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ను ప్రొటెం స్పీకర్‌గా ఎంపిక చేసినట్టు గవర్నర్ జారీ చేసిన నోటిఫికేషన్‌ను శాసనసభ సెక్రటరీ జనరల్ పి.పి.కె. రామాచార్యులు చదివి వినిపించారు. అనంతరం బుచ్చయ్య చౌదరి ముందుగా ఎమ్మెల్యేగా ప్రమాణం చేయగా, అనంతరం ఆయనతో ప్రొటెం స్పీకర్‌గా గవర్నర్ పదవీ స్వీకార ప్రమాణం చేయించారు.

ముగ్గురు ఐపీఎస్ అధికారుల బదిలీ

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ముగ్గురు ఐపీఎస్ అధికారులను గురువారం ప్రభుత్వం బదిలీ చేసింది. గతంలో పూర్తి అదనపు బాధ్యతలతో డీజీపీగా వ్యవహరించిన ఏసీబీ డీజీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డిని ప్రింటింగ్ స్టేషనరీ కమిషనర్‌గా నియమించింది. విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక శాఖ డీజీ పీవీ సునీల్‌కుమార్, కౌంటర్ ఇంటిలిజెన్స్ విభాగం ఎస్పీ రిశాంత్‌రెడ్డిలను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలంది. అదనపు డీజీ (శాంతిభద్రతలు) శంకబ్రాత బాగ్చికి విపత్తుల నివారణ అగ్నిమాపక శాఖ అదనపు డీజీగా, ఏపీ ఎస్పీ అదనపు డీజీ అతుల్‌సింగ్‌కు ఏసీబీ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించింది.

ఆ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోండి: యూటీఎఫ్

సాక్షి, అమరావతి: ఎన్నికల విధుల్లో భాగంగా సస్పెన్షన్‌కు గురైన ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఇవ్వాలని యూటీఎఫ్ నాయకులు ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు విజ్ఞప్తి చేశారు. గురువారం పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుతో కలిసి యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, ప్రసాద్ సచివాలయంలో మీనాను కలిసి వినతిపత్రమిచ్చారు. మాచర్ల నియోజకవర్గంలో సస్పెండ్ అయిన పీవో, ఏపీవోలకు పోస్టింగ్‌లివ్వాలని, ఎన్నికల విధులకు హాజరు కాలేదన్న కలెక్టర్లు సస్పెండ్ చేసిన ఉపాధ్యాయుల వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

ప్రతి కార్యకర్తకూ తోడుగా ఉందాం

వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు వైఎస్ జగన్ దిశా నిర్దేశం

సాక్షి, అమరావతి: ''మన కార్యకర్తలు కష్టాల్లోనూ, నష్టాల్లోనూ మనతోనే నిలబడ్డారు. జెండాలు మోసి కష్టపడ్డారు. మనకు ఓట్లు వేసి దెబ్బలు కూడా తిన్నారు. ప్రతి కార్యకర్తకూ తోడుగా నిలిచి భరోసా ఇద్దాం'' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. ఎన్నికల్లో శాసనసభ, లోక్‌సభ స్థానాలకు పోటీ చేసిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులతో గురువారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. సోషల్ మీడియా కార్యకర్తలను, మనకోసం నిలబడ్డ వలంటీర్లను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో మన పార్టీ జెండా పట్టుకున్న ప్రతి ఒక్కరినీ కాపాడుకోవాలని, వారికి తోడుగా ఉండాలని ఆదేశించారు. ''రాష్ట్రంలో గతంలో ఎప్పుడూ చూడని రీతిలో మన కార్యకర్తలు, సానుభూతిపరులమీద దాడులు చేస్తున్నారు. మనకు ఓటు వేసిన వారి మీద దాడులు చేస్తున్నారు. తీవ్రంగా అవమానించడంతోపాటు ఆస్తులకు నష్టం చేకూరుస్తున్నారు. ప్రాణాలు కోల్పోవడం కూడా కొన్ని చోట్ల చూశాం'' అని పేర్కొన్నారు. ''మీ అందరికీ ఒక్కటే చెబుతున్నా.. మీ నియోజక వర్గాలలో కార్యకర్తలకు తోడుగా ఉంటూ పరామర్శించి భరోసా కల్పించండి. సోషల్ మీడియా కార్యకర్తలు, మనకోసం నిలబడ్డ వలంటీర్లకు తోడుగా నిలవాలి. ఇప్పటికే పార్టీ తరఫున ఆదుకునే కార్యక్రమాలు చేస్తున్నాం. పార్టీ ఇచ్చే సహాయాన్ని మీరు స్వయంగా అందచేయండి'' అని అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. ''రాబోయే రోజుల్లో నేను కార్యకర్తలను కలుస్తా. నష్టపోయిన ప్రతి కార్యకర్త ఇంటికి వెళ్లి కలసి భరోసానిచ్చే కార్యక్రమం చేస్తా. మా ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ అభ్యర్థి మా వద్దకు రాలేదనే మాట అనిపించుకోవద్దు. ప్రతి కార్యకర్తకూ భరోసా కల్పిద్దాం. ఇది అవసరం'' అని సూచించారు. ''మనల్ని నమ్ముకుని కొన్ని కోట్ల మంది ఉన్నారు. మనం పక్కకు తప్పుకుంటే వారంతా నష్టపోతారు. లక్షల మంది కార్యకర్తలు, వేలమంది నాయకులు, వందల మంది పోటీచేసిన అభ్యర్థులు కూడా నష్టపోతారు. మనల్ని నమ్ముకున్న ప్రజలు, నాయకులు అంతా నష్టపోతారు. నిరాశకు ఎట్టి పరిస్థితుల్లోనూ చోటివ్వకూడదు. ధైర్యంగా అడుగులు ముందుకు వేయాలి' అని ధైర్యం చెప్పారు. ప్రతి అభిమానికీ, ప్రతి కార్యకర్తకూ భరోసా ఇవ్వాల్సిన బాధ్యత మనదేనని స్పష్టం చేశారు. ''ఇప్పుడిది కేవలం ఇంటర్వెల్ మాత్రమే. శ్రీకృష్ణుడు తోడుగా ఉన్నా పాండవులకు ఓటమి తప్పలేదు. చివరకు ధర్మం, విశ్వసనీయత, నిజాయితీ తప్పకుండా. మనం ధర్మం వైపే ఉన్నాం. విశ్వసనీయతతో రాజకీయాలు చేశాం. తలెత్తుకునేలా రాజకీయాలు చేశాం. ప్రతి ఒక్కరూ అర్జునుడి మాదిరిగా తిరిగి విజయం సాధిస్తారు. పైన దేవుడున్నాడు. ఆయనే మనకు తోడుగా ఉండి నడిపిస్తాడు. ప్రజలను, దేవుడ్ని నమ్ముకున్నాం. ధైర్యంగా అడుగులు వేద్దాం'' అంటూ దిశానిర్దేశం చేశారు. సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..



బాధ అనిపించింది..

గతంలో ఎప్పుడూ ఇలాంటి మార్పులు జరగలేదు. ఇన్ని చేశాక వచ్చిన ఫలితాలు చాలా ఆశ్చర్యాన్ని కలిగించాయి. ఇవేవీ చేయకపోయి ఉంటే... చేయలేదు కాబట్టి ప్రతిపక్షంలో కూర్చుంటున్నామనే దానికి అర్థం ఉండేది. ఇంత బాధ కూడా ఉండేది కాదు. కానీ ఇన్ని చేసిన తర్వాత, ఎప్పుడూ చూడని మార్పులు తీసుకొచ్చిన తర్వాత కూడా ఇలాంటి ఫలితాలు చూసిన తర్వాత బాధ అనిపించింది. ఫలితాలు చూసిన తర్వాత శకుని, పాచికల కథ గుర్తుకొచ్చింది. శకుని పాచికల మాదిరిగా ఎన్నికల ఫలితాలు వచ్చాయి. కానీ ఆధారాలు లేకుండా మాట్లాడలేం.

మేనిఫెస్టో అజెండాగా పాలన..

ఈ రోజు నేను మీ అందరితో నా మనసు నుంచి వచ్చిన విషయాలను పంచుకుంటున్నా. ఈ ఎన్నికల్లో మీరంతా గట్టి పోరాటం చేశారు. ఎన్నికల ఫలితాలు ఎందుకు ఇలా వచ్చాయన్నది ఇవ్వాళ్టికీ ఆశ్చర్యకరం. ఎందుకంటే ఎప్పుడూ ఊహించని విధంగా, ఎప్పుడూ జరగని విధంగా, మనలో ప్రతి ఒక్కరూ తలెత్తుకునేలా పాలన చేశాం. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా మేనిఫెస్టో హామీలను 99 శాతం అమలు చేశాం. ప్రతి ఇంటికీ మేనిఫెస్టోతో వెళ్లి ఆశీస్సులు తీసుకుని ఎన్నికలకు వెళ్లాం. ప్రతి గడపకూ తిరిగాం. రాష్ట్ర చరిత్రలో మేనిఫెస్టోను ఇంత సీరియస్‌గా ఎవరూ, ఎప్పుడూ తీసుకోలేదు. ఎన్నికల్లో పెద్ద పెద్ద మాటలు చెప్పి, పెద్ద పెద్ద పుస్తకాలు ముద్రించి ఆ తర్వాత మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేసిన పరిస్థితులను మనం చూశాం. మొట్టమొదటిసారిగా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయాల వరకూ మేనిఫెస్టోలు పెట్టి అమలు చేశాం. ప్రతి డిపార్ట్‌మెంట్‌లో హెచ్‌ఓడీల కార్యాలయాల్లో మన మేనిఫెస్టో పెట్టి అదే అజెండాగా పాలన చేశాం. వారందరినీ మొట్ట మొదటి రోజు నుంచి సమాయాత్తం చేసి అమలు చేసుకుంటూ ముందుకు వెళ్లాం.

సంస్కరణలతో విప్లవాత్మక మార్పులు..

ఎప్పుడూ జరగని విధంగా పేదవాడిని ఆ పేదరికం నుంచి బయటకు తెస్తూ మన అడుగులు పడ్డాయి. క్వాలిటీ చదువుల వల్లే ఇది సాధ్యమని భావించి విద్యారంగంలో సమూల సంస్కరణలు తెచ్చాం. మూడో తరగతి పిల్లలకు టోఫెల్ పీరియడ్, ఇంగ్లిషు మీడియం బడులు, ఆరో తరగతి నుంచే ఐఎఫ్‌పీలు, 8వ తరగతి పిల్లలకు ట్యాబ్‌లు.. ఇలా ఎన్నో మార్పులు తెచ్చాం. వైద్య రంగంలో సమూల మార్పులు తీసుకొచ్చాం. ఆరోగ్యశ్రీ కింద ఏకంగా రూ.25 లక్షల వరకూ వైద్యం ఉచితంగా అందించాం. ఆరోగ్య ఆసరా నుంచి గ్రామ స్థాయిలో విలేజ్ క్లినిక్ ద్వారా ప్రతి పేదవాడికి తోడుగా ఉన్నాం. ఏకంగా 54 వేలమంది డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందిని నియమించాం. వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి ఆర్బీకేల ద్వారా రైతన్నలకు తోడుగా నిలిచాం.

గ్రామ స్వరాజ్యానికి నిర్వచనం..

విద్య, వైద్యం, వ్యవసాయం, సామాజిక న్యాయం, సుపరిపాలనలో మనం ఎక్కడా తగ్గలేదు. మొట్టమొదటిసారిగా గ్రామ స్థాయిలో ఎన్నో మార్పులతో గ్రామ స్వరాజ్యానికి అర్థం తీసుకొచ్చాం. లంచాలు, వివక్ష లేని పాలన కచ్చితంగా సాధ్యమేనని గత ఐదేళ్లలో నిరూపించాం. ప్రతి పథకాన్ని డోర్ డెలివరీ చేశాం. మహిళా సాధికారితకు ఏం చేయవచ్చో అన్నీ చేశాం. అక్కచెల్లెమ్మలు ధైర్యంగా బయటకు వెళ్లే పరిస్థితి కల్పించాం. దిశ యాప్ ద్వారా మహిళల భద్రతకు గట్టి చర్యలు తీసుకున్నాం. గ్రామంలోనే మహిళా పోలీసుల సేవలను తీసుకొచ్చాం.

చేసిన మంచే శ్రీరామరక్ష..

ఇంత జరిగిన తర్వాత కూడా ఏకంగా 40 శాతం ఓటు షేర్‌తో మనం ప్రతిపక్షంలో ఉన్నాం. 2019లో మనకు 50 శాతం ఓట్లు వచ్చాయి. ఈసారి 10 శాతం ఓట్లు తగ్గాయి. ఇదే ప్రజలు మళ్లీ 2029 వచ్చేసరికి చంద్రబాబు మోసాలను గుర్తించి రెట్టించిన ఉత్సాహంతో మళ్లీ మనల్ని తెచ్చుకుంటారు. ఇవ్వాళ్టికి కూడా మనం చేసిన మంచి ఎక్కడికీ పోలేదు. ఈరోజు కూడా ప్రతి గడపలోనూ మనం చేసిన మంచి కనిపిస్తుంది. ప్రతి కుటుంబానికీ, ప్రతి ఇంటికీ మనం చేసిన మంచేమిటో తెలుసు. మనం చేసిన మంచే ఎప్పటికీ మనకు శ్రీరామరక్ష. విశ్వసనీయతకు మన పార్టీ చిరునామా. జగన్ మాట తప్పడు, మాట మీద నిలబడతాడు, మాట తప్పని పాలన ఇచ్చాడని విశ్వసనీయతకు అర్థం చెబుతూ మనం అందించిన పాలనను ప్రజలు మరిచిపోరు.

చంద్రబాబు సింగిల్ డిజిట్ చూస్తారు..

ఈరోజుకీ జగన్ అబద్ధాలు చెప్పడు, మోసం చేయడని గర్వంగా చెబుతున్నా. చంద్రబాబు కన్నా మనం ఎక్కువ హామీలిచ్చి ఉంటే బాగుండేదని చాలా మందికి అనిపించవచ్చు కూడా! రాజకీయాల్లో జగన్ ఇంత నిజాయితీగా ఉండడం అవసరమా? అనుకునే వాళ్లూ ఉండొచ్చు! కానీ ఒక్కటే చెబుతున్నా... ఓడిపోయినా ఫర్వాలేదు. అధికారం కోసం అబద్ధాలు చెప్పడం, మోసం చేయడం.. ధర్మం, న్యాయం కాదనే జగన్ ఎప్పుడూ నమ్ముతాడు. 2014లో కూడా ఇదే నమ్మా. సాధ్యం కానిది సాధ్యం కాదనే చెప్పాను. చంద్రబాబు వ్యవసాయ రుణాల మాఫీ దగ్గర నుంచి అన్నీ చేస్తానని చెప్పి 2019 నాటికీ చేయకపోవడం వల్ల నాడు ప్రజలు రెట్టించిన ఉత్సాహంతో మనల్ని అధికారంలోకి తీసుకొచ్చారు. మనకు గొప్ప విజయంతో అధికారం ఇచ్చారు. ప్రజలు మళ్లీ అదే చేస్తారు. ప్రజలు మనల్ని ఏ స్థాయిలో ఆశీర్వదిస్తారంటే.. చంద్రబాబు నాయుడికి సింగిల్ డిజిట్ వచ్చే పరిస్థితులు కూడా చూస్తాం. ఇది వాస్తవం.



ప్రజలతో కలసి పోరాటాలు చేద్దాం..

మనం చేసిన మంచి ఎక్కడికీ పోలేదు. విశ్వసనీయతతో మనం చేసిన రాజకీయాలు ఎక్కడికీ పోలేదు. ఈ రోజు నేను చెబుతున్నా.. జగన్‌కు వయసుతోపాటు సత్తువ కూడా ఉంది. చంద్రబాబు పాపాలు పండే కొద్దీ ప్రజలతో కలసి చేసే పోరాటాల్లో వైఎస్సార్‌సీపీకి, జగన్‌కు ఎవరూ సాటిరారు. ప్రజలకు మళ్లీ దగ్గరయ్యే కార్యక్రమాలు, వారికి తోడుగా ఉంటూ వారి తరఫున పోరాటం చేసే కార్యక్రమాలు జరుగుతాయి. మన సంఖ్యాబలం తక్కువే కాబట్టి అసెంబ్లీలో మనం చేయగలిగేది తక్కువే. స్పీకర్ పదవి చేపట్టనున్న వ్యక్తి మాట్లాడుతున్న మాటలను మనం సోషల్ మీడియాలో చూస్తున్నాం. ఒకరేమో జగన్ ఓడిపోయాడు కానీ.. చనిపోలేదు అని అంటారు. చచ్చేదాకా కొట్టాలి అని ఇంకొకరు అంటారు. ఆ వ్యక్తిని ఇప్పుడు స్పీకర్ పదవిలోకి తీసుకెళ్తున్నారు. ఇలాంటి వ్యక్తుల మధ్య అసెంబ్లీలో మనం ఏదో చేయగలుగుతామనే నమ్మకం లేదు. కానీ చంద్రబాబు పాపాలు పండేకొద్దీ ప్రజలతో కలిసి, ప్రజల మధ్య నిలబడి పోరాటం చేసే కార్యక్రమాలు రాబోయే రోజుల్లో ఊపందుకుంటాయి. శిశుపాలుడి పాపాలు పండినట్టుగా చంద్రబాబు నాయుడు పాపాలు వేగంగా పండుతున్నాయి. కులం, మతం, ప్రాంతం చూడకుండా, చివరకు ఏ పార్టీకి ఓటు వేశారని కూడా చూడకుండా ప్రతి పథకాన్ని మనం డోర్ డెలివరీ చేశాం. కానీ ఇవాళ వారి పార్టీకి ఓటు వేయలేదన్న ఒకే ఒక్క కారణంతో ఏకంగా మనుషులపై దాడులు చేస్తున్నారు, అవమానిస్తున్నారు. ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ ఇంత అన్యాయంగా వ్యవహరిస్తున్నారంటే శిశుపాలుడి పాపాలు చాలా వేగంగా పండుతున్నాయి.

ప్రతి ఇంటికీ తలెత్తుకుని వెళ్లగలం..

ఓడిపోయామన్న భావనను మీ మనసులో నుంచి తీసేయండి. మనం చేసిన మంచి ప్రజల్లో ఉంది. ప్రతి ఇంట్లో కూడా మనం చేసిన మంచి ఉంది. ప్రతి ఇంటికీ మనం తలెత్తుకుని వెళ్లగలం. చెప్పినవన్నీ చేశాం కాబట్టి ప్రజల మధ్యకు గౌరవంగా వెళ్లగలుగుతాం. చంద్రబాబు ప్రలోభాల వల్ల మోసపోయిన పరిస్థితులతో మనకు అంతో ఇంతో అపజయం జరిగింది. ఆ మోసాలు ఎప్పుడైతే తేటతెల్లం అవుతాయో.. కాలం గడుస్తున్న కొద్దీ చంద్రబాబుపై ప్రజాగ్రహం, మన పట్ల అభిమానం వ్యక్తం అవుతుంది. మనం మళ్లీ రికార్డు మెజార్టీలతో గెలుస్తాం.

నాలుగేళ్లు అవిశ్వాసానికి ఆస్కారం లేదు

స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు భరోసా కల్పించాలన్న వైఎస్ జగన్

మన ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు అందరితో మాట్లాడి భరోసా ఇవ్వండి. వారిని బెదిరించే కార్యక్రమాలు, ప్రలోభాలు జోరుగా జరుగుతున్నాయి. రాజీనామాలు చేయాలని వారిని బెదిరిస్తున్నారు. మీ నియోజకవర్గాల్లో కార్యకర్తలను, నాయకులను పిలిచి చెప్పండి. స్థానిక సంస్థలకు సంబంధించి వారిపై నాలుగేళ్ల వరకూ కూడా అవిశ్వాసం పెట్టే అవకాశం లేదు. చట్టం దీన్ని నిరోధిస్తుంది. ఆ చట్టాన్ని మార్చి ఏదో చేయాలనుకుంటే ఏమీ చేయలేరు. కోర్టులు దీనికి ఒప్పుకోవు. అందువల్ల ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ విషయాలన్నీ మనవాళ్లకు విడమరచి చెప్పాలి. వారికి తోడుగా ఉన్నామనే ధీమా కల్పించాలి. అప్పుడు వారిలో భరోసా కలుగుతుంది. మీరంతా ఈ కార్యక్రమాన్ని కచ్చితంగా చేయాలి.

హోదా అడగకపోవడం శిశుపాలుడి పాపాల్లో ఒకటి..

కేంద్రంలో మెజారిటీ కోసం 272 స్థానాలు అవసరం కాగా బీజేపీ 240 దగ్గర ఆగిపోయింది. చంద్రబాబుకు 16 ఎంపీ స్థానాలున్నాయి. తాను ఎన్‌డీఏలో చక్రం తిప్పుతున్నట్టుగా ప్రధాని మోదీ పక్కన కూర్చుని కనిపిస్తాడు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదాను అడగకపోవడం, అడిగి సాధించుకునే దిశగా అడుగులు వేయకపోవడం శిశుపాలుడి పాపాల్లో ఒకటి. అలా అడగలేని మనిషి రాష్ట్రానికి, యువతకు ఏం సమాధానం చెబుతాడు?

హనీమూన్ ముగుస్తుంది..

ఇవాళ వైఎస్సార్‌సీపీ పాలన, జగన్ ఉండి ఉంటే ఈపాటికే విద్యాదీవెన ఇచ్చేవాళ్లం. ఏప్రిల్‌లో ఇవ్వాల్సిన వసతి దీవెన బటన్ నొక్కేవాళ్లం. ఇవి పెండింగ్‌లో ఉన్నాయి. రైతు భరోసా పెండింగ్, అమ్మ ఒడి పెండింగ్, చివరకు చిన్న అమౌంట్ అయిన మత్స్యకార భరోసా కూడా పెండింగ్‌లోనే పెట్టారు. ఒక్క జగన్ తప్పుకోవడంతో, వైఎస్సార్‌సీపీ పాలన లేకపోవడంతో ఏమీ రావడం లేదని ప్రజలు గమనిస్తున్నారు. ఏపీలో 4.12 కోట్ల మంది ఓటర్లున్నారు. దాదాపు సగానికిపైగా అక్కచెల్లెమ్మలే ఉన్నారు. రూ.1,500 ప్రతి ఒక్కరికీ ఇస్తానని చంద్రబాబు చెప్పాడు. ఇందులో పెన్షన్లు తీసుకునే వాళ్లని పక్కనపెట్టినా మిగిలిన 1.8 కోట్ల మంది ఎదురు చూస్తున్నారు. రూ.20 వేల పెట్టుబడి సహాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. దాదాపు కోటి మంది పిల్లలు అమ్మ ఒడి కింద వచ్చే డబ్బులు కోసం నిరీక్షిస్తున్నారు. వీరి కోసం అడుగులు ఏవీ ముందుకు పడని పరిస్థితి నెలకొంది. కాలం గడుస్తున్న కొద్దీ హనీమూన్ పీరియడ్ ముగుస్తుంది.

ఆ ప్రేమలు, ఆప్యాయతలు ఏమయ్యాయో?

ఏకంగా 99 శాతం హామీలను అమలు చేసి తలెత్తుకుని సగర్వంగా ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగాం. కానీ ఫలితాలు చూస్తే చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. ఎప్పుడూ చూడని విధంగా ఏకంగా రూ.2.7 లక్షల కోట్లు ప్రజలకు డీబీటీ ద్వారా నేరుగా అందచేశాం. ఏ పథకం ఏ నెలలో ఇస్తామో ముందే క్యాలెండర్ ప్రకటించి తేదీల వారీగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేశాం. ఇలా ఎప్పుడూ ఇలా జరగలేదు. మరి ఆ ప్రేమలు, ఆప్యాయతలు ఏమయ్యాయి? అని ఒక్కోసారి అనిపిస్తుంది. మనం అధికారంలోకి రావడానికి రెండు నెలల ముందు వరకు పెన్షన్ కేవలం రూ.వెయ్యి మాత్రమే ఇచ్చిన పరిస్థితి ఉంటే మనం ఏకంగా రూ.3 వేలకు పెంచాం. అప్పట్లో 39 లక్షల మంత్రి మాత్రమే పెన్షనర్లు ఉంటే మనం వచ్చాక ఏకంగా 66 లక్షల మందికి లబ్ధి చేకూరుస్తూ పింఛన్లు ఇంటి వద్దే వారి చేతికే అందించాం. వాళ్ల ఆశీస్సులు తీసుకున్నాం. మరి ఆ 66 లక్షల మంది అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతు అక్కచెల్లెమ్మల ఆప్యాయతలు, ప్రేమలు ఏమయ్యాయి? 54 లక్షల మంది తల్లులకు అమ్మ ఒడి అందించాం. పిల్లలు గొప్పగా చదవాలి, వారికి మంచి భవిష్యత్ ఉండాలనే తపనతో అమ్మఒడి ఇచ్చాం. వాళ్ల ప్రేమలు, ఆప్యాయతలు ఏమయ్యాయో తెలియదు. ఏకంగా 53.58 లక్షల మంది రైతన్నలకు పెట్టుబడి సహాయం కింద రైతు భరోసా ఇచ్చాం. వ్యవసాయ రంగంలో ఇవి ఎప్పుడూ చూడని విప్లవాత్మక మార్పులు. మరి వారి ప్రేమలు, ఆప్యాయతలు ఏమయ్యాయో తెలియదు. ఏకంగా 1.5 కోట్ల మందికి పైగా అక్క చెల్లెమ్మలకు సున్నావడ్డీ ఇచ్చాం. 79 లక్షలమంది అక్క చెల్లెమ్మలు అప్పులతో కుదేలైన పరిస్థితుల్లో వారికి అండగా ఉంటూ ఆసరా ఇచ్చాం. 27 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు చేయూత క్రమం తప్పకుండా ప్రతి ఏటా ఇచ్చాం. 30 లక్షల మంది పిల్లలకు మంచి చేస్తూ విద్యా దీవెన, వసతి దీవెన వారి తల్లులకే ఇచ్చాం. 31 లక్షల మంది అక్క చెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలిచ్చాం. గతంలో ఎప్పుడూ చూడని విధంగా 22 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టాం. 3.60 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు కాపు నేస్తం, 4.96 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఈబీసీ నేస్తం, 82 వేల మందికి నేతన్న నేస్తం, 2.76 లక్షల మందికి వాహనమిత్ర, 16 లక్షల మందిని తోడు కార్యక్రమం ద్వారా ఆదుకున్నాం. 3.38 లక్షల మందికి చేదోడు, 1.10 లక్షల మంది మత్స్యకారులకు మత్స్యకార భరోసా క్రమం తప్పకుండా ఇచ్చాం. కోవిడ్ లాంటి సంక్షోభ పరిస్థితులున్నా సాకులు చెప్పకుండా మంచి చేశాం.

దాడులు కాదు.. సూపర్ 6 అమలు ఎప్పుడు?

- ఇంకా ఎన్ని విధ్వంసాలు.. ఎంత మందిని చంపుతారు?
- ఊరూరా తిరుగుతాం.. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం
- మాజీ మంత్రులు కొడాలి నాని, రోజా, గుడివాడ అమర్నాథ్, సీదిరి అప్పలరాజు, మాజీ ఎంపీ గీత, ఎమ్మెల్యే సుధా ధ్వజం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విధ్వంసాలు, అరాచకాలు ఆపి.. చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్ 6 హామీలు ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని మాజీ మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలు డిమాండ్ చేశారు. ఎన్నికల్లో దొంగ వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. విశాఖలోని రుషికొండపై టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. నిరుద్యోగులకు నెలకు ఇస్తామన్న రూ.3 వేలు వెంటనే ఇవ్వాలన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తాడేపల్లిలో క్యాంపు కార్యాలయంలో విజిటర్స్ కోసం ఏర్పాటు చేసిన ఫర్నీచర్‌పై కూడా అసత్యపు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ఫర్నిచర్ విలువ చెబితే చెల్లిస్తామని చెప్పినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేకపోగా, దుష్ప్రచారం చేస్తుండటం దారుణం అన్నారు. తాడేపల్లిలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయం వద్ద గురువారం మాజీ మంత్రులు కొడాలి నాని, గుడివాడ అమర్నాథ్, సీదిరి అప్పలరాజు, మాజీ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే సుధా మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

కార్యకర్తలకు అండగా ఉంటాం



టీడీపీ దాడులకు భయపడేది లేదు. ఎవరిని చంపుతారో చంపుకోమనండి. టీడీపీ దాడుల్లో గాయపడిన ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబం వద్దకు తాను వెళ్తానని, వాళ్లకు అండగా ఉంటానని వైఎస్ జగన్ చెప్పారు. ఎటువంటి రివ్యూ చేయకుండా వైఎస్ జగన్‌కు సెక్యూరిటీ తీసేయడం దారుణం. మమ్మల్ని ఎవరు టార్గెట్ చేసినా భయపడేది లేదు. మేం ప్రజల మధ్య ఉంటాం. వారి సమస్యల కోసం పోరాటం చేస్తాం. రుషికొండపై భవనాలు ప్రభుత్వ ఆస్తి. అవి వైఎస్ జగన్‌వి కావు. వీఐపీల కోసం భవనాలు కడితే దానినీ రాద్ధాంతం చేస్తున్నారు. ఎల్లో బ్యాచ్ చెప్పేవన్నీ అబద్ధాలే. రుషికొండలో కట్టిన ప్రభుత్వ భవనాల్ని.. జగన్ నివాసంగా ఎల్లో మీడియా, టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. ప్రభుత్వం కట్టించిన గెస్ట్ హౌస్‌లో ఉండాల్సిన అవసరం వైఎస్ జగన్‌కు లేదు. ఎక్కడైనా ఆయన సొంత ఇంటిలోనే ఉంటారు. చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలను పక్కదారి పట్టించడానికి టీడీపీ నేతలు రోజుకో డ్రామా ఆడుతున్నారు.

– కొడాలి నాని, మాజీ మంత్రి

టీడీపీ చేసిన మంచి ఒక్కటీ లేదు



రుషికొండపై నిర్మించిన ప్రభుత్వ భవనాలు విశాఖకే తలమానికంగా ఉంటాయి. దీనిపై ఎల్లో మీడియా, కూటమి పార్టీలు వికృత రాజకీయం చేస్తున్నాయి. రూ.700 కోట్లతో నాసిరకంగా తాత్కాలిక సచివాలయం నిర్మించింది టీడీపీ ప్రభుత్వం. రుషికొండలో రూ.400 కోట్లతోనే ఐకానిక్ భవనాలు నిర్మించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ప్రభుత్వ భవనాలివి. శిథిలమైన హరిత రిసార్ట్స్ స్థానంలో నూతన భవనాల నిర్మాణం. విశాఖ నుంచి పరిపాలనకు ఈ భవనాలు అనువైనవని అధికారుల కమిటీ తేల్చింది. దీంతో సీఎం నివాసం, కార్యాలయానికి అనుకూలంగా కొన్ని మార్పులు చేస్తే అవి సొంత భవనాలంటూ టీడీపీ గగ్గోలు పెడుతోంది. రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు మంచి చేయడం అనేది తెలుగుదేశం పార్టీకి, ఆ పార్టీ ప్రభుత్వానికి చేతకాదు. 2014 – 2019 మధ్య రాష్ట్రానికి చేసిన మంచి ఒక్కటి లేదు. అన్నీ రాష్ట్రానికి తలవంపులు తెచ్చే పనులే. ఇప్పుడూ అదే చేస్తోంది.

– గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రి

వైఎస్ జగన్ ఊరూరా తిరగమన్నారు



వైఎస్ జగన్ మమ్మల్ని ఊరూరా తిరగమన్నారు. కూటమి పార్టీల దాడులు, ఆస్తుల విధ్వంసం సమయంలో ప్రతి కార్యకర్తకు అండగా ఉండాలని సూచించారు. 40 శాతం ఓటు బ్యాంకు కలిగిన మనం భయపడకూడదంటూ మనో ధైర్యం నింపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మంచి ప్రజలెవరూ మరచిపోలేదు. ప్రతి ఇంట్లో జగన్ చేసిన మంచి కనిపిస్తోంది. ప్రతి ఇంటికీ మేం తలెత్తుకుని పోగలం. చెప్పిన పని చేశాం కాబట్టి.. ప్రజల మధ్యకు గౌరవంగా వెళ్లగలుగుతాం. చంద్రబాబు ప్రలోభాలకు మోసపోయిన పరిస్థితుల మధ్య అపజయం సంభవించింది. బాబు మోసాలు ఎప్పుడైతే తేటతెల్లం అవుతాయో.. కాలం గడుస్తున్న కొద్దీ చంద్రబాబుపై కోపం వస్తుంది. అప్పుడు వైఎస్సార్‌సీపీ పట్ల అభిమానమూ మళ్లీ రెట్టింపు అవుతుంది. మళ్లీ వైఎస్సార్‌సీపీ రికార్డు మెజార్టీతో గెలుస్తుంది. చంద్రబాబు చేతిలో ప్రతి రోజు మోసపోతున్న ప్రజలకు అండగా ఉంటాం.

– వంగా గీత, మాజీ ఎంపీ

అంతర్జాతీయ స్థాయిలో కట్టడాలు



రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు ఆపి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంపై టీడీపీ నేతలు దృష్టి సారించాలి. రిషికొండలో పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా పర్యాటక శాఖ కట్టిన భవనాలు అవి. మేమేమీ వర్షానికి కారిపోయే అసెంబ్లీ, సచివాలయం కట్టలేదు. సెవెన్ స్టార్ రేంజ్‌లో పర్యాటక శాఖ భవనాలు నిర్మించాం. మేము కట్టిన మెడికల్ కాలేజీలు, నాడు – నేడు స్కూల్స్, ఆసుపత్రులు, సచివాలయాలు, పోర్టులను కూడా టీడీపీ నేతలు ఇలానే ప్రజలకు చూపించాలి. రిషికొండలో నాణ్యమైన, అంతర్జాతీయ స్థాయిలో కట్టడాలు నిర్మించాం. గతంలో చంద్రబాబు ఎక్కడైనా ఇంత నాణ్యమైన భవనాలు కట్టారా? కేంద్రం అనుమతి, హైకోర్టు పర్యవేక్షణలోనే నిర్మాణాలు చేపట్టాం. ఆడుదాం ఆంధ్రా ఖర్చు రూ.100 కోట్లు అయితే స్కామ్ జరిగింది రూ.100 కోట్లు అని టీడీపీ నేతలు చెబుతున్నారు. స్కామ్ ఇలా కూడా ఉంటుందా? క్రీడాకారులకు ఇచ్చిన నగదు బహుమతులు గుర్తు లేవా? అసలు ఆడుదాం ఆంధ్రా టెండర్లు మా క్రీడా శాఖ ద్వారా నిర్వహించలేదు. అలాంటిది నేను, సిద్ధార్థ్ రెడ్డి అవినీతి చేశాం అనడం హాస్యాస్పదం. 2029లో మళ్లీ జగనన్నను సీఎం చేసుకోవడానికి తగ్గట్టుగా ఐదేళ్లు పనిచేస్తాం. – ఆర్కే రోజా, మాజీ మంత్రి

మా ఓట్లు ఏమయ్యాయి.. అంటున్నారు



బద్వేలు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ప్రతి గ్రామంలో అపూర్వ స్వాగతం లభించింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ 99 శాతం పైగా హామీలను అమలు చేయటంతో సగర్వంగా ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగాం. మా ఓటు మీకే నమ్మా? మీ ఫ్యాన్ గుర్తుకే వేసి తీరుతాం అని ఓటర్లు భరోసా ఇచ్చారు. కానీ ఫలితాలు చూస్తే చాలా ఆశ్చర్యం కలిగించాయి. ఈవీఎంలపై జగనన్న ట్వీట్ చేస్తే టీడీపీ నేతలు ఎందుకు ఉలిక్కి పడుతున్నారు? చంద్రబాబు గతంలో ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయొచ్చన లేదా? ఎన్నికల ఫలితాలు చూసి ఓటర్లే ఆశ్చర్యపోతున్నారు. మేం జగన్‌కు వేసిన ఓట్లు ఏమయ్యాయి అని ప్రశ్నిస్తున్నారు. అదే మన ప్రభుత్వం ఉండి ఉంటే ఈపాటికే విద్యాదీవెన ఇచ్చేవాళ్లం. రైతు భరోసా, అమ్మ ఒడి, మత్స్యకార భరోసా అన్నీ సమయానికి అందేవి. ఏకంగా రూ.2.7 లక్షల కోట్లు ప్రజలకు డీబీటీ ద్వారా ఇచ్చాం. ఏ పథకం ఏ నెలలో అమలవుతుందో క్యాలెండర్ ఇచ్చి.. తేదీల వారీగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో వైఎస్ జగన్ నగదు జమ చేసేవారు. ఇప్పుడు కూడా నిత్యం ప్రజల్లో ఉంటాం. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. – దాసరి సుధా, బద్వేలు ఎమ్మెల్యే

టీడీపీ కపట నాటకాన్ని ప్రజలు గమనించాలి



ఎన్నికల ఫలితాలు ఎందుకు ఇలా వచ్చాయన్నది ఇవ్వాళ్టికీ మాకు ఆశ్చర్యంగా ఉంది. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా వైఎస్ జగన్ మేనిఫెస్టోలో 99 శాతం హామీలు అమలు చేశారు. ఇంత చేసినా ఎక్కడ మోసం జరిగింది అనేదే ప్రశ్న. ఇప్పుడు రుషికొండపై చంద్రబాబు, ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తున్నారు. రుషికొండ మొత్తం 61 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇందులో 9.88 ఎకరాల విస్తీర్ణంలోనే ఈ భవనాలు నిర్మించారు. గతంలో హరిత రిసార్టు 48 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండేది. ప్రస్తుత భవనాలు 19,968 చ.మీ విస్తీర్ణంలో ఉన్నాయి. వీటన్నింటినీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు వీలుగా నిర్మించారు. ప్రెసిడెన్షియల్ సూట్, సూట్ రూమ్, బాంక్వెట్ హాల్‌తో విజయనగర బ్లాకు, ప్రెసిడెన్షియల్ సూట్ రూమ్స్, సూట్ రూమ్స్, డీలక్స్ గదులు, బాంక్వెట్ హాల్‌తో కళింగ బ్లాక్ నిర్మించారు. సూట్ రూమ్‌లు, కాన్ఫరెన్స్ హాల్‌తో పల్లవ బ్లాక్, సమావేశ మందిరాలతో చోళ బ్లాక్, రిక్రియేషన్ లాంజ్, బిజినెస్ సెంటర్‌తో గజపతి బ్లాక్, ప్రైవేట్ సూట్ రూమ్‌లతో వేంగిబ్లాక్, రెస్టారెంట్స్, లాంజ్, కిచెన్, పార్కింగ్ సౌకర్యాలతో ఈస్టర్న్ గంగా బ్లాక్‌లని నిర్మించారు. ఈ ఏడు బ్లాక్‌లు ప్రభుత్వానివే. అయినప్పటికీ ఈ విష ప్రచారం టీడీపీ సంస్కృతికి నిదర్శనం. దాడులు, ఆస్తుల విధ్వంసం ఆపి నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎప్పటి నుంచి ఇస్తారో చెప్పాలి.

– సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రి

క్లుప్తంగా...

వైఎస్సార్ బీమా.. ఇక చంద్రన్న బీమా



సాక్షి, అమరావతి: వైఎస్సార్ బీమా పథకం పేరును చంద్రన్న బీమా పథకంగా రాష్ట్ర ప్రభుత్వం మార్చింది. ఇందుకు సంబంధించిన ఫైల్‌పై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తొలి సంతకం చేశారు. ఆయన గురువారం వెలగపూడిలోని సచివాలయంలో రాష్ట్ర కార్మికశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో బాల కార్మిక వ్యవస్థను రూపుమాపడానికి కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వం అమలుచేసిన ఇసుక విధానంతో రాష్ట్రంలో నిర్మాణ రంగం కుదేలైందన్నారు. మంత్రి సుభాష్‌కు కార్మికశాఖ కార్యదర్శి హరిజవహర్‌లాల్, కమిషనర్ శేషగిరిబాబు, తదితరులు అభినందనలు తెలిపారు. కాగా, వైఎస్సార్ బీమా పథకం పేరును చంద్రన్న బీమాగా మార్పు చేస్తూ కార్మిక శాఖ కార్యదర్శి హరిజవహర్‌లాల్ గురువారం ఉత్తర్వులిచ్చారు.

ఎకో, టెంపుల్ టూరిజాన్ని ప్రోత్సహిస్తాం

మంత్రి కందుల దుర్గేష్



సాక్షి, అమరావతి: ఏపీలో ఎకో,టెంపుల్ టూరిజాన్ని ప్రోత్సహిస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రిగా ఆయన గురువారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. రూ.2.31కోట్ల అంచనా తో 10 టూరిజం బోట్లను కొనుగోలు చేసే ఫైలుపై తొలి సంతకం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏపీలో సినిమా షూటింగ్‌లు, సినీ స్టూడియోల నిర్మాణానికి సినీ పరిశ్రమ ప్రముఖులు తరలిరావాలని కోరారు. మంత్రి దుర్గేష్‌ను మంత్రి నాదెండ్ల కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయాల పవిత్రతను కాపాడేందుకు కృషి

రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



సాక్షి, అమరావతి/భవానీపురం(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షలకు అనుగుణంగా ఆలయాల పవిత్రతను కాపాడేందుకు, దేవస్థానాలకు చెందిన ప్రతి సెంటు భూమిని పరిరక్షించేందుకు సమష్టిగా కృషిచేస్తామని రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆయన గురువారం రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. గొల్లపూడిలోని దేవదాయ, ధర్మాదాయశాఖ కమిషనరేట్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం దూప దీప నైవేద్య పథకం కింద అర్చకులకు ఇచ్చే మొత్తాన్ని రూ.5వేల నుంచి రూ.10వేలకు పెంచి శ్రేయోనిధి నుంచి అందించే ఫైలుతోపాటు ఆలయ పునర్నిర్మాణ పనుల పర్యవేక్షణ, అనుమతులకు సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటుకు సంబంధించిన ఫైలుపై మంత్రి సంతకాలు చేశారు.

రెవెన్యూశాఖను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

మంత్రి అనగాని సత్యప్రసాద్



సాక్షి, అమరావతి: రెవెన్యూశాఖ సేవలను మరింత పారదర్శకంగా అందించి దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయంలో ఆయన గురువారం రెవెన్యూ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. రెవెన్యూ దినోత్సవం(జూన్ 20వ తేదీ) సందర్భంగా మంత్రి కేక్ కట్ చేసి అధికారులు, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. అనగాని మాట్లాడుతూ రెవెన్యూశాఖలో జవాబుదారీతనాన్ని పెంపొందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలోని రెవెన్యూ సిబ్బందికి శిక్షణ కోసం ప్రత్యేక అకాడమీని ఏర్పాటుచేస్తామన్నారు. బ్లాక్ చైన్ టెక్నాలజీలో రెవెన్యూ రికార్డుల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

ప్రాధాన్యతాక్రమంలో ప్రాజెక్టులు పూర్తిచేస్తాం

మంత్రి నిమ్మల రామానాయుడు



సాక్షి, అమరావతి: పోలవరంతోపాటు నీటిపారుదల ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం అస్తవ్యస్తం చేసి పదేళ్లు వెనక్కి నెట్టిందని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టు పనులపై శ్వేతపత్రం విడుదల చేస్తామని చెప్పారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రిగా ఆయన గురువారం వెలగపూడిలోని సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే పోలవరం ప్రాజెక్టులో భాగమైన డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని ఆరోపించారు. రైతులకు ఉపశమనం కలిగించేందుకు వీలుగా ఏటిగట్లను పటిష్టపరచి షట్టర్లు, గేట్లు వంటివాటికి మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఆదేశాలిచ్చానని తెలిపారు.

కప్పం కడతారా..

కంపెనీ మూసేస్తారా

లారీకి రూ.వేయి.. నెలకు రూ.1.50 కోట్లు

యూబీ బీరు కంపెనీకి ఎచ్చెర్ల ఎమ్మెల్యే ముఠా అల్టిమేటం

సాక్షి, అమరావతి: పరిశ్రమలకు రెడ్ కార్పెట్ పరుస్తాం అని చెబుతున్న టీడీపీ కూటమి ప్రభుత్వం ఆచరణలో మాత్రం పారిశ్రామికవేత్తలకు 'రెడ్ బుక్ రాజ్యాంగం'తో తడాఖా చూపిస్తోంది. కొత్త పరిశ్రమల స్థాపన సంగతి తరువాత.. ముందు దశాబ్దాలుగా ఉన్న పరిశ్రమలు ఉత్పత్తి ప్రారంభించాలంటే కప్పం కట్టాల్సిందేనని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి పెద్దలు అల్టిమేటం జారీ చేస్తున్నారు. ఎన్నికై నెల రోజులు కూడా కాకుండానే స్వయంగా ఎమ్మెల్యేలే రంగంలోకి దిగిపోయారు. కంపెనీలకు కళ్లు బైర్లు కమ్మేలా కప్పం రేట్లు నిర్ణయిస్తున్నారు. అందుకు కాదంటే ఫ్యాక్టరీలపై దాడులకు తెగబడతామని, అక్రమ కేసులతో వేధిస్తామని బెదిరిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గంలోని యునైటెడ్ బ్రూవరీస్ (యూబీ) కంపెనీ ఉత్పత్తి ప్రారంభించాలంటే నెలకు రూ.1.50 కోట్లు మామూళ్లివ్వాలని జారీ చేసిన అల్టిమేటం.., అందుకు కాదన్నందుకు ఆ కంపెనీపై కూటమి మూకలు విధ్వంసానికి పాల్పడటం ద్వారా వారి ఉద్దేశాన్ని తేటతెల్లం చేశారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన యూబీ కంపెనీ కూడా గత్యంతరం లేక కూటమి ఎమ్మెల్యే ఈశ్వరరావుతో సంప్రదింపుల పేరుతో శరణుజొచ్చి, కప్పం కట్టేందుకు సమ్మతించడం రాష్ట్రంలో ఇకముందు జరగబోయే అరాచకాలకు సూచికగా నిలుస్తోంది. రాష్ట్రంలో



శ్రీకాకుళం జిల్లాలోని యూబీ ఫ్యాక్టరీ

పారిశ్రామికవేత్తలకు ముందున్నది ముసళ్ల పండుగేనన్నది సుస్పష్టమవుతోంది.

ప్రతి లారీకీ డబ్బు

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండలం బంటుపల్లిలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన యునైటెడ్ బ్రూవరీస్ (యూబీ) బీర్ కంపెనీ ఎన్నో ఏళ్లుగా ఉంది. ఇక్కడ కింగ్ ఫిషర్ బీరు ఉత్పత్తి అవుతుంది. ఆ కంపెనీ బీరు యూనిట్‌ను పునఃప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. బంటుపల్లి కేంద్రంగా ఉన్న టీడీపీ ముఠాలు గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ ఫ్యాక్టరీకి వచ్చి వెళ్లే లారీల నుంచి మామూళ్లు వసూలు చేసి హడలెత్తించేవి. ఇటీవల ఎన్నికల్లో ఎచ్చెర్ల నుంచి గెలుపొందిన బీజేపీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు ఇప్పుడు మామూళ్ల వసూలుకు రంగంలోకి దిగారు. బంటుపల్లికి చెందిన ఆయన వర్గీయులు ఫ్యాక్టరీకి వచ్చే లారీలను అడ్డుకుని హల్‌చల్ చేశారు. అనంతరం యూబీ కంపెనీ ప్రతినిధులను కలిసి రోజూ లోడింగ్, అన్‌లోడింగ్ వచ్చే లారీకి రూ.వేయి చొప్పున మామూళ్లు ఇవ్వాలని హుకుం జారీ చేశారు. బీరు ఉత్పత్తికి అవసరమైన ముడి సరుకుతో రోజుకు 300 లారీలు వస్తాయి. ఉత్పత్తి అయిన బీరు రవాణాకు రోజుకు 200 లారీలు వస్తాయి. అంటే రోజుకు సగటున 500 లారీలు వచ్చి వెళ్తాయి. ఎమ్మెల్యే ఈశ్వరరావు ముఠా చెప్పిన దాని ప్రకారం రోజుకు రూ.5 లక్షలు మామూళ్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఆ లెక్కన నెలకు రూ.1.50 కోటి.. ఏడాదికి రూ.18 కోట్లు యూబీ కంపెనీ ఎమ్మెల్యే వర్గానికి మామూళ్ల కింద సమర్పించుకోవాలి. లేకపోతే కంపెనీ ఉత్పత్తి ప్రారంభించలేదని హెచ్చరించారు.

కాదన్నందుకు కంపెనీపై దాడి

ఎమ్మెల్యే ఈశ్వరరావు వర్గం చెప్పిన మామూళ్ల లెక్కలకు యూబీ కంపెనీ ప్రతినిధులకు కళ్లు బైర్లు కమ్మాయి. అంత భారీ మొత్తాన్ని కేవలం ఎమ్మెల్యే వర్గానికి ఇవ్వలేమని చెప్పారు. అంతే.. ఈ నెల 15న అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ఎమ్మెల్యే ముఠా యూబీ ఫ్యాక్టరీపై దాడి చేసింది. ఫ్యాక్టరీ గేట్ల వద్ద సెక్యూరిటీ సిబ్బందిపై దాడికి పాల్పడి గూండాలు లోపలికి ప్రవేశించారు. కార్యాలయంలో ఫర్నీచర్, ఇతర సామగ్రిని ధ్వంసం చేసి బీభత్సం సృష్టించారు. అడ్డువచ్చిన కంపెనీ ప్రతినిధులను బూతులు తిడుతూ దాడి చేశారు. ఫ్యాక్టరీ హెడ్, పర్చేజ్ మేనేజర్, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బందిని చితకబాదారు. దాంతో కంపెనీ ప్రతినిధులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరారయ్యారు.

ఢిల్లీ నుంచి ఒత్తిడితో కేసు నమోదు

ఎమ్మెల్యే ఈశ్వరరావు వర్గీయుల దాష్టీకంపై యూబీ కంపెనీ ప్రతినిధులు జీఆర్ పురం పోలీస్ స్టేషన్‌లో వెంటనే ఫిర్యాదు చేశారు. కానీ ఎమ్మెల్యే వర్గీయులపై కేసు నమోదుకు పోలీసులు ససేమిరా అన్నారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన యూబీ కంపెనీ ప్రధాన కార్యాలయం ఢిల్లీలోని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకువెళ్లింది. దాంతో తప్పనిసరై జీఆర్ పురం పోలీసులు ఎమ్మెల్యే ఈశ్వరరావు వర్గీయులపై ఈ నెల 16వ తేదీ రాత్రి కేసు నమోదు చేశారు. తమ వారిపై పోలీసులు కేసు నమోదు చేయడాన్ని ఎమ్మెల్యే ఈశ్వరరావు తీవ్రంగా పరిగణించారు. యూబీ కంపెనీ ప్రతినిధులపై ఆయన వర్గీయులతో ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద ఫిర్యాదు చేయించారు. పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చి యూబీ కంపెనీ ప్రతినిధులపై కేసు పెట్టించి ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయించారు. కంపెనీ ప్రతినిధులను వెంటనే అరెస్ట్ చేయాలని కూడా పోలీసులపై ఒత్తిడి తెచ్చారు.

డీల్ సెట్ చేసిన మంత్రి అచ్చెన్నాయుడు

ఈ వ్యవహారంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జోక్యం చేసుకున్నారు. ఆయన కంపెనీ ప్రతినిధులు, ఎమ్మెల్యే ఈశ్వరరావుతో మాట్లాడారు. కంపెనీ ఉత్పత్తి ప్రారంభించాలంటే 'ఏం చేయాలో ' చెప్పారు. అచ్చెన్న 'మంత్రం' పని చేసింది. ఎమ్మెల్యే ఈశ్వరరావు వెనుక మంత్రి అచ్చెన్న ఉన్నారన్నది యూబీ కంపెనీ ప్రతినిధులకు అర్థమైంది. టీడీపీ, బీజేపీ కూటమి నేతలు డిమాండ్ చేసిన మామూళ్లు సమర్పించుకుంటే తప్ప ఉత్పత్తి ప్రారంభించలేమని స్పష్టంగా తెలిసిపోయింది. దాంతో అనివార్యంగా యూబీ కంపెనీ ప్రతినిధులు ఎమ్మెల్యే ఈశ్వరరావు నివాసానికి వెళ్లి సంప్రదింపులు జరిపారు. వారిపై ఎమ్మెల్యే ఈశ్వరరావు తీవ్ర ఆగ్రహావేశాలతో చిందులు తొక్కారు. తమను కాదని ఈ ప్రాంతంలో ఫ్యాక్టరీ ఎలా నడుపుతారంటూ మండిపడినట్టు సమాచారం. ఢిల్లీ నుంచైనా, ఎక్కడి నుంచి చెప్పించినా సరే.. ఇక్కడ తాము పచ్చజెండా ఊపితేనే ఫ్యాక్టరీ గేట్లు తెరుచుకుంటాయని, లేకపోతే లేదని కూడా కరాఖండిగా చెప్పినట్లు తెలుస్తోంది. దాంతో యూబీ కంపెనీ ప్రతినిధులు బంటుపల్లి ముఠా డిమాండ్ చేసిన మేరకు మామూళ్లు ఇచ్చేందుకు సమ్మతించి తిరిగి వచ్చినట్లు ఆ కంపెనీ వర్గాలే చెబుతున్నాయి.

కప్పం కడితేనే కంపెనీలు

యూబీ కంపెనీ వ్యవహారం ద్వారా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. తమకు కప్పం కడితేనే కంపెనీలు కార్యకలాపాలు చేపడతాయని స్పష్టం చేశారు. అందుకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే కంపెనీలపై దాడులు, దండయాత్రలు తప్పవని తేల్చిచెప్పారు. ఈ పరిణామాలతో రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు హడలిపోతున్నారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన యూబీ కంపెనీకే అటువంటి దుస్థితి ఏర్పడితే ఇక తమ పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు.

పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేస్తాం

రాష్ట్ర పారిశ్రామిక, వాణిజ్య, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్



టీజీ భరత్



కొండపల్లి శ్రీనివాస్



సవిత

సాక్షి, అమరావతి: పారిశ్రామిక వృద్ధిలో అత్యుత్తమ స్థానాన్ని పొందిన గుజరాత్ తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోను పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పారిశ్రామిక, వాణిజ్య, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. గుజరాత్ తరహాలో మన రాష్ట్రంలో కూడా గిఫ్ట్ సిటీ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఆయన గురువారం సచివాలయంలో రాష్ట్ర పారిశ్రామిక, వాణిజ్య, ఆహారశుద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి తరలివచ్చి పరిశ్రమలు స్థాపించేందుకు అనువైన వాతావరణం కల్పిస్తామన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఎన్‌ఆర్‌ఐల సహకారంతో యువతకు ఉపాధి

రాష్ట్ర చిన్న, మధ్య సూక్ష్మ పరిశ్రమల, సెర్ప్, ఎన్ఆర్ఐ సంబంధాల శాఖ మంత్రిగా కొండపల్లి శ్రీనివాస్ గురువారం రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చిన్న పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. ఎన్ఆర్ఐల సహకారంతో యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడానికి, డ్వాక్రా గ్రూప్ మహిళలు పారిశ్రామికంగా ఎదుగుదలకు ఒక రోడ్ మ్యాప్‌ను త్వరలోనే రూపొందిస్తామని వివరించారు. తాను బాధ్యతలు స్వీకరించిన అనంతరం 20 ఆదర్శ మండలాలకు రూ.10లక్షలు చొప్పున నిధులు, ఎస్సీ, ఎస్టీ ఎస్‌హెచ్‌జీలకు అందుబాటులో ఉన్న నిధులతో వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తూ రెండు ఫైళ్లపై సంతకాలు చేసినట్లు మంత్రి శ్రీనివాస్ చెప్పారు.

బీసీ స్టడీ సర్కిళ్లలో ఉచిత డీఎస్సీ కోచింగ్

రాష్ట్రంలోని బీసీ స్టడీ సర్కిళ్లలో వెనకబడిన తరగతుల విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉచిత డీఎస్సీ కోచింగ్ అందించనున్నట్టు బీసీ, ఈడబ్ల్యూఎస్, చేనేత, జౌళి శాఖల మంత్రి సంజీవిరెడ్డిగారి సవిత తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ఆమె మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. బీసీ స్టడీ సర్కిళ్లలో ఉచిత డీఎస్సీ కోచింగ్, ఎన్టీఆర్ విదేశీ విద్య పథకంపై మొదటి, ద్వితీయ సంతకాలు చేశారు. వెనకబడిన తరగతుల్లోని నిరుద్యోగులకు ఉచిత డీఎస్సీ కోచింగ్ ఫైల్‌పై తొలి సంతకం చేసినట్టు సవిత తెలిపారు. 2014–19 లో ఉమ్మడి 13 జిల్లాలకు మంజూరు చేసిన బీసీ భవన్‌ల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. వారానికి ఒక్కసారైనా సచివాలయ ఉద్యోగులు, రాష్ట్ర ప్రజలు చేనేత వస్త్రాలు ధరించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి సవిత ముఖ్య కార్యదర్శి సునీతతో కలిసి మూడో బ్లాకులోని లేపాక్షి ఎంపోరియంను సందర్శించారు.

'ఉపాధి' నిధులను సద్వినియోగం చేసుకోవాలి

- గ్రామాల్లో పకడ్బందీగా సోషల్ ఆడిట్ నిర్వహించాలి
- డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్



సాక్షి, అమరావతి: ఉపాధి హామీ పథకం నిధులను సద్వినియోగం చేసుకోవాలని.. ఇందులో భాగంగా గ్రామాల్లో పకడ్బందీగా సోషల్ ఆడిట్ చేపట్టాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ విభాగం అధికారులతో పవన్‌కళ్యాణ్ గురువారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ జరిగే తీరును, పనుల పురోగతి, నిధులు దుర్వినియోగానికి సంబంధించిన కేసుల వివరాలను అధికారులు పవన్‌కు తెలిపారు. పవన్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం నిధులను సద్వినియోగం చేసుకుంటేనే సత్ఫలితాలు వస్తాయన్నారు. ఈ విషయంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. సోషల్ ఆడిట్ పక్కాగా జరగాలని.. గ్రామాల్లో ప్రొటోకాల్‌ను అనుసరించి సోషల్ ఆడిట్ సభలు నిర్వహించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం నిధులు దుర్వినియోగం కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.

చిన్నారుల్లో సైన్స్ పట్ల అవగాహన పెంచాలి

గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను పవన్ కల్యాణ్ ఆదేశించారు. గురువారం విజయవాడలో సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖపై జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. వైజ్ఞానిక ప్రదర్శనలు గ్రామ స్థాయి నుంచి నిర్వహించాలన్నారు. రాజమండ్రి ఎస్ఆర్ఎస్‌సీ ప్రాంతీయ వైజ్ఞానిక కేంద్రం ప్రారంభానికి సిద్ధంగా ఉన్న విషయాన్ని అధికారులు పవన్‌కు తెలియజేయగా.. త్వరలో ప్రజలకు అందుబాటులోకి తెద్దామని పవన్ అన్నారు. కాగా, తనకు కేటాయించిన శాఖలపై వరుసగా సమీక్షలు నిర్వహించిన పవన్.. అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించడంతో పాటు రక్షిత మంచి నీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. తుపాన్ల నుంచి తీరాన్ని రక్షించే మడ అడవులపై చర్చించారు.

నెల రోజుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి

సాక్షి, అమరావతి: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని నెల రోజుల్లో ప్రారంభిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. విజయవాడ జవహర్‌లాల్ నెహ్రూ బస్‌స్టేషన్‌ను ఆయన గురువారం సందర్శించారు. మహిళలకు ఉచిత ప్రయాణం పథకంపై అధ్యయనం చేయిస్తామని అందుకోసం కర్ణాటక, తెలంగాణల్లో తానే పర్యటిస్తానన్నారు. అనంతరం ఈ పథకాన్ని ఏపీలో ప్రారంభిస్తామన్నారు.

కూటమిపై విశ్వాసంతోనే ప్రజాశీర్వాదం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి



కేంద్ర మంత్రి వర్మను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

సాక్షి, అమరావతి: కూటమిపై విశ్వాసంతోనే ప్రజలు తమను ఆశీర్వదించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ డి.పురందేశ్వరి స్పష్టం చేశారు. గత పాలనలో రాజధాని లేని రాష్ట్రాన్ని చేశారని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలకు సన్మాన సభను విజయవాడలో గురువారం నిర్వహించారు. కేంద్ర భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ.. పార్టీలో ఒక కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించిన తనకు కేంద్రమంత్రిగా అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. సర్పంచ్ పదవికి కూడా పోటీ చేయని తనకు ఎమ్మెల్యే, మంత్రిగా పార్టీ అవకాశం ఇచ్చిందని, ఇది కార్యకర్తల విజయానికి నిదర్శనం అని రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు ఆదినారాయణ రెడ్డి, సుజనా చౌదరి, కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సీఎం చంద్రబాబును గురువారం రాత్రి ఉండవల్లిలోని ఆయన నివాసంలో బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు కలిశారు.

ఏజీగా దమ్మాలపాటి బాధ్యతల స్వీకారం

అదనపు ఏజీగా జనసేన సాంబశివ ప్రతాప్?

సాక్షి, అమరావతి: రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ (ఏజీ)గా దమ్మాలపాటి శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. గురువారం ఆయన హైకోర్టులోని అడ్వొకేట్ జనరల్ ఛాంబర్‌లో వేద మంత్రాల మధ్య ఏజీగా బాధ్యతలు స్వీకరించారు. దమ్మాలపాటి శ్రీనివాస్‌ను ఏజీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే, అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ)గా జనసేన లీగల్ సెల్ అధ్యక్షుడు ఈవన సాంబశివ ప్రతాప్ నియమితులు కానున్నారు. ఆయన నియామకం విషయంలో ఉప ముఖ్యమంతి పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడారు. దీంతో సాంబశివ ప్రతాప్ నియామకానికి చంద్రబాబు సుముఖత వ్యక్తం చేశారు. ఈయన నియామకానికి సంబంధించి వారంలోపు ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. రెండో అదనపు ఏజీ పోస్టు విషయంలో న్యాయవర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ఈ పోస్టును బీజేపీ ఆశిస్తోంది. అయితే ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, ఏజీ దమ్మాలపాటి నిర్ణయం ఏమిటో తెలియరాలేదు. రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) నియామకం విషయంలో కూడా త్వరలో ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కాగా, సామాజిక, రాజకీయ సమీకరణల ఆధారంగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులు, ప్రభుత్వ న్యాయవాదులు, సహాయ ప్రభుత్వ న్యాయవాదుల నియామకాలు చేపట్టనున్నారు.

భూములమ్మి రాజధాని నిర్మిస్తాం

అమరావతి పర్యటనలో సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: అమరావతిలో రైతులిచ్చిన భూములతో పాటు ప్రభుత్వ భూముల్లో రోడ్లు, భవనాలు, ఇతర నిర్మాణాలు చేపట్టగా మిగిలిన భూములు అమ్మితే రాజధానిని నిర్మించుకోవచ్చని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అని, ఇక్కడ వచ్చే ఆదాయమే రాజధాని నిర్మాణానికి సరిపోతుందన్నారు. రాష్ట్రంలో అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలను కూడా రాజధాని నుంచి వచ్చే సంపదతోనే అమలు చేస్తామన్నారు. గురువారం రాజధాని ప్రాంతంలో సీఎం చంద్రబాబు విస్తృతంగా పర్యటించారు. ఉండవల్లిలోని ప్రజావేదిక శిథిలాల నుంచి ప్రారంభించి ఉద్దండరాయునిపాలెంలో రాజధానికి భూమి పూజ చేసిన ప్రాంతం, ప్రజా ప్రతినిధులు, అధికారుల కోసం నిర్మించ తలపెట్టిన భవనాల సముదాయాలను పరిశీలించారు. అనంతరం సీడ్ యాక్సెస్ రోడ్డులోని సీఆర్‌డీఏ భవనం వద్ద సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. అమరావతి, పోలవరాన్ని సంపద సృష్టించే కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. దక్షిణాదిలో గోదావరి భారీ జల నిధి లాంటిదన్నారు. పోలవరం పూర్తయితే నదుల అనుసంధానం ద్వారా ప్రతి ఎకరాకూ నీళ్లివ్వచ్చన్నారు. విభజన అనంతరం రాజధాని నిర్మాణం కోసం ఆర్థిక తోడ్పాటు, పోలవరం పూర్తి చేసేందుకు కేంద్రం వెసులుబాటు కల్పించిందన్నారు. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించగా అమరావతికి ఆర్థిక సాయం చేసేందుకు కేంద్రం ముందుకు వచ్చిందన్నారు. ప్రజారాజధానిగా అమరావతి ఐదు కోట్ల మందికి దశ, దిశను నిర్దేశిస్తుందన్నారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే గర్వంగా పనులు చేసుకోవచ్చన్నారు. రాజధానిని వైఎస్ జగన్ అతలాకుతలం చేశారని విమర్శించారు. సీఎం చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే..

రాజధానిపై శ్వేతపత్రం..

రాజధానికి ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. 16 వేల గ్రామాలు, దేశవ్యాప్తంగా పవిత్రమైన ప్రాంతాల నుంచి మట్టి, నీళ్లు తెచ్చి అందరు దేవుళ్ల ఆశీర్వాదాలతో శంకుస్థాపన చేశాం. ఆ మహిమే నేడు రాజధానిని కాపాడింది. ఎవరైనా సీఎం అయితే మంచి కార్యక్రమంతో ప్రజలను మెప్పిస్తారు. కానీ జగన్ ప్రజావేదిక కూల్చి పాలన ప్రారంభించారు. రాజధానిలో ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. ఇష్టానుసారంగా విధ్వంసం చేశారు. పైపులు, ఇసుక దొంగతనం చేయడంతో పాటు రోడ్లను కూడా తవ్వుకుపోయారు. ఒక్క బిల్డింగ్‌ను కూడా పూర్తి చేయలేదు. రోడ్ల నిర్మాణాలన్నీ సగంలో ఆగిపోయాయి. ఐఏఎస్, ఐపీఎస్, జడ్జీలు, మంత్రులు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారుల భవన నిర్మాణాలను అర్ధాంతరంగా నిలిపేశారు. రాజధాని ప్రస్తుత పరిస్థితిపై శ్వేత పత్రం విడుదల చేస్తాం. ఏం చేయాలనే దానిపై అధ్యయనం చేయాల్సి ఉంది.

కన్సార్టియంపైనా విషం చిమ్మారు..

తెలుగుజాతి గర్వంగా తలెత్తుకు తిరిగే రాజధానిగా అమరావతిని నిర్మిస్తాం. విశాఖను ఆర్థిక రాజధానిగా, కర్నూలును ఆధునిక నగరంగా తయారు చేయాలనుకున్నాం. రాజధానిపై బురద జల్లి బ్రాండ్ దెబ్బతీయడానికి ప్రయత్నించారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్, స్విస్ ఛాలెంజ్‌లో మోసం అన్నారు. సింగపూర్ కన్సార్టియంపైనా విషం చిమ్మి తరిమేశారు. రాష్ట్రానికి మధ్యలో ఉండేలా ఎక్కడైనా రాజధానిని ఏర్పాటు చేయాలని శివరామకృష్ణన్ కమిటీ నివేదికలో చెప్పింది. దానికి అనుగుణంగానే గుంటూరు కేంద్రంగా అమరావతిని రాజధానిగా గుర్తించాం. మూడు రాజధానులంటూ మూడు ముక్కలాట ఆడారు. పదేళ్ల తర్వాత రాజధాని ఏది అంటే చెప్పుకోలేని దుస్థితికి తీసుకొచ్చారు. రైతులు ఇచ్చిన భూములే కాకుండా ప్రభుత్వ భూములు కలిపి 55 వేల ఎకరాలను సేకరించాం. 29 వేల మంది రైతుల్లో ఒక్కరు కూడా కోర్టుకు వెళ్లకుండా ముందుకొచ్చి స్వచ్ఛందంగా భూములిచ్చారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులు చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుంది. ఇకపై ఆంధ్రప్రదేశ్‌లో 'ఏ' అంటే అమరావతి.. 'పీ' అంటే పోలవరంగా గుర్తుంటుంది.



అమరావతిలో భూములను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

నదులు అనుసంధానిస్తాం..

ప్రజలు కూటమికి ఏకపక్షంగా ఓట్లు వేయడంతో రాష్ట్ర చరిత్రలో ఇంత పెద్ద విజయం లభించింది. ఒక వ్యక్తి ముఖ్యమంత్రి పదవికి పనికిరాడని తీర్పు ఇచ్చి 11 సీట్లకు పరిమితం చేశారు. రాజకీయాలకు పనికిరాని వ్యక్తి, అర్హతలేని వ్యక్తి సీఎం అయితే రాష్ట్రం ఎంత నష్టపోతుందో గత ఐదేళ్లలో చూశాం. పోలవరం, అమరావతి వ్యక్తిగత అంశానికి సంబంధించినవి కాదు. వ్యక్తికి, వర్గానికి, ప్రాంతానికి పరిమితమైనవి కావు. వాటి ద్వారా సంపద సృష్టి జరిగి ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. పోలవరం పూర్తి చేసి నదుల అనుసంధానం పూర్తయితే రాయలసీమ రతనాల సీమ అవుతుంది. గత ప్రభుత్వం పోలవరాన్ని గోదావరిలో కలిపింది. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఖర్చు కూడా రెట్టింపు అయ్యింది.

అప్పులెంతో తెలియదు..

ప్రభుత్వ విధానాలతోనే ప్రజల జీవితాలు మారుతాయి. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే అభివృద్ధి చేస్తాం. దీర్ఘకాలంలో ప్రజల జీవితాలకు వెలుగునిచ్చే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఐదేళ్ల విధ్వంసాన్ని భరించలేకే ప్రజలు ముందుకు వచ్చి ఓట్లు వేశారు. ఎటువంటి అరమరికలు లేకుండా ప్రతి పనిని ప్రజల ముందు ఉంచుతాం. తప్పుడు పనులు చేసిన వారిని క్షమించం. రౌడీయిజాన్నిఅణచివేస్తాం. రాజధానిలో నిర్మాణాలను ఉన్మాది బారి నుంచి దేవుడే కాపాడాడు. రుషికొండను చదును చేసి రూ.500 కోట్లు ఖర్చు పెట్టి ప్యాలెస్ కట్టారు. పర్యావరణానికి విరుద్ధంగా ప్రవర్తించారు. జగన్ లాంటి వ్యక్తులకు రాజకీయాల్లో కొనసాగే అర్హత ఉందా? అనేది ప్రజల్లో చర్చ జరగాలి. అప్పులు ఎంత చేశారో తెలియదు. అడ్డదిడ్డంగా సంతకాలు పెట్టిన అధికారులు ఎక్కడున్నారో తెలియదు. ఇవన్నీ సరిదిద్దాలి. రాజధాని భూములను కూడా తాకట్టు పెట్టారేమో చూడాలి. లాలూచీ పడే అధికారుల ప్రవర్తన మార్చుకోవాలి.

తెరుచుకున్న 'దుఃఖాణాలు'

- ప్రైవేటు స్కూళ్లలో సైడ్ బిజినెస్

కాకినాడ సిటీ: జిల్లాలో కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు ఇప్పటికే రూ.వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తుండగా బుక్స్, బ్యాగు, చివరికి షూ సైతం తమ పాఠశాలలోనే తీసుకోవాలనేది ఆ యాజమాన్యాల ఆదేశం. బుక్స్ ఇతర మెటీరియల్ కలిపి రూ.10 వేల నుంచి రూ.14 వేలు దాటుతున్నాయి. వాటి ధర మార్కెట్లో రూ.5 వేలే. ఇదేమని అడిగితే ఇవి తీసుకుంటేనే ఇక్కడ చదవాలనే కండిషన్, లేకుంటే నో అడ్మిషన్, బయటి బుక్స్ తెస్తే, నో పర్మిషన్, జిల్లాలో దాదాపు అన్ని ప్రైవేట్ స్కూళ్లలో పరిస్థితి ఇదే...

జిల్లా కేంద్రంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ పాఠశాలలు. నియంత్రణ లేని ఫీజులు విద్యార్థుల తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. నాణ్యమైన విద్య అందుతుందనే అభిప్రాయంతో నగర పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు తమ పిల్లలను నగంలోని ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. దీంతో ఆయా పాఠశాలల యాజమాన్యాలు అడ్మిషన్, మెయింటినెన్స్, స్పెషల్ ఫీజులు అంటూ రక్తం పీలుస్తున్నాయి. పలు ప్రైవేట్ పాఠశాలల్లో యథేచ్ఛగా పుస్తకాలు, నోట్‌బుక్‌లు కొనాలని ఆదేశిస్తూ తమ పాఠశాల పేర్లతో ఉన్న బ్యాగులను సైతం విక్రయిస్తున్నారు. పాఠ్యపుస్తకాలు మొదలు, బ్యాగులు, టై, బూట్లు, షూ వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. జిల్లా అధికారులు కొలువుండే కాకినాడ నగరంలోనే ఈ పరిస్థితి ఉంటే ఇక మారుమూల ప్రాంతాల్లో ఎలా ఉందో చెప్పనవసరం లేదు. పాఠశాలలు పునఃప్రారంభమై వారం రోజులు కావస్తున్నా విద్యాశాఖ మాత్రం ఎలాంటి తనిఖీలు చేయడం లేదు.

పుస్తకాల ధరలు పైపైకి..

బయట షాపుల్లో ఓ పుస్తకం ధర రూ.20 ఉంటే పాఠశాలలో రూ.25 నుంచి రూ.30 వరకు ఉంటుంది. ఇంకొన్ని పాఠశాలల్లో అయితే రూ.40 కన్నా ఎక్కువగా ఉంటుంది. ఒకటో తరగతికి సంబంధించి 11 టెక్స్ట్‌బుక్స్‌కు రూ.1,220, 13 నోట్‌బుక్స్‌కు రూ.530 మొత్తం రూ.1,750 వసూలు చేస్తుండగా, కొన్నిచోట్ల రూ.5 వేలకు పైగానే తీసుకుంటున్నారు. రెండో తరగతి 11 టెక్స్ట్‌బుక్స్‌కు రూ.1,850, 21 నోట్ బుక్స్‌కు రూ. 760 మొత్తం రూ.2,610 కాగా, మరికొందరు రూ.6 వేలు తీసుకుంటున్నారు. మూడో తరగతి 10 టెక్స్ట్‌బుక్స్‌కు రూ.1,990, 22 నోట్‌బుక్స్‌కు రూ.660, మొత్తం రూ. 2,560 ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. వీటికి తోడు పెన్నులు, పెన్సిళ్లు, కవర్లు అంటూ రెట్టింపు ధరలకు అంటగడుతున్నారు.

> ఓ విశ్వసించిన వారలారా! ఇంకొకరి సొమ్మును అధర్మంగా తినకండి. అయితే పరస్పర అంగీకారంతో జరిగే క్రయ విక్రయాల ద్వారా లభించే దానిని తినవచ్చు.
>
> – ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 21 జూన్ 2024

మండుటెండల మహోపద్రవం

గత దశాబ్దిన్నరగా ఎన్నడెరుగని పరిస్థితి. మే నెలలో మండే ఎండలు తెలిసినవే అయినా, ఏప్రిల్ మొదలు జూన్ సగం దాటినా మాడు పగిలేలా దీర్ఘకాలిక ఉష్ణపవనాల దెబ్బ ఇప్పుడే అనుభవంలోకి వచ్చింది. కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో గణనీయమైన మార్పులతో ఢిల్లీ సహా ఉత్తరాది అంతా ఇప్పుడు అగ్నిగుండమైంది. మొన్న మంగళవారం 1969 తర్వాత ఎన్నడూ లేని స్థాయిలో 35.2 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతతో ఢిల్లీ మలమల మాడిపోయింది. ఒక్క జూన్‌లోనే ఇప్పటిదాకా ఏడు రోజులు తీవ్ర ఉష్ణపవనాలతో దేశ రాజధాని ఉక్కిరిబిక్కిరి కాగా, పగలే కాదు రాత్రి ఉష్ణోగ్రతలూ గణనీయంగా పెరిగిపోవడంతో అవస్థలు హెచ్చాయి. మే 12 తర్వాత ఇప్పటి వరకు ఢిల్లీలో పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు రాత్రి పొద్దుపోయినా 40 డిగ్రీల కన్నా తగ్గనే లేదు. నిరాశ్రయులు 192 మంది ఈ జూన్ నెల 11 నుంచి 19 మధ్య కాలంలో వడదెబ్బ తగిలి మరణించారట. మునుపెన్నడూ చూడని ఇన్ని మరణాల సంఖ్య పరిస్థితి తీవ్రతకు మచ్చుతునక.

నగరంలో నీటి కొరత మరో పెద్ద కథ. అధిక జనాభాతో దేశరాజధాని చాలాకాలంగా తల్లడిల్లుతోంది. సమీప ప్రాంతాల నుంచి వందలాది మంది వలస రావడంతో గత పాతికేళ్ళలో ఢిల్లీలో డజన్లకొద్దీ శిబిరాలు చట్టవిరుద్ధంగా వెలిశాయి. అసలే శిథిలమైన నగర జలవ్యవస్థ కారణంగా ఢిల్లీ పరిసర ప్రాంతాలకు, మరీ ముఖ్యంగా ఈ మురికివాడలకు కనీసం తాగునీటిని కూడా అందించలేని పరిస్థితి. దానికి తోడు యమునా నదీజలాలు తగ్గిపోయి, నీటి కోసం అల్లాడే ఎండాకాలం వస్తే వాటర్ ట్యాంకర్లతో నీటి పంపిణీ పెద్ద వ్యాపారమైంది. ఇదే అదనుగా జలవనరుల్ని యథేచ్ఛగా కొల్లగొడుతున్న ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల మాఫియా బయలుదేరింది. పెరిగిన ఎండలతో ఉత్తరాదిన రోజువారీ విద్యుత్ వినియోగం 89 గిగా వాట్ల పతాకస్థాయికి చేరి, ఢిల్లీ విమానాశ్రయం అరగంటసేపు కరెంట్ కోతలో మగ్గాల్సి వచ్చింది. మిగతా దక్షిణ, పశ్చిమ, తూర్పు, ఈశాన్య ప్రాంతాల నుంచి ఉత్తరాదికి 25 నుంచి 30 శాతం విద్యుత్ దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. ఈ ఎండల్లో ఇన్ని సమస్యల ముప్పేటదాడితో రాజధాని ప్రజలకు కష్టాలు వర్ణనాతీతం.

సందట్లో సడేమియాగా వ్యవహారం రాజకీయ రంగు పులుముకొంది. పొరుగున హర్యానాలోని బీజేపీ ప్రభుత్వాన్ని అభ్యర్థించినా, యమునలోని నీళ్ళొదలడం లేదన్నది ఢిల్లీ ఆప్ సర్కార్ ఆరోపణ. మాకే తగినంత లేవన్నది హర్యానా జవాబు. నీళ్ళైనా అందించలేకపోవడం ఆప్ వైఫల్యమేనంటూ ఢిల్లీ బీజేపీ నేతలు రోడ్డు పైకొచ్చి నిరసనలకు దిగడం ఒక ఎత్తయితే... ట్యాంకర్ల మాఫియా రెచ్చిపోవడం, ఢిల్లీ నీటి సరఫరా పైపులకు సైతం దుష్టశక్తులు చిల్లులు పెడుతున్నాయంటూ ఆప్ సర్కార్ ఆ పైపులకు పోలీసు రక్షణ కోరడం పరాకాష్ఠ. దేశ రాజధానిలో నీటి కొరతపై ప్రధాని మోదీ స్పందించకపోతే శుక్రవారం నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తానంటూ ఢిల్లీ మంత్రి ఆతిశి ప్రకటించడంతో మహానగరం మరింత వేడెక్కింది. నిజానికి, ఈసారి రుతుపవనాలు త్వరగానే కేరళను తాకి, ఇతర ప్రాంతాలకు విస్తరించాయి. తీరా జూన్ 12 నుంచి మధ్యభారతంలో అవి స్తంభించేసరికి, దేశమంతా ఇటు వర్షాలు లేవు. అటు ఎండలు, ఉక్కపోత. దక్షిణాదితో పోలిస్తే ఉత్తర, పశ్చిమ భారతావనిలో మరీ దుర్భరం. ఇలాంటి దీర్ఘకాలిక వేసవిని ప్రకృతి విపత్తుగా పరిగణించాలంటున్నది అందుకే!

నిజానికి ఇదంతా ఎక్కడో ఢిల్లీలో వ్యవహారమనీ, అది అక్కడికే పరిమితమనీ అనుకోవడానికి వీల్లేదు. వాతావరణ మార్పులు, మన స్వయంకృతాపరాధాల కారణంగా భవిష్యత్తులో దేశంలోని నగరాలన్నిటికీ ఇదే దుఃస్థితి దాపురించడం ఖాయం. ఆ మధ్య బెంగుళూరులో ఇలాంటివే చూశాం. దేశానికి అభివృద్ధిఇంజన్లయిన బొంబాయి, కలకత్తా, చెన్నై, హైదరాబాద్, పుణే లాంటి నగరాల్లోనూ రేపు ఇవే పరిస్థితులు వస్తే, పరిస్థితి ఏమిటి? దేశ ఆర్థికపురోగతికి వెన్నెముక అయిన వీటిని నివాసయోగ్యం కాకుండా చేస్తే, జనం ఉద్యోగ, ఉపాధుల మాటేమిటి? పొంచివున్న నీటికొరత నివారణకు పాలకులు ఏం ప్రణాళిక వేస్తున్నారు? హైదరాబాద్ సహా అనేక నగరాల్లో వందల కొద్దీ చెరువులు, కుంటలు కబ్జాకు గురై, పర్యావరణానికీ, పెరుగుతున్న జనాభా అవసరాలకూ తీరని నష్టం వాటిల్లింది. ఇప్పటికైనా మొద్దునిద్ర వదిలి, దీర్ఘకాలిక వ్యూహంతో ప్రభుత్వాలు ముందుకు రాకపోతే కష్టం.

మానవాళికి శాపంగా మారిన ఈ అధిక ఉష్ణోగ్రతల వెనక వాయుకాలుష్యం, శరవేగంగా పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, అడవుల నరికివేత... ఇలా చాలా కారణాలున్నాయి. విపరీతంగా నిర్మాణాలు పెరిగి, పట్టణాలన్నీ కాంక్రీట్ జనారణ్యాలుగా మారేసరికి, పచ్చని చెట్లు, ఖాళీ ప్రదేశాలున్న ప్రాంతాలతో పోలిస్తే కొద్ది కి.మీ.ల దూరంలోనే 2 నుంచి 4 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పైగా, దీనివల్ల రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గి, వాతావరణం చల్లబడడం కూడా పాతికేళ్ళ క్రితంతో పోలిస్తే బాగా నిదానించిందట. 'పట్టణ ఉష్ణద్వీప' ప్రభావంగా పేర్కొనే ఈ పరిస్థితిని నివారించడం అత్యవసరం. అలాగే, నిలువ నీడ లేని వారితో సహా సమాజంలోని దుర్బల వర్గాలను ఈ వేడిమి బాధ నుంచి కాపాడే చర్యలు చేపట్టాలి. ఒంట్లో నీటి శాతం తగ్గిపోనివ్వకుండా ప్రభుత్వాలు సురక్షిత తాగునీటి వసతి కల్పించాలి. శీతల కేంద్రాలు, ఎండబారిన పడకుండా తగినంత నీడ ఏర్పాటు చేయాలి. గత ఏడాది, ఈసారి ఎన్జీఓ 'స్వయం ఉపాధి మహిళా సంఘం' (సేవ) అమలు చేసిన 'ఎండల నుంచి బీమా సౌకర్యం' లాంటి వినూత్న ఆలోచనలు అసంఘటిత కార్మికుల జీవనోపాధిని కాపాడతాయి. ఇప్పటికే ఈ 2024 మానవచరిత్రలోనే మండుటెండల వత్సరంగా రికార్డు కెక్కింది. వచ్చే ఏడాది ఈ రికార్డును తిరగరాయక ముందే ఈ మహోపద్రవం పట్ల కళ్ళు తెరవడం మంచిది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.చతుర్దశి ఉ.6.37 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** జ్యేష్ఠ సా.6.22 వరకు, తదుపరి మూల **వర్జ్యం:** రా.2.27 నుండి 4.04 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.06 నుండి 8.59 వరకు, తదుపరి ప.12.28 నుండి 1.20 వరకు **అమృతఘడియలు:** ఉ.9.18 నుండి 10.56 వరకు.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం: 6.33
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

ఇంగ్లీషు మీడియం కొనసాగేనా?



అభిప్రాయం

ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

మొత్తం దేశ చరిత్రనే మార్చే పథకం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంగ్లీషు విద్య. ఆ విద్యా విధానాన్ని కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందా, ఆపేస్తుందా అనేది ప్రశ్న. గత ఐదేండ్లుగా ప్రభుత్వ పాఠశాల విద్యారంగంలో వచ్చిన మార్పులు గణనీయమైనవి. ఆ మార్పులను అనిష్టంగానైనా కొత్త ప్రభుత్వం కొనసాగిస్తే రానున్న ఐదేండ్లలో విద్యారంగంలోని మార్పులు పాతుకుపోతాయి. అలాకాకుండా మళ్ళీ పాత పద్ధతిలోకి విద్యావ్యవస్థను నెడితే ప్రజలు ఏం చెయ్యాలనేది చాలా కీలకమైంది. అందుకే స్కూళ్ళలో పిల్లల భవిష్యత్తును కొత్త ప్రభుత్వం వెనక్కి నెట్టకుండా చూడాల్సిన బాధ్యత వైసీపీ రాజకీయ శక్తులతో పాటు, పిల్లల తలిదండ్రుల మీద కూడా ఉంది.

ఎన్నికల సమయంలో చండీగఢ్‌లో జరిగిన రాజ్యాంగ రక్షణ సదస్సుకు నేను వక్తగా వెళ్ళాను. అది ఆఖరి ఘట్టం ఎన్నికల ముందు. చివరి ఘట్టంలో పంజాబు రాష్ట్ర ఎన్నికలు జరిగాయి. ఆ సదస్సు మే 22న జరిగింది. మరుసటి రోజు అక్కడి మేధావులు పంజాబు గ్రామాల్లో నాకోసం సమావేశాలు ఏర్పాటు చేశారు. నేను మూడు గ్రామాల్లో జరిగిన మూడు మీటింగుల్లో పాల్గొని మాట్లాడాను. మీటింగులో ఆడా, మగా చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు.



పంజాబులో ప్రభుత్వ పాఠశాల విద్య పంజాబీ భాషలోనే బోధిస్తారు. అన్ని రాష్ట్రాల్లో ఉన్నట్టు ఒక్క సబ్జెక్టు మాత్రం ఇంగ్లీషులో ఉంటుంది. అయితే అక్కడ కూడా ప్రైవేట్ స్కూళ్లు ఇంగ్లీషు మీడియంలో నడుస్తాయి. పంజాబీలు ఇతర దేశాలకు ఎక్కువ వలసపోతారు కనుక వారు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ఉండాలని డిమాండ్ చేస్తున్నారా అని నేను అడిగాను. వాళ్ళు లేదు అన్నారు.

అప్పుడు నేను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంగ్లీషు మీడియం గురించీ, అది గ్రామాల్లోని పిల్లల్లో తెస్తున్న మార్పుల గురించీ వివరించాను. 'మా పిల్లలకు కచ్చితంగా అటువంటి ఇంగ్లీషు మీడియం విద్య కావాలి; వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని పార్టీల ముందు ఈ డిమాండ్ పెడతా'మని వాళ్లు తీర్మానించుకున్నారు.

మొత్తం దేశ చరిత్రనే మార్చే పథకం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ స్కూళ్ళలో ఇంగ్లీషు విద్య. ఆ విద్యా విధానాన్ని కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందా, ఆపేస్తుందా అనేది కీలకమైన ప్రశ్న. చంద్రబాబు నాయుడు క్యాబినేట్ ప్రమాణ స్వీకారం రోజు వేదిక మీద ఉన్నవారంతా గ్రామీణ పిల్లలు ప్రభుత్వ స్కూళ్ళలో ఇంగ్లీషు మీడియం చదువు నేర్చుకోవడాన్ని వ్యతిరేకించినవారే. చంద్రబాబు ప్రభుత్వాన్ని ఢిల్లీ నుంచి శాసించే అమిత్ షా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం చదువుకు బద్ధ వ్యతిరేకి. అంతేకాదు, తెలుగు రాష్ట్రాల్లో ప్రైవేటు స్కూళ్ళను స్థాపించి ప్రభుత్వ విద్యారంగాన్ని నాశనం చేసిన నారాయణ మళ్ళీ మంత్రి అయ్యారు. కార్పొరేట్ ప్రైవేట్ స్కూళ్ళు చంద్రబాబు ప్రైవేటీకరణలో భాగంగా ఎదిగాయి.

ప్రభుత్వ రంగంలో ఇంగ్లీషు మీడియం విద్య ఒక సంక్షేమ పథకం కాదు. ప్రపంచంలోని అన్ని అభివృద్ధి చెందిన దేశాల్లో పాఠశాల విద్య ప్రభుత్వ రంగంలోనే ఉన్నది. కానీ, భారతదేశంలో ప్రైవేట్ పాఠశాల విద్య ప్రభుత్వ రంగ విద్యను సర్వనాశనం చేసింది. అటువంటి విద్యా విధానం నుండి గ్రామీణ విద్యార్థులను కాపాడే విద్యావిధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రభుత్వం దీన్ని రద్దు చేసి మళ్ళీ పాత పద్ధతిలోకి విద్యావ్యవస్థను నెడితే ప్రజలు ఏం చెయ్యాలనేది చాలా కీలకమైంది.

కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకారం, 2024–25 ఎకడమిక్ సంవత్సర స్కూళ్ల ప్రారంభం ఏకకాలంలో జరిగాయి. అయితే ఈ సంవత్సరానికి కావలసిన బైలింగ్వల్ బుక్స్(ఉభయ భాషా పుస్తకాలు), పిల్లలకిచ్చే డ్రెస్సులు, బూట్లు ఈ ప్రభుత్వం సకాలంలో ఇస్తుందా అనేది ప్రశ్న. గత ఐదేండ్లుగా ప్రభుత్వ పాఠశాల విద్యారంగంలో వచ్చిన మార్పులు గణనీయమైనవి. ఆ మార్పులను అనిష్టంగానైనా కొత్త ప్రభుత్వం కొనసాగిస్తే రానున్న ఐదేండ్లలో విద్యారంగంలోని మార్పులు పాతుకుపోతాయి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలలో బీదవారు, అగ్రకులాలలో బీదవారి పిల్లలకు 2029 ఎన్నికల నాటికి ఈ విద్యావ్యవస్థ తమకు ఎటువంటి భవిష్యత్తును ఇవ్వనుందో అర్థమయ్యే దశ వస్తుంది. కానీ ఇప్పుడు స్కూళ్ళలో పిల్లల భవిష్యత్తును కొత్త ప్రభుత్వం వెనక్కి నెట్టకుండా చూడాల్సిన బాధ్యత అటు వైసీపీ రాజకీయ శక్తులతో పాటు, ఇటు పిల్లల తలిదండ్రుల మీద ఉంది.

ఇప్పటి నుండి గ్రామాల్లో పిల్లల తల్లిదండ్రులు ఇంగ్లీషు మీడియం విద్యా పరిరక్షణ కమిటీలు వేసుకోవలసిన అవసరం ఉంది. గ్రామాల్లో ప్రజలు తమ రాజకీయ అభిప్రాయాలను అధిగమించి విద్యారంగ పరిరక్షణ కోసం కమిటీలు వేసుకుని గ్రామంలోని పిల్లలందరి భవిష్యత్ కాపాడవలసిన బాధ్యత ఉంది. గ్రామాల్లో కూడా ధనవంతులున్నారు. వారి పిల్లలను ప్రైవేట్ స్కూళ్ళలో విపరీతంగా డబ్బులు ఖర్చుపెట్టి చదివించగలిగేవారూ ఉన్నారు. ఇటువంటివారు, ఉద్యోగులు, పట్టణాల్లోని ధనవంతులు... బీద బక్క పిల్లలందరికీ ఇంగ్లీషు వస్తే తమ పిల్లలు వారితో పోటీ పడాల్సి వస్తుందని భావించి ప్రభుత్వ స్కూళ్ళలో ఇంగ్లీషు మీడియంను వ్యతిరేకించే అవకాశం ఉంది.

జగన్ ప్రభుత్వాన్ని ఉద్యోగస్థులు, కొంత మంది ఉపాధ్యాయులతో పాటు ఇతర ధనవంతులు వ్యతిరేకించడంలో తమ పిల్లల భవిష్యత్ స్వార్థం పనిచేసింది. ఈ స్వార్థం కులాలకు అతీతంగా ఉంటుంది. ప్రతి రిజర్వేషన్ కేటగిరిలో డబ్బున్నవారు తమ పిల్లలను ప్రైవేటు ఇంగ్లీషు మీడియం స్కూళ్ళలో చదివించి, ప్రభుత్వ తెలుగు మీడియం పిల్లలు తమ పిల్లలతో పోటీ పడకుండా ఉండాలనే స్వార్థం ఓటు వేసే దగ్గర కూడా పనిచేస్తుంది. ఈ స్వార్థపు వేళ్లను తెంపడం చాలా కష్టం. మార్పు తెచ్చే ప్రభుత్వాలను దింపెయ్యాలనే ఈ ధనిక వర్గం ఓటు వ్యవస్థను తమకు అనుకూలంగా తిప్పుకుంటుంది.

ప్రపంచీకరణ యుగంలో వర్గం, హోదా, ఆధిక్యత... నాణ్యమైన ఇంగ్లీష్ విద్యతో ముడిపడి ఉన్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ నిర్మాణాల్లో కూడా ఈ విధంగా ఆలోచించే వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. మార్పు తమ వర్గ శత్రువు అనుకునే శక్తులు వీరు. వీరు గ్రామాల్లో ఉన్నారు, పట్టణాల్లో ఉన్నారు.

భారతదేశ చరిత్రలో ఎప్పుడు కూడా స్కూలు విద్య ఎన్నికల్లో చర్చనీయాంశం కాలేదు. ఈసారి ఆంధ్ర ఎన్నికల్లో అది చర్చనీయాంశం అయింది. బహిరంగ సభల్లో సైతం స్కూలు పిల్లలు ఇంగ్లీషు, తెలుగులో వాగ్ధాటితో మాట్లాడటం, అదీ బీద కుటుంబం నుంచి వచ్చిన వారు మాట్లాడటం ఆ యా గ్రామాల్లో, పట్టణాల్లో ధనవంతులు జీర్ణించుకోలేని విషయం. మార్పును అంగీకరించదల్చుకోని విషయం. ఇది వైసీపీ ఓటమికి కొంత దోహదపడి ఉండవచ్చు. ఈ ధోరణిని తిప్పికొట్టాలంటే ప్రభుత్వ స్కూళ్ళలో చదివే పిల్లల తల్లిదండ్రుల తిరుగుబాటు మాత్రమే పనిచేస్తుంది.

భారతదేశంలో విద్య మీద గ్రామీణ స్థాయిలో చర్యలు, పోరాటాలు జరగలేదు. కమ్యూనిస్టులు కూడా ఇటువంటి పోరాటాన్ని జరపలేదు. ఈసారి ఆంధ్ర ఎన్నికల్లో కొత్త విద్యావిధానాన్ని ఓడించడానికి కమ్యూనిస్టులు కూడా సహకరించారు. ఆ విధంగా వీరు బీజేపీ భావజాలానికి మద్దతిచ్చారు.

అందుకే రానున్న ఐదేండ్లలో సమాన భాష, పురోగామి భావజాల పాఠశాల విద్య కోసం బలమైన పోరాటం జరగాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్ ఈ పోరాటానికి నేతృత్వం వహించాల్సి ఉంది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



జరిగిన మంచి



మూడు దశాబ్దాల తర్వాత, బారాముల్లాలో సిక్కు సమాజం 'నగర్ కీర్తన్' జరిపింది. ఆర్టికల్ 370 రద్దు కశ్మీర్‌లో బలమైన శాంతి, సామరస్యతలకు దారితీసింది. అన్ని విశ్వాసాలు, సమాజాలు సౌభ్రాతృత్వ భావనలో మనగలుగుతున్నాయి.

– ఫాతిమా దార్, కశ్మీరీ ఇండియన్

నీటు మాట



పెద్ద జోక్: తొమ్మిది లక్షల మంది విద్యార్థులకే విజయవంతంగా (మోసం లేకుండా) పరీక్ష నిర్వహించలేని జనాలు, వంద కోట్ల మందికి పారదర్శకమైన ఎన్నికలు నిర్వహించామని చెప్పుకొంటున్నారు.

– అనుష్కా మిత్తల్, వ్యాఖ్యాత

నిజమైన మనుషులు



మలప్పురం నుంచి ఒక 'నిజమైన కేరళ కథ': తిరూర్‌లోని వెట్టకోరుమాకం ఆలయంలో మంటలు వ్యాపించినప్పుడు, ముగ్గురు ముస్లిం యువకులు మహమ్మద్ నౌఫల్, మహమ్మద్ బేసిల్, రసూల్ ఆ మంటలను ఆర్పేందుకు పరుగెత్తారు. 'జనాలు ఎవరూ సాయానికి ముందుకు రాకపోతే, వాళ్ల సాయంతో మంటలను అదుపులోకి తెచ్చాం' అని పూజారి అన్నారు.

– మహమ్మద్ జుబేర్, ఫ్యాక్ట్ చెకర్

అర్థం కావడం ముఖ్యం



తరగతి గదిలో ఈ మాటలు అనాలని నా పిల్లల్ని ప్రోత్సహిస్తాను: 1. మేడమ్, నాకు అర్థం కావడం లేదు. 2. మళ్లీ చెప్తారా? 3. నాకో డౌట్ 4. దీని గురించి మళ్లీ మీతో మాట్లాడొచ్చా?... ఇలాంటివి అడగటం చాలా సాధారణం; పిల్లలకు ఇది స్పష్టంగా చెప్పాలి.

– కార్తీక్ బాలచంద్రన్, వైద్యుడు

అంతు పట్టేనా?



ప్రపంచంలో ఏం జరుగుతోంది? ఉత్తర కొరియాలో పుతిన్; జీ-7 దేశాలు 50 బిలియన్ డాలర్లను ఉక్రెయిన్‌కు ఇవ్వడం; రష్యా అణు సబ్‌మెరైన్ క్యూబాలో; దలైలామాను అమెరికన్లు కలవడం; ఖలిస్తాన్‌ను కెనడా ప్రోత్సహించడం; చైనా, ఐఎంఎఫ్ నుంచి పాకిస్తాన్ ప్రయోజనాలు పొందే ప్రయత్నం... ఏదో జరుగుతోంది.

– సాజిద్ ఎస్.తరార్, పాక్ వ్యాపారవేత్త

విధానం ఏమిటి?



మనకో పెద్ద ప్రశ్న: భారత నేల మీద బహిరంగంగా టిబెట్ గురించిన రాజకీయ వ్యాఖ్యలను చేసేలా అమెరికా కాంగ్రెస్ ప్రతినిధులను అనుమతించడం ద్వారా న్యూఢిల్లీ ఏం సాధించాలనుకుంటోంది? ఒకవేళ ఇదే భారత విధానమైతే, మరి దాన్నే భారత అధికారులు, నాయకులు వేదిక మీద ఎందుకు చేయకూడదు?

– సుహాసినీ హైదర్, జర్నలిస్ట్

పెద్ద మనుషుల తరం



మా 'నానా' (తాత; అమ్మ తండ్రి) మాకు అర్థం కాని భాషలో పుస్తకాలు చదవడాన్ని చూస్తూ పెరిగాము. అవి భగవద్గీత, రామాయణం, ఇంకా ఇతర మత గ్రంథాలని చెప్పేవాళ్లు. ఆయన పుస్తకాల్లో ఒకటి (ఉర్దూలో ఉన్న నవదుర్గల కథ) ఇవ్వాళ దొరికింది. ఒకప్పుడు మనుషులు మత దురభిమానం ఏమాత్రం లేకుండా కూడా ధార్మికంగా ఉండేవాళ్లు.

– ఏక్తా చౌహాన్, కళా బోధకురాలు

ఆమె ఎవరంటే...

ఆమె ఎవరని అడుగుతారేమో
ఏమని చెప్పాలి!?
ఆమె అక్షరం అని చెప్పనా
కష్ట జీవుల కన్నీటి వ్యథ అనాలా
ఆమె ఓ ధిక్కార స్వరం అని చెప్పనా
ఏమని చెప్పాలి?
అణిచివేతల సాచివేతల రాజ్యంలో
ఆమె ఓ పోరాట జ్వాల
చీకటి కొనల మీద చిక్కటి వెలుగు తాను

ఆమె ఎవరని అడుగుతారేమో
ఆమె అన్నార్తుల
ఆకలి కేకల పోరు నాదమని
గొంతు లేని ప్రజల గొంతుకని
ఆమె అక్షరం తెలియని వాళ్ల
అడుగు జాడల్లో అక్షర దివిటని
ఆమె ప్రజా పోరు దారుల్లో
ఓ అడుగు జాడని చెప్పగలను



ఆమె గొంతు ఎందుకు
నొక్కుతున్నారని అడిగితే మాత్రం
ఆమె శోషితుల పక్షమై నిల్చినందుకు
ఆమె పౌర హక్కులు అడిగినందుకు
ఆమె స్త్రీ సమానత్వం కోరినందుకు
ఆమె జాతి విముక్తి నినదించినందుకు
ఆమె స్వేచ్ఛను కోరినందుకే కదా
రాజ్య ద్రోహం అనే రాజ్య బహుమానం

– వంగల సంతోష్
(అరుంధతీ రాయ్‌పై పెట్టిన కేసును ఖండిస్తూ)

మనస్ఫూర్తిగా జీవించే యోగం కోసం...

ప్రస్తుతం మానసిక ఒత్తిడి, సమస్యలు లేని జీవితం లేదంటే అతిశయోక్తి కాదు. పని ఒత్తిడి, ఆర్థికపరమైన సమస్యలు, ఇతర ఇబ్బందుల కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రతిరోజూ కనీసం ఓ అర గంటయినా శారీరక శ్రమ చేయాలంటారు నిపుణులు. అందుకు యోగా చక్కని మార్గం. ఆరోగ్యకరమైన జీవితానికి యోగా ఎంతో సహాయపడుతుంది. చాలామందికి, వారి అస్తవ్యస్తమైన, బిజీ జీవితాల నుండి యోగా ఉపశమనాన్ని ఇవ్వగలదు. యోగా చేయడం వల్ల శరీరానికి నూతనోత్సాహం కలుగుతుంది. బలాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడుతుంది. భంగిమను మెరుగుపరుస్తుంది. మనసు, శరీరం, ఆత్మను నియంత్రించడంలో యోగా సహాయపడుతుంది.

యోగా ఒక శక్తిమంతమైన మైండ్‌ఫుల్‌నెస్ సాధన. యోగా ఒత్తిడిని తగ్గించి ప్రశాంతంగా ఉండేట్లు చేస్తుంది. యోగా చేయడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. యోగ శ్వాసక్రియ శక్తిని కూడా మెరుగుపరుస్తుంది. యోగా సాధన సాగదీసినట్లు అనిపించవచ్చు. కానీ శరీరానికి మంచి అనుభూతి అందించడం, కదిలే విధానంలో చాలా మార్పు చూపుతుంది. క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం వల్ల బరువు తగ్గడం, ఒత్తిడిని తగ్గించుకోవడం సాధ్యమవుతాయి. యోగ అభ్యాసం వలన కలిగే ప్రయోజనాలు ఇటీవలి కాలంలో ఎక్కువగా వ్యాప్తిలోకి వచ్చాయి.

యోగాలో చాలా రకాలు ఉన్నాయి, హఠ (అనేక శైలుల కలయిక) అత్యంత ప్రాచుర్యం పొందిన శైలులలో ఒకటి. హఠ యోగం ప్రాణాయామాలపై (శ్వాస నియంత్రిత వ్యాయామాలు) దృష్టి పెడుతుంది. వీటి తర్వాత వరుసలో ఆసనాలు (యోగా భంగిమలు) ఉంటాయి. అవి శవాసనంతో (విశ్రాంతి కాలం) ముగుస్తాయి.



యోగశాలల్లో సాధారణంగా అద్దాలు ఉండవు. సాధకులు తమను చుట్టుపక్కల వ్యక్తులు ఎలా చూస్తారనే దాని కంటే ముఖ్యంగా తమ పట్ల తమకు ఏకాగ్రత అవసరం. యోగా సాధన చేయని వ్యక్తుల కంటే యోగా సాధన చేసేవారికి తమ శరీరాల గురించి ఎక్కువ అవగాహన ఉంటుందని అధ్యయనాలు చెబుతున్నాయి. యోగాసనాలు వేసేవారు ఎక్కువ సంతృప్తిగా ఉన్నారు. తమ శరీరాలపై తక్కువ ఫిర్యాదులు చేశారు. అందుకే సానుకూల శరీర ఆకృతి, ఆత్మగౌరవాలను ప్రోత్సహించే కార్యక్రమాలు యోగా చికిత్సలో భాగం అవుతున్నాయి.

యోగాను అభ్యసించడం ద్వారా, ఒక వ్యక్తి జీవితంలోని ఇతర రంగాలలో కూడా అవగాహన మెరుగవుతుంది. తినే రుగ్మతలను యోగా పోగొడుతుంది. బుద్ధిపూర్వకంగా తినడం, శారీరక భావోద్వేగ అనుభూతులను అవగాహనకు తెచ్చుకోవడంలో యోగా సాయపడుతుంది. విచారంలో ఉన్నప్పుడు లేదా ఒత్తిడికి గురైనప్పుడు పరధ్యానంగా తింటారు. అదే యోగాను అభ్యసించే వ్యక్తులు ఒక పద్ధతి ప్రకారం మనస్ఫూర్తిగా భుజిస్తారు. అందుకే బరువు తగ్గాలనుకునేవారికి యోగా సాధన ఉత్తమం. బుద్ధిపూర్వకంగా తినేవారు తమ శరీరాన్ని ఆరోగ్యాంగా చూసుకుంటారు. యోగా సాధన చేసేవారిలో కండరాల బలం, స్థితప్రజ్ఞత, ఓర్పు, కార్డియో-రెస్పిరేటరీ ఫిట్‌నెస్ మెరుగవుతాయని అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. యోగా, మంచి ఆహార అలవాట్లు మనిషి మనుగడను మెరుగుపరుస్తాయి. మనిషి ప్రశాంతతకు, ఆనందమయ జీవితానికి యోగా మంచి ఉపకరణం.

– డా॥ ఎం. అఖిల మిత్ర । ప్రకృతి వైద్యులు
(నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం)

సంతాపం సగం చేటు

పుట్టెడు కష్టం వచ్చి శోకసంతాపాల్లో మునిగి ఉన్న వ్యక్తిని, 'ఊరుకో, దుఃఖించకు!' అంటే ఊరుకోడు. ఊరుకోలేడు. అనుకోకుండా తీవ్రమైన కష్టాలు ఎదురయినప్పుడు మనిషికి సంతాపం, దిగులు, దుఃఖం కలగటం మామూలు విషయమే. కొన్ని పరిమితులలో ఉన్నవరకూ అది మానసిక ఆరోగ్యానికి మంచిది కూడా!

అయితే ఘడియకో, గంటకో, రోజుకో, వారానికో ఎలాగోలా దాన్ని అధిగమించాలి. బాధే సౌఖ్యమనే భావన పట్టుకొని, శోకపు ఊబి నుంచి బయటపడే ప్రయాస చేయని దేవదాసు మనసు మీదా, జీవితం మీదా అదుపు కోల్పోయి మరింత శోకం కొని తెచ్చుకొన్నవాడయ్యాడు.

జ్యోతిర్మయం

సఫల జీవనం కోరేవాడికి సంతోషం సగం బలం. సంతాపం సగం చేటు.

సందర్భానికి సరిపడని నవ్వులాగా, దీర్ఘకాలం కొనసాగే సంతాపం కూడా నాలుగందాల చేటు అంటుంది మహాభారతం. 'సంతాపాత్ భ్రశ్యతే రూపం, సంతాపాత్ భ్రశ్యతే బలమ్'... దీర్ఘ శోకం వల్ల శరీరం చిక్కి, ముఖం నిస్తేజమై, ఆకారం వికారమవుతుంది. సంతాపం వల్ల బలం– అటు మనోబలమూ, ఇటు శరీర బలమూ– క్షీణించటం జరుగుతుంది. 'సంతాపాత్ భ్రశ్యతే జ్ఞానం, సంతాపాత్ వ్యాధిం ఋచ్ఛతి'... దుఃఖం వల్ల వివేచనా, జ్ఞానమూ సన్నగిల్లుతాయి. మితిమీరిన సంతాపం అనారోగ్యాన్ని కలిగిస్తుంది.

శోకించటం వల్ల, కోల్పోయింది తిరిగిరాదు. తిరిగి రావాలంటే కావాల్సింది ప్రయాస. ఆ ప్రయాసకు శోకం ప్రతిబంధకం. శోకం వల్ల, శోకించేవాడికి లాభం శూన్యం. అతడి శత్రువులకు మాత్రం అతడి శోకం ఆనందాన్నిస్తుంది అంటాడు విదురుడు.

– ఎం. మారుతి శాస్త్రి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ-మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

నేడు యుద్ధ నౌకలపై యోగాసనాలు



సాక్షి, విశాఖపట్నం: అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున ప్రపంచ దేశాల్లో ఉన్న ఇండియన్ వార్‌షిప్‌లపై యోగా విన్యాసాలు నిర్వహించాలని ఇండియన్ నేవీ సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే 4 రోజులుగా పలు దేశాల్లో యోగాభ్యాసాలు చేస్తున్నారు. యోగా డే సందర్భంగా భారత నౌకాదళ బృందం సాహసోపేతమైన విన్యాసాల్ని నడి సముద్రంలో చేయడం 2019 నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఆగ్నేయాసియా దేశాలతో పాటు పశ్చిమ పసిఫిక్ ప్రాంతాల్లో భారత యుద్ధ నౌకలు ఐఎన్ఎస్ శక్తి, ఐఎన్ఎస్ కమోర్తాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో పహారా కాస్తున్న యుద్ధ నౌకల్లో నేవీ బృందాలు శుక్రవారం యోగాసనాలు వేయనున్నట్లు తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రం ప్రకటించింది. ఈ విన్యాసాలు నిర్వహించిన అనంతరం..భారత జాతీయ పతాకం ప్రదర్శితమయ్యేలా యోగాసనాలు వేస్తారని ఈఎన్‌సీ అధికారులు తెలిపారు.

మెట్ల మార్గంలో.. స్కాన్ చేసిన టోకెన్లు ఉంటేనే శ్రీవారి దర్శనం

చంద్రగిరి (తిరుపతి జిల్లా): కాలినడకన శ్రీవారి మెట్టు మార్గం గుండా తిరుమలకు చేరుకునే భక్తుల టోకెన్లు స్కాన్ చేసి ఉంటేనే శ్రీవారి దర్శనం ఉంటుందని టీటీడీ అధికారులు స్పష్టం చేశారు. కొద్దిరోజులుగా శ్రీవారిమెట్టు ప్రారంభంలో భక్తులకు టీటీడీ దర్శన టోకెన్లను జారీ చేయడంతో ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో దర్శన టోకెన్లను సరైన పద్ధతిలో అందించాలంటూ భక్తులు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో శ్రీవారి మెట్టు మార్గం గుండా టోకెన్లను పొందిన భక్తులు 1200వ మెట్టు వద్ద తప్పనిసరిగా టోకెన్లను స్కానింగ్ చేసుకునే విధంగా ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు గురువారం దివ్యదర్శనం టోకెన్ స్కానింగ్‌ను టీటీడీ పునఃప్రారంభించింది. దీనికి సంబంధించిన ట్రయల్ రన్ గురువారం నిర్వహించారు. శ్రీవారి మెట్టు వద్ద దివ్య దర్శనం టోకెన్లు తీసుకున్న భక్తులు శుక్రవారం నుంచి విధిగా 1200 వ మెట్టు వద్ద స్కానింగ్ చేయించుకోవాలి. లేకుంటే గతంలో ఆచరణలో ఉన్నట్లుగా దివ్యదర్శనం టోకెన్లు కలిగి స్కాన్ చేసుకోని భక్తులను దర్శన క్యూల్లో అనుమతించరని టీటీడీ స్పష్టం చేసింది. ఈ మేరకు భక్తులు మార్పును గమనించాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

మహిళ కడుపులో ఎనిమిది కిలోల కణితి తొలగింపు

- తప్పిన ప్రాణాపాయం
- అరకు ఏరియా ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



అరకులోయ టౌన్ (అల్లూరి సీతారామరాజు జిల్లా): స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యులు గురువారం అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. మండలంలోని దిబ్బవలస గ్రామానికి చెందిన పోడపల్లి తిమె (45) అనే మహిళ కడుపులో ఎనిమిది కిలోల కణితిని ఆస్పత్రి జనరల్ సర్జన్ లగుడు రాము నేతృత్వంలో వైద్యులు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ ఈ ఆస్పత్రిలో ఇటువంటి శస్త్రచికిత్స జరగలేదన్నారు. తిమె ఆరేళ్లుగా కణితితో బాధపడుతోందని, దీనిని తొలగించడం వల్ల ప్రాణాపాయ స్థితి తప్పిందన్నారు. శస్త్ర చికిత్సలో వైద్య సిబ్బంది రాంబాబు, సావిత్రి, ఉషా పాల్గొన్నారు.

ఏపీ నిట్.. ప్లేస్‌మెంట్స్‌లో హిట్

ఈ ఏడాదిలో ఇప్పటివరకు 258 మందికి ఉద్యోగాలు



- బయట లేఆఫ్‌లు ఉన్నా దిగ్గజ కంపెనీల్లో ఆఫర్లు
- సరాసరి వేతనం సంవత్సరానికి రూ.7.15 లక్షలు
- ఇద్దరు విద్యార్థులకు అత్యధికంగా రూ.44.1 లక్షల ప్యాకేజీ

తాడేపల్లిగూడెం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) ప్రాంగణ నియామకాల్లో సత్తా చాటుతోంది. ఇక్కడ ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్నవారికి దిగ్గజ కంపెనీల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో లేఆఫ్‌లు కొనసాగుతున్నా.. ఏపీ నిట్ విద్యార్థులకు మాత్రం మంచి అవకాశాలు దక్కుతున్నాయి. మంచి ప్యాకేజీలతో ఉద్యోగాలను సాధిస్తున్నారు. 2022 బ్యాచ్‌లో 98 శాతం, 2023లో 97 శాతం మంది విద్యార్థులు ప్రాంగణ నియామకాల్లో ఎంపికయ్యారు. ఏపీ నిట్ ప్రారంభించిన దగ్గరి నుంచి ఇప్పటివరకు ఏడాదికి 300 మందికి తక్కువ కాకుండా ఉద్యోగాలు పొందడం విశేషం. త్వరలో 2023–24 సంవత్సరానికి సంబంధించి ఆరో బ్యాచ్ బయటకు రానుంది.

258 మందికి ఉద్యోగాలు

క్యాంపస్ ఇంటర్వ్యూల కోసం ఏకంగా 127 కంపెనీలు నిట్ ప్రాంగణానికి వచ్చాయి. ఆరో బ్యాచ్ విద్యార్థుల్లో ప్లేస్‌మెంట్స్ కోసం 392 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇప్పటివరకు 258 మంది (65.82 శాతం)కి ఉద్యోగాలు లభించాయి. సరాసరి వేతనం రూ.7.15 లక్షలుగా ఉంది. బీటెక్ ఫైనలియర్ సీఎస్ఈ చదువుతున్న ఆదర్శ్, ఈసీఈ విద్యార్థి ఆకాష్‌కుమార్ సిన్హా అత్యధికంగా రూ.44.1 లక్షల వార్షిక ప్యాకేజీ పొందారు. వీరిని నివిధ కంపెనీ ఎంపిక చేసుకుంది. అలాగే సీఎస్ఈ విద్యార్థి సలాది వెంకట శశిభూషణ్.. పేపాల్ కంపెనీలో రూ.34.4 లక్షల ప్యాకేజీతో, సీఎస్ఈ బ్రాంచ్‌కే చెందిన స్వామి సక్సేనా జెడ్ఎస్ కేలర్‌లో రూ.26.5 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించడం విశేషం. కాగా డిసెంబర్ వరకు ప్లేస్‌మెంట్స్ ప్రక్రియ కొనసాగనుంది.

480 సీట్ల భర్తీ

నిట్‌లో 2024–25 సంవత్సరానికి సంబంధించి జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ (జోసా) నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ మొదటి రౌండ్‌లో 480 సీట్లకు అలాట్‌మెంట్లు పూర్తయ్యాయని రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకరరెడ్డి గురువారం తెలిపారు. నిట్‌లో సీఈసీ, ఈఈఈ, ఈసీఈ బ్రాంచ్‌ల్లో 90 సీట్ల చొప్పున ఉన్నాయన్నారు. అలాగే సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ బ్రాంచ్‌ల్లో 60 చొప్పున, కెమికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, ఎంఎంఈ బ్రాంచ్‌ల్లో 30 చొప్పున సీట్లు ఉన్నాయని వెల్లడించారు. మొత్తం 480 సీట్లలో 50 శాతం సీట్లను రాష్ట్ర విద్యార్థులకు, మిగిలిన 50 శాతం సీట్లను ఇతర రాష్ట్రాల విద్యార్థులకు కౌన్సెలింగ్ ద్వారా కేటాయించామన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 24లోపు ఆన్‌లైన్ రిపోర్టింగ్‌తో పాటు ఫీజు చెల్లించాలని కోరారు. ఆగస్టు మొదటి వారంలో నిట్ ప్రాంగణానికి వచ్చి తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లను వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. దీని కోసం నిట్‌లో ప్రత్యేక కేంద్రం పనిచేస్తోందన్నారు.

ముత్యపు కవచంలో మురిపించిన మలయప్ప



జ్యేష్ఠాభిషేకంలో శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామికి వసంతాలు నిర్వహిస్తున్న అర్చకులు

తిరుమల: తిరుమల శ్రీవారి జ్యేష్ఠాభిషేకంలో భాగంగా రెండో రోజు గురువారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు ముత్యపు కవచం ధరించి నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను మురిపించారు. అంతకుముందు ఉదయం 6.30 గంటలకు శ్రీ మలయప్ప స్వామివారు ఉభయదేవేరులతో కలిసి శ్రీవారి ఆలయంలోని సంపంగి ప్రాకారానికి వేంచేపు చేశారు. ఉదయం 8 గంటలకు ఆలయ అర్చకులు, వేదపారాయణదారులు శాస్త్రోక్తంగా మహాశాంతి హోమం నిర్వహించారు. అనంతరం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు శ్రీ మలయప్ప స్వామివారికి, దేవేరులకు అభిదేయక అభిషేకాన్ని కన్నుల పండువగా చేపట్టారు. సాయంత్రం శ్రీ మలయప్పస్వామివారికి ముత్యపు కవచ సమర్పణ వేడుకగా జరిగింది. అనంతరం సహస్రదీపాలంకార సేవలో స్వామి ముత్యపు కవచంలో భక్తులను అనుగ్రహించారు. కాగా సంవత్సరంలో ఒకమారు మాత్రమే ముత్యపు కవచాన్ని ధరించిన స్వామివారి ముగ్ధమనోహర రూపాన్ని చూసి భక్తులు తన్మయత్వం చెందారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథం, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

గజవాహనంపై పద్మావతీదేవి దివ్యదర్శనం

తెప్పపై విహరించిన అమ్మవారు



అమ్మవారికి మంగళ హారతులిస్తున్న పండితులు

చంద్రగిరి (తిరుపతి జిల్లా): శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన గురువారం రాత్రి అమ్మవారు గజవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి మధ్యాహ్నం 3 గంటలకు వేదపారాయణం, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ అర్చకులు నేత్రపర్వంగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6.30గంటలకు తెప్పపై ఆశీనులై ఐదుమార్లు పుష్కరిణిలో విహరించారు. రాత్రి 8.30గంటలకు సర్వాలంకార శోభితురాలై గజవాహనంపై ఆశీనులై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, సూపరింటెండెంట్ మధు, అర్చకులు బాబు స్వామి పాల్గొన్నారు. తెప్పోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం సాయంత్రం 6.30గంటలకు పుష్కరిణిలో అమ్మవారు ఏడు పర్యాయాలు తెప్పపై విహరించనున్నారు. రాత్రి 8.45గంటలకు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

'ఉక్కు' పొతర

▶ మొదటి పేజీ తరువాయి

ఈ అభిప్రాయం బలపడుతోంది. ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై నగరాల్లో ఉన్న ఖరీదైన భవనాలు, స్టాక్‌యార్డుల విక్రయానికి రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) బోర్డు ఆమోదం తెలిపి... తూతూ మంత్రంగా తుది అనుమతుల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది.

మూలధన సంక్షోభం పేరుతో..

స్టీల్‌ప్లాంట్ బయట నిరర్థకంగా ఉన్న ఆస్తుల అమ్మకానికి సంస్థ యాజమాన్యం రంగం సిద్ధంచేసుకుంటోంది. మూలధన సంక్షోభాన్ని అధిగమిస్తూ.. పూర్తిస్థాయి ప్లాంట్ నిర్వహణ కోసం సొంతంగా నిధులు సమకూర్చుకునేందుకే ఆస్తుల వేలం ప్రక్రియ షురూ చేసింది. ఇటు ప్రజలు.. అటు ఉద్యోగుల ఆందోళనలు.. ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నిరసనలను ఎన్‌డీఏ ప్రభుత్వం ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే స్టీల్‌ప్లాంట్ విక్రయించేందుకు ఉన్న అవకాశాలపైనే దృష్టిసారించింది. రెండ్రోజుల క్రితం కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఇప్పట్లో ఉండబోదని స్పష్టంచేశారు. అయినప్పటికీ ఎన్‌డీఏ ప్రభుత్వ చర్యలు మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఉన్న ఆస్తులన్నింటినీ విక్రయించేసి.. ప్లాంట్ విలువను శూన్యం చేసేందుకు సిద్ధమవుతోంది. రైతులు, ప్రజలు త్యాగాలు చేసి.. 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' నినాదంతో పోరాడి సాధించుకున్న పరిశ్రమ ప్రైవేటీకరణకు శతవిధాలా యత్నిస్తోంది. ఎన్నికలు పూర్తయ్యేంత వరకూ స్తబ్దుగా ఉన్నా.. తాజాగా విశాఖ ఉక్కు స్థలాల అమ్మకాల వ్యవహారాన్ని మళ్లీ వేగవంతం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడంతో ప్రైవేటీకరణకు కొంత బ్రేక్ పడింది. ఇప్పుడు ప్రభుత్వం మారిన వెంటనే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కేంద్రం వెనక్కు తగ్గడంలేదు. నిజానికి.. పరిశ్రమకు ప్రత్యేకంగా గనులు కేటాయించి, ఆర్థిక భరోసా కల్పించి కష్టాల నుంచి గట్టెక్కించొచ్చు. సెయిల్‌లో విలీనం చేయడం మరో పరిష్కారం అని తెలిసినా, కేంద్రం ఆ పని కూడా చేయడం లేదు. ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నా ప్రైవేటీకరణకే మొగ్గు చూపుతూ 'విశాఖ ఉక్కు' ఊపిరి తీసేలా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు తెరపైకి తెచ్చిన ఉక్కు స్థలాల అమ్మకం వ్యవహారాన్ని తాజాగా వేగవంతం చేశారు. ఇందులో భాగంగా.. దేశవ్యాప్తంగా ఉన్న ఆర్ఐఎన్ఎల్ ఆస్తుల వేలానికి సిద్ధమవుతోంది.

ఆదరిస్తే.., అద్భుతాలే కానీ..

ఇటీవలే కొంతమేర లాభాలతో పాటు రికార్డు స్థాయిలో ఉత్పత్తి చేస్తూ స్టీల్‌ప్లాంట్ దూసుకుపోతోంది. సొంత గనులు కేటాయించి మూలధన సాయంచేస్తే ఉక్కు కర్మాగారం ఉరకలు వేసే అవకాశాలున్నా.. ఎన్‌డీఏ ప్రభుత్వం మాత్రం ప్రైవేటీకరణ వైపే మొగ్గు చూపుతుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్లాంటులో పూర్తి సామర్థ్యం మేరకు ఉక్కు ఉత్పత్తి చేయకుండా ఆస్తులను అమ్మడానికి ఆసక్తి చూపడంపైనా ఉద్యోగ, కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. స్థలాలు అమ్మితే విశాఖ ఉక్కు కష్టాలు తీరుతాయా అంటే ముడిసరుకు కొనుగోలు చేయడానికి, పేరుకుపోయిన అప్పులు తీర్చడానికి సైతం సరిపోవని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. జిందాల్ సంస్థతో ముడిసరుకు సరఫరాకు ఆర్థిక సాయానికి ఇటీవల ఒప్పందం కుదిరింది. ఆ మేరకు బీఎఫ్–3 ప్రారంభించినా, ముడిసరుకు సక్రమంగా అందక ఉత్పత్తి లక్ష్యం అందుకోలేకపోతోంది. నిత్యం మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌ల ద్వారా 21 వేల టన్నులు ఉత్పత్తి చేసే అవకాశమున్నా, 14 వేల టన్నులకే పరిమితమవుతోంది. ఎన్ఎండీసీ ద్వారా ప్లాంటుకు ప్రతిరోజూ 6 రేక్‌ల ఇనుప ఖనిజం అందాలి. నాలుగు రేక్‌లకు మించి అందించడంలేదు. ఇప్పుడిస్తున్న ఇనుప ఖనిజం కేవలం రెండు ఫర్నేస్‌లకు మాత్రమే సరిపోతోంది. బీఎఫ్–3 పరిస్థితి ఏంటనే దానిపై ఉక్కు మంత్రిత్వ శాఖ దృష్టిసారించకుండా ఆస్తుల్ని విక్రయించేసి.. స్టీల్‌ప్లాంట్‌ని మోడువారేలా చేసి.. ప్రైవేటీకరణ చేయాలన్న లక్ష్యంతోనే ఎన్‌డీఏ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఈ విషయాలు తెలిసినా టీడీపీ, జనసేన పార్టీలు.. పొత్తు పార్టీ బీజేపీపై ఒత్తిడి తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నంత వరకూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని కదిలించేందుకు భయపడిన బీజేపీ.. ఇప్పుడు మాత్రం వేగంగా పావులు కదుపుతోంది.

బోర్డు సమావేశంలో వేలం అంశం!

ఇదిలా ఉంటే.. ఇటీవల జరిగిన బోర్డు డైరెక్టర్ల సమావేశంలో ఆస్తుల విక్రయంపై ప్రధాన చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా విశాఖ స్టీల్ మెటీరియల్స్ నిల్వచేయడానికి హైదరాబాద్, చెన్నైలలో స్టాక్‌యార్డుల ఏర్పాటుకోసం కొనుగోలు చేసిన భూములతో పాటు ముంబై, ఢిల్లీ సహా వివిధ ప్రాంతాల్లో ఉన్న భవనాల్ని విక్రయించే అంశాలపై చర్చించినట్లు సమాచారం. దక్షిణాది, పశ్చిమ రాష్ట్రాల స్టీల్ వినియోగదారుల అవసరాల్ని మూడు దశాబ్దాల కాలంగా హైదరాబాద్, చెన్నైలోని స్టాక్‌యార్డులు తీరుస్తున్నాయి. ఇతర మెట్రో ప్రాంతాలతో పోలిస్తే.. ఈ స్టాక్‌యార్డుల్లో హ్యాండ్లింగ్ చార్జీలు తక్కువగా ఉండటంతో ఎక్కువగా ఇక్కడే విక్రయాలు జరిగేవి. వీటిని విక్రయిస్తే అటు స్టీల్‌ప్లాంట్‌కు, ఇటు వినియోగదారులకు నష్టాలే తప్ప ఎలాంటి ఉపయోగంలేదు. ఈ మొత్తం ఆస్తుల మార్కెట్ విలువ రూ.476.18 కోట్లు ఉంటుందని అధికారులు లెక్కలు కట్టారు. నిరర్థక ఆస్తుల నెపంతో ఆస్తుల మానిటైజేషన్‌కు బోర్డు సూచనప్రాయంగా ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. మరోసారి ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకుని కేంద్రానికి ప్రతిపాదనలు పంపించేందుకు బోర్డు సమాయత్తమవుతున్నట్లు సమాచారం.

విక్రయానికి చర్చించిన స్టీల్‌ప్లాంట్ ఆస్తులివే..



ఆస్తులున్న ప్రాంతం	విస్తీర్ణం (చ.మీ.లలో)	ప్రస్తుత మార్కెట్ విలువ (రూ.కోట్లలో)
ముంబై కార్యాలయం	214	12.51
గుర్‌గావ్–ఈస్ట్‌లో 7 ఫ్లాట్లు	528	10.91
ముంబైలో నాలుగు ఫ్లాట్లు	261	2.90
ముంబైలోని కాలంబోలిలో 2 ఫ్లాట్లు	108	0.61
ఢిల్లీలోని కార్యాలయం	350	16.00
ఫరీదాబాద్‌లోని కార్యాలయం	186	1.42
హైదరాబాద్ కార్యాలయం	4,047	12.15
బెంగళూరు కార్యాలయం	424	6.50
చెన్నై స్టాక్‌యార్డు	53,459	191.73
హైదరాబాద్ స్టాక్‌యార్డు	89,031	220.00
పూణే కార్యాలయం	135	1.45
మొత్తం		476.18

స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రంతో ప్రకటన చేయించాలి

కూటమి నేతలకు సీఐటీయూ నేత ఆర్‌కేఎస్‌వీకుమార్ డిమాండ్



దాబా గార్డెన్స్(విశాఖ దక్షిణ): విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకుంటున్నట్లుగా కేంద్ర ప్రభుత్వంతో ప్రకటన చేయించాలని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నేతలను సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించేలా ఒత్తిడి తేవాలని.. అలాగే స్టీల్ ప్లాంట్ నిర్మాణం వల్ల భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉపాధి కల్పించి న్యాయం చేయాలని కోరారు. గురువారం విశాఖపట్నంలో ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ 1,225 రోజులుగా కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పోరాడుతున్నారని చెప్పారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణను అడ్డుకుంటామంటూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, విశాఖ ఎంపీ భరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రంతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి విశాఖ స్టీల్ ప్లాంట్‌కు గనులు కేటాయించకుండా, వేలం పాటలో పాల్గొనాలంటూ ప్రకటన చేయడం దారుణమన్నారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా చీపురుపల్లి, కింతాడ, గర్భాంలో గల గనుల లీజులను తక్షణమే పునరుద్ధరించాలన్నారు. స్టీల్ ప్లాంట్ నిర్మాణంలో భూములు కోల్పోయిన 8,500 మందికి తక్షణమే ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

'సాక్షి' కథనానికి స్పందన

- లోకాయుక్త ఆదేశంతో కదిలిన అధికారులు
- కాకానిలో ఆక్రమణకు గురైన భూముల పరిశీలన

నరసరావుపేట రూరల్: జగనన్న లే అవుట్‌లో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలను టీడీపీ నేతలు ఆక్రమించడంపై లోకాయుక్త ఆగ్రహం వ్యక్తం చేయడంతో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఆక్రమణలపై రెవెన్యూ, పోలీసు శాఖలు గురువారం విచారణ జరిపాయి. పేదల ఇళ్ల స్థలాలను ఆక్రమించిన టీడీపీ నేతలు అంటూ బుధవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమవగా..దాన్ని లోకాయుక్త సుమోటోగా తీసుకుని విచారణ జరిపి నివేదికను అందజేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. దీంతో నరసరావుపేట మండలం కాకాని సమీపంలోని జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కాలేజీ వద్ద పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల ప్రాంతాన్ని రూరల్ ఎస్‌ఐ రోశయ్య పరిశీలించారు. ఇళ్ల స్థలాల వద్ద ఏర్పాటు చేసిన హద్దు రాళ్లను తొలిగించి రోడ్డును ధ్వంసం చేసినట్లు గుర్తించారు. భూమిని చదును చేసి పంటభూమిగా మార్చే పనులు చేపట్టినట్లు విచారణలో తేల్చారు. తహశీల్దార్ హరిబాబు సెలవుపై ఉండటంతో వీఆర్‌వో నరసింహ విచారణ జరిపి నివేదిక సిద్ధం చేశారు. జగనన్న లేఅవుట్‌లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన మాట వాస్తవమని, ఇందులో 80 సెంట్లు ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారని తేల్చారు. తహశీల్దార్ సెలవు నుంచి రాగానే నివేదిక అందజేసి చర్యలు తీసుకునేందుకు రెవెన్యూ శాఖ సిద్ధమైంది.

పిన్నెల్లి వ్యాజ్యాలపై తీర్పు రిజర్వ్

మధ్యంతర ముందస్తు బెయిలు పొడిగింపు
హైకోర్టు ఉత్తర్వులు



సాక్షి, అమరావతి : పోలీసులు నమోదు చేసిన మూడు కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హైకోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యాలపై వాదనలు ముగిశాయి. న్యాయస్థానం తీర్పును రిజర్వు చేసింది. పిన్నెల్లికి మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను ఈ వ్యాజ్యాల్లో తీర్పు వెలువరించే వరకు పొడిగిస్తున్నట్లు హైకోర్టు తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగఢ మల్లికార్జునరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈవీఎం ధ్వంసం కేసులో హైకోర్టు పిన్నెల్లికి మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసిన వెంటనే పోలీసులు ఆయనపై రెండు హత్యాయత్నం కేసులతో సహా మూడు కేసులు నమోదు చేశారు. కౌంటింగ్ ప్రక్రియలో పిన్నెల్లి పాల్గొనకుండా పెట్టిన ఈ తప్పుడు కేసులపై పిన్నెల్లి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన హైకోర్టు.. కౌంటింగ్‌లో పాల్గొనేందుకు పిన్నెల్లికి ఈ నెల 6వ తేదీ వరకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. తరువాత ఈ ఉత్తర్వులను పొడిగిస్తూ వచ్చింది. గురువారం ఈ వ్యాజ్యాలు మరోసారి విచారణకు వచ్చాయి.

పోలీసులు కోర్టును తప్పుదోవ పట్టించారు.. తీవ్రంగా పరిగణించండి

ఈ సందర్భంగా పిన్నెల్లి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ఎన్నికల సంఘం, పోలీసుల తీరును ఎండగట్టారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్ట్ చేసి తీరాలన్న లక్ష్యంతో ఎన్నికల కమిషన్ అసాధారణ రీతిలో ఉత్తర్వులిచ్చిందని, గతంలో ఎన్నడూ కమిషన్ ఇలా వ్యవహరించలేదని అన్నారు. పోలీసులు పరిధి దాటి వ్యవహరించారన్నారు. తప్పుడు వివరాలతో కోర్టును సైతం తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారని తెలిపారు. ఈవీఎం కేసులో పిన్నెల్లికి హైకోర్టు మధ్యంతర ముందస్తు బెయిల్ ఇవ్వనున్నట్లు సంకేతాలు రావడంతో ఆ వెంటనే హత్యాయత్నం కేసులు బనాయించేందుకు పోలీసులు రంగం సిద్ధం చేశారన్నారు. గత నెల 22న హైకోర్టు మధ్యంతర ముందస్తు బెయిల్ ఇవ్వగా, 23న ఇతర కేసుల్లో పిన్నెల్లిని నిందితునిగా చేర్చారని తెలిపారు. హైకోర్టుకు మాత్రం 22నే చేసినట్లు చెప్పారని, తరువాత ఇది అబద్ధమని తేలడంతో 23నే నిందితునిగా చేర్చినట్లు పోలీసులు అంగీకరించక తప్పలేదన్నారు. ఇదే విషయాన్ని హైకోర్టు సైతం తన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొందని తెలిపారు. పోలీసుల తీరును తీవ్రంగా పరిగణించాలన్నారు. హత్యాయత్నం చేశారని చెప్పినంత మాత్రాన ఆ సెక్షన్ కింద కేసు నమోదుకు వీల్లేదని, అందుకు నిర్దిష్ట విధానం ఉందని వివరించారు. సహ నిందితులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా పిన్నెల్లిపై పెట్టిన మరో కేసు చెల్లదని చెప్పారు.

నేర చరిత్రను పరిగణనలోకి తీసుకోండి

పోలీసుల తరఫు న్యాయవాది ఎస్.అశ్వనీ కుమార్ వాదనలు వినిపిస్తూ.. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పిన్నెల్లిపై ఈవీఎం ధ్వంసం కేసు నమోదు చేశామని తెలిపారు. 2019లో కూడా ఇదే తరహా కేసు నమోదైందన్నారు. మధ్యంతర ముందుస్తు బెయిల్ షరతులను పిన్నెల్లి ఉల్లంఘించారని, సాక్షులను బెదిరించారని తెలిపారు. పిన్నెల్లి, అతని అనుచరుల దాడిలో కారెంపూడి సీఐ నారాయణ స్వామి తీవ్రంగా గాయపడ్డారన్నారు. పిటిషనర్ నేర చరిత్రను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. బాధితుల తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ, ఈవీఎం ధ్వంసాన్ని అడ్డుకునేందుకు వచ్చిన శేషగిరిరావు, ప్రశ్నించిన మరో మహిళపై పిన్నెల్లి, అతని అనుచరులు దాడికి పాల్పడ్డారన్నారు.

అశ్వనీ కుమార్ నియామకం చట్ట విరుద్ధం

అనంతరం పిన్నెల్లి న్యాయవాది నిరంజన్‌రెడ్డి పోలీసుల తరఫున అశ్వనీ కుమార్ హాజరు కావడంపై అభ్యంతరం తెలిపారు. ఆయన నియామకం సీఆర్‌పీసీ నిబంధనలకు అనుగుణంగా జరగలేదన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ లేదా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నియామకం గురించే నిబంధనల్లో ఉంది తప్ప, స్పెషల్ కౌన్సిల్ గురించి లేదన్నారు. తప్పును సరిచేసుకుని చట్ట ప్రకారం ఆయన్ను నియమించుకుంటే అభ్యంతరం లేదన్నారు. అందరి వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

విశాఖలో ఎన్‌సీఈఆర్‌టీ బృందం పర్యటన



జాలారిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఎన్‌సీఈఆర్‌టీ బృందం

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ–2020లో భాగంగా ప్రవేశ పెట్టిన విద్యా ప్రవేశ్ కార్యక్రమ అమలును పర్యవేక్షించేందుకు ఎన్‌సీఈఆర్‌టీ (న్యూఢిల్లీ) నుంచి ఆరుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక బృందం గురువారం జీవీఎంసీ ప్రకాశరావుపేట ప్రాథమిక పాఠశాల, జాలారిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించింది. ఆయా పాఠశాలల్లో ఒకటో తరగతి విద్యార్థులకు పాఠశాల సంసిద్ధతలో భాగంగా ఎటువంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నారు, 90 రోజుల ప్రణాళిక అమలు చేయడం ద్వారా ఎటువంటి మార్పు కనిపిస్తోంది, ఆట పాటల ద్వారా పిల్లలను సంసిద్ధులు చేస్తున్నారా? లేదా? పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన, పరిశుభ్రత, భద్రత విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తలు వంటి అంశాలు పరిశీలించారు. ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన విద్యా ప్రవేశ్ కార్యక్రమం జిల్లా స్థాయిలో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులకు భాషాభివృద్ధి, జ్ఞానేంద్రియాల అభివృద్ధి, శారీరక అభివృద్ధి అనే అంశాలపై రోజుకు 2 గంటలు, వారానికి 5 రోజులు చొప్పున విద్యా సంవత్సరంలో ఏపీఎస్‌సీఈఆర్‌టీ విడుదల చేసిన 90 రోజుల షెడ్యూల్ అనుసరించి, ఆట పాటలు, కథలు, గేయాల రూపంలో, ఆహ్లాదకర వాతావరణంలో పాఠశాలల్లో సంసిద్ధులు చేసేందుకుగాను ఈ కార్యక్రమం జరుగుతుందని సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి జి లక్ష్మీ తెలిపారు. ఈ కార్యక్రమం పక్కాగా అమలు చేసేందుకు మండలాల్లో ముగ్గురు రిసోర్స్ పర్సన్స్‌కు జిల్లా స్థాయిలో శిక్షణ ఇస్తామని, ప్రధానోపాధ్యాయులు అందరికీ సూచనలు జారీ చేశామని చెప్పారు. ఎన్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ డాక్టర్ షీలా మంగోసా నేతృత్వంలో జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌లాల్, డైట్ లెక్చరర్ సోమయాజులు, ఎఫ్ఎల్ఎన్ డీఆర్‌పీలు రఘురాముడు, శ్రీను, గంగాధరుడు, బృందం సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలు సజీవదహనం

- నెల్లూరులో భారీ అగ్నిప్రమాదం
- దగ్ధమైన 12 ఇళ్లు



అగ్నికి ఆహుతైన పూరిళ్లు (ఇన్‌సెట్‌లో) నాగలక్ష్మి (ఫైల్)

నెల్లూరు (క్రైమ్): శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రంలోని బర్మాషెల్‌గుంటలో గురువారం మధ్యాహ్నం జరిగిన భారీ అగ్నిప్రమాదంలో ఓ దివ్యాంగురాలు సజీవదహనం కాగా.. 12 ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పాత చెక్‌పోస్ట్ వద్ద రైల్వేలైన్ విస్తరణ నేపథ్యంలో అక్కడున్న అనేక కుటుంబాలను బర్మాషెల్‌గుంటకు నాలుగేళ్ల క్రితం తరలించారు. వారు అక్కడ పూరిళ్లు నిర్మించుకుని కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పనులకెళ్లి బుధవారం మధ్యాహ్నం ఇంటికొచ్చి నిద్రించసాగారు. సుమారు రెండు గంటల ప్రాంతంలో వారిళ్ల సమీపంలో చెత్తాచెదారాలను ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు తగలబెట్టారు. దీని తాలూకు నిప్పురవ్వలు ఇళ్లపై పడడమో.. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణం తెలియదుగానీ మంటలు వ్యాపించాయి. పూరిళ్లు కావడంతో మంటలు పెద్ద ఎత్తున చెలరేగి చుట్టుపక్కల ఇళ్లకూ వ్యాపించాయి. నిద్రలో ఉన్న వారు మంటల వేడికి తేరుకుని బయటకు పరుగులు తీశారు. పలు ఇళ్లలోని గ్యాస్ సిలిండర్లు పేలిపోయాయి. అయితే ఒంటరిగా జీవిస్తున్న దివ్యాంగురాలు నాగలక్ష్మి (40) బయటకొచ్చేలోపే మంటలు ఇంటిని చుట్టుముట్టడంతో ఆమె సజీవ దహనమయ్యారు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. నెల్లూరు అగ్నిమాపక అధికారులు మూడు ఫైరింజన్లతో ఘటన స్థలానికి చేరుకుని రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.రూ.లక్షల్లో ఆస్తినష్టం సంభవించింది. 12 ఇళ్లు పూర్తిగా.. మూడిళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కలెక్టర్ హరినారాయణన్ ఘటన స్థలానికి చేరుకుని తక్షణ సహాయక చర్యలు చేపట్టారు. ఘటనపై రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆరాతీశారు.

ఈవీఎంలు వెరిఫికేషన్ చేయండి

- 8 లోక్‌సభ నియోజకవర్గాల నుంచి దరఖాస్తులు
- మైక్రో కంట్రోలర్ చిప్‌ల ట్యాంపరింగ్‌పై అనుమానాలు వ్యక్తంచేస్తూ ఈసీకి అభ్యర్థనలు
- ఏపీ, ఒడిశా అసెంబ్లీలకు సంబంధించి మూడు దరఖాస్తులు

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలపై కొందరు అభ్యర్థులు అనుమానాలు వ్యక్తంచేస్తూ కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించారు. ఈవీఎంలలోని మైక్రో-కంట్రోలర్ చిప్‌లు ట్యాంపరింగ్‌కు గురయ్యాయో లేదో తనిఖీ చేయాలని ఆయా లోక్‌సభ నియోజకవర్గాల అభ్యర్థులు ఈసీకి దరఖాస్తు చేసుకున్నారు. ఇలా ఆరు రాష్ట్రాల పరిధిలోని ఎనిమిది లోక్‌సభ నియోజకవర్గాల నుంచి బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులుసహా ఎనిమిది దరఖాస్తులు ఈసీకి అందాయి. తమిళనాడు, హరియాణాలో చెరో రెండు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో చెరో స్థానంలో ఇలా మొత్తంగా 8 లోక్‌సభ నియోజకవర్గాల నుంచి దరఖాస్తులు వచ్చాయి. పేపర్ బ్యాలెట్ విధానానికి మారుదామంటూ దాఖలైన పిటిషన్లను కొట్టేస్తూ, ఈవీఎం విధానాన్ని సమర్థిస్తూ ఏప్రిల్ 26వ తేదీన సర్వోన్నత న్యాయస్థానం చరిత్రాత్మక తీర్పు వెలువడిన వేళ ఇలా ఈసీకి అభ్యర్థనలు రావడం గమనార్హం. అయితే ఆయా నియోజకవర్గాల్లో ఓడి రెండో, మూడో స్థానంలో నిలిచిన అభ్యర్థులు ఈవీఎంలపై సందేహాలు వ్యక్తంచేస్తే ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో ర్యాండమ్‌గా ఐదు శాతం ఈవీఎంలను చెక్‌చేసేందుకు సుప్రీంకోర్టు అవకాశం కల్పించింది. ఈ వెసులుబాటును వినియోగించుకుంటూ ఓడిన అభ్యర్థులు కొందరు తాజాగా ఈసీని ఆశ్రయించగా ఆయా వివరాలను ఈసీ వెల్లడించింది. ఆరు రాష్ట్రాల్లో కలిపి 92 పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలను చెక్ చేయనున్నారు. అయితే ఒక్కో ఈవీఎం సెట్‌ను తనిఖీచేయడానికి నిర్వహణ ఖర్చుగా రూ.47,200ను ఆ అభ్యర్థి ఫీజు రూపంలో చెల్లించాల్సి ఉంటుందని జూన్ ఒకటో తేదీన ఈసీ ఒక ప్రకటన జారీచేయడం తెల్సిందే. ఈవీఎంల తనిఖీ ఖర్చును భారత్ ఎలక్ట్రానిక్స్ (బెల్), ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఈసీఐఎల్)లు రూ.40,000 నిర్ణయించగా జీఎస్టీ 18 శాతం(రూ.7,200) కలుపుకుంటే ఖర్చు రూ. 47,200గా తేలింది. అయితే ఈవీఎంల తరలింపు, వాటిని తనిఖీని రికార్డ్ చేసేందుకు సీసీటీవీల ఏర్పాటు, విద్యుత్ చార్జీలు, వీడియోగ్రఫీ, జిల్లా ఎన్నికల అధికారి స్థాయిలో ఇతర నిర్వహణ ఖర్చులు అదనంగా ఉండొచ్చని తెలుస్తోంది. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌లో బీజేపీ అభ్యర్థి సంజయ్ రాధాకృష్ణ విఖే పాటిల్ 40 పోలింగ్ కేంద్రాల్లో తనిఖీ చేయాలని దరఖాస్తుచేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని ఒక లోక్‌సభ పరిధిలోని 4 పోలింగ్ స్టేషన్లను, హరియాణాలోని రెండు లోక్‌సభ స్థానాల్లోని 6 పోలింగ్ స్టేషన్లను, తమిళనాడులోని 2 లోక్‌సభ స్థానాల్లోని 20 పోలింగ్ స్టేషన్లను అభ్యర్థులు తనిఖీకి ఎంచుకున్నారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోనూ..

ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం లోక్‌సభ స్థానం పరిధిలోని బొబ్బిలి, నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కో పోలింగ్ స్టేషన్‌లో ఈవీఎంలను తనిఖీ చేయాలని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కోరారు. గజపతినగరం అసెంబ్లీ స్థానంలో ఒక పోలింగ్ స్టేషన్, ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో 12 పోలింగ్ స్టేషన్లను వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఎంచుకున్నారు. తెలంగాణలోని జహీరాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో ఉన్న నారాయణ్‌ఖేడ్‌లో 7 , జహీరాబాద్‌లో 7, ఆందోల్‌లో 6 పోలింగ్ స్టేషన్లను బీజేపీ అభ్యర్థి ఎంచుకున్నారు. ఒడిశాలోని ఒక అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 13 పోలింగ్ స్టేషన్లను బీజేడీ అభ్యర్థి ఎంచుకున్నారు.


కేజ్రీవాల్‌కు బెయిల్

మంజూరు చేసిన ఢిల్లీ కోర్టు • నేడు విడుదలకానున్న ఢిల్లీ సీఎం

ఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ ఊరట లభించింది. మద్యం కుంభకోణంలో మనీలాండరింగ్ అభియోగాలపై అరెస్టయిన ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ కోర్టు గురువారం రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. లక్ష రూపాయల వ్యక్తిగత పూచీకత్తుపై కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ వెకేషన్ స్పెషల్ జడ్జి నియయ్ బిందు ఆదేశాలు జారీ చేశారు. బెయిల్ ఆదేశాలను 48 గంటల పాటు నిలిపి ఉంచాలన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అభ్యర్థనను జడ్జి తిరస్కరించారు. బెయిల్ ఉత్తర్వులను హైకోర్టులో సవాల్ చేస్తామని, అందుకోసం 48 గంటలు ఆదేశాలను నిలిపి ఉంచాలని ఈడీ అభ్యర్థించింది. కానీ జడ్జి నియయ్ బిందు ఇందుకు సమ్మతించలేదు. దర్యాప్తునకు ఆటంకం కల్పించకూడదని, సాక్షులను ప్రభావితం చేయరాదని కేజ్రీవాల్‌కు కోర్టు షరతులు విధించింది. అలాగే అవసరమైనప్పుడల్లా కోర్టు ఎదుట హాజరుకావాలని, దర్యాప్తునకు సహకరించాలని షరతులు పెట్టింది. కేజ్రీవాల్‌కు రెగ్యులర్ బెయిల్ రావడం ఆప్‌కు, ఇండియా కూటమి మిత్రపక్షాలకు ప్రధానికి వ్యతిరేకంగా ఒక అస్త్రం దొరికినట్లే. కేజ్రీవాల్ న్యాయవాదులు శుక్రవారం కోర్టులో పూచీకత్తును సమర్పిస్తే అదేరోజు తీహార్ జైలు నుంచి ఢిల్లీ సీఎం బయటకు వస్తారు. ఢిల్లీ మద్యం పాలసీలో కొందరు మద్యం వ్యాపారులకు మేలు చేకూర్చేలా ఉద్దేశపూర్వకంగా నిబంధనలకు చేర్చారని, ఈ కుట్రలో కేజ్రీవాల్ భాగస్వామి అని ఆరోపిస్తూ ఈడీ మార్చి 21న ఢిల్లీ సీఎంను అరెస్టు చేసింది. మద్యం వ్యాపారుల నుంచి అందుకున్న ముడుపులను గోవా ఎన్నికల్లో ఆప్ ప్రచారానికి వినియోగించారని, ఆప్ జాతీయ కన్వీనర్‌గా కేజ్రీవాల్ వ్యక్తిగతంగా, పరోక్షంగా మనీలాండరింగ్‌కు పాల్పడినట్లేనని ఈడీ వాదించింది. ఈ ఆరోపణలను ఖండించిన కేజ్రీవాల్ ఒక్క పైసాను కూడా ఈడీ పట్టుకోలేదని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిమిత్తం సుప్రీంకోర్టు మే 10 తేదీన కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. ఎన్నికలు ముగిశాక కేజ్రీవాల్ జూన్ 2న తీహార్ జైలులో లొంగిపోయారు.

ఈడీది అంతులేని దర్యాప్తు

మద్యం కుంభకోణం కేసులో ఈడీ ఎలాంటి నగదును స్వాధీనం చేసుకోలేదని, కేజ్రీవాల్‌పై అభియోగాలను నిరూపించేందుకు ఎలాంటి ఆధారాలు లేవని ఆయన న్యాయవాది వాదించారు. ఈడీ పక్షాన హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) ఎస్.వి.రాజు కేజ్రీవాల్‌కు బెయిల్‌ను వ్యతిరేకించారు. ఈడీ ఊహాజనిత దర్యాప్తును చేయడం లేదని, లంచాలుగా ఇచ్చిన కరెన్సీ నోట్ల ఫోటోలు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. గోవాలో కేజ్రీవాల్ బసచేసిన సెవన్ స్టార్ హోటల్ గదికి చెల్లింపులు జరపడానికి ముడుపుల డబ్బునే వాడారని ఆరోపించారు. తన మొబైల్ ఫోన్ పాస్‌వర్డ్‌ను కేజ్రీవాల్ ఇవ్వడం లేదని, దీనిబట్టి మద్యం కుంభకోణంలో ఆయన పాత్ర ఉందని భావించవచ్చని రాజు వాదించారు. కేజ్రీవాల్ మొబైల్ ఫోన్‌ను ఓపెన్ చేస్తే మరింతమంది ప్రమేయం బయపడుతుందన్నారు. 'కేజ్రీవాల్ వ్యక్తిగతంగా ఎలాంటి నేరానికి పాల్పడకపోయినా.. ప్రివెన్షన్ ఆఫ్ మనీ ల్యాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్‌ఏ) సెక్షన్ 70 ప్రకారం ఆమ్‌ఆద్మీ పార్టీ వ్యవహారాలకు ఆయనే బాధ్యుడు కాబట్టి ఆప్ నేరాలకు కూడా జాతీయ కన్వీనర్‌గా ఢిల్లీ సీఎం దోషిగా బాధ్యుడవుతాడు' అని రాజు పేర్కొన్నారు. కేజ్రీవాల్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి.. ఈడీ ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. 'ఈడీ స్వతంత్ర సంస్థా? లేక రాజకీయ బాసులు చెప్పినట్లు ఆడుతోందా? అని విక్రమ్ చౌదరి ప్రశ్నించారు. ఊహాజనిత అంశాల ఆధారంగానే ఈడీ తుది నిర్ణయాలకు వస్తోందన్నారు. ఆప్‌కు రూ. 45 కోట్లు ముడుపులు ముట్టాయనడానికి ఈడీ వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. ఇంకా అరెస్టులు కొనసాగిస్తున్నారు. మరో వైపు రూ. 100 కోట్లు ముడుపులుగా అందాయంటారు. ఈడీ ఇంకా ఆధారాలు సేకరిస్తూనే ఉంటే.. ఇది అంతులేని దర్యాప్తే అవుతుంది. కాబట్టి ఇతరులకు ఇచ్చినట్లే కేజ్రీవాల్‌కు స్వేచ్ఛనివ్వాలని విక్రమ్ చౌదరి కోర్టుకు విన్నవించారు.



మనీలాండరింగ్ కేసులో పరిణామక్రమం..

జూలై 2022: ఢిల్లీ ఎక్సైజ్ విధానంలో రూపకల్పన, అమలులో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై సీబీఐ విచారణకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆదేశం.
ఆగస్ట్ 2022: సీబీఐ, ఈడీ కేసులు నమోదు.
అక్టోబర్ 30, 2023: మనీ లాండరింగ్ కేసులో నవంబరు 2న విచారణకు హాజరు కావాలని కేజ్రీవాల్‌కు ఈడీ తొలి సమన్లు.
ఏప్రిల్ 27: చట్టవిరుద్ధ అరెస్టు.. స్వేచ్ఛాయుత ఎన్నికలు, సమాఖ్య వ్యవస్థ అనే ప్రజాస్వామ్య మూలస్తంభాలపై దాడి అని సుప్రీం కోర్టుకు తెలిపిన కేజ్రీవాల్.
ఏప్రిల్ 29: ఈడీ పలుమార్లు సమన్లు జారీచేసినా స్టేట్‌మెంట్ రికార్డు చేయడానికి కేజ్రీవాల్ విచారణకు హాజరుకాకపోవడాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు.
మే 10: లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు. జూన్ 2న లొంగిపోవాలని ఆదేశం.
మే 30: అనారోగ్య కారణాలతో మధ్యంతర బెయిల్‌ను కోరుతూ ఢిల్లీ కోర్టుకు కేజ్రీవాల్.
జూన్ 5: మధ్యంతర బెయిల్ తిరస్కరణ.
జూన్ 20: రెగ్యులర్ బెయిల్ మంజూరు.

హజ్ యాత్రలో వెయ్యి మంది మృతి


రియాద్: ఈ ఏడాది హజ్ యాత్రలో ఎండల తీవ్రతకు తాళలేక 10 దేశాలకు చెందిన 1,081 మంది చనిపోయారు. ప్రాణాలు కోల్పోయిన వారిలో భారతీయులు 68 మంది కాగా, ఈజిప్టు దేశస్తులు అత్యధికంగా 658 ఉన్నారు. ఒక్క గురువారమే ఈజిప్టుకు చెందిన 58 మంది చనిపోయినట్లు ఆ దేశ దౌత్యాధికారి ఒకరు తెలిపారు. మొత్తం మృతుల్లో 630 మంది వరకు అనధికారికంగా వచ్చిన వారు ఉన్నారు. అధికారికంగా పేర్లు నమోదైన వారికి, ప్రభుత్వం ఏసీ ప్రాంతాన్ని కేటాయిస్తుంది. అనధికారికంగా వచ్చిన వారు ఎండకు తాళలేక ప్రాణాలు కోల్పోతున్నారని అధికారులు చెప్పారు.

ఢిల్లీలో వడగాడ్పులకు గూడు లేని 192 మంది బలి

న్యూఢిల్లీ: ఢిల్లీలో ఎండల తీవ్రత, వడగాడ్పులకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ నెల 11 నుంచి 19వ తేదీల మధ్య అత్యధికంగా ప్రాణాలు కోల్పోయారు. ఈ సమయంలో వేడిగాలులకు తాళలేక 192 మంది ప్రాణాలు కోల్పోయారని, వీరిలో 80 శాతం మంది ఎటువంటి ఆశ్రయం లేని వారేనని సెంటర్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్ అనే ఎన్జీవో తెలిపింది. ఇటువంటి వారికి తక్షణమే వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతో ఉందని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్ కుమార్ చెప్పారు. గాలి కాలుష్యం, పారిశ్రామికీకరణ,అడవుల నరికివేత వంటివి ఉష్ణోగ్రతలు పెరగడానికి, గూడు లేని వారి ఇబ్బందులను పెంచాయని విశ్లేషించారు.

కశ్మీర్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు

- రాష్ట్ర హోదా పునరుద్ధరణ కూడా..
- శ్రీనగర్‌లో ప్రకటించిన ప్రధాని మోదీ



శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు మొదలయ్యాయని ప్రధాని మోదీ చెప్పారు. ఈ కేంద్ర పాలిత ప్రాంతానికి త్వరలోనే రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని ప్రకటించారు. గురువారం సాయంత్రం శ్రీనగర్‌లో రూ.1,500 కోట్ల విలువైన 84 అభివృద్ధి ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కశ్మీర్‌లో ఇటీవలి ఉగ్రదాడులకు కారణమైన వారిని కఠినంగా శిక్షిస్తామని చెప్పారు. జమ్మూకశ్మీర్ శత్రువులకు తగు రీతిలో బుద్ధి చెబుతామన్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్న జమ్మూకశ్మీర్ యువతను ఆయన అభినందించారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత అడ్డుగోడ తొలగిపోయిందని, జమ్మూకశ్మీర్‌లో నేడు భారత రాజ్యాంగం నిజంగా అమలవుతోందని చెప్పారు. జమ్మూకశ్మీర్‌లో శాశ్వతంగా శాంతిని నెలకొల్పుతామని ప్రజలకు హామీ ఇచ్చారు.

శ్రీనగర్‌లో నేడు యోగా డే

అంతకుముందు, జమ్మూకశ్మీర్‌లో రెండు రోజుల పర్యటనకు గాను గురువారం సాయంత్రం శ్రీనగర్‌కు చేరుకున్న ప్రధాని మోదీకి షేర్-ఇ-కశ్మీర్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సెంటర్(ఎస్‌కేఐసీసీ)వద్ద ఘన స్వాగతం లభించింది. శుక్రవారం ఉదయం 6.30 గంటలకు దాల్ సరస్సు సమీపంలోని ఎస్‌కేఐసీసీలో జరిగే 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో మోదీ పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో 7 వేల మందికి పైగా పాలుపంచుకుని ఆసనాలు వేస్తారు.

ప్రొటెం స్పీకర్‌గా మహతాబ్




న్యూఢిల్లీ: ఏడుసార్లు ఎంపీ అయిన భర్తృహరి మహతాబ్ లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా నియమితులయ్యారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు గురువారం తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రాజ్యాంగంలోని ఆర్టికల్ 95 (1) ప్రకారం.. కొత్త స్పీకర్ ఎన్నికయ్యే దాకా ప్రిసైడింగ్ ఆఫీసర్ (ప్రొటెం స్పీకర్)గా మహతాబ్‌ను నియమించారని చెప్పారు. మహతాబ్ ఇటీవలి ఎన్నికల్లో కటక్ నుంచి బీజేపీ టికెట్‌పై గెలుపొందారు. లోక్‌సభ ఎన్నికలకు ముందే ఈ సీనియర్ నేత బిజూ జనతాదళ్‌కు వీడి బీజేపీలో చేరారు. 18వ లోక్‌సభ తొలి సమావేశాలు ఈనెల 24న మొదలు కానున్నాయి. 24, 25వ తేదీల్లో ప్రొటెం స్పీకర్ కొత్త సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. 26న స్పీకర్ ఎన్నిక ఉంటుంది. ప్రొటెం స్పీకర్‌కు సహాయపడేందుకు ఐదుగురు సభ్యుల ప్యానెల్‌ను నియమించారు. ఈ చైర్‌పర్సన్స్ ప్యానెల్‌లో కె.సురేష్ (కాంగ్రెస్), టి.ఆర్.బాలు (డీఎంకే), రాధామోహన్ సింగ్, ఫగ్గన్‌సింగ్ కులస్తే (బీజేపీ), సుదీప్ బందోపాధ్యాయ్ (టీఎంసీ)లు సభ్యులుగా ఉన్నారు. సంప్రదాయం ప్రకారం అత్యధిక సార్లు ఎంపీయైన కె. సురేష్(ఎనిమిది సార్లు) ప్రొటెం స్పీకర్ కావాలని, బీజేపీ పార్లమెంటరీ సంప్రదాయాలను పాటించడం లేదని కాంగ్రెస్ స్పందించింది.

రాజ్‌భవన్‌లో నాకు భద్రత లేదు

- గవర్నర్ సీవీ ఆనంద్ బోస్ సంచలన ఆరోపణ
- బెంగాల్ పోలీసులతో తనకు ముప్పు ఉందని ఆందోళన



కోల్‌కతా: పశ్చిమబెంగాల్ ప్రభుత్వంతో ఆ రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద బోస్ విభేదాలు మరోసారి తెరమీదకొచ్చాయి. గవర్నర్ అధికార నివాసం రాజ్‌భవన్‌లో విధులు నిర్వర్తిస్తున్న బెంగాల్ పోలీసు బృందంతో మనకు ముప్పు ఉందని గవర్నర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాజ్‌భవన్‌లో డ్యూటీలో ఉన్న పోలీసులంతా అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆయన ఆదేశించిన కొద్దిరోజులకే ఇలా వ్యాఖ్యానించడం గమనార్హం. ''ప్రస్తుత ఆఫీసర్-ఇన్‌చార్జ్, ఆయన బృందం వల్ల నా వ్యక్తిగత భద్రతకు ముప్పు ఉంది. ఇదే విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి తెలియజేశా. అయినా ఆమె ఎలాంటి చర్యలు తీసుకోలేదు. చుట్టూ ఉన్న కోల్‌కతా పోలీసులతో నాలో అభద్రతా భావం గూడుకట్టుకుపోయింది'' అని గవర్నర్ ఆందోళన వ్యక్తంచేశారు. '' ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలిగేలా ఇక్కడి పోలీసులు ప్రవర్తిస్తున్నారు. రాజ్‌భవన్‌కు వ్యతిరేకంగా వాళ్లు పనిచేస్తున్నట్లు నా వద్ద విశ్వసనీయ సమాచారం ఉంది. ఇక్కడ పనిచేస్తున్న పోలీసులు గతంలో రాష్ట్ర సచివాలయం 'నబన్నా'లో పనిచేశారు. ఒకరి కోసం వీళ్లు పనిచేస్తున్నారు. వాళ్ల పేరు నేను చెప్పదల్చుకోలేదు'' అని గవర్నర్ వ్యాఖ్యానించారు.



చినాబ్‌పై చుక్‌చుక్ రైలు

నది ఉపరితలం నుంచి 359 మీటర్ల ఎత్తులో నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెనపై పరుగులు పెడుతున్న రైలు. జమ్మూకశ్మీర్‌లోని చినాబ్ నదిపై కొత్తగా కట్టిన ఈ వంతెనపై తొలిసారిగా పూర్తిస్థాయిలో ట్రయల్ రన్‌ను గురువారం విజయవంతంగా పూర్తిచేశారు. మొత్తంగా 40.79 కి.మీ.ల పొడవైన 9 సొరంగాలను దాటుతూ సంగల్దన్ నుంచి రెయిసీకి ఈ రైలు ప్రయాణించింది. ఈ వంతెన పొడవు 1,315 మీటర్లు. ఈ వంతెన పారిస్‌లోని ప్రఖ్యాత ఈఫిల్ టవర్ కన్నా 35 మీటర్ల ఎత్తు ఎక్కువ ఉండటం విశేషం.

రిజర్వేషన్ల పెంపు చెల్లదు

బిహార్ ప్రభుత్వ నిర్ణయాన్ని కొట్టివేసిన పాట్నా హైకోర్టు • విద్యా, ఉద్యోగాల్లో కోటా పెంచడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టీకరణ

పట్నా: బిహార్‌లో నితీశ్ కుమార్ ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. విద్యా, ఉద్యోగాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను 50 శాతం నుంచి 65 శాతానికి పెంచేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పట్నా హైకోర్టు కొట్టివేసింది. రిజర్వేషన్లు పెంచుతూ 2023 నవంబర్‌లో ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.వినోద్ చంద్రన్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ గురువారం విచారణ చేపట్టింది. రిజర్వేషన్లు పెంచడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ సంచలన తీర్పు వెలువరించింది. రిజర్వేషన్లు పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం చట్ట సవరణ చేయడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16ని ఉల్లంఘించడమే అవుతుందని పిటిషనర్ల తరఫు న్యాయవాది రితికా రాణి చెప్పారు. తమ పిటిషన్లపై హైకోర్టు ఈ ఏడాది మార్చి నెలలో తీర్పును రిజర్వ్ చేసిందని, గురువారం తుది తీర్పు ఇచ్చిందని వెల్లడించారు. ఆర్టికల్ 14 ప్రకారం చట్టం ముందు పౌరులంతా సమానమే. ఆర్టికల్ 16 ప్రకారం ఉద్యోగం, ఉపాధి విషయంలో పౌరులందరికీ సమాన అవకాశాలు కల్పించాలి. కుల గణన ఆధారంగా బీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు పెంచినట్లు బిహార్ ప్రభుత్వం న్యాయస్థానంలో వాదించిందని పిటిషనర్ల తరఫు మరో న్యాయవాది నిర్వయ్ ప్రశాంత్ తెలిపారు. ఇంద్ర సహానీ కేసుతోపాటు మరాఠా రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను హైకోర్టు దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. విద్యా, ఉద్యోగాల్లో కోటాను 50 శాతానికి మించి పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పిందని గుర్తుచేశారు.

75 శాతానికి చేరిన రిజర్వేషన్లు

బిహార్ ప్రభుత్వం కుల గణన నిర్వహించింది. రాష్ట్ర జనాభాలో ఓబీసీలు, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు(ఈబీసీ) 63 శాతం ఉన్నట్లు ఈ సర్వేలో తేలింది. ఎస్సీ, ఎస్టీలు కలిపి 21 శాతానిపైగా ఉన్నట్లు వెల్లడయ్యింది. ప్రభుత్వం గతంలోనే ఈబీసీలకు 10 రిజర్వేషన్లు కల్పించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం రిజర్వేషన్లు 50 శాతానికి మించడానికి వీల్లేదు కాబట్టి రిజర్వేషన్ చట్టాల్లో సవరణలు చేసింది. ఈ మేరకు అసెంబ్లీలో బిల్లును ఆమోదించింది. 50 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీల కోటాను 65 శాతానికి పెంచేసింది. ఈ మేరకు గత ఏడాది నవంబర్ 21న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. బిహార్‌లో ఈబీసీ రిజర్వేషన్లతో కలిపి మొత్తం రిజర్వేషన్లు 75 శాతానికి చేరుకున్నాయి. సవరించిన రిజర్వేషన్ చట్టాలను రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్ర ప్రభుత్వానికి బిహార్ సర్కారు విజ్ఞప్తి చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చట్టాల జాబితా తొమ్మిదో షెడ్యూల్‌లో ఉంది. ఈ షెడ్యూల్‌లో చేర్చిన చట్టాలను కోర్టుల్లో సవాలు చేసేందుకు అవకాశం ఉండదు. సుప్రీంకోర్టు 1992లో రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి విధించిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా బిహార్ సర్కారు రిజర్వేషన్లు పెంచడాన్ని సవాలు చేస్తూ పలువురు పాట్నా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు.

వియత్నాంతో పుతిన్ చెట్టపట్టాల్

పలు ద్వైపాక్షిక ఒప్పందాలు ఖరారు



హనోయి: యుద్ధోన్మాదంతో ఉక్రెయిన్‌పై దండయాత్రకు దిగాక అంతర్జాతీయ మద్దతు కరువైన తరుణంలో రష్యా ఆసియా దేశాలతో మైత్రికి మొగ్గుచూపుతోంది. అందులోభాగంగానే ఉత్తర కొరియా పర్యటన ముగించుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్ గురువారం అక్కడి నుంచి నేరుగా వియత్నాం చేరుకున్నారు. అధికారిక పర్యటనలో భాగంగా గురువారం వియత్నాం అధ్యక్షుడు టో లామ్‌తో విస్తృత స్థాయి చర్చలు జరిపారు. విద్య, శాస్త్ర సాంకేతికత, చమురు, సహజవాయువుల అన్వేషణ, ఆరోగ్య రంగాల్లో ద్వైపాక్షిక ఒప్పందాలు కుదుర్చుకున్నారు. అణు శాస్త్ర సాంకేతికతపై ఉమ్మడి పరిశోధనకూ అంగీకరించారు.

'నీట్' కౌన్సెలింగ్ రద్దు కుదరదు

సాక్షి, న్యూఢిల్లీ: నీట్-యూజీ కౌన్సెలింగ్ రద్దు చేయడం కుదరదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పరీక్ష నిర్వహణ, పేపర్ లీక్, మూల్యాంకనంలో వ్యత్యాసాలపై దాఖలైన పలు పిటిషన్లను గురువారం ధర్మాసనం విచారించింది. నీట్ అడ్మిషన్ల ప్రక్రియ ఈ పిటిషన్లపై తుది ఉత్తర్వులకు లోబడి ఉంటుందని ఉత్తర్వులివ్వాలని పిటిషనర్ల తరఫున మరో న్యాయవాది కోరారు. గ్రేసు మార్కులు పొందిన 1,563 మంది అభ్యర్థులకు ఈ నెల 23న నిర్వహించనున్న పరీక్షపై స్టే ఇవ్వాలని మరో న్యాయవాది విజ్ఞప్తి చేశారు. వాదనల అనంతరం ధర్మాసనం స్పందిస్తూ.. గ్రేసు మార్కులు పొందిన అభ్యర్థులకు ఈ నెల 23న నిర్వహించే పరీక్షతోపాటు వచ్చే నెల 6న జరిగే కౌన్సెలింగ్‌ను రద్దు చేసేందుకు నిరాకరించింది. అడ్మిషన్ల ప్రక్రియ తుది తీర్పునకు లోబడే ఉంటుందని వ్యాఖ్యానించింది. పెండింగ్‌లో ఉన్న పిటిషన్లకు ఈ పిటిషన్లను జత చేస్తూ తదుపరి విచారణను జూలై 8కి వాయిదా వేసింది. వేర్వేరు హైకోర్టుల్లో విచారణలో ఉన్న కేసులను సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలంటూ ఎన్టీఏ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రతివాదులకు సుప్రీం నోటీసులిచ్చింది. హైకోర్టుల్లో విచారణలో ఉన్న కేసులను సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలన్న పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. ఆయా హైకోర్టుల్లో విచారణలపై స్టే విధించింది.

యుద్ధాలను ఆపే మోదీ పేపర్ లీకేజీలు ఆపలేరా?

రాహుల్ గాంధీ ధ్వజం

న్యూఢిల్లీ: నీట్-యూజీ, యూజీసీ-నెట్ పరీక్షల్లో అక్రమాలపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉక్రెయిన్-రష్యా, హమాస్-ఇజ్రాయెల్ యుద్ధాలను ఆపేసే శక్తి ఉందని చెప్పే ప్రధాని నరేంద్ర మోదీకి మన దేశంలో పేపర్ లీకేజీలను ఆపే శక్తి లేదా? అని ప్రశ్నించారు. లీకేజీలను ఆపాలని మోదీ కోరుకోవడం లేదని ఆక్షేపించారు. దేశంలో ఉన్నత విద్యా సంస్థలను అధికార బీజేపీ, దాని మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ చెరబట్టాయని, అందుకే పేపర్ లీక్‌లు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ పరిస్థితి మారనంత వరకు పేపర్ లీక్‌లు ఆగవని తేల్చిచెప్పారు. రాహుల్ గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. లక్షలాది మంది నీట్ అభ్యర్థుల ఆందోళనలను నరేంద్ర మోదీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆయన దృష్టి మొత్తం ఇప్పుడు పార్లమెంట్‌లో స్పీకర్‌ను ఎన్నుకోవడంపైనే ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత మోదీ మానసికంగా కుప్పకూలిపోయారని, ఇకపై ఆయన ప్రభుత్వాన్ని నడిపించేందుకు మరింత ఇబ్బంది పడుతారని చెప్పారు.

పార్లమెంట్‌లో లేవనెత్తుతాం..

''నరేంద్ర మోదీకి ఇప్పుడు ఎవరూ భయపడడం లేదు. గతంలో ఆయన ఛాతీ 56 అంగుళాలు ఉండేది. ఇప్పుడది 32 అంగుళాలకు కుదించుకుపోయింది. భయపెట్టి, బెదిరించి పని చేయించుకోవడం మోదీకి అలవాటు. ఇప్పుడు ప్రజల్లో మోదీ అంటే భయం పోయింది. దేశంలో బలమైన ప్రతిపక్షం ఉంది. ప్రశ్నపత్రాల లీకేజీ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తుతాం''. అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

నీట్‌పై ఆందోళన అవసరం లేదు | కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ: నీట్-యూజీ పరీక్ష విషయంలో ఆందోళన అవసరం లేదని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఎక్కడో జరిగిన చిన్నాచితక సంఘటనలు ఈ పరీక్ష సక్రమంగా రాసిన లక్షలాది మంది అభ్యర్థులపై ఎలాంటి ప్రభావం చూపబోవని చెప్పారు. యూజీసీ-నెట్ ప్రశ్నపత్రం డార్క్‌నెట్‌లో లీక్ అయ్యిందని, అందుకే పరీక్ష రద్దు చేశామని ధర్మేంద్ర ప్రధాన్ తెలియజేశారు.

నీట్ పేపర్ లీకేజీ నిజమే

పట్నా: బిహార్‌లో చోటుచేసుకున్న నీట్-యూజీ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో సంచలన విషయాలు బయటకొచ్చాయి. పేపర్ లీక్ నిజమేనని పోలీసుల విచారణలో నిందితులు అంగీకరించారు. నీట్‌కు ఒక్క రోజు ముందు ప్రశ్నపత్రంతోపాటు సమాధానాల 'కీ'ని సైతం అభ్యర్థులకు అందజేసి, పరీక్షకు సిద్ధం చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ కేసులో బిహార్ పోలీసులు పలువురు నిందితులను అరెస్టు చేశారు. వీరిలో నలుగురు నీట్ అభ్యర్థులు అనురాగ్ యాదవ్, శివానందన్, అభిషేక్, ఆయుష్ రాజ్, ఇద్దరు లీకేజీ ముఠా సభ్యులు నితీశ్, అమిత్ ఆనంద్‌తోపాటు ప్రభుత్వ జూనియర్ ఇంజనీర్ సికిందర్ యాదవేందు ఉన్నారు. ఈ యాదవేందు మేనల్లుడే అనురాగ్. విచారణలో నిందితులు ఏం చెప్పారో వారి మాటల్లోనే...

''బిహార్ దానాపూర్ టౌన్ కౌన్సిల్‌లో జూనియర్ ఇంజనీర్‌గా పని చేస్తున్న సికిందర్ ప్రసాద్ యాదవేందు మమ్మల్ని సంప్రదించాడు. మేనల్లుడు అనురాగ్‌సహా నలుగురికి ప్రశ్నపత్రం ఇచ్చి యాదవేందు నుంచి రూ.32 లక్షలు తీసుకున్నాం''
- నితీశ్, అమిత్.

'' అమిత్, నితీశ్ ప్రశ్నపత్రం, కీ అందజేశారు. పరీక్షకు సిద్ధం కావడానికి సహకరించారు'
- అనురాగ్, నీట్ అభ్యర్థి

''యాదవేందు అంకుల్ మే 4న ఓ ఇంటికి రమ్మని చెప్పాడు. అక్కడ నితీశ్, అమిత్ ప్రశ్నపత్రం ఇచ్చి నన్ను పరీక్షకు సిద్ధం చేశారు''
- శివానందన్ కుమార్, నీట్ అభ్యర్థి

''నీట్ ప్రశ్నపత్రం కోసం యాదవేందుకు రూ.40 లక్షలు చెల్లించాం''
-అవదేశ్, అభిషేక్ కుమార్ తండ్రి

''యాదవేందు రూ.40 లక్షలు తీసుకున్నాడు''
నీట్ అభ్యర్థి ఆయుష్ రాజ్ తండ్రి

''రాజస్తాన్‌లోని కోటాలో శిక్షణ పొందుతున్న నా మేనల్లుడు అనురాగ్ యాదవ్ నా సోదరి రీనా కుమారితో కలిసి నీట్ పరీక్ష రాయడానికి పాట్నా వచ్చాడు. వారికి పాట్నాలో ప్రభుత్వ అతిథి గృహంలో నేనే బస ఏర్పాట్లు చేశా. నీట్ పరీక్ష రాయడానికి నా మేనల్లుడు సహా నలుగురి అభ్యర్థులకు సహకరించా. నలుగురికి ప్రశ్నపత్రాలు సమకూర్చా. ఒక్కొక్కరి నుంచి రూ.40 లక్షల చొప్పున డిమాండ్ చేశా. నితీశ్ కుమార్, అమిత్ ఆనంద్ రూ.32 లక్షల చొప్పున తీసుకున్నారు''
- యాదవేందు, ప్రభుత్వ జూనియర్ ఇంజనీర్

తేజస్వీ యాదవ్ సహాయకుడి హస్తం!

ప్రభుత్వ అతిథి గృహంలో అనురాగ్ యాదవ్, ఆయన తల్లికి బస ఏర్పాట్ల వెనుక బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. గెస్టు హౌస్ బిల్లులను పరిశీలించగా, అందులో మంత్రిజీ అని ఉంది. తేజస్వీ యాదవ్ వ్యక్తిగత సహాయకుడైన ప్రీతమ్ కుమార్ ఈ గెస్టు హౌస్‌ను బుక్ చేసేందుకు యాదవేందుకు సహకరించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

తమిళనాట కల్తీ మద్యం కాటు..

40కి చేరుకున్న మరణాలు

- ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న మరో 116 మంది
- విచారణకు రిటైర్డ్ జడ్జి సారథ్యంలో కమిటీ వేస్తున్నామన్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: తమిళనాడులోని కళ్లకురిచ్చి జిల్లా కరుణపురం ప్రాంతం కల్తీ మద్యం బాధితుల రోదనలతో ప్రతిధ్వనిస్తోంది. కల్తీ మద్యం కాటుకు బలైన వారి సంఖ్య 18 నుంచి గురువారం 40కి చేరుకుంది. ఆస్పత్రుల పాలైన బాధితుల సంఖ్య 116కు పెరిగిందని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ చెప్పారు. కల్తీ మద్యం తాగి పలువురు ప్రాణాలు కోల్పోవడం, పెద్ద సంఖ్యలో బాధితులు ఆస్పత్రి పాలైన ఘటన తనకు తీవ్ర వేదన కలిగించిందని సీఎం ఎంకే స్టాలిన్ చెప్పారు. ఘటనపై దర్యాప్తు జరుగుతోందని, ఇప్పటి వరకు పోలీసులు 8 మందిని అరెస్ట్ చేశారని సీఎం చెప్పారు. ఎక్కువ శాతం మిథనాల్ కలిపిన సారాయి తాగడం వల్లే మరణాలు సంభవించినట్లు తేలిందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి రూ.50 వేలు చొప్పున సాయం అందజేస్తామని ప్రకటించారు. పెద్ద సంఖ్యలో సంభవించిన మరణాలకు కారణాలను కనుగొనడంతోపాటు, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలను సూచించేందుకు హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ బి.గోకుల్‌దాస్ సారథ్యంలో ఏకసభ్య కమిటీని నియమిస్తున్నట్లు చెప్పారు.

16 మంది పరిస్థితి విషమం

బుధవారం తమ ఆస్పత్రిలో చేరిన 19 మంది కల్తీ మద్యం బాధితుల్లో 16 మంది పరిస్థితి విషమంగా ఉంది. జిప్మర్‌తోపాటు సేలం, కళ్లకురిచ్చి, విల్లుపురం ఆస్పత్రుల్లో బాధితులు చికిత్స పొందుతున్నారు. వీరిలో 34 మంది పూర్తిగా కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉందని అంటున్నారు. కళ్లకురిచ్చి ఘటనపై సీబీసీఐడీ అధికారులు తనిఖీలు చేపట్టి ఇప్పటి వరకు 200 లీటర్ల కల్తీ మద్యం పట్టుకున్నారు. అందులో ప్రమాదకర స్థాయిలో మిథనాల్ ఉన్నట్లు తేలింది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం । 21 । జూన్ । 2024


గురువారం ధార్వాడ వద్ద పొలం పనిలో నిమగ్నమైన రైతులు. ముందు వర్షాలు జోరుగా పడడంతో విత్తనాలు వేశారు. అయితే రాష్ట్రమంతటా వారం రోజుల నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టాయి

న్యూస్‌రీల్

బీజేపీ సైకిల్ జాతా భగ్నం



శివాజీనగర: పెట్రోల్–డీజిల్ ధరల పెంపును ఖండిస్తూ బీజేపీ నేతలు గురువారం రాష్ట్రవ్యాప్తంగా సైకిల్ జాతాలు నిర్వహించారు. బెంగళూరులో బీజేపీ కార్యాలయం నుంచి విధానసౌధ వరకు సైకిల్ ర్యాలీ చేపట్టగా పోలీసులు అడ్డుకున్నారు. బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు మల్లేశ్వరంలో బీజేపీ ఆఫీసు నుంచి సైకిళ్లపై బయల్దేరారు. అర కిలోమీటరు రాగానే పోలీసులు అడ్డుకుని విజయేంద్ర, ఇతర నేతలను అదుపులోకి తీసుకున్నారు. విజయేంద్ర మాట్లాడుతూ ధరల పెంపును రద్దు చేసేవరకు పోరాటం ఆగదని అన్నారు. నేతలను పోలీసులు వాహనాలలో తరలించి కొంతసేపటికి విడిచిపెట్టారు.

మక్కా యాత్రలో ఇద్దరు నగరవాసుల మృతి

శివాజీనగర: హజ్ యాత్రకు వెళ్లిన బెంగళూరు నగరానికి చెందిన ఇద్దరు అక్కడ ఎండ వేడిమికి మృతిచెందారని కుటుంబీకులకు సమాచారం అందింది. ఆర్‌టీ నగరకు చెందిన కౌసర్ రుక్సానా (69) అనే మహిళ, ఫ్రేజర్‌టౌన్‌కు చెందిన మొహమ్మద్ ఇలియాస్ ఇటీవల మరికొందరితో కలిసి మక్కా యాత్రకు వెళ్లారు. మక్కాకు 8 కి.మీ.దూరంలో వీరు ఎండవేడిమి వల్ల అనారోగ్యంతో కన్నుమూశారు, అక్కడే అంత్యక్రియలను పూర్తి చేసినట్లు కుటుంబాలకు సమాచారం వచ్చింది.

కట్నం వేధింపులకు అబల బలి

మైసూరు: భర్త, అత్తమామలు అదనంగా కట్నం తేవాలని సతాయించడంతో వివాహిత ఆత్మహత్య చెసకున్న సంఘటన మైసూరు కెఆర్ మొహల్లాలో జరిగింది. సయ్యద్ ముదాసిర్‌కు జువేరియా కుదా (20) అనే యువతితో ఏడాది కిందట పెళ్లి జరిగింది. ఆ సమయంలో కట్న కానుకలు బాగానే ఇచ్చారు. అయితే మరింత డబ్బు, బంగారం తేవాలని ఆమెను వేధించసాగారు. దీంతో గురువారం ఇంట్లో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకుంది. భర్త, అత్తమామలపై కేఆర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరికి వేలాడిన నవ వధువు

బనశంకరి: 18 రోజుల క్రితం పెళ్లయిన నవ వధువు అనుమానాస్పదరీతిలో చనిపోయింది. ఈ ఘటన సర్జాపుర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు.. డెంకణీకోట సమీపంలోని కలకందరహళ్లికి చెందిన రిహానా (24) అనే యువతికి, సర్జాపుర నివాసి షబాశ్‌తో ఇటీవలే వివాహమైంది. కొత్త జంట సర్జాపురలో నివాసం ఉంటున్నారు. గురువారం రిహానా ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న స్థితిలో మరణించింది. వెంటనే సర్జాపుర పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి మృతదేహానికి సెయింట్‌జాన్స్ ఆసుపత్రికి తరలించారు. భర్త షబాస్ అదనపు కట్నం తేవాలని వేధించేవాడని మృతురాలి కుటుంబసభ్యులు ఆరోపించారు. వారి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

జూలై 15 నుంచి అసెంబ్లీ సమావేశాలు



బనశంకరి: జూలై 15 నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 11 రోజుల పాటు సమావేశాలు జరుగుతాయి. గురువారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధ్యక్షతన కేబినెట్ భేటీ నిర్వహించారు. శాసనసభ వ్యవహారాల మంత్రి హెచ్‌కే పాటిల్ ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, పీయూ, డిగ్రీ కాలేజీలకు ఉచిత విద్యుత్, నీటి సౌలభ్యం కల్పించే పథకాన్ని రూ.29.19 కోట్లతో అమలు చేస్తారు. రాష్ట్రంలో ఆస్తి పన్ను, నీటి బిల్లులను మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా వసూలుకు ఆమోదం. ప్రగతి పథ పథకం కింద 7,110 కిలోమీటర్ల మేర గ్రామీణ రోడ్లను రూ.5,190 కోట్ల ఖర్చుతో నిర్మాణం. రోటరీ క్లబ్ ద్వారా వసతి పాఠశాలల విద్యార్థులకు సమగ్ర వ్యక్తిత్వ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తారు. మైసూరులో కేఆర్ ఆసుపత్రి ఆవరణలో అవుట్‌పేషెంట్ల కోసం రూ.75 కోట్లతో భవన నిర్మాణానికి ఆమోదం తెలిపారు.

తప్పు చేసి ఉంటే శిక్ష పడాల్సిందే

మైసూరు: చిత్రదుర్గకు చెందిన రేణుకా స్వామి హత్య కేసులో హీరో దర్శన్ భాగస్వామి అయితే ఆయనకు తప్పకుండా శిక్ష పడాలని జేడీఎస్ పార్టీ కార్యాధ్యక్షుడు సా.రా మహేశ్ అన్నారు. గురువారం మైసూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ... నటుడు దర్శన్ మైసూరు జిల్లాకు చెందిన వారని, సినిమా రంగంలో గొప్ప పేరు ఉందని, అలాంటి వ్యక్తి హత్య చేయడం అంటే నమ్మడానికి కూడా కావడం లేదని అన్నారు. ఎంతటి వారైనా తప్పు చేసి ఉంటే శిక్ష పడాలన్నారు.

తుంగభద్రపై మరో జలాశయం

- నిర్మాణానికి కట్టుబడి ఉన్నామన్న సీఎం
- ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలతో చర్చిస్తామని వెల్లడి


మాట్లాడుతున్న సీఎం సిద్ధరామయ్య


తుంగభద్ర జలాశయం నుంచి నది పరవళ్లు (ఫైల్)


హంపీ వద్ద కొప్పళ జిల్లాలో నది ప్రవాహం

సాక్షి, బళ్లారి: తుంగభద్ర నదిపై సమాంతర జలాశయం నిర్మాణం మరోసారి చర్చకు వచ్చింది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు తాగు, సాగునీరందించే హొసపేటె తుంగభద్ర జలాశయం కింద నదిపై సమాంతర జలాశయ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని సీఎం సిద్దరామయ్య చెప్పారు. అయితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఆయన గురువారం సాయంత్రం విజయనగర జిల్లాలోని తోరణగల్లు విమానాశ్రయం వద్ద విలేకరులతో మాట్లాడారు. మూడు రాష్ట్రాలకు ఉపయోగపడేలా సమాంతర జలాశయ నిర్మాణం చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మూడు రాష్ట్ర ప్రభుత్వాలు సమ్మతి తెలియజేసిన తర్వాత సమగ్ర నివేదిక తయారీ (డీపీఆర్)కు అప్పగిస్తామన్నారు.

ఏమిటీ సమాంతర డ్యాం?

తుంగభద్ర జలాశయం దిగువన కొప్పళ జిల్లాలో నవలి గ్రామం వద్ద మరో డ్యాంను నిర్మించాలన్న ప్రతిపాదన చాలా కాలంగా ఉంది. టీబీ డ్యాంలో పూడిక పేరుకుపోవడం వల్ల నీటి నిల్వ తగ్గింది, దీని వల్ల నీరు వృథాగా నదిలోకి వెళ్లిపోతోంది. ఆ నీటిని సమాంతర డ్యాం ద్వారా నిల్వ చేసి ఉపయోగించాలని సర్కారు భావిస్తోంది. దీనికి దిగువన ఉన్న తెలుగు రాష్ట్రాలు కూడా ఆమోదం తెలపాల్సి ఉంది.

మోదీ హయాంలోనే పెట్రో మంట

రాష్ట్రంలో ఇంధన ధరల పెంపు, బీజేపీ నిరసనలపై స్పందిస్తూ మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఒక బ్యారెల్‌కు క్రూడాయిల్‌కు ధర 113 డాలర్లు ఉండేది, అప్పుడు పెట్రో ధరలు తక్కువగా ఉండేవి, ఇప్పుడు క్రూడాయిల ధర తగ్గినా పెట్రో ధరలు ఎక్కువగా ఉన్నాయని సీఎం ఆరోపించారు. నాడు పెట్రోలు లీటరు రూ.72 మాత్రమే ఉండేదన్నారు. ప్రస్తుతం రూ.103లు కావడానికి కారణం ప్రధాని మోదీనేనన్నారు. మోదీ పెట్రోలు, డీజిల్ ధరలు పెంచితే ప్రశ్నించేవారు లేరన్నారు. తాము ప్రజాసంక్షేమం కోసం కొంతమేర పెంచితే రాద్ధాంతం చేస్తున్నారన్నారు.

బస్సు చార్జీలను పెంచం

రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోను కేఎస్‌ఆర్‌టీసీ బస్సు ఛార్జీలు పెంచే ఆలోచన లేదని సీఎం చెప్పారు. పెట్రోలు, డీజిల్ ధరలు పెంచారని, కేఎస్‌ఆర్‌టీసీ బస్సు ఛార్జీలు కూడా పెంచుతారని బీజేపీ నాయకులు చెబుతున్న మాటల్లో నిజం లేదన్నారు. బీజేపీ ఎంపీలు లోక్‌సభలో నోరు ఎందుకు విప్పడం లేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ట్యాక్స్‌లు, ధరల పెంపుపై ఎలాంటి వ్యాఖ్యలు చేశారో ఒకసారి రికార్డులు చూడాలని అన్నారు.

మద్దతు ధరతో పొద్దుతిరుగుడు కొనుగోలు!

బనశంకరి: రాష్ట్రంలో 2023–24 లో పొద్దు తిరుగుడు పంట 3,133 టన్నులను మద్దతు ధరతో కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రాష్ట్రంలో మధ్య, ఉత్తర కర్ణాటక జిల్లాల్లో 21 వేల హెక్టార్లలో పొద్దుతిరుగుడును సాగుచేస్తున్నారు. మార్కెట్లో సరైన ధర లభించడం లేదు. ప్రకటనల్లో ఎక్కువ ధర ఉంటుంది. మార్కెట్లో అమ్మితే దళారులు కొనే రేటు చాలా తక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రం నుంచి వినతుల మేరకు రానున్న రోజుల్లో మార్కెటింగ్ శాఖ ద్వారా మద్దతు ధరతో పంటను కొనుగోలు చేసే అవకాశముంది.

కేంద్ర మంత్రిని దూషించిన మహిళపై ఫిర్యాదు

బనశంకరి: కేంద్రమంత్రి హెచ్‌డీ.కుమారస్వామి పట్ల పరుష పదజాలంతో సోషల్ మీడియాలో అవమానించిన మహిళపై జేడీఎస్ నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. మంగళ అనే మహిళ సోషల్ మీడియాలో కుమారస్వామి గురించి అత్యంత హీనంగా దూషించింది. మహిళ దురుద్దేశపూర్వకంగా దూషించిందని జేడీఎస్ న్యాయ విభాగం నాయకులు నగర సీపీ దయానంద్‌కు ఫిర్యాదు చేశారు. నటుడు దర్శన్‌పై ఆరోపణలు కేసుకు సంబంధించి కుమారస్వామికి ఎలాంటి సంబంధం లేనప్పటికి కుమారస్వామి పేరు ప్రస్తావిస్తూ మహిళ దూషించిందని, ఇది బాధాకరమని తెలిపారు. సదరు మహిళపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మిత్రున్ని కాల్చి, ఆపై కాల్చుకుని..



- హాసన్‌లో పట్టపగలే గోలీబార్
- ఇద్దరు దుర్మరణం


ఘటనాస్థలిని పరిశీలిస్తున్న పోలీసులు, ఫోరెన్సిక్ సిబ్బంది

యశవంతపుర: హాసన్ నగరంలో పట్టపగలే షూటౌట్ జరిగింది. ఈ కాల్పుల్లో ఇద్దరు యువకులు హత్యకు గురయ్యారు. హొయ్సళనగరలో గురువారం మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో కాల్పుల మోత భయోత్పాతాన్ని సృష్టించింది. హాసన్‌లోని అడివళ్లికి చెందిన షరాఫత్ అలి, బెంగళూరుకు చెందిన అసిఫ్ అనే ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.

స్థల వివాదంపై మాట్లాడదామని..

వీరిద్దరూ మంచి స్నేహితులు. షరాఫత్ ఢిల్లీకి చెందిన వ్యక్తికాగా, హాసన్‌లో నివసిస్తున్నాడు, ఇద్దరూ రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. అయితే ఒక ఇంటి స్థలం విషయమై ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నట్లు తెలిసింది. దీనిపై మాట్లాడదామని ఆ స్థలం వద్దకు వచ్చారు. షరాఫత్ భార్య కూడా అక్కడే ఉంది. వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో షరాఫత్‌ను అసిఫ్ పిస్టల్‌తో కాల్పులు జరిపి హత్య చేశాడు. తరువాత తన కారులో కూర్చుని కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు అక్కడి పరిస్థితులను బట్టి తెలుస్తోంది. ఎస్పీ మొహమ్మద్ సుజేత, ఇతర పోలీసు అధికారులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కారులో వెతగ్గా మరో తుపాకీ దొరికింది. ఫోరెన్సిక్ సిబ్బంది ఆధారాలను సేకరించారు. అవి లైసెన్సు లేని ఆయుధాలుగా అనుమానాలున్నాయి. ఈ సంఘటన జిల్లాలో తీవ్ర కలకలం రేకెత్తించింది.

బైక్‌లకు నిప్పు పెట్టి, అత్తపై అల్లుని దాడి

మైసూరు: అల్లుడు మామ ఇంటికి వచ్చి ఇంటి ముందు నిలిపిన రెండు బైకులకు నిప్పు పెట్టి, అత్తను కొట్టిన సంఘటన చామరాజనగరలోని గాలిపురలో జరిగింది. కట్నం ఇవ్వలేదన్న కోపమే దీనికి కారణం. ఏడు నెలల క్రితం ఖతీజా అనే యువతితో సల్మాన్ మహ్మద్ షరీఫ్ అనే యువకునికి పెళ్ళి చేశారు. కొంత కట్నం డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎన్నిసార్లు అడిగిన ఇవ్వడం లేదంటూ కోపగించుకున్న అల్లుడు బుధవారం రాత్రి మామ ఇంటికి వచ్చి నానా బీభత్సం చేశాడు. అక్కడ నిలిపిన రెండు బైక్‌లకు నిప్పు పెట్టాడు. ఇరుగుపొరుగు అతనికి బుద్ధిమాటలు చెప్పినా వినలేదు. పైగా అత్తను కొట్టడంతో ఆమె చెయ్యి ఫ్రాక్చర్ అయ్యింది. చామరాజనగర పట్టణ పోలీసులు ఘరానా అల్లున్ని అదుపులోకి తీసుకున్నారు.

రాణాలో చిన్నారి.. తల్లి అదృశ్యం

మైసూరు: ఓ మహిళ చిన్నారి కొడుకును వదిలిపెట్టి అదృశ్యమైన ఘటన మైసూరులో వెలుగుచూసింది. వివరాలు.. చామరాజనగర కొళ్లేగాలకు చెందిన శశికుమార్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతున్నాడు. అతనికి మూడేళ్ల కిందట బెంగళూరుకు చెందిన సింధూ అనే యువతిని వివాహం చేసుకున్నాడు. వీరికి రెండేళ్ల వయసున్న ఆద్విక్ అనే కొడుకు ఉన్నాడు. జూన్ 15వ తేదీన దంపతులు బిడ్డతో కలిసి మైసూరును చూడాలని వచ్చారు. తాను స్నేహితురాలితో కలిసి చాముండి కొండకు వెళ్తానని భార్య చెప్పింది. కానీ ఆనలహళ్లి పోలీస్ స్టేషన్ వద్ద కొడుకును వదిలివేసి ఆమె ఎక్కడికో వెళ్లిపోయింది. ఫోన్ కూడా స్విచాఫ్ వచ్చింది. శశికుమార్ భార్య కోసం గాలిస్తుండగా సమాచారం తెలిసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కొడుకును తీసుకున్నాడు. సింధు కోసం భర్తతో పాటు పోలీసులు గాలిస్తున్నారు.

బస్సు చార్జీల పెంపు ప్రస్తావన లేదు: మంత్రి

శివాజీనగర: రాష్ట్రంలో త్వరలో ఆర్టీసీ బస్సు చార్జీలు పెరిగే అవకాశం కనిపిస్తోంది. దీనిపై స్పందించిన రవాణా మంత్రి రామలింగారెడ్డి.. గత నాలుగు సంవత్సరాల నుండి బస్సు చార్జీలను పెంచలేదు. ఇప్పటివరకు ధరలను పెంచాలనే ఎలాంటి ప్రస్తావన రాలేదు. ఒకవేళ వచ్చినట్లయితే పరిశీలించి నిర్ధారిస్తామని తెలిపారు. ప్రభుత్వం ఆదాయం పెంపు కోసం చార్జీలను పెంచవచ్చనే వార్తలున్నాయి. అయితే పెట్రో ధరల పెంపుపై ప్రతిపక్షాలు, ప్రజల స్పందనను చూసి నిర్ణయం తీసుకోవచ్చు.

దర్శన్‌కు మరో 2 రోజులు కస్టడీ


పట్టణగెరెలోని షెడ్ వద్ద పోలీసులు

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసులో మొదటి నిందితురాలిగా ఉన్న నటి పవిత్రగౌడ, హీరో దర్శన్ ఇతర నిందితులను కస్టడీ ముగిసింది, దీంతో పోలీసులు గురువారంనాడు 42వ ఏసీఎంఎం కోర్టులో హాజరుపరిచారు. కోర్టు దర్శన్, ధనరాజ్, వినయ్, ప్రదోశ్‌లను తిరిగి రెండు రోజుల పాటు పోలీసు కస్టడీకి ఇచ్చింది. పవిత్రగౌడ మిగతా నిందితులను జ్యుడీషియల్ కస్టడీకి ఇస్తూ ఆదేశించింది. దీంతో పవిత్ర తదితరులను జైలుకు తరలించారు. అలాగే దర్శన్, ఇతరులను మరింత విచారిస్తారు. ఈ సమయంలో తల్లిని చూడాలని పవిత్రగౌడ కుమార్తె అమ్మమ్మతో కలిసి కోర్టుకు వచ్చింది. కోర్టు వద్ద అభిమానుల కోలాహలం నెలకొంది.

షెడ్డుకు ఆస్తి పన్ను నోటీసు

రేణుకాస్వామి హత్య జరిగిన కామాక్షిపాళ్యలోని పట్టణగెరెలోని షెడ్ పాపులర్ అయ్యింది. ఈ క్రమంలో సదరు షెడ్ యజమానికి బీబీఎంపీ వారు నోటీసు ఇచ్చారు. 2008 నుంచి ఆస్తి పన్ను కట్టలేదనే, 15 రోజుల్లో సదరు ఆస్తి తమదే అని ప్రకటించుకుని పన్ను చెల్లించాలని నోటీసులు సూచించారు.

హత్యపై సీఎం ఆగ్రహం!

రేణుకాస్వామి హత్యపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య తీవ్రంగా స్పందించినట్లు తెలిసింది. గురువారం కేబినెట్ భేటీలో స్పందిస్తూ ఇలాంటి హత్య ఇప్పటి వరకూ చూడలేదు. ఇలాంటి హత్య సభ్య సమాజంలో జరగకుండా ఉండాల్సింది. ఇది చాలా సున్నితమైన కేసు కాబట్టి ఎమ్మెల్యేలు, మంత్రులు ఎక్కడా మాట్లాడవద్దని చెప్పినట్లు సమాచారం.


గురువారం బెంగళూరు ఫ్రీడంపార్క్‌లో నిరసన


రాత్రి అక్కడే విశ్రమించిన దృశ్యం

అంగన్‌వాడీల ఆందోళన

శివాజీనగర: రాష్ట్రంలో అంగనవాడీ కార్యకర్తలు నిర్వహిస్తున్న ధర్నా రెండో రోజుకు చేరింది. నగరంలోని ఫ్రీడం పార్కులో నిరసన కొనసాగుతోంది. కళ్యాణ కర్ణాటకలో ఏడు జిల్లాల్లో ఒక వెయ్యికిపైగా ప్రాథమిక పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను ప్రారంభించే ఆదేశాన్ని రద్దు చేయాలని, అంగనవాడీలలోనే ఆ తరగతులను ప్రారంభించాలని కోరారు. అంగన్‌వాడీలలో పిల్లలకు యూనిఫారాలు, బ్యాగ్‌లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఫ్రీడంపార్క్‌లోనే వందలాది కార్యకర్తలు, తమ పిల్లలతో మకాం వేశారు.


యోగా ఆచరిస్తున్న గార్మెంట్స్ కార్మికులు

యోగాతో ఆరోగ్య భాగ్యం

గౌరిబిదనూరు: యోగా వల్ల మనసు స్థిరంగా ఉంటుందని, ఆరోగ్యం వృద్ధి చెందుతుందని యునాని వైద్యులైన అవినాశ్ తెలిపారు. గురువారం ఉదయం స్థానిక గార్మెంట్స్ ఫ్యాక్టరీలో కార్మికులకు యోగాసనాల అభ్యాసం చేయించారు. పశ్చిమ దేశాల వారికి యోగా పరిచయం చేసింది మనదేశమే అన్నారు. ప్రభుత్వ వైద్యురాలు డా.శిల్పా మాట్లాడుతూ ఉత్తమ ఆరోగ్యం కోసం ప్రతి రోజూ యోగా చేయాలన్నారు. మన ప్రాచీన రుషులు యోగాభ్యాసం చేసేవారని, వేదకాలం నుంచి యోగా ఆచరణలో ఉందని చెప్పారు. ఈ సందర్భంగా వందలాది మంది కార్మికులు యోగాసనాలు సాగించారు.

షికారుకు వచ్చి డ్యాంలో జలసమాధి

- ముగ్గురు యువకుల గల్లంతు


ప్రమాదం జరిగిన చోట గాలింపు చర్యలు




నీటిపాలైన యువకులు సాజీద్, అదిల్, అప్తాఖాన్ (ఫైల్)

శివమొగ్గ: చిక్కమగళూరు జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఎన్ఆర్ పుర తాలూకాలోని ఉన్న భద్రా జలాశయంలో తెప్ప ప్రమాదం జరిగి శివమొగ్గకు చెందిన ముగ్గురు గల్లంతు అయ్యారు. ఈ దుర్ఘటన బుధవారం సాయంత్రం జరిగింది. వివరాలు.. శివమొగ్గ నగరంలోని విద్యానగరకు చెందిన అదిల్ (19), సాజీద్ (24), అప్తా ఖాన్ (23) అనే ముగ్గురు యువకులు ఎన్ఆర్ పుర తాలూకాలో బైరాపు గ్రామంలని భద్రా డ్యాంను చూడాలని వచ్చారు.

నీటి ఒడ్డున ఉన్న ఒక తెప్పలో వెళ్లసాగారు. వీరితో పాటు వచ్చిన మరో స్నేహితుడు ఫోన్‌లో మాట్లాడుతూ ఒడ్డునే ఉండిపోయాడు. కొంచెం ముందుకు వెళ్లాక తెప్ప పల్టీ కొట్టడంతో ముగ్గురూ నీటిలోకి పడిపోయారు. మరో యువకుడు స్థానికులకు చెప్పడంతో పోలీసులు, ఫైర్ సిబ్బంది చేరుకుని గాలింపు చేపట్టారు. బాధితుల బంధువులు చేరుకుని తమవారి కోసం రోదిస్తూ నిరీక్షించారు.

క్లుప్తంగా

బస్సుల రాకపోకలు లేక పాట్లు

• 7 కి.మీ.లు కాలి నడకన విద్యార్థులు



బడికి కాలి నడకన వెళుతున్న విద్యార్థులు

రాయచూరు రూరల్: జిల్లాలో పాఠశాలలు ప్రారంభమై 20 రోజులు గడిచినా గ్రామీణ ప్రాంతాల నుంచి నగర ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో విద్యనభ్యసించడానికి రవాణ సౌకర్యం కొరత అధికమైంది. మస్కి తాలూకా కవితాళ మండల కేంద్రానికి చేరడానికి విద్యార్థులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాలూకాలోని నెలకోళ, కాచాపుర, యాతగల్‌లకు చెందిన సుమారు 80 మంది విద్యార్థులు అమీన్‌గడ, హట్టి, నీలగల్, లింగసూగూరులకు వెళ్లాలంటే 7 కిలో మీటర్లు దూరం కాలి నడకన వెళ్లాల్సి వస్తోంది. శాసన సభ్యులు బసనగౌడ, మానప్ప వజ్జల్, హంపయ్య నాయక్ మౌనం వహించడంపై విద్యార్థులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర మంత్రి కుమారకు అభినందన



కేంద్ర మంత్రిని అభినందిస్తున్న అమరేశ్వర నాయక్

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలో భారీ పరిశ్రమల స్థాపనకు చర్యలు చేపట్టాలని రాయచూరు మాజీ ఎంపీ రాజా అమరేశ్వర నాయక్ కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామికి విన్నవించారు. ఆయన గురువారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి పుష్ప గుచ్ఛం అందించి అభినందించి మాట్లాడారు. రాయచూరు, యాదగిరి జిల్లాల్లో భారీ పరిశ్రమలు ప్రారంభిస్తే ప్రజలు వలస వెళ్లకుండా నివారించవచ్చన్నారు.

అంగన్‌వాడీలకు తరగతులు కేటాయించరూ



వినతిపత్రం సమర్పిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాలకు ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను కేటాయించాలని అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం జిల్లాధ్యక్షురాలు పద్మ డిమాండ్ చేశారు. గురువారం నగర శాసన సభ్యుల నివాసం ముందు అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహించే కార్యకర్తలకు ఇప్పటికే ఎల్‌కేజీ, యూకేజీ పాఠాల బోధనకు సంబంధించిన శిక్షణ ఇచ్చారన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలకు కేటాయించే పనులను, పథకాలను విద్యాశాఖకు అప్పగించేందుకు తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్‌కు వినతిపత్రం సమర్పించారు.

నేడు నగరానికి మంత్రి రాక



మంత్రి శరణ ప్రకాష్ పాటిల్

రాయచూరు రూరల్: జిల్లా ఇంచార్జి, రాష్ట్ర వైద్య విద్యా శాఖా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్ శుక్రవారం నగరంలో పర్యటించనున్నారు. జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మంత్రి అనంతరం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కుమార నాయక్ తరపున ప్రచారానికి కూడా గైర్హాజరయ్యారు. వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడినా స్పందించలేదు. తాజాగా నగరంలో మూడు రోజుల పాటు జరగనున్న మున్నూరు కాపు సమాజం ఏర్పాటు చేసిన ముంగారు సాంస్కృతిక ఉత్సవాల ప్రారంభోత్సవానికి హాజరు కానున్నారు. అనంతరం జెడ్పీ సభాంగణంలో అధికారులతో సమావేశంలో పాల్గొంటారని అధికార వర్గాలు తెలిపాయి.

సొంతదార్లకు సొత్తు అప్పగింత



చోరీ సొత్తును సొంతదార్లకు అప్పగిస్తున్న ఎస్పీ శ్రీహరిబాబు

హొసపేటె: దొంగలించిన మొబైల్ ఫోన్లను సొంతదార్లకు పోలీసులు అప్పగించిన ఘటన టౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం జరిగింది. దొంగలించిన సుమారు 15 మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న వారికి విజయనగర జిల్లా ఎస్పీ శ్రీహరి బాబు ఆధ్వర్యంలో తిరిగి ఇచ్చారు. సుమారు రూ.3.425 లక్షల విలువ చేసే వివిధ కంపెనీలకు చెందిన ఫోన్లు తిరిగి ఇవ్వడంతో వారు పోలీస్ శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఏఎస్పీ సలీం పాషా, డీఎస్పీ మంజునాథ్ పాల్గొన్నారు.

నేడే మేయర్ ఎన్నిక.. వీడని ఉత్కంఠ

• అభ్యర్థిత్వం ఇంకా కొలిక్కిరాని వైనం
• పదవి రేసులో నలుగురు కార్పొరేటర్లు



బళ్లారి నగర నడిబొడ్డులోని సిటీ మున్సిపాలిటీ కార్యాలయం

సాక్షి,బళ్లారి: నగర మేయర్ ఎంపికకు సంబంధించి అధికార కాంగ్రెస్ పార్టీలో తీవ్ర పోటీ నెలకొనడంతో కాంగ్రెస్ రాష్ట్ర హైకమాండ్ రంగంలోకి దిగింది. నగర మేయర్ ఎన్నిక రేపు (ఈనెల 21)వ తేదీన జరిపేందుకు అధికారులు తేదీ ఖరారు చేయడంతో మేయర్ రేసులో నలుగురు కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు వివేక్(విక్కీ), ముల్లంగి నందీష్, ప్రభంజన్‌కుమార్, గాదెప్ప తీవ్రంగా పోటీ పడటంతో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మేయర్ అభ్యర్థి పేరు కొలిక్కి రాకపోవడంతో బుధవారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పెద్దలు రంగంలోకి దిగారు. కేపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ, మేయర్ ఎన్నికకు సంబంధించిన పరిశీలకులు బెంగళూరుకు చెందిన నారాయణస్వామి, కేపీసీసీ ఉపాధ్యక్షుడు సూరజ్ హెగ్డే బళ్లారికి విచ్చేశారు.

పట్టువీడని కార్పొరేటర్లు

వారు నగరంలోని అల్లం భవన్‌లో స్థానిక ఎమ్మెల్యేలు నాగేంద్ర, భరత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు నాసిర్ హుస్సేన్, లోక్‌సభ సభ్యుడు తుకారాం, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అల్లం ప్రశాంత్ సమక్షంలో కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుని చర్చలు జరిపారు. మేయర్ స్థానం జనరల్‌కు కేటాయించడంతో ఆ వర్గానికి చెందిన ఒకే సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు కార్పొరేట్లు పట్టువీడటం లేదు. ముగ్గురు కార్పొరేటర్లు ఈసారి ఎలాగైనా మేయర్ పదవి దక్కించుకోవాలని ఎవరికి వారు పట్టువీడకుండా తీవ్ర ప్రయత్నాలు చేస్తూ లోలోపల కార్పొరేటర్ల మద్దతు కోరుతూ రాజకీయ హైడ్రామా చేస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో చీలిక వస్తుందనే భయంతో నేతలు రంగంలోకి దిగి కార్పొరేటర్లతో మంతనాలు జరిపారు.

పార్టీ కోసం కష్టపడిన వారికే అందలం

ఈ సందర్భంగా మేయర్ రేసులో ఉన్న కార్పొరేటర్లు మాట్లాడుతూ తాము పార్టీ కోసం ఎంతో కష్టపడ్డామని ఎవరికి వారు కార్పొరేటర్లు తమ అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లు చెప్పుకొచ్చారు. మేయర్ రేసులో ఉన్న వారితో పాటు పలువురు కార్పొరేటర్ల అభిప్రాయాలను కూడా పార్టీ పెద్దలు తెలుసుకున్నారు. అనంతరం పార్టీ పరిశీలకులు, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కష్టపడి పార్టీని బలోపేతం చేసిన వారికి కచితంగా అందలం ఎక్కిస్తామన్నారు. మేయర్ పదవి ఒకటే ఉంటుందని, నలుగురు పోటీలో ఉన్నారని, ఎవరిని మేయర్ ఎంపిక చేయాలో సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు నిర్ణయం తీసుకుని ఒక పేరును సూచిస్తారన్నారు.

విపక్షానికి అవకాశమివ్వొద్దు

అందరూ అందుకు సమ్మతించి ఏకాభిప్రాయంతో ఏకగ్రీవంగా మేయర్ ఎన్నిక జరిగేందుకు తోడ్పాటు నందించాలని, ప్రతిపక్ష బీజేపీకి ఎట్టి పరిస్థితుల్లోను రాజకీయం చేసేందుకు అవకాశం కల్పించకూడదని, కలిసి ఉంటేనే కలదు సుఖం అన్న పెద్దలు హితోక్తిని అనుసరించి ముందడుగు వేయాలన్నారు. పార్టీ నిర్ణయాన్ని ధిక్కరిస్తే సమంజసంగా ఉండదన్నారు. బుడా అధ్యక్షుడు జే.ఎస్ ఆంజనేయులు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మంజుల తదితరులతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన 26 మంది కార్పొరేటర్లు హాజరయ్యారు.

తిరుమలకు పాదయాత్ర షురూ



పాదయాత్రకు బయలుదేరిన భక్త బృందం

కేజీఎఫ్: తిరుమల తిరుపతి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో 31వ సంవత్సరం తిరుమల పాదయాత్రను గురువారం నగరంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రారంభించారు. 350 మంది భక్తులు ఉదయం ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ట్రస్టు అధ్యక్షుడు సతీష్, కోశాధికారి వేలు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా ప్రతియేటా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లుగానే ఈ యేడాది కూడా చేస్తున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల పాటు ఈ పాదయాత్ర కొనసాగుతుందన్నారు. ప్రతియేటా భక్తుల సంఖ్య పెరుగుతోందన్నారు. భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మండ్య: క్యాంటర్ వాహనం ఢీకొని పాదచారి మృతి చెందిన ఘటన మండ్య తాలూకాలోని హలగూరు సమీపంలో ఉన్న బైపాస్ రోడ్డులో చోటు చేసుకుంది. మృతుడిని తాలూకాలోని జిగుండిపట్టణానికి చెందిన ముత్తురాజు (42)గా గుర్తించారు. ఇతను రోడ్డు దాటుతుండగా క్యాంటర్ వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలతో మత్తురాజు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అధ్యక్షుడిగా ఏకగ్రీవం

చింతామణి: తాలూకాలోని నందిగానహళ్లి వ్యవసాయ సేవా సహకార సంఘం అధ్యక్షుడిగా షేక్ నజీర్‌సాబ్, ఉపాధ్యక్షుడిగా చంద్రప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ... సంఘాన్ని లాభాలో నడిపించడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ టీపీ అధ్యక్షుడు లక్ష్మీ నారాయణరెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడగూరు రోడ్డు బాగు చేయండి



దుస్థితిలో ఉన్న రోడ్డుపై నిరసన ప్రకటిస్తున్న దృశ్యం

కోలారు: తాలూకాలోని వడగూరు రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేకుంటే బంగారుపేట ఎమ్మెల్యే నారాయణస్వామికి వ్యతిరేకంగా కరవే తరపున ధర్నా చేస్తామని కరవే జిల్లా అధ్యక్షుడు శంకరరెడ్డి హెచ్చరించారు. ఆయన గురువారం అధ్వాన్న స్థితిలో ఉన్న రోడ్డుపైనే నిరసన తెలిపి మాట్లాడారు. దగ్గరలో ఉన్న కెంబోడి ఉన్నత పాఠశాలకు వెళ్లడానికి వందలాది మంది విద్యార్థులు సైకిళ్లు తదితరాలపై వెళుతుంటారు. దారి అధ్వాన్నంగా ఉండడం వల్ల విద్యార్థులు కింద పడి గాయపడుతున్నారన్నారు. వర్షం వచ్చిందంటే దారి మరింత దారుణంగా మారి వాహన సంచారం కష్టకరంగా మారుతోందన్నారు. ఈ దారికి వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు. కరవే తాలూకా అధ్యక్షుడు డీవీ మంజునాథ్, సురేష్, తాలూకా అధ్యక్షుడు యారంగట్టి శశి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఖండిస్తూ ధర్నా



ఎద్దులబండిపై ధర్నా చేపట్టిన నాయకులు



శ్రీనివాసపురంలో ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

మాలూరు/శ్రీనివాసపురం: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఖండిస్తూ గురువారం బీజేపీ, జేడీఎస్ కార్యకర్తలు, ఎమ్మెల్యేలు ఎద్దుల బండిపై వినూత్న రీతిలో ధర్నా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు కెఎస్ మంజునాథ్‌గౌడ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే పాలనలో పూర్తిగా విఫలం అయిందని ఆరోపించారు. కేవలం గ్యారెంటీల అమలు కోసం మాత్రమే ప్రభుత్వం నడుస్తోందన్నారు. అభివృద్ధి పనులు కుంటుపడ్డాయన్నారు. గ్యారెంటీల అమలుకు నిధుల సమీకరణ కోసం ప్రభుత్వం అన్నిరకాల ధరలు పెంచేస్తోందన్నారు. సాంఘిక సంక్షేమ శాఖలో ఉన్న రూ.11 వేల కోట్లను గ్యారెంటీల కోసం ఖర్చు చేసిందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలను, ఇటీవలే స్టాంపు ధరలను కూడా గణనీయంగా పెంచేసిందన్నారు. ఇలా ప్రజలను లూటీ చేసిన డబ్బును వారికే ఇచ్చి ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ అవధిలో నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా పెరిగిపోయి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రభుత్వం వెంటనే దిగిపోవాలన్నారు. ధర్నాలో జేడీఎస్ నాయకుడు జి.రామేగౌడ, తాలూకా బీజేపీ అధ్యక్షుడు టీబీ కృష్ణప్ప, ఉపాధ్యక్షుడు పుర నారాయణస్వామి, బీజేపీ తాలూకా అధ్యక్షుడు రోణూరు ఆర్ ఎస్ చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు బాబురెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగభూషణ్, ఒక్కలిగ సంఘం తాలూకా అధ్యక్షుడు వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాల్ టికెట్ కోసం విద్యార్థి నిరసన



పాఠశాల ఎదుట నిరసన ప్రకటిస్తున్న పరశురామ

హొసపేటె: కొప్పళ జిల్లా కుకనూరు తాలూకాలోని మంగళూరు కేపీఎస్(హైస్కూల్ డివిజన్) పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడి నిర్లక్ష్యం వల్ల 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్ష రాయలేక పోయిన విద్యార్థి పాఠశాల ఎదుట తన తండ్రితో కలిసి నిరసనకు దిగిన ఘటన వెలుగు చూసింది. పరశురామ అనే విద్యార్థి టెస్ట్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడు. అయితే ఆ విద్యార్థి తన హాల్ టికెట్ కోసం చెల్లించాల్సిన అన్ని రుసుములను ప్రధానోపాధ్యాయుడికి అందించాడు. కానీ విద్యార్థికి బోర్డు నుంచి తన హాల్ టికెట్ అందలేదు. పరీక్ష ఫీజుగా రూ.680లు చెల్లించామని, అయినా తన కుమారుడు పరీక్షకు హాజరు కాలేకపోయాడని విద్యార్థి తండ్రి విశ్వనాథ్ వాపోయారు. తాలూకాలోని మంగళూరు కేపీఎస్ హైస్కూల్ విభాగంలో 10వ తరగతి పరీక్షకు 146 మంది హాజరయ్యారు. వారిలో 53 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. సప్లిమెంటరీ పరీక్షకు హాజరయ్యేందుకు పరీక్ష ఫీజు చెల్లించిన విద్యార్థి పరశురామ తనకు పరీక్ష హాల్ టికెట్ అందలేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

13న మెగా లోక్ అదాలత్

చిక్కబళ్లాపురం: కేసులకు సంబంధించి ఏళ్ల తరబడి కోర్టుల చుట్టు విసిగిపోయిన వారికి రాజీ మార్గంలో కేసులు పరిష్కరిస్తామని జిల్లా జడ్జి నేరలె వీరభద్రయ్య భవానీ తెలిపారు. గురువారం జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జడ్జి మాట్లాడుతూ... ప్రస్తుతం జిల్లాలో 40 వేలకు పైగా కేసులు ఉన్నాయని, అందులో అదాలత్ కోసం 1150 కేసులు గుర్తించామని చెప్పారు. ఏళ్ల తరబడి కోర్టుల్లో పేరుకుపోయిన కేసులను పరిష్కరించే ఉద్దేశ్యంతో ఈ అదాలత్ ప్రారంభించామని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా న్యాయాంగ ప్రాధికార సభ్యులు ఉమేశ్ పాల్గొన్నారు.

తుమకూరులో భారీ వర్షం



రైల్వే స్టేషన్ రోడ్డులో ఒరిగిపోయిన స్తంభం

తుమకూరు: తుమకూరు నగరంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో నగర వాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల కరెంట్ స్తంభాలు కూలిపోయాయి. నగరంలోని రైల్వే స్టేషన్ ముందు భాగంలో కరెంట్ స్తంభం కూలిపోయింది. ఇదే రోడ్డులో భారీ చెట్టు నేలకూలింది. సుమారు గంట పాటు వర్షం నానా బీభత్సం సృష్టించింది.

సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి

మైసూరు: దేశంలో రైతులు సేంద్రియ సాగుపై దృష్టి సారించాలని ఎంపీ యదువీర్ అన్నారు. గురువారం ఆయన నగరంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ రైతు మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో మాట్లాడారు. సాగులో అనుసరించే పద్ధతి వల్ల ప్రజలు రోగాలకు గురవుతున్నారని, సేంద్రియ సాగుపై రైతులు దృష్టి పెట్టాలన్నారు. సిరిధాన్యాలు సాగు చేసి ఆరోగ్యవంతమైన సమాజం కోసం పాటుపడాలన్నారు.

ఇంజినీరింగ్ కాలేజీ ప్రారంభం

బనశంకరి: రాష్ట్రంలో విద్యారంగంలో 107 ఏళ్ల చరిత్ర కలిగిన నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ నూతన ఇంజనీరింగ్ కాలేజీ ప్రారంభించిందని ఈ ఏడాది నుంచి ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ అడ్మిషన్లు ప్రారంభిస్తామని నేషనల్ ఎడ్యుకేషనల్ సొసైటీ కర్ణాటక అధ్యక్షుడు డాక్టర్ హెచ్‌ఎన్. సుబ్రమణ్య తెలిపారు. గురువారం జయనగరలో డాక్టర్ హెచ్‌ఎన్.నేషనల్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ హెచ్‌ఎన్.సుబ్రమణ్య మాట్లాడుతూ... డాక్టర్ హెచ్ నరసింహయ్య ఆదర్శాలపై నిర్వహిస్తున్న విద్యాసంస్థలు ద్వారా భవిష్యత్ తరాలకు అనుకూలమయ్యే విధంగా విద్యను అందించడానికి ఇంజనీరింగ్‌కాలేజీ ప్రారంభించామని తెలిపారు. సమావేశంలో కాలేజీ అధ్యక్షుడు డాక్టర్ పీఎల్.వెంకటరామరెడ్డి, కోశాధికారి తల్లంద్వారకనాథ్, బసవనగుడి నేషనల్ డిగ్రీ కాలేజీ అధ్యక్షుడు సుధాకర్, భావన, రాంమోహన్,అల్కానంద తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం కోసం వినతి



జిల్లాధికారిణికి వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

శివాజీనగర: క్రైస్తవులు అధికంగా ఉన్న హుబ్లీ శహరలో క్రైస్తవులకు శ్మశానం కోసం స్థలం మంజూరు చేయాలని అఖిల భారత క్రిస్టియన్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నాయకులు సీఎం సిద్ధరామయ్యకు విన్నించారు. సీఎం ప్రత్యేక అధికారి ఆర్.మహాదేవ సూచన మేరకు ధారవాడ జిల్లాధికారికి గురువారం వినతిపత్రం సమర్పించారు. ఇప్పటికే క్రైస్తవుల కోసం ప్రత్యేకంగా హుబ్లీ తాలూకా సుళ్ల గ్రామంలో 10 ఎకరాల భూమి కోరారు. ఈ మేరకు సీఎం ప్రత్యేక అధికారి సిఫారస్సు మేరకు స్థలం పరిశీలించి క్రైస్తవులకు శ్మశానం కోసం భూమి మంజూరు చేయాలని ధారవాడ జిల్లాధికారికి విన్నవించారు. ఈ సందర్భంగా అఖిల భారత క్రిస్టియన్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సంస్థాపక ట్రస్టీ ప్రకాశ్ ఎం.ఎల్. క్రైస్తవ సంఘాల పెద్దలు ఎస్.ఎల్. విజయకుమార్, జీ.డేవిడ్, బీ.రవికుమార్, టీ. జెర్మియా, సీ.ప్రభుదేవ్ తదితరులు ఉన్నారు.

భూసమితి అధ్యక్షుడిగా తిమ్మనగౌడ



తిమ్మనగౌడను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు నాగేంద్ర, భరత్‌రెడ్డి

సాక్షి,బళ్లారి: బగర్ హుకుం(ఆక్రమిత ప్రభుత్వ) భూసమితి తాలూకా అధ్యక్షుడిగా సిద్ధమ్మనహళ్లి తిమ్మనగౌడ నియమితులయ్యారు. ఈమేరకు ఆయన గురువారం నగరంలో తాలూకా కార్యాలయంలో సంబంధిత అధికారుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర, నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, ఏపీఎంసీ అధ్యక్షుడు కట్టెమనె నాగేంద్ర, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మీనళ్లి చంద్రశేఖర్ తదితరులు ఆయన్ను కలుసుకుని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి, సంబంధిత రైతులకు న్యాయం చేస్తానన్నారు. రైతులు ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న భూములకు పట్టాలు తీసుకునేందుకు దరఖాస్తుదారులకు పట్టాలు అందజేసేందుకు కృషి చేస్తామన్నారు.

చురుగ్గా అభివృద్ధి పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న మంత్రి బోసురాజు

రాయచూరు రూరల్: జిల్లాలో చురుగ్గా జాతీయ రహదారుల అభివృద్ధి పనులు చేపట్టాలని రాష్ట్ర చిన్న నీటిపారుదల శాఖా మంత్రి ఎన్ఎస్ బోసు రాజు, లోక్‌సభ సభ్యుడు కుమార నాయక్ పేర్కొన్నారు. బుధవారం బెంగళూరులోని వికాససౌధలో జాతీయ రహదారుల శాఖ అధికారులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాధికార అధికారుల సమావేశంలో హునగుంద– రాయచూరు రహదారి నిర్మాణానికి భూస్వాధీనంలో నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. కృష్ణానదిపై నిర్మిస్తున్న రోడ్డు వంతెన పనులు త్వరగా ముగించాలన్నారు. నగరంలోని ఆర్టీఓ సర్కిల్ నుంచి మలయాబాద్ మలుపు వరకు రహదారి పనులు పూర్తి చేయాలని సూచించారు.

కోలారు వార్తలు...

ప్రభుత్వ కార్యక్రమంలో ప్రొటోకాల్ రగడ



ప్రొటోకాల్‌పై ఎమ్మెల్యే మంజునాథ్‌తో వాగ్వాదం చేస్తున్న సభ్యులు



లబ్ధిదారుడికి త్రిచక్రవాహనం అందిస్తున్న ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్

• కమిషనర్ తీరుపై జేడీఎస్, బీజేపీ సభ్యుల ఆగ్రహం

కోలారు: నగరసభ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన లబ్ధిదారులకు త్రిచక్ర వాహన పంపిణీ కార్యక్రమంలో గందరగోళం చోటు చేసుకుంది. నగరసభ వివిధ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు త్రిచక్రవాహనాలను అందించే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులందరికీ ఆహ్వానం పంపాల్సి ఉండగా నూతన ఎంపీ ఎం.మల్లేష్‌బాబుకు ఆహ్వానం పంపడాన్ని మరిచారు. కనీసం ఆహ్వాన పత్రికలో కూడా ఎంపీ పేరు కనిపించలేదు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన బీజేపీ, జేడీఎస్ సభ్యులు ప్రవీణ్‌గౌడ, మురళీగౌడ, రాకేష్, రమేష్, గుణశేఖర్‌లు కార్యక్రమం జరుగుతున్న వేదిక వద్దకు వచ్చి గొడవ ప్రారంభించారు. జరిగిన తప్పిదంపై నగరసభ కమిషనర్ శివానందను నిలదీశారు. మధ్యలో కలుగజేసుకున్న ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ ప్రజాప్రతినిధిగా ఎన్నికైన తరువాత అధికారకంగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ప్రభుత్వం ప్రొటోకాల్‌లో చేర్చాలని అన్ని శాఖలకు సమాచారం అందిస్తుందని ఎంపీ ఇంకా ప్రతినిధిగా ప్రమాణ స్వీకారం చేయకపోవడం వల్ల ఇలా జరిగిందని, భవిష్యత్తులో ఇలా జరగకుండా అధికారులకు సూచిస్తామని తెలపడంతో సభ్యులు శాంతించారు.

ఎమ్మెల్యే కంటే ఎక్కువ బాధ్యత

కార్యక్రమంలో లబ్ధిదారులకు త్రిచక్రవాహనాలను అందించి ఆయన మాట్లాడుతూ నగరసభ సభ్యులకు ఎమ్మెల్యే కంటే బాధ్యత అధికంగా ఉంటుందన్నారు. ప్రతి వార్డు సభ్యుడు బాధ్యతాయుతంగా మెలిగి తమ వార్డులోని సమస్యలను పరిష్కరించి ప్రజలకు సౌకర్యాలు కల్పించాలన్నారు. వార్డులో ఎలాంటి సమస్య ఉన్నా ప్రజలు వార్డు మెంబర్‌ను సంప్రదిస్తారు కానీ ఎమ్మెల్యేని కాదన్నారు. కనుక వార్డు సభ్యులు సదా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. 15వ ఆర్థిక ప్రణాళికలో రూ.8.14 కోట్లు మంజూరయ్యాయి. యాక్షన్ ప్లాన్ తయారు చేసి సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభిస్తామన్నారు. ఇందుకు సభ్యులు తమ వంతు సహకారం అందించాలన్నారు. నగరంలో స్వచ్ఛతకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంఎల్ అనిల్‌కుమార్, కమిషనర్ శివానంద, నగరసభ సభ్యులు పాల్గొన్నారు.

నూతన ఎంపీకి సన్మానం



నూతన ఎంపీని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

కోలారు: నూతన లోక్‌సభ సభ్యుడు ఎం.మల్లేష్ బాబును గురువారం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సభ్యులు ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు జిల్లా సర్వతోముఖాభివృద్ధికి శ్రమించాలన్నారు. నియోజకవర్గంలో నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాలకు ఉద్యోగులు తమ వంతు సహకారం అందించాలన్నారు. జిల్లా ప్రజలు తనను లోక్‌సభ సభ్యుడిగా ఎన్నుకోవడం ద్వారా తనకు ఒక మంచి అవకాశం ఇచ్చారన్నారు. అభివృద్ధిలో జిల్లా వెనుకబడిందనే అపవాదును తొలగించాల్సి ఉందన్నారు. జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర భారీ పరిశ్రమల శాఖా మంత్రి హెచ్‌డీ కుమారస్వామితో చర్చిస్తానన్నారు. తద్వారా జిల్లాలో నిరుద్యోగ సమస్య నివారణకు కృషి చేస్తానన్నారు. జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.సురేష్‌బాబు, డీపీసీయూ డిప్యూటీ డైరెక్టర్ రవిచంద్ర, మాజీ అధ్యక్షుడు కేబీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై దర్యాప్తునకు డిమాండ్



దాఖలాలు ప్రదర్శిస్తున్న అంబరీష్

కోలారు: బెంగళూరు ఉత్తర వర్సిటీలో జరిగిన అక్రమాలపై ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపించి నిందితులను శిక్షించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వి.అంబరీష్ తెలిపారు. గురువారం నగరంలోని పాత్రికేయుల భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వవిద్యాలయంలో అధికారిక టెండర్లు లేకుండా వివిధ పనులను నిర్వహించారన్నారు. సమాచార హక్కు చట్టం కింద పొందిన సమాచారం ద్వారా విశ్వ విద్యాలయంలో భారీ స్థాయిలో అక్రమాలు జరిగి కోట్లాది రూపాయలు ప్రభుత్వానికి నష్టం కలుగజేశారని ఆరోపించారు. విశ్వవిద్యాలయంలోని కొంతమంది ఉన్నత స్థాయి అధికారులు ఈ అక్రమాల్లో నేరుగా పాలు పంచుకున్నారన్నారు. సరైన తనిఖీ చేయిస్తే అన్ని విషయాలు బయట పడతాయన్నారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న వర్సిటీలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. కాంట్రాక్టుతో పాటు దినకూలీ ఉద్యోగుల నియామకాల్లో కూడా అక్రమాలు జరిగాయన్నారు. రూ.8 కోట్ల పనులకు రూ.18 కోట్ల వరకు బిల్లులు చేసుకుని లూటీ చేశారన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. సామాజిక కార్యకర్త చంజిమలై రమేష్, దళసగెరె మూర్తి, హూవళ్లి నాగరాజ్ ఉన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రూపా శశిధర్

కేజీఎఫ్: తాలూకాలోని బేతమంగల టి.గొల్లహళ్లి జీపీ పరిధిలోని నల్లూరు గ్రామంలో గురువారం ఎమ్మెల్యే రూపా శశిధర్ రూ.1.60 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చాలా పాతబడి శిథిలమైన బేతమంగల చెరువు మరువకు, పాపేనహళ్లి, మల్లహళ్లి గ్రామం వద్ద మరువకు మరమ్మతులు చేస్తామన్నారు. జెడ్పీ మాజీ సభ్యుడు లక్ష్మీనారాయణ, జీపీ అధ్యక్షుడు విను కార్తీక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీపీఎం నిరసన



కృష్ణరాజపురం: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వ్యతిరేకిస్తూ కృష్ణరాజపురం బీబీఎంపీ ఆఫీసు ముందు సీపీఎం నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ ధరల వలన సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం తగ్గించాలని డిమాండు చేశారు. ధర్నాలో సీపీఎం నాయకులు గౌరమ్మ, గోపాలగౌడ, ఎం.నంజెగౌడ, పి.మునిరాజు కల్పన, వనిత పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మండ్య: పేదరికం, మూఢ నమ్మకాలు, చట్టాలపై అవగాహన లేని కారణంగా సమాజంలో ఇంకా బాల్య వివాహాలు జరుగుతున్నాయని రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్ సభ్యుడు వెంకటేష్ అన్నారు. రాష్ట్ర న్యాయ వి.వి. జాతీయ సేవా పథకం, పీఈఎస్ న్యాయ కళాశాల ఆధ్వర్యంలో మండ్య తాలూకా ఎలెచాకనహళ్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో స్వచ్ఛ పరిసరాలు, ఆరోగ్య శిబిరం, చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండ్య జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు అధికంగా జరుగుతున్నాయని, వాటిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలతో పిల్లల జీవితాలు నాశనమవుతాయని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.

మృతదేహం వివరాలు లభ్యం

దొడ్డబళ్లాపురం: దేవనహళ్లి తాలూకా బూదిగెరె గ్రామం చెరువులో బుధవారం లభించిన వృద్ధురాలి శవం వివరాలు లభించినట్టు పోలీసులు తెలిపారు. దేవనహళ్లి తాలూకా హందరహళ్లి గ్రామానికి చెందిన మునితాయమ్మ (80)గా గుర్తించారు. మానసిక అస్వస్థురాలైన మునితాయమ్మ తరచూ ఇల్లు వదిలి వెళ్లిపోయి తిరిగి ఇంటికి వచ్చేదని, అదేవిధంగా గత ఆదివారం కూడా ఇల్లు వదిలి వెళ్లిపోయింది. మామూలుగానే తిరిగి వస్తుందనుకున్న మునితాయమ్మ బూదిగెరె చెరువులో శవమై తేలింది. మృదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన పోలీసులు కుటుంబ సభ్యులకు అందజేసారు.

రాముడే ఆదర్శం



సమావేశంలో స్వామీజీలు

తుమకూరు: రాముని గుణాలను అనుసరించడం ద్వారా రామరాజ్యం నిర్మాణం చేయాలని ఉడుపి పేజావర మఠానికి చెందిన విశ్వప్రసన్నతీర్థ స్వామిజీ అన్నారు. తుమకూరు నగరంలో ఎంప్రెస్ పాఠశాలలో గురువందనా సమితి సమావేశంలో స్వామీజీ పాల్గొని మాట్లాడారు. శ్రీరాముడు ఒక ఆదర్శ పురుషుడని, సమాజంలో మనం ఎలా ఉండాలో అనేదానికి శ్రీరాముడు చూపించాడని చెప్పారు. సిద్దగంగ సిద్దలింగ స్వామి మాట్లాడుతూ గురువు అంటే వెలుగు, జ్ఞానం, సేవా అని అనేక అర్థాలు ఉన్నాయని చెప్పారు.

ఎంపీ రాక

బెంగళూరు గ్రామీణ ఎంపీ డా. సిఎన్ మంజునాథ్ తుమకూరు శ్రీనగరలో నివాసం ఉంటున్న కగ్గెరె సతీష్ నివాసానికి వచ్చారు. సతీష్ కుటుంబంతో పాటు స్థానికులు ఎంపీని కలిశారు.

23న స్వర్ణ మహోత్సవం



బ్రోచర్ విడుదల చేస్తున్న డాక్టర్ కేఎం.రంగదామశెట్టి, డీఆర్.విజయసారథి తదితరులు

బనశంకరి: సహకార రంగం ప్రారంభం నుంచి నిరంతరం లాభాల్లో నడుస్తున్న శ్రీ సుబ్రమణ్యేశ్వర కో–ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ 50 వసంతాలు పూర్తి చేసుకుందని 23 తేదీ ఆదివారం ప్యాలెస్ మైదానంలో స్వర్ణోత్సవం నిర్వహిస్తామని బ్యాంకు సంస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేఎం. రంగదామశెట్టి, ఉపాధ్యక్షుడు డీఆర్.విజయసారథి తెలిపారు. గురువారం నగరంలో విలేకరులతో వారు మాట్లాడుతూ...ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం ఆర్థిక క్రమశిక్షణ కాపాడుకుంటూ వస్తున్నామని, కస్టమర్లు, సభ్యుల హితరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. బెంగళూరునగరంలో తొమ్మిది శాఖలు ఉన్నాయని, ప్రారంభం నుంచి లాభాలు గడిస్తున్నామని చెప్పారు. 2023–24లో రూ.8.83 కోట్లు నిల్వ లాభాల్లో ఉందన్నారు. విలేకరుల సమావేశంలో బ్యాంకు డైరెక్టర్లు బీఎల్.వెంకటా చలపతి, పీ.రుద్రమూర్తి, సత్యమూర్తి, నంజేగౌడ, ఎంఈ.సురేశ్‌బాబు, రవి.కే, రవీంద్ర పీ.కే, మారుతి హెచ్, మహాలక్ష్మీ, అన్నపూర్ణమ్మ, జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మనసుకు హాయినిచ్చేదే సంగీతం

- రాగం ఏదైనా వినసొంపుగా మార్చే విలక్షణ ప్రక్రియ సంగీతం
- సంగీతం విశ్వ వ్యాప్తం
- నేడు విశ్వ సంగీత దినోత్సవం సందర్భంగా..





వీణ, కీబోర్డు శిక్షణలో చిన్నారులు



కీ బోర్డ్, వీణపై శిక్షణ ఇస్తున్న గీతా హెగ్డె

గౌరిబిదనూరు: సంగీతానికి భాష లేదు, ఆస్వాదించడానికి విద్య అవసరం లేదు, మానవుల నుంచి పశు పక్ష్యాదులు సైతం సంగీతాన్ని ఇష్టపడతాయి. సంగీతం అనేక మానసిక రుగ్మతలను, ఒత్తిడులను తగ్గించి మానసిక ప్రశాంతతను కల్పిస్తుంది. సంగీతానికి అంతటి శక్తి ఉంది. నేడు (జూన్ 21న) విశ్వ సంగీత దినోత్సవం సందర్భంగా... రాగమేదైనా మనసుకు ఆనందాన్నిచ్చే దానిపై శ్రద్ధ చూపితే సంగీతాభ్యాసం సులువవుతుందని చెబుతున్నారు ప్రముఖ గాయని గీతా హెగ్డె. ఈమె అన్నమయ్య, రామదాసు, పురంధర దాసు, కనకదాసు భక్తి కీర్తనలను రాగయుక్తంగా పాడగలరు. అనేక కఛేరీలు నిర్వహించి శ్రోతలతో మెప్పు పొందారు. సంగీతం గురించి ఆమె మాటల్లో... శంకరాభరణమైనా, మోహన రాగమైనా, ఆది తాళమైనా అది పాడే వారి శైలిపైన, వారి స్వరంలో మధురమైన కంఠం శ్రోతలను ఆకర్షిస్తుందని అన్నారు. అది కీ బోర్డ్ అయినా, వీణ అయినా శ్రద్ధతో అభ్యసిస్తే అన్ని రాగాలు పాడే వారిదవుతుందని, ప్రతి మనిషిలో సంగీతంపై మక్కువ వుంటుంది. కనీసం బాత్‌రూం పాటైనా పాడని వారుండరు. శిశుర్వేత్తి, పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణికి అన్నట్లుగా గానానికి తలూపని వారుండరు, పశువులు వేణు గానానికి పరవశమవుతుంది. కోయిలమ్మ పాటలను, నెమలి నృత్యాన్ని మెచ్చని వారుండరని గీతా హెగ్డె అన్నారు. పాశ్చాత్య సంగీతమైనా దానిలోని విలువలను గౌరవించాలన్నారు.

శాస్త్రీయ సంగీతం పట్ల అభిరుచి పెంచుకోవాలి :

కర్ణాటక సంగీతం, హిందూస్థానీ సంగీతంలో సీనియర్ గ్రేడ్‌లో గీతా హెగ్డె పాసయ్యారు. ఉత్తర కన్నడ జిల్లా శిరశి ప్రాంతానికి చెందిన ఈమె పదేళ్ల క్రితం నగరానికి వచ్చారు. ప్రస్తుతం గానయోగి సంగీత సరస్వతి ట్రస్ట్ ఆధ్వర్యంలో వీణ, కీబోర్డ్, హార్మోనియం పిల్లలకు నేర్పుతున్నారు. నేటి యువత శాస్త్రీయ సంగీతం పట్ల అభిరుచి పెంచుకోవాలని, అవసాన దశ చేరుకొంటున్న మన కళలను భావి తరాలకు అందివ్వడానికి యువత శ్రమించాలన్నారు. తాలూకాలో పిల్లలలో సంగీతాభిరుచిని పెంచడం, వారిని సంగీత కళాకారులుగా తీర్చిదిద్దడం, నగరంలో సంగీత ప్రియుల అవసరాలను తీర్చడానికి సౌండ్ రికార్డింగ్ స్టుడియో స్థాపించడం తన ధ్యేయమని గీతా హెగ్డె తెలిపారు.



ఓ సంగీత కచేరీలో వీణ వాయిస్తున్న చిన్నారులు

పెంచిన ఇంధన ధరలను తగ్గించాలి





మైసూరు: ఇంధన పెంపును నిరసిస్తూ తుమకూరు నగరంలో బీజేపీ, జేడీఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. నగరంలోని అశోక్ రోడ్డుకు చేరుకున్న రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వచ్చి వాహనాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ ఎమ్మెల్యే జ్యోతిగణేశ్ మాట్లాడుతూ...ఇప్పటికే ప్రజలు పెరిగిన నిత్యావసరాలతో అల్లాడిపోతుంటే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం అన్యాయమన్నారు. వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ధరలు తగ్గించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని అన్నారు.

మండ్యలో బీజేపీ ధర్నా

మండ్య: రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ ఇంధన ధరలు పెంపును నిరసిస్తూ ప్రతిపక్షాలు ఆందోళనలు కొనసాగిస్తున్నాయి. మండ్య నగరంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు గురువారం రాస్తారోకో నిర్వహించారు. నగరంలోని జేసీ సర్కిల్‌కు చేరుకుని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కూడలిలో వాహనాలు అడ్డుకుని, వెంటనే పెంచిన ఇంధన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

పుస్తక ప్రదర్శనను విజయవంతం చేయాలి

హోసూరు: హోసూరులోని ప్రైవేట్ హోటల్లో ఏర్పాటు చేయనున్న 13వ పుస్తక ప్రదర్శను విజయవంతం చేయాలని కలెక్టర్ శరయు కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం తమిళనాడు ప్రభుత్వంచే పుస్తక ప్రదర్శనను నిర్వహిస్తుందని, అందులో భాగంగా జూలై 12వ తేదీ నుంచి 23 వరకు జరగనుందని, ఈ ప్రదర్శనలో వందకు పైగా స్టాల్లు ఏర్పాటు కానున్నాయని, దీంతో పాటు ప్రతి రోజూ పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, పాఠశాల, కళాశాల విద్యార్థులు, స్థానికులు తిలకించి విలువైన పుస్తకాలను కొనుగోలు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌వో సాధనకురల్, అధికారులు పుష్ప, హోసూరు సబ్‌కలెక్టర్ ప్రియాంక, ధనలక్ష్మి, సత్యమూర్తి, విజయ్‌కుమార్, వనంగాముడి తదితరులు పాల్గొన్నారు.

మండ్యలో పార్కుల అభివృద్ధికి కృషి

మండ్య: మండ్య నగరంలో పార్కుల అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, నగరంలోని కెంపేగౌడ జిల్లాధికారి కార్యాలయంలో ముందస్తు సమావేశంలో ఆయన మాట్లాడుతూ...నాడప్రభు కెంపేగౌడ విగ్రహం కూడా ఏర్పాటు చేస్తామని, ఈనెల 30న కెంపేగౌడ జయంతి వేడుకలను నిర్వహిస్తామని, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కూడా హాజరువుతారన్నారు.

నీట్ అక్రమాలపై ఆప్ ఆధ్వర్యంలో ధర్నా

బనశంకరి: రాష్ట్రంలో సీఈటీ ద్వారా వైద్య కోర్సు పొందడానికి అర్హత పొందేవారని, నీట్‌తో రాష్ట్ర విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని ఆమ్ ఆద్మీపార్టీ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌దాసరి ఆరోపించారు. గురువారం ఫ్రీడం పార్కులో ఆప్ ఆధ్వర్యంలో నీట్ అక్రమాలకు వ్యతిరేకంగా నిర్వహించిన ధర్నాలో మోహన దాసరి మాట్లాడారు. ఐదారేళ్లుగా నీట్‌లో ఒకరు లేదా ఇద్దరు మాత్రమే మొదటి ర్యాంకు సాధించేవారు. కానీ ఈ సారి 67 మంది విద్యార్థులు 720 మార్కులకు 720 మార్కులు సాధించడం అనేక అనుమానాలకు కారణమైందన్నారు. అంతేగాక ఒకే గదిలో పరీక్ష రాసిన ఆరుగురు విద్యార్థులు 720 మార్కులకు 720 మార్కులు సాధించారంటే పరీక్షల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడు తరహాలో రాష్ట్ర ప్రభుత్వం కూడా కమిటీ ఏర్పాటు చేసి తమ రాష్ట్రానికి నీట్ ఆవశ్యకత లేదని న్యాయ పోరాటం చేయాలన్నారు. నీట్‌తో రాష్ట్రానికి మినహాయింపు లభించే చట్టం అంగీకరించాలి. పీయూసీ, సీఈటీలో పొందే మార్కులు మాత్రమే వైద్యకీయ కోర్సుల్లో ప్రవేశానికి పరిగణించాలి. అంతేగాక రాష్ట్రంలో ఎమ్మెల్యేలు ఎంపీలు లోక్‌సభ ముందు ఆందోళనలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీట్‌కు వ్యతిరేకంగా పార్టీలకు అతీతంగా పోరాడాలని అన్యాయం పట్ల జాగృతం చేయాలన్నారు.

ఫోన్‌పే పేరుతో ఘరానా మోసం

- నిందితుడి అరెస్ట్

యశవంతపుర: ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నా అమాయకులు జాగృతం కావడం లేదు. తాజాగా ఫోన్ పే వెరిఫై పేరుతో రాష్ట్రంలోని వివిధ జిల్లాలో 79 మంది రూ.40 లక్షలు వరకు మోసోయారు. ఈ కేసులో నిందితుడిని బీదర్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి ఆరు మొబైల్ ఫోన్లతో పాటు 45 సిమ్‌కార్డులను బుధవారం స్వాధీనం చేసుకున్నారు. బీదర్ నగరానికి చెందిన శివప్రసాద శంక్రెప్ప మాడగిని పోలీసులు అరెస్ట్ చేశారు.

విలాసాలకు అలవాటు పడి మోసాలు:

విలాసవంతమైన జీవితానికి అలవాటు పడిన శివప్రసాద్ వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగుల వివరాలను గూగుల్ సర్చ్ చేసి వారి మొబైల్ నెంబర్లు సేకరించాడు. అనంతరం తాను ఎస్‌బీఐ మొయిన్ బ్రాంచ్ ఉద్యోగినని చెప్పి ఫోన్ పేలో యుపీఐ ఐడీ వెరిఫై చేయాలి, నగదు లిమిట్ సెట్ చేయాలని చెప్పి అన్నీ వివరాలు సేకరించేవాడు. అనంతరం బంగారు అంగళ్లు, ఇతర దుకాణాల్లో సేకరించిన నెంబర్ల యూపీఐ ద్వారానే అన్ని కొనుగోలు చేసేవాడని ఎస్పీ చన్నబసవణ్ణ తెలిపారు. మే 29న బసవకల్యాణ తాలూకా యశవంతగి గ్రామానికి చెందిన సంగప్ప మాదప్ప కల్యాణకు ఫోన్ చేసి రూ.75 వేలు మోసం చేశాడు. అతడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ముడబి పోలీసులు కేసు నమోదు చేసి విచారించగా సైబర్ పోలీసుల సాయంతో నిందితుడిని అరెస్ట్ చేశారు. బీదర్ కర్ణాటక కాలేజీలో బీసీఏ పూర్తి చేసి నిరుద్యోగిగా మారి డబ్బుల కోసం మోసాలకు పాల్పడతుతున్నట్లు తేలింది.

చెరువులో పడి యువకుడు మృతి

మైసూరు: మైసూరు తాలూకా ఉద్దూరు గ్రామంలో దొడ్డకెరె చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన కెంపేగౌడ (25) మద్యం మత్తులో చెరువు వద్దకు వచ్చి అందులో పడి ప్రాణాలు కోల్పోయాడు. గురువారం ఉదయం 7 గంటల సమయంలో చెరువు వద్దకు పలువురు చెరువులో మృతదేహం ఉండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

కరెంటు షాక్‌తో మరొకరు..

కరెంటు షాక్‌తో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా కణ్నెనూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చిక్కపుట్టనాయక (52) మేకలకు గడ్డి తీస్తున్న సమయంలో పక్కనే ఉన్న కరెంట్ తీగ తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

క్రేన్ ఢీ, ఆటో డ్రైవర్ దుర్మరణం

శివాజీనగర: నిలిపి ఉన్న ఆటోను క్రేన్ ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన ఉప్పారపేట పరిధిలో గురువారం జరిగింది. హారోహళ్లి నాగరహొళె సర్కిల్‌కు చెందిన వినోద్‌కుమార్ (35) మృతుడు. ఉదయం 7 గంటల సమయంలో ఆటోలో కూర్చొని టీ తాగుతుండగా అదే మార్గంలో వెనుక నుంచి వచ్చిన క్రేన్ ఆటోను ఢీకొంది. కొద్ది దూరంలో లాక్కొని వెళ్లింది. ఆటోలో ఉన్న వినోద్‌కుమార్ కింద పడి పోవడంతో క్రేన్ చక్రం అతని తలపై దూసుకుని వెళ్లడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు.

కలబురగిలో బీజేపీ ఆందోళన



ఎద్దుల బండిపై అశోక్ తదితరులు

యశవంతపుర: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజల్ ధరలను వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష నాయకుడు ఆర్ అశోక్ నేతృత్వంలో కలబురగి పట్టణంలో ఎద్దులబండి ఎక్కి ఆందోళన చేశారు. పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు సర్దార్ వల్లభాయ్ నేతృత్వంలో జరిగిన అందోళనలో పార్టీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో కలబురగి మేయర్ విశాల్ దర్గి, మాజీ ఎమ్మెల్యే సుభాశ గుత్తేదార్, పార్టీ నాయకురాలు శోభా బానిలతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

హోసూరు వార్తలు..

ఆర్థిక సాయం అందజేత



హోసూరు: ఓ విద్యార్థినికి హోసూరు కంకర క్వారీ యాజమానుల సంఘం గురువారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. పట్టణంలోని ఉ.వ.సి. నగర్ ప్రాంతానికి చెందిన విద్యార్థిని దుర్గా ప్లస్టూ వరకు చదువుకుంది. పై చదువులకు వెళ్లేందుకు ఆర్థిక ఇబ్బందు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకొన్న కంకర క్వారీ యాజమానుల సంఘం ద్వారా రూ. లక్ష ఆర్థిక సాయాన్ని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. సబ్‌కలెక్టర్ శరణ్య నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి సంఘ అధ్యక్షులు శానమావు సంపంగి, సంఘ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అన్నకు యాక్సిడెంట్.. చెల్లి ఆత్మహత్య

కెలమంగలం: వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన సోదరుడు కోమా స్థితికి చేరుకోవడంతో దుఃఖాన్ని భరించలేక చెల్లెలు బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకొన్న ఘటన తళి వద్ద జరిగింది. వివరాల మేరకు తళి సమీపంలోని మేల్‌కొచ్చాపూర్ గ్రామానికి చెందిన ప్రాన్ కూతురు భవాని (15). రాయకోటలోని ప్రభుత్వ ఉన్నతోన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. వారం రోజుల క్రితం ఆమె సోదరుడు మాదేష్ (18) రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోమా స్థితికి చేరుకోవడంతో భవాని తీవ్రంగా దుఃఖిస్తోంది. చివరకు జీవితంపై విరక్తి చెందిన భవాని బావిలో దూకి ఆత్మహత్య చేసుకొంది. వరుసగా జరిగిన విషాదాలతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

ఘనంగా మారియమ్మ జాతర



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

కెలమంగలం: అంచెట్టి సమీపంలోని మిలిదిక్కి గ్రామంలో వెలసిన గ్రామదేవత మారియమ్మ జాతరను విశేషంగా జరుపుకొన్నారు. రెండు రోజులుగా ఆలయంలో వివిధ పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు పిండిదీపాలతో ఆలయం వద్దకు చేరుకొని అమ్మవారికి అభిషేకించారు. అనంతరం అగ్నిగుండ మహోత్సవం జరిగింది. ఈ మహోత్సవంలో ఆలయ అర్చకులు ముందు వెళ్లగా భక్తులు అగ్నిగుండంలో ప్రవేశించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి జంతుబలులిచ్చి మొక్కులు తీర్చుకొన్నారు. కార్యక్రమంలో చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నూతన గదుల నిర్మాణానికి భూమిపూజ



కృష్ణరాజపురం: నగరంలోని మహాదేవపుర నియోజకవర్గం గుంజూరులోని ప్రభుత్వ పాఠశాలలో నూతన గదుల నిర్మాణం కోసం ఎమ్మెల్యే మంజుల లింబావళి గురువారం భూమిపూజ చేశారు. అనంతరం ఆమె విద్యార్థులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొడగులో కూలిన హోటల్ భవనం

బనశంకరి: కొడగు జిల్లా పొన్నంపేటే తాలూకా గోణికుప్పలో గురువారం కూలిపోయిన అంబూర్ బిరియాని హోటల్ భవనంలో ఇప్పటివరకు 9 మందిని కాపాడారు. ఇందులో ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. మరో ఇద్దరు చిక్కుకున్నట్లు అనుమానం వ్యక్తం కావడంతో వీరికోసం గాలిస్తున్నారు. సమాచారం అందిన వెంటనే ఎన్‌డీఆర్ఎఫ్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టింది. హోటల్ యజమాని తిరుమురగన్, భార్య అలమేలు, కుమారుడు నారాయణ, కార్మికుడు మాలింగను కాపాడారు. భోజనానికి వచ్చిన కస్టమర్ మధు అనే వ్యక్తికి కాలి విరిగిపోవడంతో అతడిని గోణకుప్పె ఆసుపత్రికి తరలించారు. మరో వ్యక్తి తలకు గాయం కావడంతో మైసూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. స్థానికులు ఇద్దరు చిక్కుకున్నారనే అనుమానంతో గాలిస్తున్నారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

యశవంతపుర: కలబురగి తాలూకా తావరగేరా గ్రామంలో స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన యువకుడు నీట మునిగి మృతి చెందాడు. తావరగేరాకు చెందిన అబ్దుల్ ఖాదర్ (25) తన స్నేహితులతో మంగళవారం బావిలో ఈతకు వెళ్లాడు. ఈత కొడుతూ నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. అగ్నిమాపక సిబ్బంది మృతదేహాన్ని వెలికితీశారు.

హాసన్‌లో సన్నిలియోన్

యశవంతపుర: బాలీవుడ్ కథానాయిక సన్ని లియోన్ హాసన్ జిల్లాలో సందడి చేశారు. చెన్నరాయపట్టణ తాలూకా కబ్బళ్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు వచ్చిన ఆమె అక్కడి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. పలువురు సన్నిలియోన్‌తో సెల్ఫీలు తీసుకున్నారు. తమిళ చిత్రం షూటింగ్ సందర్భంగా ఆమె చెన్నరాయపట్టణకు వచ్చినట్లు సమాచారం.

అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్



పిల్లలతో కలెక్టర్ శరయు

హోసూరు: క్రిష్ణగిరి జిల్లా కావేరిపట్టణం సమితి నరిమేడు గ్రామంలో శిథిలావస్థకు చేరుకొన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని స్వచ్ఛంద సంస్థ పునరుద్ధరణ అనంతరం గురువారం కలెక్టర్ శరయు ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరుకొందని, మరమ్మతులకు దాతలు ముందుకు రావాలని కోరడంతో అమీగా స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చి కేంద్రానికి మరమ్మతులు చేపట్టింది. పనులు పూర్తి చేసుకొన్న నేపథ్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి కలెక్టర్ శరయు ముఖ్య అతిథిగా పాల్గొని అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించి పిల్లలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమీగా స్వచ్ఛంద సంస్థ క్రిష్ణగిరి జిల్లాలో 2 అంగన్‌వాడీ కేంద్రాలు, 15 కేంద్రాలకు మరమ్మతులు చేపట్టిందని సామాజిక సేవలో ఉత్తమ సేవలందిస్తోందని అభినందించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు లక్ష్మీరామమూర్తి, ధర్మరాజు, అంగన్‌వాడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబానికి ఆర్థిక సాయం



హోసూరు: విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతి చెందిన పోలీసు కుటుంబానికి జిల్లా ఎస్పీ తంగదురై ఆర్థిక సాయం అందజేశారు. వివరాలు... ధర్మపురి జిల్లా అరూర్ సమీపంలోని పాళ్యం గ్రామానికి చెందిన రాజేంద్రన్. గత 2011 నుంచి హోసూరు తాలూకా బాగలూరు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ వచ్చాడు. గత ఏడాది గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసేందుకు పోలీసు శాఖ ద్వారా నిధులను సేకరించారు. అందులో భాగంగా సేకరించిన నిధులను బాధిత కుటుంబానికి అందజేశారు. రాజేంద్రన్ ఇద్దరి పిల్లలకు ఎల్ఐసీ ద్వారా రూ. 23 లక్షలు, భార్య అభితకు రూ. 2.50 లక్షల చెక్కు రూపంలో అందజేశారు.

రాజకాల్వ ఆక్రమణలు తొలగించాలి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కెలమంగలం: కెలమంగలం పట్టణ పంచాయతీలోని పటాలమ్మ చెరువు రాజకాల్వలు ఆక్రమణలకు గురికావడంతో గత ఆరేళ్లుగా ఆయకట్టుదారులకు సాగునీరు అందక వ్యవసాయం చేయలేకపోతున్నామని, సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి ఆక్రమణలు తొలగించాలని కోరుతూ రైతు సంఘం ద్వారా జమాబందీ కార్యక్రమంలో ఫిర్యాదులు అందజేశారు. ఆ ఫిర్యాదులో పట్టణ పంచాయతీలోని పటాలమ్మ చెరువు నీటి ద్వారా సుమారు వంద ఎకరాలకు పైగా సాగు చేస్తుండేవారని, ఆరేళ్ల క్రితం రాజకాల్వ ఆక్రమణలకు గురికావడంతో ఆయకట్టు ప్రస్తుతం బీడుభూములుగా మారిపోయిందని, ఈ విషయంపై పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితంలేకపోయిందని, సంబంధిత శాఖాధికారులు చర్యలు చేపట్టి రాజకాల్వ ఆక్రమణలు తొలగించి ఆయకట్టు రైతులకు సాగునీరందజేయాలని కోరుతూ కెలమంగలం పట్టణ పంచాయతీ అధ్యక్షులు సయ్యద్ అస్సేన్ నేతృత్వంలో రైతు సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ జమాబందీ కార్యక్రమంలో తహసీల్దార్ పారిమేల్ అళగన్, డెప్యూటీ తహసీల్దార్ శక్తివేల్, సుహాసిని, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రోడ్లపై విచ్చలవిడిగా పశువుల సంచారం



రోడ్లపై సంచరిస్తున్న పశువులు

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలో పశువులు విచ్చలవిడిగా తిరుగుతూ వాహనదారులకు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కల్పిస్తున్నాయని, కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టి పశువుల సంచారాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు. పట్టణంలో పశువులను పోషిస్తున్న కొంత మంది రైతులు రోజూ యథేచ్ఛగా వదలివేయడంతో రైతు బజారు, బస్టాండు తదితర ప్రాంతాల్లో సంచరిస్తూ వాహనదారులకు, వ్యాపారులకు, ప్రయాణికులకు, స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కల్పిస్తున్నాయని, కొన్ని ప్రాంతాల్లో వాహనదారులపై తిరగబడుతున్నాయని, పశువులను అరికట్టాలని సామాజిక సేవాకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక వ్యక్తి మృతి


రవి (ఫైల్)

నెల్లూరు సిటీ: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక బుధవారం ఆ పార్టీ అభిమాని ప్రాణాలు విడిచారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని శ్రామికనగర్ ఆరో వీధికి చెందిన మొలతాటి రవి(59) పెయింటర్. కౌంటింగ్ రోజు నుంచి సరిగా భోజనం చేయలేదు. నాలుగు రోజుల నుంచి ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఆస్పత్రికి తరలించినా ప్రయోజనంలేకపోయింది. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

మైనార్టీ రిజర్వేషన్ల చట్టబద్ధతకు ఒత్తిడి పెంచాలి

ఎంపీ మిథున్‌రెడ్డికి ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: మైనార్టీ రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి పెంచేలా పార్లమెంటులో పోరాడాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా విజ్ఞప్తి చేశారు. తాడేపల్లిలో గురువారం ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన నాగుల్ మీరా వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల ప్రచారంలో మైనార్టీ రిజర్వేషన్లను కాపాడతానని హామీ ఇచ్చిన చంద్రబాబును త్వరలో కలిసి మైనార్టీ రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం కృషి చేయాలని కోరతామని ఆయన తెలిపారు.

పదవీ విరమణ తర్వాత మళ్లీ చేరిన వారిని సాగనంపండి

అన్ని శాఖల అధికారులకు సీఎస్ నీరబ్‌కుమార్‌ప్రసాద్ ఆదేశాలు

సాక్షి, అమరావతి: పదవీ విరమణ తర్వాత ఆయా శాఖల్లో తిరిగి పునర్నియమితులైన అధికారులు, ఉద్యోగులను తక్షణం సాగనంపాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్‌ప్రసాద్ అన్ని శాఖలనూ ఆదేశించారు. పదవీ విరమణ తర్వాత తిరిగి ఉద్యోగులుగా నియమితులైన వారి జాబితాలను అన్ని శాఖలు రూపొందించి తక్షణం వారితో రాజీనామాలు చేయించాల్సిందిగా ఆదేశించారు. ఆ రాజీనామాలు చేసిన ఉద్యోగులు, అధికారుల వివరాలను సాధారణ పరిపాలన శాఖ(రాజకీయ)కు పంపాల్సిందిగా సూచించారు. ఏ శాఖలోనైనా రిటైరైన అధికారులు, ఉద్యోగుల సేవలు అవసరమైతే కొత్తగా సంబంధిత అథారిటీ నుంచి అనుమతి పొందాల్సిందిగా సీఎస్ సూచించారు.

ఈవీఎంల ట్యాంపరింగ్‌తో అధికారం చేపట్టిన బీజేపీ

మాజీ ఎంపీ చింతా మోహన్ విమర్శ



తిరుపతి కల్చరల్: దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అధికార దాహంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఈవీఎంలు ట్యాంపరింగ్ చేసి అధికారంలోకి వచ్చిందని మాజీ ఎంపీ డాక్టర్ చింతా మోహన్ విమర్శించారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. అప్రజాస్వామిక పద్ధతిలో అధికారం చేపట్టడం బీజేపీకి నిత్యకృత్యంగా మారిందన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్‌పై ఇటీవల ప్రపంచ సంపన్నుల్లో ఒకరైన ఎలన్ మస్క్ చేసిన వ్యాఖ్యలు వంద శాతం వాస్తవమేనన్నారు. దుర్మార్గపు రీతిలో బీజేపీ ప్రభుత్వం నీట్ పరీక్షలు నిర్వహించి ప్రజాగ్రహానికి గురైందన్నారు. ఈ పరీక్షకు లక్షల మంది బిడ్డలు చదువుకున్నారని, బీజేపీ ముందుగానే పరీక్ష పేపర్ లీక్ చేయడంతో కొన్ని ప్రాంతాల్లో కొందరు మాత్రమే బాగుపడ్డారని పేర్కొన్నారు.

'స్వామినాథన్' సిఫార్సుల మేరకు మద్దతు ధర పెంచాలి

కౌలు రైతుల సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: కేంద్రంలో మూడోసారి కొలువైన ఎన్డీఏ సర్కార్ పంట ఉత్పత్తులపై తొలి కేబినెట్ సమావేశంలో తీసుకున్న మద్దతు ధరల పెంపు నిర్ణయం.. ప్రస్తుతం పెరిగిన ఖర్చులకు ఏమాత్రం సరిపోదని ఏపీ కౌలు రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై.రాధాకృష్ణ, హరిబాబు స్పష్టంచేశారు. ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు పంటల ఉత్పత్తి ఖర్చుకు 50 శాతం అదనంగా పెంచి మద్దతు ధర ప్రకటించాలని గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న విధ్వంసం

- రాష్ట్రవ్యాప్తంగా శిలాఫలకాలపై టీడీపీ శ్రేణుల దాడులు
- పలుచోట్ల ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం


ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం గుణ్ణంపల్లిలో ధ్వంసం చేసిన శిలాఫలకం


ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం గుణ్ణంపల్లిలో పగిలిన హెల్త్ క్లినిక్ భవన కిటికీ అద్దం

ద్వారకాతిరుమల/తాడేపల్లిగూడెం/గోపాలపురం: అధికారమే అండగా టీడీపీ కార్యకర్తలు అరాచకాలకు పాల్పడుతున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా శిలాఫలకాలను, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తూనే ఉన్నారు. పలు ప్రాంతాల్లో గురువారం కూడా యథేచ్ఛగా విధ్వంసం సాగించారు.

ఏలూరు జిల్లాలో సీసీ రోడ్డు శిలాఫలకం ధ్వంసం

ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం గుణ్ణంపల్లిలో సీసీ రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని టీడీపీ శ్రేణులు ధ్వంసం చేశాయి. అంతేకాకుండా విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం కిటికీ అద్దాలను పగులగొట్టాయి. ఇలా ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం ఏమిటని గ్రామస్తులు మండిపడుతున్నారు.

పశ్చిమ గోదావరి జిల్లాలోనూ..

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం 14వ వార్డు సత్యనారాయణపేటలో టీడీపీ కార్యకర్తలు సిమెంటు రోడ్డు, డ్రెయిన్ నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. సత్యనారాయణ పేటలో రెండేళ్ల క్రితం రూ.9 లక్షల నిధులతో సిమెంటు రోడ్డు, డ్రెయిన్ నిర్మించారు. తాజాగా ఈ శిలాఫలకాన్ని నాశనం చేశారు.

'తూర్పు'లో శిలాఫలకం పగులకొట్టి..

తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం వెంకటాయపాలెంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు సచివాలయ నిర్మాణానికి ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని పగులకొట్టారు. అంతేకాకుండా సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన వెంకటాయపాలెం – గౌరీపట్నం రోడ్డు శిలాఫలకాన్ని ధ్వంసం చేసి తుప్పల్లో పడేశారు. దీంతో వెంకటాయపాలెంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు రంగప్రవేశం చేసి వారిని చెదరగొట్టారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా పికెట్ ఏర్పాటు చేశామని ఎస్సై సతీష్‌కుమార్ తెలిపారు.



గోపాలపురం మండలం వెంకటాయపాలెం సచివాలయం వద్ద ధ్వంసమైన శిలాఫలకం


గోపాలపురం మండలం వెంకటాయపాలెం- గౌరీపట్నం రోడ్డులో తుప్పల్లో పడేసిన శిలాఫలకం


తాడేపల్లిగూడెంలో నేలమట్టం చేసిన శిలాఫలకం

వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లపై హత్యాయత్నం

రాయచోటిలో రెచ్చిపోయిన టీడీపీ నేత సయ్యద్ ఖాన్ గ్యాంగ్

- 7వ వార్డు కౌన్సిలర్ మున్నీసా భర్త ఇర్ఫాన్‌పై కత్తులతో దాడి
- కత్తిపోట్లతోపాటు తలకు తీవ్రగాయాలు.. కడప రిమ్స్‌కు తరలింపు
- 4వ వార్డు కౌన్సిలర్ ఇంటిపై బండరాళ్లు వేసిన టీడీపీ రౌడీలు
- బైక్ ధ్వంసం.. చంపుతామంటూ తల్లికి హెచ్చరికలు
- బాధితులకు ఫోన్‌లో వైఎస్సార్‌సీపీ నేత గడికోట శ్రీకాంత్‌రెడ్డి పరామర్శ

రాయచోటి: ఎన్నికల ముందురోజు వరకు ప్రశాంతంగా ఉన్న అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో టీడీపీ నేతలు వరుస దాడులతో అరాచకం సృష్టిస్తున్నారు. కౌంటింగ్ ముగిసిననాటి నుంచి టీడీపీ రౌడీలు వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకొని హత్యాయత్నాలకు తెగబడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి రాయచోటి టీడీపీ నేత సయ్యద్ ఖాన్ కొంతమంది రౌడీలతో వైఎస్సార్‌సీపీకి చెందిన మున్సిపల్ కౌన్సిలర్లపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. రాత్రి 11.30 గంటల సమయంలో నాలుగో వార్డు కౌన్సిలర్ హారూన్ బాషా ఇంటి వద్దకు వెళ్లి ఇంట్లో నుంచి బయటికి రావాలని, చంపుతామంటూ టీడీపీ రౌడీలు కేకలు వేశారు. ఆ సమయంలో హారూన్ ఇంటిలో లేకపోవడంతో ఆయన తల్లి బయటకు వచ్చి ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని వారిని ప్రాధేయపడ్డారు. అయినా వినని టీడీపీ రౌడీలు పెద్ద బండరాళ్లతో ఇంటి ఆవరణలో ఉన్న బైక్‌ను ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పీఏ నిస్సార్ అహ్మద్‌ను కూడా చంపుతామంటూ కేకలు పెడుతూ వెళ్లిపోయారు. ఆ తర్వాత వీధుల్లో బైకులపై కేకలు వేసుకుంటూ 7వ వార్డు కౌన్సిలర్ మున్నీసా ఇంటికి వెళ్లి ఆమె భర్త ఇర్ఫాన్‌పై కత్తులతో విచక్షణారహితంగా దాడి చేశారు. టీడీపీ రౌడీల దాడిలో ఇర్ఫాన్ కత్తిపోట్లకు గురయ్యారు. ఆయన తలకు బలమైన గాయాలయ్యాయి. ఆయనను కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు టీడీపీ నేత సయ్యద్ ఖాన్, బాబ్జీ, ఫిరోజ్ ఖాన్, శివారెడ్డి, అఫ్రోజ్, అబూజర్‌లను అరెస్టు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు అర్బన్ సీఐ సుధాకర్ రెడ్డి, డీఎస్పీ రామానుజులు టీడీపీ నేతలపైన హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కౌంటింగ్ నాటి నుంచే వరుస దాడులు..

ఈనెల నాలుగో తేదిన ఎన్నికల కౌంటింగ్ పూర్తి కాగానే అదే రోజు రాత్రి రాయచోటి రూరల్ మండలం ఎండపల్లి పంచాయతీ బోయపల్లిలో వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి ఇంటిపై టీడీపీ శ్రేణులు దాడికి తెగబడ్డాయి. ఈ దాడిలో సుబ్బారెడ్డి సోదరుడు, మరొకరు గాయాలపాలయ్యారు. ఇంటి ముందు ఉన్న కారును కూడా ధ్వంసం చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడిగా ఉన్న ఆర్టీసీ కండక్టర్ రామ్మోహన్ ఇంటిపై దాడులకు తెగబడి ఆయన బైకును తగులబెట్టారు. ఇలా రాయచోటిలో టీడీపీకి చెందిన రౌడీ మూకలు, గ్యాంగ్‌లు దాడులు చేయడమే కాకుండా ఫోన్ల ద్వారా తీవ్రమైన అసభ్య పదజాలంతో దూషిస్తూ చంపుతామని బెదిరిస్తున్నారు.


కత్తిపోటుకు గురైన 7వ వార్డు కౌన్సిలర్ భర్త ఇర్ఫాన్


4వ వార్డు కౌన్సిలర్ ఇంటి ముందు ఉన్న బైకును బండరాళ్లతో ధ్వంసం చేసిన దృశ్యం

టీడీపీ రౌడీమూకల దాడులు దారుణం



రాయచోటిలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లపైన టీడీపీ రౌడీ మూకలు దాడి చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రశాంత వాతావరణానికి అలవాటుపడిన రాయచోటి ప్రజలను ఈ రకమైన దాడులు చేసి భయాందోళనలకు గురి చేయడం సరికాదన్నారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని కోరారు. అధికారమనేది ఎవరికీ శాశ్వతం కాదన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఎవరిపైనా కక్షపూరిత రాజకీయాలు చేయలేదని గుర్తు చేశారు. టీడీపీ రౌడీలు అర్ధరాత్రి వేళ మద్యం తాగి గుంపులుగా వచ్చి తమ పార్టీ కౌన్సిలర్లపై దాడులు చేయడం దారుణమన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని దాడులు చేస్తామంటూ ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులకు ఆయన ఫోన్ చేసి పరామర్శించారు. ప్రస్తుతం తాను విజయవాడలో ఉన్నానని, త్వరలో బాధితులను కలుస్తానని అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలి

- సూపర్ సిక్స్ హామీల వల్లే కూటమికి అధికారం
- ఏపీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్

సాక్షి, అమరావతి : సూపర్ సిక్స్ పేరిట ఇచ్చిన హామీల వలనే టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిందని, వీటిలో భాగమైన ప్రతి రైతుకూ రూ.20 వేల చొప్పున ఇస్తామన్న పెట్టుబడి సాయం తక్షణమే వారి ఖాతాల్లో జమ చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు సంఘ రాష్ట్రాధ్యక్షుడు వి.కృష్ణయ్య అధ్యక్షతన వడ్డేశ్వరంలోని కార్యాలయంలో జరిగాయి. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. వాటిని వి.కృష్ణయ్య, సంఘం కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి మీడియాకు వివరించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా భూ యజమానులతో పాటు కౌలు రైతులకూ రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, ఉభయగోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో రబీ ధాన్యం బకాయిలు రూ.1,600 కోట్లను తక్షణమే రైతులకు చెల్లించాలన్నారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో 2023 రబీలో వేసిన పప్పుశనగ, కంది, జొన్న, మొక్కజొన్న, మిరప, తెల్ల కుసుమ, పొద్దు తిరుగుడు, ఉలవలు వంటి పంటలు వర్షాభావంతో దెబ్బతిన్నాయని, వీటికి ఎకరాకు రూ.పది వేలు నష్ట పరిహారంగా రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేవాలయ భూములు సాగు చేస్తున్న కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలని, వాస్తవ సాగుదారులకు బ్యాంకు రుణాలిచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మోటార్లకు మీటర్లు పెట్టే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐకేఎస్ నాయకులు టి.సాగర్, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపే 'సాక్షి'ని మూసేయిస్తా

ఉదయం 10 గంటలకు మూతేయకపోతే చూడండ్రా..

- నేను వస్తే పోలీసులు కూడా అడ్డుకోలేరు
- మీ సీతారామాంజనేయులు, పేర్ని నాని, మా ఎమ్మెల్యే వస్తారా?
- వాళ్లెవరూ రారు.. నేను ఎవరికీ భయపడను
- మీడియా సమావేశంలో జేసీ ప్రభాకర్‌రెడ్డి చిందులు



అనంతపురం క్రైం: తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకరరెడ్డి మరోసారి నోటికి పనిచెప్పారు. బుధవారం మీడియా సమక్షంలో రవాణా శాఖ అధికారులను బెదిరించిన ఆయన.. ఆ వార్తను ప్రచురించిన, ప్రసారం చేసిన 'సాక్షి' మీడియాపై గురువారం నోరుపారేసుకున్నారు. సాక్షి ఆఫీసుకు రేపు ఉదయం 10 గంటలకు మూతేయకపోతే చూడండ్రా.. ఎవరూ అడ్డుకోలేరంటూ బెదిరించారు. గురువారం అనంతపురంలోని ఆయన స్వగృహంలో మీడియా సమావేశం పేరిట కొందరు పాత్రికేయులను పిలిపించి సాక్షిపై అక్కసు వెళ్లగక్కారు. 'వాళ్లని, వీళ్లని కాదు. మిమ్మల్నే (సాక్షి) బెదిరిస్తున్నా. ఏం పీకుతారు' అంటూ బరితెగించి మాట్లాడారు. బ్రేక్ ఇన్‌స్పెక్టర్లను కాదు.. నేరుగా మీకే చెబుతున్నా.. సాక్షిని మూతేయిస్తా. నేను బంద్ చేయించేందుకు వస్తే పోలీసులు కూడా అడ్డుకోలేరు' అంటూ బెదిరింపులకు దిగారు. 'మీ కార్యాలయంపై దాడి చేస్తే దిక్కొచ్చే వారెవరున్నారు? నోరు మూసుకుని ఉండాలి. దర్వేష్.. నా కొ.. ల్లారా' అంటూ అసభ్య పదజాలంతో దూషిస్తూ ఊగిపోయారు. 'ఆయమ్మను బెదిరించాడు.. ఈయమ్మను బెదిరించాడు అన్నారు కదా.. ఇప్పుడు మిమ్మల్నే అంటున్నా.. మీకెవరు దిక్కున్నారు? మీ సీతారామాంజనేయులు, మీ పేర్ని నాని, మా ఎమ్మెల్యే (పెద్దారెడ్డి) వస్తారా? వాళ్లెవరూ రారు. నేను ఎవరికీ భయపడను. అంతకు ముందు కూడా నేను 'సాక్షి' ముందే కూర్చున్నా. మీకు వెనకాల, ముందు ఏముంది? నేను అనుకుంటే అనంతపురం సాక్షి ఆఫీసు మూసేయిస్తా' అంటూ రెచ్చిపోయారు. 'వాన్నీ.. వీన్ని బెదిరించను. నేరుగా మిమ్మల్నే బెదిరిస్తున్నా. అప్పట్లో మాకు ఎవరూ ప్రొటెక్షన్ రాలేదు. ఈ రోజు మీపైకి వస్తే మీకు అండగా ఎవరూ రారు. మేమొస్తే ఎవడూ అడ్డుకోలేరు. లక్షలాది మంది జనం మీ కార్యాలయంపై దాడి చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. మీకు ఎవడూ లేడు. నాకు జన బలం ఉంది' అంటూ బెదిరించారు.

ఉద్యోగులను దూషించడం సరికాదు

- ఉద్యోగులపై అధికార పార్టీ నేతల దౌర్జన్యాలను అరికట్టాలి
- వారికి అండగా ఉండాలి.. ఆత్మస్థైర్యాన్ని కల్పించాలి
- మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు కూడా సరికాదు
- టీడీపీ నేతల దౌర్జన్యాలను ఖండించిన ఏపీఎన్‌జీజీవో సంఘం
- సీఎం చంద్రబాబుకు సంఘం నేత బండి శ్రీనివాసరావు లేఖ
- జేసీ ప్రభాకర రెడ్డి వ్యాఖ్యలను ఖండించిన రవాణా శాఖ జేఏసీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇటీవల ప్రభుత్వం మారినప్పటి నుంచి తెలుగుదేశం పార్టీ, జనసేన నేతలు, కార్యకర్తలు ఉద్యోగులను దూషిస్తూ భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని ఏపీఎన్‌జీజీవో సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు అన్నారు. ఉద్యోగులపై టీడీపీ నేతలు వాడిన పదాలతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన గురువారం ఓ లేఖ రాశారు. ఇటీవల రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో టీడీపీ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలు ఉద్యోగులపై బెదిరింపులకు దిగిన ఘటనలను సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విధంగా వ్యవహరించడం ద్వారా ఉద్యోగుల్లో ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు జోక్యం చేసుకుని ఉద్యోగుల పట్ల అధికార పార్టీ నేతల దౌర్జన్యాలను అరికట్టాలని, ఉద్యోగుల్లో ఆత్మస్థైర్యం కలిగించేలా చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరారు. నర్సీపట్నంలో టీడీపీ ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు నడిరోడ్డుపై మున్సిపల్ అధికారులను బూతులు తిట్టి దౌర్జన్యపూరితంగా మాట్లాడారని, ఇది ఉద్యోగులను తీవ్ర భయాందోళనలకు గురిచేసేలా ఉందని పేర్కొన్నారు. అనంతపురం టీడీపీ నేత జేసీ ప్రభాకర రెడ్డి రవాణా శాఖ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, డిటీసీ శివరాంప్రసాద్‌ను బహిరంగంగా దూషించడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. జేసీ వ్యాఖ్యలు ఉద్యోగుల కుటుంబ సభ్యులను తీవ్ర ఆందోళనకు గురిచేసేలా ఉన్నాయన్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో టీడీపీ కార్యకర్తలు ఎలక్ట్రికల్ డీఈ విజయ భాస్కరరావు ఇంట్లోకి వెళ్లి ఆయనతో బలవంతంగా క్షమాపణలు చెప్పించారన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సైతం ఏ ప్రభుత్వ కార్యాలయానికైనా పసుపు బిళ్ల పెట్టుకొని వెళ్తే మిమ్మల్ని కూర్చొబెట్టి, కాఫీ ఇచ్చి, మీ పని ఏమిటో కనుక్కొని మరీ దానిని చేసి పంపుతారని టీడీపీ కార్యకర్తలకు చెప్పారన్నారు. అలా చేయని అధికారుల సమాచారం తనకు ఇస్తే వారిపై చర్యలు తీసుకుంటామని కూడా మంత్రి చెప్పారని తెలిపారు. ఒక మంత్రే ఈ విధంగా మాట్లాడితే ఉద్యోగులు ఎలా పనిచేసుకోగలుగుతారని అన్నారు. ఇలాంటి చర్యలు ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పనిచేసే ఏ ఉద్యోగైనా వారి విధులకు అనుగుణంగా ప్రభుత్వ విధానాల మేరకు పనిచేస్తారన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే ఉద్యోగులను బెదిరించడం, ఇబ్బందులకు గురిచేయడం సరికాదని అన్నారు.

జేసీ వ్యాఖ్యలను ఖండించిన రవాణా శాఖ జేఏసీ


రవాణా శాఖ అధికారులపై జేసీ ప్రభాకర రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఏపీ రవాణా శాఖ జేఏసీ తీవ్రంగా ఖండించింది. అటువంటి పదజాలం మంచిది కాదని, ఆయన చేసిన వ్యాఖ్యలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని ఏపీ రవాణా శాఖ జేఏసీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. రవాణా శాఖ అధికారులపై ప్రభాకర రెడ్డి వ్యక్తిగత విమర్శలు చేసి, దూషించడం చాలా బాధాకరమన్నారు. ఏ వ్యక్తి మీద లేదా వ్యక్తుల మీద తమకు ఎటువంటి పక్షపాతం ఉండదని, విధి నిర్వహణలో భాగంగానే వాహనాలపై కేసులు రాయడం, సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులను దుర్భాషలాడటం, వ్యక్తిగత విమర్శలు చేయడం లేదా దాడులు చేయడం వంటివి మంచిది కాదని జేఏసీ జనరల్ సెక్రటరీ ఎస్. జగదీష్ స్పష్టం చేశారు.

పేదల ఇళ్లు కూల్చివేత

- 65 రేకుల ఇళ్లు నిర్దయగా నేలమట్టం
- రేణిగుంటలో అధికారుల దుశ్చర్య
- ఎమ్మెల్యే ఆదేశాలతోనే ఈ దుర్మార్గం

రేణిగుంట (తిరుపతి జిల్లా): తిరుపతి జిల్లా రేణిగుంటలో దళిత వర్గానికి చెందిన సుమారు 65 రేకుల ఇళ్లను అక్రమ నిర్మాణాల సాకుతో గురువారం అధికారులు నేలమట్టం చేశారు. పేదలకు తీరని నష్టాన్ని కలిగించారు. దళిత నాయకులు, ప్రజా ప్రతినిధులను హౌస్ అరెస్ట్ చేసి ఈ దౌర్జన్య కాండను నిర్దయగా కొనసాగించారు. కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలను మోహరింపజేసి, బాధితులెవరూ రాకుండా అడ్డుకున్నారు. తొలుత రేణిగుంట సీబీఐడీ కాలనీ సమీపంలో 25 రేకుల ఇళ్లను, ఆ తర్వాత వివేకానంద కాలనీ సమీపంలో 40 ఇళ్లను కూల్చి వేశారు. బాధితులు లబోదిబోమంటూ ఆర్తనాదాలు చేసినా అధికారులు పెడచెవిన పెట్టి ఇళ్లను పూర్తిగా నేలమట్టం చేశారు. దళిత సామాజిక వర్గానికి చెందిన ఇళ్లు లేని నిరుపేదలు ఏడాది కిందట రేణిగుంటలో రెవెన్యూ అధికారుల అనుమతులతో రేకుల ఇళ్లను నిర్మించుకుని విద్యుత్ కనెక్షన్ తీసుకుని నివాసం ఉంటున్నారు. బుధవారం రేణిగుంట సీబీఐడీ కాలనీలోని కొన్ని ఇళ్లను ఎంపీడీవో విష్ణుచిరంజీవి వెళ్లి జేసీబీ సాయంతో తొలగించారు. స్థానికులు అడ్డు చెప్పడంతో తిరిగి వెళ్లిపోయారు. అయితే గురువారం ఉదయం భారీగా పోలీసు బలగాలతో రేణిగుంట తహసీల్దార్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కూల్చివేత సాగింది. కళ్లెదుటే ఇల్లు కూల్చి వేయడంతో ఓ మహిళ సొమ్మసిల్లి పడిపోయింది. దళితులంటే అంత చులకనా? అని బాధిత మహిళలు తహసీల్దార్ నాగేశ్వరరావును నిలదీశారు. ఈ ఇళ్లు అక్రమ నిర్మాణాలైతే అనుభవ ధ్రువీకరణ పత్రాలు, ఎన్‌వోసీ, ఇంటి పన్నులను రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షల నుంచి రూ.2.50 లక్షలు ఖర్చు చేశామని కన్నీటిపర్యంతమయ్యారు. ఇళ్లు నిర్మిస్తున్నప్పుడు ఇటువైపు కన్నెత్తి చూడని అధికారులు.. ప్రభుత్వం మారగానే, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాలతో దళితుల ఇళ్లను ఇలా కూల్చేయడం దుర్మార్గం అని మండిపడ్డారు.


రేణిగుంటలో పేదల ఇల్లు కూల్చివేస్తున్న దృశ్యం


లబ్ధిదారు నుంచి ఇంటి పన్ను వసూలు చేసుకుని పంచాయతీ అధికారులు ఇచ్చిన రసీదు

పేద దళితులపై ఎందుకింత పగ?

ఇళ్లులేని పేద దళితులు కట్టుకున్న చిన్నపాటి రేకుల ఇళ్లను దౌర్జన్యంగా కూల్చేయడం బాధాకరం. నేను అడ్డుకుంటానని భావించి మా ఇంటి వద్దకు పోలీసులను పంపి నన్ను హౌస్ అరెస్ట్ చేశారు. మీకిది తగునా? పెత్తందార్ల ఇళ్ల జోలికి వెళ్లగలరా? ఇలాంటి ఆకృత్యాలు చేసేందుకా ప్రజలు మీకు అధికారాన్ని ఇచ్చింది? దళితులపై మీకు ఎందుకింత పగ?

– ఆనందరావు, ఎంపీటీసీ సభ్యుడు, తూకివాకం, రేణిగుంట మండలం


రేణిగుంటలో కూల్చి వేసిన పేదల ఇళ్లు


అధికారులు ఇచ్చిన అనుభవ ధ్రువీకరణ పత్రం

ఇళ్ల కూల్చివేత దుర్మార్గం

రేణిగుంట వివేకానంద కాలనీలో పేదలు, దళితులు నిర్మించుకున్న ఇళ్లను టీడీపీ నాయకుల ఆదేశాలతో అధికారులు కూల్చి వేయడం దుర్మార్గం. ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించి ఉంటే ఆ ఇళ్లకు అనుభవ ధ్రువీకరణ పత్రం, విద్యుత్ కనెక్షన్లు ఎలా ఇచ్చారు? ఇంటి పన్నులు ఎలా వసూలు చేశారు? స్థలాలకు సంబంధించి సర్టిఫికెట్లు జారీ చేసిన అధికారులపైనా విచారించి చర్యలు తీసుకోవాలి. కరకంబాడి ఎర్రగుట్ట వివాదాస్పద భూమిని సిద్ధల రవి అనే వ్యక్తి ఆక్రమించుకుని పెద్ద ఎత్తున గ్రావెల్ తోలుకుంటుండటం మీకు కనిపించలేదా?

– హరినాథ్, సీపీఎం మండల కార్యదర్శి, రేణిగుంట

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
శుక్రవారం ॥ 21-6-2024









ఫ్యాషన్

యోగా చేయడానికి సౌకర్యవంతమైన ప్రదేశం మాత్రమే కాదు
అనువైన దుస్తులు ఉండటం కూడా అవసరం.
నవతరం అభిరుచికి తగినట్టు ఇటీవల యోగా వేర్ కొత్తగా రూపుదిద్దుకుంటోంది.
ముఖ్యంగా నేతన్నలు చరఖాతో దారం వడికి
మగ్గంపై నేసిన కాటన్‌తో తయారైన యోగా వేర్‌కి డిమాండ్ పెరుగుతోంది.
మేనికి హాయిగొలిపేలా సౌకర్యంగా, వదులుగా ఉండే దుస్తుల డిజైన్లే యోగా వేర్‌లో కీలకమైన అంశాలు.
యోగా డే సందర్భంగా సౌకర్యవంతమైన హంగులను
మనమూ సొంతం చేసుకుందాం..

యోగా... మరింత సౌకర్యంగా!





కాటన్ స్మోక్డ్ వెయిస్ట్ క్రాప్ టాప్ బాటమ్‌గా బ్లాక్ హారమ్ ప్యాంట్ ధరించడంతో క్రీడాకారిణి లుక్ వచ్చేస్తుంది.

• • •

ఆర్గానిక్ కాటన్‌తో డిజైన్ చేసిన ప్రింటెడ్ క్రాప్ టాప్, హారమ్ ప్యాంట్ ఇది.

• • •

మిడ్ లెంగ్త్ స్లీవ్స్ కాటన్ టాప్, సైడ్ పాకెట్స్ ఉన్న కాటన్ ప్యాంట్‌తో యోగా కదలికలలో సౌకర్యంగా ఉంటుంది.

• • •

కాటన్ షార్ట్ కుర్తీ లేదా క్రాప్ టాప్స్‌ని ధోతీ ప్యాంట్‌తో జత చేస్తే యోగ సాధనలో సౌకర్యవంతమైన సంప్రదాయ శైలి కనిపిస్తుంది.

• • •

కాటన్ బెల్టెడ్ టాప్‌కి, పెన్సిల్ కట్ ప్యాంట్ యోగావేర్‌లో స్మార్ట్ లుక్‌తో ఆకట్టుకుంటుంది.

• • •

యోగా వేర్‌లో జంప్‌సూట్ డిజైన్స్ సౌకర్యాన్ని ఇస్తాయి.

పర్యావరణ స్పృహ, వ్యక్తిగత శైలి, సౌకర్యం.. వీటిని దృష్టిలో పెట్టుకుని యోగా డ్రెస్ డిజైన్స్‌ని మెరుగుపరచవచ్చు.
● యోగా సాధనలో సౌకర్యవంతంగా, పర్యావరణ స్పృహని కలిగించే సంప్రదాయ యోగా డ్రెస్సులను ఎంచుకోవచ్చు. వీటికి ఆధునిక డిజైన్స్‌నీ కలపవచ్చు. ● లేత రంగులు, ప్లెయిన్‌గా ఉండే చేనేత వస్త్రాలు యోగా చేయడానికి సౌకర్యంతోపాటు హుందాతనాన్నీ పరిచయం చేస్తాయి. ● నడుము దగ్గర కాటన్ బెల్ట్, కాలి మడమల దగ్గర ప్రత్యేకమైన డిజైన్‌ని జోడించడం ద్వారా యోగా డ్రెస్సులను ఆకర్షణీయంగా మార్చేయవచ్చు. ● యోగాలో సౌకర్యం చాలా ముఖ్యమైనది. శ్వాసక్రియకు పర్యావరణ అనుకూలమైన దుస్తులను ఎంచుకుంటే ఫ్యాషన్‌గానే కనిపిస్తాం. శరీర కదలికలకు తగినట్టు డ్రెస్ కూడా ఉండాలి. మన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా సహజ రంగులను ఉంచుకోవాలి. ● స్టైల్‌గా ఉండాలనుకుంటే హై వెయిస్టెడ్ ప్యాంట్స్, ర్యాప్‌టాప్‌ల వంటివి మార్కెట్లో లభిస్తున్నాయి.
● హైవెయిస్ట్ లెగ్గింగ్స్, క్రాప్‌టాప్స్, స్పోర్ట్స్ బ్రాలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. ● హెయిర్ హెడ్ బ్యాండ్స్, సన్నని బ్రాస్‌లెట్స్, స్టడ్స్ లేదా చెవి పోగులు వంటి తేలికైన ఆభరణాలను ధరించాలి.
● పార్క్ లేదా యోగా క్లాసులకు వెళ్లేటప్పుడు వెంట ఆర్గానిక్ కాటన్ లేదా రీ సైకిల్ చేసిన బ్యాగ్‌లో యోగాకు ఉపయోగించే మ్యాట్‌ను, వాటర్ బాటిల్‌నూ వెంట తీసుకెళ్లవచ్చు. ● యోగా ప్రయోజనాన్ని ఆనంద దాయకంగా మార్చుకోవాలంటే మాత్రం మీ అభ్యాసమే ముఖ్యమైనది.

వంటిల్లు

బాదం! నానబెట్టండి... బాణలి పెట్టండి!!

బాదం ఆరోగ్యానికి మంచిది.
నిజమే... రోజూ పది బాదం పప్పులు తినాలి.
అదీ నిజమే... కానీ మర్చిపోతుంటాం.
బాదం ఖీర్... బాదం మిల్క్ తాగడమూ మంచిదే.
రోజూ తియ్యగా తాగలేం. మరేం చేద్దాం?
బాదం రుచిని కొంచెం కారంగా ఎంజాయ్ చేస్తే! చాలా బాగుంటుంది.
ఒక మసాలా కర్రీ... ఓ సీఖా...మరో టిక్కా!
మన వంటింట్లో ఈ వారం ఇలా ట్రై చేద్దాం.
'బాదం ధర తెలుసా' అని అడక్కండి. మటన్ ధర కంటే తక్కువే.
పైగా మనం వీటికోసం వాడేది కిలోల్లో కాదు... గ్రాముల్లోనే.



నద్రు ఔర్ బాదం కీ సీఖా

కావలసినవి: బాదం పప్పులు– 80 గ్రాములు (పలుచగా తరగాలి); తామర తూడు – 300 గ్రాములు; పచ్చిమిర్చి – 4; అల్లం – 5 గ్రాములు; వెల్లుల్లి – 10 గ్రాములు; శనగపిండి – 30 గ్రాములు; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; బంగాళదుంప– 1 (మీడియం సైజు); చీజ్ – 50 గ్రాములు (తురమాలి); యాలకుల పొడి – పావు టీ స్పూన్; జాపత్రి – పావు టీ స్పూన్ ; ఉల్లిపాయలు – 2 (తరగాలి) ; కోవా – టేబుల్ స్పూన్ ; కుంకుమ పువ్వు – ఆరు రేకలు; నూనె – 2 టేబుల్ స్పూన్‌లు

తయారీ: ● తామర తూడును శుభ్రంగా కడిగి తరిగి మరుగుతున్న నీటిలో వేసి నాలుగైదు నిమిషాల తర్వాత తీసి నీరు కారిపోయేటట్లు చిల్లుల పాత్రలో వేసి పక్కన పెట్టాలి ● బంగాళదుంపను ఉడికించి పొట్టు వలిచి, చిదిమి పక్కన పెట్టాలి ● కుంకుమ పువ్వును పావు కప్పు గోరువెచ్చటి నీటిలో నానబెట్టాలి ● అల్లం, వెల్లుల్లిని సన్నగా తరిగి పక్కన పెట్టాలి ● శనగపిండి నూనె లేని బాణలిలో పచ్చి వాసన పోయే వరకు వేయించి పక్కన పెట్టాలి ● ఇప్పుడు బాణలిలో టేబుల్ స్పూన్ నూనె వేసి తామర తూడులను గోధుమరంగులోకి వచ్చే వరకు వేయించి పక్కన పెట్టాలి ● ఒక పాత్రలో చీజ్ తురుము, ఉడికించిన బంగాళదుంప, ఉప్పు, యాలకుల పొడి, జాపత్రి పొడి, అల్లం ముక్కలు, వెల్లుల్లి ముక్కలు, శనగపిండి, కుంకుమ పువ్వు కలిపిన నీటిని వేయాలి. బంగాళదుంప, కోవా, ఉల్లిపాయ ముక్కలు వేయాలి ● తామర తూడు ముక్కలు చల్లారిన తర్వాత మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేసి పై దినుసులున్న పాత్రలో వేసి అన్నీ సమంగా కలిసేటట్లు ముద్దగా కలపాలి ● ఈ మిశ్రమాన్ని పెద్ద గోళీలుగా చేసుకుని అరచేతిలో వేసి పొడవుగా చేయాలి. మనకు కావల్సిన సైజులో కబాబ్‌లుగా కట్ చేసుకోవాలి ● బాదం పలుకులను ఒక ప్లేట్‌లో వేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలి. ఒక్కో కబాబ్‌ని బాదం పలుకులలో అద్ది పక్కన పెట్టాలి. ఇలా అంతటినీ చేసుకోవాలి ● పైన తామర తూడు వేయించిన బాణలిలోనే మరో టేబుల్ స్పూన్ నూనె వేడి చేసి ఒక్కో కబాబ్‌ని పెట్టి మీడియం కంటే తక్కువ మంట మీద ఉంచాలి. కొంతసేపటికి కబాబ్ ఒకవైపు కాలి గోధుమరంగులోకి మారుతుంది. అప్పుడు జాగ్రత్తగా తిప్పుతూ అన్నివైపులా దోరగా కాలేవరకు ఉంచాలి. ఇలాగే అన్నింటినీ కాల్చుకోవాలి. వీటికి పుదీన చట్నీ మంచి కాంబినేషన్.



చనా మసాలా ఆల్మండ్

కావలసినవి: బాదం పప్పులు– 50 గ్రాములు (నానబెట్టి పొట్టు తీయాలి); ఉల్లిపాయ –1 (తరగాలి); అల్లం – అంగుళం ముక్క (సన్నగా తరగాలి); పచ్చిమిర్చి తరుగు – టీ స్పూన్; ఆలివ్ ఆయిల్ – టేబుల్ స్పూన్; దాల్చిన చెక్క – అర అంగుళం ముక్క ; చనా మసాలా – టేబుల్ స్పూన్ ; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి.

తయారీ: ● బాణలిలో నూనె వేడి చేసి ఉల్లిపాయ ముక్కలు, అల్లం, పచ్చిమిర్చి వేయాలి. అవి వేగేటప్పుడు దాల్చిన చెక్క, చనా మసాలా, ఉప్పు వేసి కలుపుతూ వేయించాలి. చివరగా బాదంపప్పులు వేసి కలిపి వేడెక్కి వేగుతుండగా స్టవ్ ఆపేయాలి. ఇది రోటీలోకి రుచిగా ఉంటుంది. గ్రేవీ కావాలంటే చివరగా అర కప్పు నీటిని పోసి, చిటికెడు ఉప్పు కలపాలి. కూర ఉడకడం మొదలైన తర్వాత చిక్కదనం చూసుకుని దించేయాలి.





పనీర్ బాదమ్ టిక్కీ

కావలసినవి: పనీర్– 2 కప్పులు;బాదం పలుకులు – అర కప్పు; ఉడికించిన బంగాళదుంప – అర కప్పు ; నూనె– 2 టేబుల్ స్పూన్‌లు ; జీలకర్ర– టీ స్పూన్ ; పచ్చిమిర్చి తరుగు – 2 టీ స్పూన్‌లు ; అల్లం తరుగు – 2 టీ స్పూన్‌లు ; పసుపు – అర టీ స్పూన్; మిరప్పొడి– అర టీ స్పూన్ ; కొత్తిమీర తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు ; కార్న్‌ఫ్లోర్ – టేబుల్ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్

తయారీ: ● పనీర్‌ను ఒక పాత్రలో వేసి పొడిపొడిగా చిదమాలి. ఇందులో ఉడికించిన బంగాళదుంప ముక్కలు వేసి సమంగా కలిసేటట్లు చిదమాలి ● బాణలిలో టీ స్పూన్ నూనె వేసి అందులో జీలకర్ర, అల్లం, పచ్చిమిర్చి ముక్కలు, పసుపు వేసి వేగిన తర్వాత పైన పనీర్, బంగాళదుంప మిశ్రమంలో వేయాలి. అదే బాణలిలో మిగిలిన నూనెలో మిరప్పొడి, ఉప్పు వేసి వేడెక్కిన తర్వాత స్టవ్ ఆపేయాలి. వేడి తగ్గిన తర్వాత అందులో మొక్కజొన్న పిండి, కొత్తిమీర తరుగు వేయాలి. ఇందులో పనీర్ మిశ్రమాన్ని వేసి కలపాలి. ఈ మొత్తం మిశ్రమాన్ని పెద్ద గోళీలుగా చేసుకుని అరచేతిలో వేసి ఫొటోలో కనిపిస్తున్నట్లు ప్యాటీలుగా వత్తాలి. వత్తిన ప్యాటీలను బాదం పలుకులున్న ప్లేట్‌లో అద్దాలి ● అడుగు వెడల్పుగా ఉన్న బాణలిలో మిగిలిన నూనె వేడి చేసి ఒక్కో ప్యాటీని ఒకదాని పక్కన ఒకటిగా అమర్చాలి. ఒకవైపు కాలిన తర్వాత జాగ్రత్తగా తిరగేసి రెండవ వైపు కూడా కాలనివ్వాలి. లోపల చక్కగా ఉడికి పైన కరకరలాడుతూ రుచిగా ఉంటాయి. వీటిని వేడిగా ఉండగానే కెచప్ లేదా సాస్‌తో తింటే చాలా రుచిగా ఉంటాయి.

న్యూస్ మేకర్

వచ్చే నెలలో పారిస్ ఒలింపిక్స్.
అన్ని దేశాల ఆటగాళ్లే కాదు
మీడియా ఫొటోగ్రాఫర్లు కూడా
కెమెరాలతో బయలుదేరుతారు.
కాని 'ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ' (ఐ.ఓ.సి)
గుర్తింపు పొందిన వారికే
అన్ని మైదానాల్లో ప్రవేశం.
అలాంటి అరుదైన గుర్తింపును పొందిన
మొదటి భారతీయ మహిళా ఫొటోగ్రాఫర్
గీతికా తాలూక్‌దార్.
అస్సాంకు చెందిన స్పోర్ట్స్ ఫొటోగ్రాఫర్
గీతికా తాలూక్‌దార్ పరిచయం.



గీతికా తాలూక్‌దార్

పారిస్ ఒలింపిక్స్‌కు మన ఫొటోగ్రాఫర్

'స్పోర్ట్స్ ఫొటోగ్రాఫర్‌గా కెరీర్‌ని ఎంచుకోవడానికి స్త్రీలు పెద్దగా ముందుకు రారు. ఎందుకంటే అది మగవాళ్ల రంగం చాలా రోజులుగా. అక్కడ చాలా సవాళ్లు ఉంటాయి. నేను వాటన్నింటినీ అధిగమించి ఇవాళ గొప్ప గుర్తింపు పొందగలిగాను' అని సంతోషం వ్యక్తం చేసింది గీతికా తాలూక్‌దార్. జూలై 26 నుంచి ఆగస్టు 11 వరకూ పారిస్‌లో జరగనున్న ఒలింపిక్స్ పోటీల్లో ఫొటోలు తీయడానికి ఆమెకు అక్రిడిటేషన్ లభించింది. ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటి (ఐ.ఓ.సి) చాలా తక్కువ మంది ఫొటోగ్రాఫర్లకు మాత్రమే ఒలింపిక్స్‌ను కవర్ చేసే అధికారిక గుర్తింపు ఇస్తుంది. ఈసారి ప్రపంచవ్యాప్తంగా అతి కొద్దిమంది మహిళా స్పోర్ట్స్ ఫొటోగ్రాఫర్లు ఈ గుర్తింపు పొందితే మన దేశం నుంచి మొదటి, ఏకైక మహిళా స్పోర్ట్స్ ఫొటోగ్రాఫర్‌గా గీతికా తాలూక్‌దార్ చరిత్ర సృష్టించింది.

ఫ్రీ లాన్సర్‌గా...

'స్పోర్ట్స్ ఫొటోగ్రాఫర్ అంటే విస్తృతంగా పర్యటించాలి. సంస్థలో ఉద్యోగిగా ఉన్నప్పుడు సంస్థలు ఒక్కోసారి అనుమతిస్తాయి, మరో సారి అనుమతించవు. అందుకని నేను ఫ్రీలాన్సర్‌గా మారాను. స్వేచ్ఛ పొందాను. నా సేవలు కావాల్సిన సంస్థలు నన్ను సంప్రదిస్తాయి' అంది గీతిక. ఫ్రీ లాన్సర్‌గా ఉంటూనే ఆమె ఇంకా చదువు కొనసాగించింది. కొలంబోలో డిప్లమా కోర్సు చేసింది. అలాగే సౌత్ కొరియా స్పోర్ట్స్ మినిస్ట్రీ వారి స్కాలర్‌షిప్ పొంది సియోల్ నేషనల్ యూనివర్సిటీ నుంచి స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసింది. 'కొలంబోలో చదువుకునే సమయంలో సర్ రిచర్డ్ హ్యాడ్లీని ఇంటర్వ్యూ చేయడం గొప్ప అనుభవం. అక్కడ ఆయన పేద పిల్లలకు క్రికెట్ నేర్పేందుకు అకాడెమీ నిర్వహిస్తున్నారు. నేను వెళ్లిన రోజు బాల్ ఎలా విసరాలో నేర్పుతున్నారు. నేను ఇంటర్వ్యూ అడిగితే ఇచ్చారు' అని చెప్పింది గీతిక.

'టీ సిటీ' అమ్మాయి

అస్సాంలోని డూమ్‌డుమా పట్టణాన్ని అందరూ 'టీ సిటీ' అని పిలుస్తారు. ఎందుకంటే అక్కడ తేయాకు తోటలు విస్తారం. హిందూస్తాన్ లీవర్ టీ ఎస్టేట్ అక్కడే ఉంది. ఆ ఊళ్లో చిన్న ఉద్యోగి కుమార్తె అయిన గీతిక చిన్నప్పటి నుంచి కెమెరాతో ప్రేమలో పడింది. అందుకు కారణం ఆమె మేనమామ చంద్ర తాలూక్‌దార్ ఫిల్మ్‌మేకర్‌గా గుర్తింపు పొందడం. అతను కెమెరాలో నుంచి చూస్తూ రకరకాల దృశ్యాలను అందంగా బంధించడాన్ని బాల్యంలో గమనించిన గీతిక తాను కూడా అలాగే చేయాలనుకుంది. పొలిటికల్ సైన్స్‌లో డిగ్రీ చేశాక మాస్ కమ్యూనికేషన్‌లో డిప్లొమా చేసింది. క్రీడలంటే ఆసక్తి ఉండటంతో స్పోర్ట్స్ జర్నలిస్ట్‌గా, ఫొటోగ్రాఫర్‌గా మారి 2005 నుంచి డీఎన్‌ఏ, జీజీసీ, ఇండియా టుడే, పీటీఐ వంటి సంస్థలతో పనిచేసింది.

కోవిడ్ రిస్క్ ఉన్నా...

ప్రపంచంలో ఎక్కడ భారీ క్రీడా వేడుకలు జరుగుతుంటే అక్కడ ప్రత్యక్షమవుతుంది గీతిక. ఆస్ట్రేలియా ఫీఫా విమెన్స్ వరల్డ్ కప్, ఖతార్‌లో జరిగిన ఫీఫా వరల్డ్ కప్ పోటీలను ఆమె కవర్ చేసింది. 2020 సియోల్ ఒలింపిక్స్‌కు కోవిడ్ కారణంగా చాలా మంది అక్రిడిటెడ్ ఫొటో జర్నలిస్టులు వెళ్లడానికి భయపడ్డారు. కాని అక్రిడిటేషన్ లేకున్నా గీతిక అక్కడకు వెళ్లి ప్రాణాలకు తెగించి ఫొటోలు తీసి గుర్తింపు పొందింది. తన వృత్తి పట్ల ఆమెకు ఉన్న ఈ అంకిత భావాన్నే ఒలింపిక్స్ కమిటీ గుర్తించింది. అందుకే ఈసారి అధికారికంగా ఆహ్వానం పలికింది. జూలై 23న పారిస్ బయలుదేరి వెళ్లనుంది గీతిక. 'గేమ్స్ వైడ్ ఓపెన్' అనేది ఈసారి ఒలింపిక్స్ థీమ్. మరిన్ని వర్గాలను కలుపుకుని ఈ క్రీడలు జరగాలనేది ఆశయం. తక్కువ గుర్తింపుకు నోచుకునే మహిళా స్పోర్ట్స్ ఫొటోగ్రాఫర్‌లను ప్రత్యేకంగా ఆహ్వానించడం కూడా ఈ ఆశయంలో భాగమే. 'నాకొచ్చిన అవకాశం నా ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. మరింత కష్టపడి పని చేస్తాను. స్పోర్ట్స్ ఫొటోగ్రాఫర్‌గా కెరీర్‌ను ఎంచుకోవాలనుకునే వారికి క్రమశిక్షణ అవసరం. అంతర్జాతీయ క్రీడాపోటీలు టైముకు మొదలయ్యి టైమ్‌కు ముగుస్తాయి. వాటిని అందుకోవాలంటే క్రీడల్లోని ఉత్తమ క్షణాలను కెమెరాలో బంధించాలంటే ఏకాగ్రత, క్రమశిక్షణ చాలా అవసరం. అవి ఉన్నవారు ఈ రంగంలో నిస్సందేహంగా రాణిస్తారు' అంటోంది గీతిక.

● టెక్.. టాక్

ఇన్‌ఫినిక్స్ నోట్ 40 ప్రో ప్లస్

డిస్‌ప్లే: 6.78 అంగుళాలు
రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్
రిజల్యూషన్: 1080×2436 పిక్సెల్స్
కనెక్టివిటీ: 5జీ
మెమోరీ: 256జీబి 12జీబి ర్యామ్
ఫ్రంట్ కెమెరా: 32 ఎంపీ
బ్యాటరీ: 4600 ఎంఏహెచ్
బరువు: 190 గ్రా.





స్క్రీన్ ఎక్స్‌పాండర్ అండ్ మాగ్నిఫైయర్

బ్రాండ్: పోట్రానిక్స్; మోడల్: పీవోఈఆర్–1899
ప్రొడక్ట్ డైమెన్షన్స్: 10×3×3 సీఎం 50గ్రా.
కంపెటబుల్ డివైజెస్: మానిటర్, ట్యాబ్, స్మార్ట్‌ఫోన్

ఆల్–ఇన్–వన్ స్క్రీన్ క్లీనర్



బ్రాండ్: సాన్స్ కలర్: బ్లాక్
మోడల్ నెంబర్: ఎస్‌సీఎంజీబీకె–బీకె5
బరువు: 200 గ్రా. స్పెషల్ ఫీచర్స్: పోర్టబుల్, నాన్–స్లిప్, స్ట్రెచబుల్, ఫోల్డబుల్ లెన్స్ మెటీరియల్: గ్లాస్

స్నాప్‌చాట్ లెన్స్ స్టూడియో



ఆగ్యుమెంటెడ్ రియాలిటీ(ఏఆర్) ఫీల్డ్‌లో తనదైన గుర్తింపు తెచ్చుకున్న ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్ 'స్నాప్‌చాట్' లేటెస్ట్ జెనరేటివ్ ఏఐ టెక్నాలజీని లాంచ్ చేసింది. ఇప్పుడు ఏఐ డెవలపర్‌లు ఏఐ–పవర్డ్ లెన్సెస్‌ను క్రియేట్ చేయవచ్చు. స్నాప్‌చాట్ యూజర్‌లు వాటిని తమ కంటెంట్‌లో ఉపయోగించవచ్చు.

డెవలపర్ ప్రోగ్రామ్ 'లెన్స్ స్టూడియో'కు సంబంధించిన అప్‌గ్రేడెడ్ వెర్షన్ గురించి ప్రకటించింది స్నాప్‌చాట్. దీనితో ఆర్టిస్ట్‌లు, డెవలపర్‌లు స్నాప్‌చాట్, వెబ్‌సైట్, యాప్స్ కోసం ఏఆర్ ఫీచర్‌లను క్రియేట్ చేయవచ్చు. ఏఆర్ ఎఫెక్ట్స్ క్రియేట్ చేయడానికి పట్టే సమయాన్ని వారాల నుంచి గంటలకు తగ్గిస్తుంది లెన్స్ స్టూడియో.

నేడు వరల్డ్ మ్యూజిక్ డే

యువర్స్

రాగాల రారాజు



తొలి ఆల్బమ్‌తోనే వేలాది అభిమానులను సంపాదించుకున్నాడు ఢిల్లీకి చెందిన అర్పణ్ కుమార్ చందేల్. మల్టీపుల్ సూపర్-హిట్ ఆల్బమ్‌లతో అభిమానుల చేత 'కింగ్' అనిపించుకున్నాడు. స్వరరచనలోనే కాదు పాటల రచనలోనూ భేష్ అనిపించుకున్నాడు. చిన్న వయసులోనే పెద్ద మ్యూజిక్ కంపెనీలతో కలిసి పని చేసిన 'కింగ్' 'ఫోర్బ్స్ 30 అండర్ 30 ఆసియా' జాబితాలో చోటు సంపాదించాడు....

పాపులర్ ర్యాప్ రియాలిటీ షో 'హసల్'తో తొలి గుర్తింపు పొందాడు అర్పణ్ కుమార్ చందేల్. 'టాప్ 5'లో ఒకరిగా చోటు సంపాదించాడు. ఆ తరువాత 'హసల్ 2.వో'లో స్క్వాడ్ బాస్‌గా మరింత పేరు తెచ్చుకున్నాడు.

'వివిధ రంగాలలో విజేతలుగా నిలిచిన వ్యక్తుల గురించి తెలుసుకోవడం నాకు ఇష్టం. వారి గురించి చదివినప్పుడల్లా ఎంతో ఉత్తేజకరంగా ఉంటుంది. ఎప్పటికప్పుడు కొత్త విషయాలు తెలుసుకోవడం అంటే నాకు ఇష్టం' అంటున్న అర్పణ్ ఢిల్లీలోని సాధారణ కుటుంబనేపథ్యం నుంచి వచ్చాడు.

మొదట్లో ఫుట్‌బాల్ ఆటను బాగా ఆడేవాడు. ఫుట్‌బాల్ ప్లేయర్‌గా పేరు తెచ్చుకోవాలనుకున్నాడు.

అయితే 'ఆట' నుంచి 'పాట' వైపు అతని మనసు మళ్లింది. సంగీతంపై ఆసక్తి అంతకంతకూ పెరగడం మొదలైంది. మ్యూజిక్ పట్ల తన ఆసక్తి, ప్రయోగాలకు యూట్యూబ్ వేదిక అయింది. పాటలు రాయడం మొదలు పెట్టాడు.

'చిన్నప్పటి నుంచి నాకు రకరకాల సందేహాలు ఉండేవి. ఆ సందేహాలు, నాలోని ఊహలతో పాటలు రాయడం మొదలుపెట్టాను' అంటాడు అర్పణ్. 'ది కార్నివాల్' 'షాంపైన్ టాక్' 'న్యూ లైఫ్'లాంటి బ్లాక్ బస్టర్ ఆల్బమ్‌లతో సంగీత ప్రపంచంలో సందడి చేసి 'కింగ్'గా పేరు తెచ్చుకున్నాడు అర్పణ్. 'మేరీ జాన్' పాట బిల్‌బోర్డ్ జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది.

ప్రేమ, భావోద్వేగాలు, జ్ఞాపకాలతో కూడిన ఈ పాట ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది శ్రోతలను ఆకట్టుకుంది. 'ప్రతి జెనరేషన్ కనెక్ట్ అయ్యేలా మేరీ జాన్ పాటను రూపొందించాను. ఈ పాటలోని ఒక వాక్యం....నీ నీడలా ఎప్పుడూ నీతో ఉంటాను అనేది యువతరానికి బాగా నచ్చింది' అంటాడు అర్పణ్.

చార్ట్‌బస్టర్ 'తూ ఆఖే దేఖ్‌లే' తనను సంగీతకారుడిగా మరో మెట్టు పైకి ఎక్కించింది.

'నేను చేసిన మంచి పని ఏమిటంటే నాలోని భావాలను కాగితంపై పెట్టడం. వాటికి బాణీ కట్టడం. నాకు తోచినది నేను రాస్తాను. అది శ్రోతలకు నచ్చింది. అందుకే వారు నన్ను కింగ్ అనిపిలుస్తున్నారు. తమ భావాలకు ప్రతినిధిగా చూస్తున్నారు' అంటాడు అర్పణ్.

అర్పణ్ సక్సెస్ మంత్రా ఏమిటి? ఆయన మాటల్లోనే... 'ఓపికగా ఎలా ఉండాలో, ఇతరులతో ఎలా వ్యవహరించాలో....ఇలా ఎన్నో విషయాలను నా ప్రయాణంలో నేర్చుకున్నాను. నేర్చుకున్నది ఏదీ వృథా పోదు'

నాన్–బాలీవుడ్ హిప్–హాప్ కింగ్‌గా పేరు తెచ్చుకున్న అర్పణ్ కుమార్ చందేల్ ఇప్పుడు బాలీవుడ్ పాటలతోనూ మంచి పేరు తెచ్చుకుంటున్నాడు.

సింపుల్‌గా స్పీడ్‌గా...

'సింపుల్‌గా ఉండాలి, అందరూ కనెక్ట్ అయ్యేలా ఉండాలి' అనుకొని పాట ప్రయాణం మొదలుపెడతాను. నా పాటలు శ్రోతలను ఆకట్టుకోవడానికి ఇదొక కారణం. ఈ పాట ఎవరి గురించో అనుకోవడం కంటే, ఈ పాట నా గురించే అనుకోవడంలో విజయం ఆధారపడి ఉంటుంది. పాట అనేది గాలిలో నుంచి పుట్టదు. దాని వెనుక ఏదో ఒక ప్రేరణ ఉంటుంది. నా పాటల నుంచి ఇతరులు స్ఫూర్తి పొందితే అంత కంటే కావల్సింది ఏముంది!

– అర్పణ్ కుమార్ చందేల్

● ఇన్నోవేషన్

పర్యావరణ హితం



తండ్రి సైన్యంలో పనిచేస్తుండడంతో ఆకాంక్ష ప్రియదర్శిని బాల్యం దేశంలోని ఎన్నో ప్రాంతాల్లో గడిచింది. పచ్చదనం అంటే చెప్పలేనంత ఇష్టం. రూర్కెలాలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బీటెక్ చేసిన ఆకాంక్షకు కాలుష్య సమస్య గురించి ఆందోళనగా ఉండేది. వాయు కాలుష్య ప్రభావంతో తన బంధువులు, కాలేజి స్నేహితులలో కొందరికి శ్వాసకోశ సమస్యలు రావడం ఆమెను కలవరపరిచింది. వాయు కాలుష్యంకు సంబంధించి ఆచరణాత్మక పరిష్కారాలను కనుగొనాలనే లక్ష్యంతో క్లైమెట్ టెక్ స్టార్టప్ 'ఆరాసుర్' ప్రారంభించింది. ఒడిషాలోని భువనేశ్వర్ కేంద్రంగా ఎన్విరాన్‌మెంటల్ కన్సల్టెంట్ 'ఆరాసుర్' ప్రయాణం మొదలైంది.

వైర్‌లెస్, సెన్సర్ ఆధారిత సాంకేతిక సహాయంతో ప్రభుత్వం, ప్రజలకు మధ్య ఉన్న సమాచార అంతరాన్ని తగ్గించడానికి కంపెనీ చురుగ్గా పనిచేస్తోంది. హైపర్ –లోకల్ ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ సిస్టమ్ అభివృద్ధి చేసింది. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన సందేహాలకు సమాధానం చెప్పడానికి మా హార్డ్‌వేర్ పరికరాల నుంచి సేకరించిన డేటా ఉపయోగపడుతుంది. ఖర్చులు ఎలా తగ్గించుకోవాలి, రెవెన్యూ ఎలా జెనరేట్ చేయాలి....అనే విషయాలకంటే పర్యావరణ విషయాలకే ప్రాధాన్యత ఇచ్చాం' అంటుంది ఆకాంక్ష. హార్డ్‌వేర్ డిజైనింగ్, సప్లైచైన్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్, ఇన్‌స్టాలేషన్...మొదలైన వాటిలో ప్రావీణ్యం సాధించిన ఆకాంక్ష 'మల్టీటాలెంటెడ్'గా గుర్తింపు పొందింది.

● గేమింగ్

ఎవరు వారు ఎచటి వారు... తప్పదిక వార్




డెస్టిని 2 ఫ్రీ–టు–ప్లే ఫస్ట్ పర్సన్ షూటర్ వీడియో గేమ్. పౌరాణిక, సైన్స్ ఫిక్షన్ జానర్‌లో రూపొందించిన గేమ్ ఇది. ఒరిజినల్ మాదిరిగానే ఈ గేమ్‌లోని మూమెంట్స్ ప్లేయర్స్ వర్సెస్ ఎన్విరాన్‌మెంట్(పివిఇ), ప్లేయర్ వర్సెస్ ప్లేయర్(పివిపి)గా విభజించబడి ఉంటాయి. 'పివిఇ'లో ఆరు–ప్లేయర్ రైడ్స్ ఉంటాయి.

ప్రతి గమ్యస్థానానికి పెట్రోలింగ్ మోడ్ అందుబాటులో ఉంది. వివిధ గ్రహాంతరవాసుల నుండి మానవ జాతిని రక్షించడానికి ప్లేయర్స్ 'గార్డియన్' పాత్రను పోషించాల్సి ఉంటుంది.

సిరీస్: డెస్టిని ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 4, ఎక్స్‌బాక్స్ వన్, విండోస్, స్టాడియా. ప్లేస్టేషన్ 5, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్ జానర్స్: ఫస్ట్–పర్సన్ షూటర్, ఎంఎంవోజీ మోడ్: మల్టీ ప్లేయర్

సినిమా

ఆట కాదు సుమా!


● రామ్‌చరణ్

క్రీడాకారుడి పాత్ర చేయడం అంటే ఆట కాదు సుమా అనాలి. ఎందుకంటే ఆ క్రీడ మీద ఎంతో కొంత అవగాహన సంపాదించాలి. అలాగే ఆ క్రీడకు తగ్గట్టుగా శరీరాకృతిని మార్చుకోవాలి. రామ్‌చరణ్ త్వరలో ఈ పని మీదే బిజీ కానున్నారు. బుచ్చిబాబు సన (ఆర్‌సీ 16) దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో చరణ్ కబడ్డీ ప్లేయర్‌గా కనిపించనున్నారని... కాదు రన్నర్‌గా కనిపిస్తారనే వార్తలు ప్రచారంలో ఉన్నాయి. ఏది ఏమైనా క్రీడాకారుడి పాత్రలో కనిపించడం ఖాయం. ఇందుకోసం రామ్‌చరణ్ కండలు పెంచాలనుకుంటున్నారట. ఈ మేకోవర్ కోసం ఆస్ట్రేలియా వెళతారని సమాచారం. అక్కడ దాదాపు రెండు నెలలు శిక్షణ తీసుకుంటారని భోగట్టా. ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ 'గేమ్ చేంజర్' చిత్రంలో నటిస్తున్నారు. వీలైనంత త్వరగా ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసి, ఆస్ట్రేలియా ప్రయాణమవుతారని తెలిసింది. ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ పూర్తయిన 'ఆర్‌సీ 16' షూటింగ్‌ని సెప్టెంబర్ లేదా అక్టోబరులో ఆరంభించేలా యూనిట్ ప్లాన్ చేస్తోందని టాక్. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించనున్నారు.

మాస్ యాక్షన్ షురూ


● రెజీనా, సన్నీ డియోల్, సయామీ ఖేర్


బాలీవుడ్ హీరో సన్నీ డియోల్, టాలీవుడ్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో ఓ హిందీ సినిమాకి శ్రీకారం జరిగింది. 'ఎస్‌డీజీఎమ్' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో సయామీ ఖేర్, రెజీనా కసాండ్రా కీలక పాత్రధారులు. మైత్రీ మూవీ మేకర్స్‌పై వై. రవిశంకర్, నవీన్ యెర్నేని, పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ తొలి స్ట్రయిట్ హిందీ సినిమా గురువారం హైదరాబాద్‌లో ప్రారంభోత్సవం జరుపుకుంది. ''మ్యాసివ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రం ఇది. 'క్రాక్, వీరసింహా రెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్‌లను అందించిన గోపీచంద్ మలినేని అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ కూడిన స్క్రిప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. గోపీచంద్ కెరీర్‌లో తొలి హిందీ మూవీ ఇది. మునుపెన్నడూ చూడని యాక్షన్ అవతార్‌లో సన్నీ డియోల్‌ని చూపించనున్నారు. రేపు రెగ్యులర్ షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: తమన్ .ఎస్, కెమెరా: రిషి పంజాబీ.


● నాగ చైతన్య

శ్రీకాకుళంలో తండేల్

శ్రీకాకుళంలో ల్యాండ్ అయింది 'తండేల్' టీమ్. నాగ చైతన్య హీరోగా నటిస్తున్న చిత్రం 'తండేల్'. 'లవ్‌స్టోరీ' (2021) చిత్రం తర్వాత నాగచైతన్యతో ఈ సినిమా కోసం మళ్లీ జోడీ కట్టారు సాయి పల్లవి. 'ప్రేమమ్' (2016), 'సవ్యసాచి' (2018) చిత్రాల తర్వాత నాగచైతన్యతో దర్శకుడు చందు మొండేటి తెరకెక్కిస్తున్న చిత్రం ఇది. 2018లో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ సెమీ పీరియాడికల్ ఫిల్మ్‌లో జాలరి రాజు పాత్రలో నాగ చైతన్య, సత్య పాత్రలో సాయి పల్లవి కనిపిస్తారు. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మిస్తున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ శ్రీకాకుళంలో ఆరంభం అయింది. ఈ షెడ్యూల్‌లో నాగ చైతన్య, సాయి పల్లవిపై లవ్, ఎమోషనల్ సీన్స్ చిత్రీకరించనున్నారు. ఈ సినిమాను ఈ ఏడాది డిసెంబరులో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారట. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

హైదరాబాద్‌లో మట్కా


● వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న తాజా పాన్ ఇండియన్ మూవీ 'మట్కా'. కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నోరా ఫతేహి, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. డా. విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్న ఈ మూవీ తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ''మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. దేశమంతటా సంచలనం సృష్టించిన ఓ నిజ జీవిత ఘటన స్ఫూర్తితో ఈ మూవీ తెరకెక్కుతోంది. ఇందులో వినోదంతో పాటు నిజ జీవితంలోని ఘటనలు, హ్యూమన్ ఎమోషన్స్ చాలా అద్భుతంగా ఉంటాయి. 'మట్కా'లో నాలుగు వైవిధ్యమైన పాత్రల్లో కనిపిస్తారు వరుణ్ తేజ్. నలభై రోజుల పాటు జరగనున్న ఈ ముఖ్యమైన షెడ్యూల్ కోసం హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో ప్రత్యేక సెట్ నిర్మించాం. ఇందులో పలు కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తాం. ప్రస్తుతం వరుణ్, నోరా, మీనాక్షీలపై సన్నివేశాలు తీస్తున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. నవీన్ చంద్ర, అజయ్ ఘోష్, కన్నడ కిశోర్, రవీంద్ర విజయ్, పి. రవిశంకర్ నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, కెమెరా: ఎ. కిశోర్ కుమార్.

థ్రిల్లింగ్ కానిస్టేబుల్


● వరుణ్ సందేశ్

వరుణ్ సందేశ్ హీరోగా రూపొందుతున్న 'ది కానిస్టేబుల్' సినిమా షూటింగ్ పూర్తయింది. ఆర్యన్ సుభాన్ ఎస్‌కే దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ద్వారా మధులిక వారణాసి హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. 'బలగం' జగదీష్ నిర్మాత. హైదరాబాద్‌లో ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ– ''కానిస్టేబుల్ పాత్రలో నటించడం కొత్తగా ఉంది. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉన్న ఈ మూవీతో త్వరలో ప్రేక్షకుల ముందుకు వస్తాను'' అన్నారు. ''సస్పెన్స్, క్రైమ్ థ్రిల్లర్ చిత్రమిది. వరుణ్ సందేశ్ నట విశ్వరూపం ఈ సినిమాలో చూస్తారు'' అన్నారు ఆర్యన్ సుభాన్ ఎస్‌కే. ''కానిస్టేబుల్ పాత్రలో వరుణ్ సందేశ్ ఆకట్టుకుంటారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి'' అన్నారు 'బలగం' జగదీష్.

సస్పెన్స్... థ్రిల్


● శ్రీకాంత్, ప్రవీణ్

ప్రవీణ్ కేవీ దర్శకత్వం వహించి, హీరోగా నటించిన చిత్రం 'మహిష'. పృథ్వీ, యశిక, వైష్ణవి, కపిల్, మౌనిక, దీపు ఇతర పాత్రల్లో నటించారు. స్క్రీన్ ప్లే పిక్చర్స్‌పై రూపొందిన ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ జరుపుకుంటోంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను నటుడు శ్రీకాంత్, నిర్మాత రామకృష్ణ గౌడ్ రిలీజ్ చేశారు. ''మహిష' కాన్సెప్ట్ కొత్తగా ఉంది. ప్రేక్షకులు ఇలాంటి చిత్రాలను ఆదరిస్తారు'' అన్నారు శ్రీకాంత్. ''మంచి సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది. బలమైన కథతో ఈ చిత్రం సాగుతుంది. శ్రీ వెంకట్ అద్భుతమైన సంగీతం ఇచ్చారు. భార్గవీ పిళ్ళై, గీతా మాధురి, సాయి చరణ్ పాడిన పాటల్ని శ్రోతలు ఇష్టపడతారు'' అన్నారు ప్రవీణ్ కేవీ.


● ప్రియాంకా చోప్రా

గాయాలు తప్పవు

''వృత్తిపరమైన గాయాలను తప్పించుకోలేం. ముఖ్యంగా యాక్షన్ సినిమాలు చేస్తున్నప్పుడు గాయాలు తప్పవు'' అంటున్నారు ప్రియాంకా చోప్రా. ప్రస్తుతం ఆమె హాలీవుడ్ చిత్రం 'ది బ్లఫ్'లో నటిస్తున్నారు. ఫ్రాంక్ ఇ. ఫ్లవర్స్ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ యాక్షన్ మూవీ షూటింగ్ ఇటీవల ఆస్ట్రేలియాలో ఆరంభమైంది. ఈ చిత్రం కోసం ప్రియాంకా చోప్రా పాల్గొనగా పోరాట సన్నివేశాలు చిత్రీకరిస్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. ఆమె పెదవి, ముక్కు, మెడకు గాయాలు అయ్యాయి. ఆ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసి, 'ప్రొఫెషనల్ లైఫ్‌లో జరిగే ప్రమాదాలు' అంటూ వీడియో పోస్ట్ చేశారు ప్రియాంక. ఇక గాయాలు కాగానే షూటింగ్ ఆపేసి, ఆమెను సిడ్నీలోని ఆస్పత్రికి తీసుకెళ్లిందట యూనిట్. అక్కడ చికిత్స చేయించుకుని, విశ్రాంతి తీసుకుంటున్నారట ప్రియాంకా చోప్రా.

రాయలసీమ ప్రేమకథ


● శశికా, ప్రవీణ్

ప్రవీణ్ రాజ్‌కుమార్, శశికా టిక్కో, 'బిగ్ బాస్' ఫేమ్ అషు రెడ్డి లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'పద్మవ్యూహంలో చక్రధారి'. సంజయ్ రెడ్డి బంగారపు దర్శకత్వంలో కేఓ రామరాజు నిర్మించిన ఈ చిత్రం నేడు రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో చిత్ర దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ''రాయలసీమ నేపథ్యంలో వస్తున్న యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్ చిత్రం 'పద్మవ్యూహంలో చక్రధారి'. హీరో విశ్వక్ సేన్‌గారు విడుదల చేసిన మా మూవీ ట్రైలర్‌తో సినిమాపై మంచి బజ్ క్రియేట్ అయింది. ఈ మూవీని ప్రేక్షకులు ఆదరించి మా యూనిట్‌కి విజయం అందించాలి'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: వినోద్ యాజమాన్య, కెమెరా: జి. అమర్.

రాజమౌళిగారు నాకు జీవితం ఇచ్చారు

– దేవ్ గిల్


● చిత్రా శుక్లా, దేవ్ గిల్

''నా స్వస్థలం పుణే. ముంబైలో ఉన్న నన్ను 'మగధీర' మూవీ కోసం రాజమౌళిగారు హైదరాబాద్‌కి తీసుకొచ్చి, నాకు జీవితం ఇచ్చారు. రాజమౌళి, రమా రాజమౌళిగార్ల వల్లే ఈ రోజు 'అహో విక్రమార్క'లో హీరోగా నటించి, నిర్మించగలిగాను. ఇందుకు నాకు ఆనందంగా ఉంది'' అని దేవ్ గిల్ అన్నారు. 'మగధీర' చిత్రంలో రామ్‌చరణ్‌కి ప్రతినాయకుడిగా నటించిన దేవ్ గిల్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడే. ఆయన హీరోగా పేట త్రికోటి దర్శకత్వం వహించిన చిత్రం 'అహో విక్రమార్క'. దేవ్ గిల్ ప్రొడక్షన్స్‌పై దేవ్ గిల్ భార్య ఆర్తి ఈ మూవీ నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ను హైదరాబాద్‌లో రిలీజ్ చేశారు. దేవ్ గిల్ మాట్లాడుతూ– ''మగధీర' నుంచి తెలుగు ప్రేక్షకులు నాపై ప్రేమను కురిపిస్తూనే ఉన్నారు. నన్ను ఇంతవరకు విలన్‌గా చూశారు. 'అహో విక్రమార్క'తో హీరోగా మీ అందరికీ సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నాను'' అన్నారు. ''మా ప్రొడక్షన్ నుంచి వస్తున్న మొదటి చిత్రం ఇది. ఈ సినిమా చాలా కొత్తగా ఉంటుంది... ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు ఆర్తి. పేట త్రికోటి మాట్లాడుతూ– ''దేవ్ గిల్‌కి పోలీస్ కథ సరిపోతుందని భావించి, ఈ సినిమా తీశాం. తెలుగు, హిందీ భాషల్లో ఈ సినిమా చిత్రీకరించాం'' అన్నారు. ''త్రికోటి, దేవ్ గిల్‌గార్లతో పని చేయడం ఆనందంగా ఉంది'' అన్నారు హీరోయిన్ చిత్రా శుక్లా. నటులు యువరాజ్, ప్రవీణ్ మాట్లాడారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
141	51
77,479	23,567

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	17,676	▽	180
డోజోన్స్	38,993	▲	156
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,272	▲	67
డాక్స్	18,254	▲	186
షాంఘై	3,005	▽	12
నికాయ్	38,633	▲	62

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)


ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	72,162	▲	458
బంగారం (99.5 స్వచ్ఛత)	71,873	▲	456
వెండి (కేజీ)	90,038	▲	1,843

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		81.73	85.41
£	బ్రిటన్ పౌండ్		103.45	108.40
€	యూరో		87.34	91.83
¥	జపాన్ ఎన్ (100)		42.00	64.00
AU$	ఆస్ట్రేలియా డాలర్		52.78	57.63
S$	సింగపూర్ డాలర్		59.44	64.14
SAR	సౌదీ రియాల్		21.39	22.94
UAE D	యూఏఈ దిర్హామ్		21.86	23.65
¥	చైనా యువాన్		10.40	12.47

చలో వాహన రంగా..!



- రూ. 2 లక్షల కోట్ల పెట్టుబడి ప్రణాళికలు
- ఈవీ, కొత్త టెక్నాలజీలపై కసరత్తు
- అత్యధికంగా మారుతీ రూ. 1.25 లక్షల కోట్లు
- హ్యుందాయ్ రూ. 32,000 కోట్లు,

ప్యాసింజర్ వాహనాలకు (పీవీ) సంబంధించి ప్రపంచంలోనే మూడో అతి పెద్ద మార్కెట్‌గా భారత్ ఎదిగింది. స్పోర్ట్ యుటిలిటీ వాహనాల (ఎస్‌యూవీ) వాటా ఇందులో దాదాపు సగం స్థాయిలో ఉంటోంది. దేశీయంగా గత ఆర్థిక సంవత్సరం 43 లక్షల యూనిట్లుగా ఉన్న పీవీల మార్కెట్ 2030 ఆర్థిక సంవత్సరం నాటికి అరవై లక్షలకు చేరొచ్చని, ఇందులో 20–21 శాతం వాటా ఎలక్ట్రిక్ వాహనాలదే (ఈవీ) ఉండొచ్చనే అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే వాహనాల డిమాండ్‌కి అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకోవడం, పర్యావరణ అనుకూల కొత్త టెక్నాలజీలను వినియోగంలోకి తేవడంపై ఆటోమొబైల్ కంపెనీలు మరింతగా దృష్టి పెడుతున్నాయి. వచ్చే కొన్నేళ్లలో ఇందుకోసం దాదాపు రూ. 2 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టనున్నాయి.

మారుతీ సుజుకీ ఎస్‌యూవీ కేటగిరీలో తొలి ఈవీని గతేడాదే ఆవిష్కరించనున్నట్లు తొలుత ప్రకటించినా అది ఈ ఆర్థిక సంవత్సరానికి వాయిదా పడింది. 2029–30 నాటికి మొత్తం ఆరు ఈవీలను భారత్‌లో ప్రవేశపెట్టాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. 50 శాతం మార్కెట్ వాటాను తిరిగి దక్కించుకునే క్రమంలో సామర్థ్యాల పెంపు, కొత్త మోడళ్ల అభివృద్ధి మొదలైన వాటిపై 2024–25లో రూ. 10,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు ప్రకటించింది.




ఈవీలు, ఐసీఈలపై మారుతీ కసరత్తు..

ఇందులో సింహభాగం వాటా హరియాణాలోని ఖార్ఖోడా ప్లాంటుపైనే వెచ్చించనుంది. 2025 నాటికి ఇందులో ఉత్పత్తి ప్రారంభం కానుండగా, సంస్థకు ఏటా 2,50,000 యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం జత కానుంది. ఎంఎస్ఐఎల్ ప్రస్తుతం గురుగ్రామ్, మానెసర్, హన్సల్‌పూర్ (గుజరాత్) ప్లాంట్లలో ఏటా 23.5 లక్షల యూనిట్లను ఉత్పత్తి చేస్తోంది. వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 40 లక్షల యూనిట్లకు, మోడళ్ల శ్రేణిని 28కి పెంచుకునేందుకు 2030–31 నాటికి రూ. 1.25 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేసే ప్రణాళికల్లో కంపెనీ ఉంది.

టాటా మోటార్స్ 6 ఈవీలు...

టాటా మోటార్స్ 2030 ఆర్థిక సంవత్సరం నాటికి ఈవీలపై రూ. 16,000–18,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు ఇటీవల ప్రకటించింది. ప్రస్తుతం నాలుగు ఎలక్ట్రిక్ కార్ల మోడల్స్ విక్రయిస్తున్న కంపెనీ 2026 మార్చి నాటికి మరో ఆరు ఈవీలను ఆవిష్కరించాలని నిర్దేశించుకుంది. 2030 నాటికి పీవీ మార్కెట్లో 20 శాతం వాటాను లక్ష్యంగా పెట్టుకుంది.

ఎంఅండ్ఎం రూ. 12,000 కోట్లు..



ఈవీల విభాగం మహీంద్రా ఎలక్ట్రిక్ ఆటోమొబైల్‌పై వచ్చే మూడేళ్లలో రూ. 12,000 కోట్లు ఇన్వెస్ట్ చేసే ప్రతిపాదనకు ఎంఅండ్ఎం బోర్డు ఆమోదముద్ర వేసింది. 2025 తొలి త్రైమాసికంలో కంపెనీ తమ తొలి 'బార్న్ ఈవీ' శ్రేణిని ప్రవేశపెట్టే యోచనలో ఉంది. 2027 నాటికి ఎంఅండ్ఎం అమ్మకాల్లో ఈవీల వాటా 20–30% ఉంటుందని అంచనా. 2030 నాటికి తొమ్మిది ఎస్‌యూవీలను, ఏడు బార్న్ ఎలక్ట్రిక్ వాహనాలను, ఏడు తేలికపాటి వాణిజ్య వాహనాలను ప్రవేశపెట్టేందుకు 2024–25 నుంచి 2026–27 మధ్య కాలంలో రూ. 27,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు కంపెనీ గతంలో తెలిపింది. ఇందులో ఐసీఈ వాహనాల కోసం రూ. 8,500 కోట్లు వెచ్చించనుంది.

హ్యుందాయ్.. సై..

త్వరలో భారీ పబ్లిక్ ఇష్యూకి వస్తున్న కొరియన్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా కూడా వచ్చే 10 ఏళ్లలో రూ. 32,000 కోట్ల మేర పెట్టుబడులు పెట్టనుంది. తమిళనాడు ప్లాంటు సామర్థ్యాల పెంపు, విడిభాగాల వ్యవస్థ, ఈవీల తయారీ, చార్జింగ్ మౌలిక సదుపాయాలు మొదలైన వాటిపై రూ. 26,000 కోట్లు, జనరల్ మోటార్స్ నుంచి కొనుగోలు చేసిన తాలేగావ్ ప్లాంటుపై రూ. 6,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది.



లిస్టులో మరిన్ని కంపెనీలు..

- జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా కొత్త తరహా ఎనర్జీ వాహనాలను (ఎన్ఈవీ), ఐసీఈ వాహనాలను అభివృద్ధి చేసేందుకు రూ. 5,000 కోట్లు ఇన్వెస్ట్ చేసే యోచనలో ఉంది.
- కియా ఇండియా 2025లో ప్రత్యేకంగా భారత మార్కెట్ కోసం రూపొందించిన ఈవీని ప్రవేశపెట్టే ప్రణాళికల్లో ఉంది.
- ఆరు వాహనాల అభివృద్ధి కోసం భారత్‌లో రూ. 5,300 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు నిస్సాన్, రెనో గతేడాది ప్రకటించాయి. వీటిలో రెండు ఈవీలు కూడా ఉండనున్నాయి.
- ఇక ద్విచక్ర వాహనాలు, ఈవీల కోసం అవసరమయ్యే పరికరాల ఉత్పత్తి కోసం విడిభాగాల తయారీ సంస్థలు వచ్చే మూడు–నాలుగేళ్లలో రూ. 25,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నాయి. ఇందులో 45–50 శాతం మొత్తాన్ని బ్యాటరీ సెల్స్ తయారీపై పెట్టుబడులు పెట్టే అవకాశం ఉంది.

రూపాయి క్రాష్!

- ఆల్‌టైమ్ కనిష్టం 83.68కి పతనం
- చివరికి 83.61 వద్ద ముగింపు



ముంబై: డాలర్ మారకంలో రూపాయి విలువ గురువారం ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో చరిత్రాత్మక కనిష్ట స్థాయి 83.68కి పడిపోయింది. అయితే చివరకు 17 పైసలు నష్టంతో రెండు నెలల కనిష్ట స్థాయి 83.61 వద్ద ముగిసింది. ఇప్పటి వరకూ ముగింపులో ఇదే చరిత్రాత్మక కనిష్ట స్థాయి కావడం గమనార్హం. దేశీయ ఈక్విటీ మార్కెట్లు చరిత్రాత్మక గరిష్టాలను చూస్తున్నప్పటికీ పశ్చిమాసియాలో భౌగోళిక ఉద్రిక్తతలు, దీనితో క్రూడ్ ఆయిల్ ధర పెరుగుదల వంటి అంశాలు తాజాగా రూపాయి విలువపై ప్రతికూలత చూపిస్తున్నాయి. బుధవారం పైసా నష్టంతో 83.44 వద్ద ముగిసిన రూపాయి, గురువారం ట్రేడింగ్‌లో 83.43 వద్ద ప్రారంభమైంది. 83.42కు మించి బలపడలేకపోయింది.

దిగ్గజ ఐపీవోలకు ఓకే...

- సెబీ నుంచి గ్రీన్‌సిగ్నల్
- జాబితాలో ఓలా ఎలక్ట్రిక్
- ఎమ్‌క్యూర్ ఫార్మాస్యూటికల్స్



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన దిగ్గజం ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ, హెల్త్‌కేర్ రంగ కంపెనీ ఎమ్‌క్యూర్ ఫార్మాస్యూటికల్స్ పబ్లిక్ ఇష్యూకి రానున్నాయి. ఇందుకు తాజాగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ రెండు కంపెనీలూ 2023 డిసెంబర్‌లో సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేశాయి.

రూ. 5,500 కోట్లకు రెడీ

ఐపీవో ద్వారా ఓలా ఎలక్ట్రిక్ రూ. 5,500 కోట్లకు పైగా సమీకరించే ప్రణాళికల్లో ఉంది. ఇష్యూ నిధులలో అత్యధిక శాతాన్ని సామర్థ్య విస్తరణ, సెల్ తయారీ ప్లాంట్, ఆర్అండ్‌డీపై పెట్టుబడులకు వినియోగించనుంది. ఇష్యూలో భాగంగా రూ. 5,500 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి అదనంగా మరో 9.52 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు ఆఫర్ చేయనున్నారు. రూ. 1,226 కోట్లు సెల్ తయారీ యూనిట్‌కు, రూ. 1,600 కోట్లు ఆర్అండ్‌డీకి, మరో రూ. 800 కోట్లు రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. ఇక బెయిన్ క్యాపిటల్‌కు పెట్టుబడులున్న ఎమ్‌క్యూర్ ఫార్మా రూ. 800 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది.

ఆఫీసర్స్ చాయిస్ @ రూ. 267-281

ఆఫీసర్స్ చాయిస్ విస్కీ తయారీ కంపెనీ అల్లైడ్ బ్లెండర్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 267–281 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 25న ప్రారంభమై 27న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 24న షేర్లను కేటాయించనుంది.



ఇష్యూలో భాగంగా రూ. 1,000 కోట్ల ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో రూ. 500 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 53 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేయాలి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-6-2024	
విశాఖ	505–00
చిత్తూరు	563–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	495–00
విజయవాడ	505–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	510–00
వరంగల్	512–00
రిటైల్ ధర	5.70

స్విస్ బ్యాంకుల్లో భారతీయుల నిధులు 70 శాతం డౌన్



న్యూఢిల్లీ/జ్యూరిక్: స్విస్ బ్యాంకుల్లో భారతీయులు, భారతీయ సంస్థల నిధులు గతేడాది గణనీయంగా తగ్గాయి. 2022తో పోలిస్తే 2023లో 70 శాతం క్షీణించి నాలుగేళ్ల కనిష్ట స్థాయి 1.04 బిలియన్ స్విస్ ఫ్రాంకులకు (సుమారు రూ. 9,771 కోట్లు) పడిపోయాయి. ప్రధానంగా ఆయా క్లయింట్ల బాండ్లు, సెక్యూరిటీలు, ఇతరత్రా ఆర్థిక సాధనాలు క్షీణించడం ఇందుకు కారణం.

ఆరో రోజూ సెన్సెక్స్ పరుగులు

- 23,500 స్థాయి ఎగువకు నిఫ్టీ
- మళ్లీ సరికొత్త శిఖరాలపైకి సూచీలు
- విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల మద్దతు



ముంబై: దేశీయ ఈక్విటీ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు క్రమంగా పుంజుకోవడంతో స్టాక్ సూచీలు గురువారం తాజా గరిష్టాలకు చేరాయి. అధిక వెయిటేజీ రిలయన్స్(1%), ఐసీఐసీఐ (1%), హెచ్‌డీఎఫ్‌సీ (0.50%) షేర్లు రాణించి సూచీలకు దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 305 పాయింట్లు పెరిగి 77,643 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 141 పాయింట్లు లాభపడి 77,479 స్థిరపడింది. నిఫ్టీ 108 పాయింట్లు ఎగసి 23,624 వద్ద ఆల్‌టైం హైని అందుకుంది. ఆఖరికి 51 పాయింట్లు పెరిగి 23,567 వద్ద ముగిసింది. ప్రైవేటు బ్యాంకు లు, మెటల్, రియల్టీ, కమోడిటీ, ఇంధన, ఇండస్ట్రియల్ షేర్లు రాణించడంతో బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 1%, 0.58% లాభపడ్డాయి.

జోయాలుక్కాస్ 'ఇన్‌క్రెడిబుల్ జ్యువెలరీ సేల్ ఆఫర్'

హైదరాబాద్: జోయాలుక్కాస్ సంస్థ తన అత్యంత ఆకర్షణీయమైన 'ఇన్‌క్రెడిబుల్ జ్యువెలరీ సేల్ ఆఫర్'ను మళ్లీ ప్రకటించింది. ఇందులో భాగంగా అన్ని జ్యువెలరీల మజూరీ చార్జీలపై ఫ్లాట్ 50% తగ్గింపు అందిస్తుంది. అదనంగా కస్టమర్లు ఉచిత జీవితకాల నిర్వహణ, ఏడాది పాటు ఉచిత బీమా, ప్రతి కొనుగోలుతో బై బ్యాక్ హామీ పొందవచ్చు. ఈ జూలై 14 వరకు ఆఫర్ అందుబాటులో ఉంటుంది.

బీఈఎల్ చైర్మన్‌గా మనోజ్ జైన్



బెంగళూరు: ప్రభుత్వ రంగ దిగ్గజం భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) చైర్మన్, ఎండీగా మనోజ్ జైన్ బాధ్యతలు చేపట్టారు. 2022 సెప్టెంబర్ నుంచి ఆర్అండ్‌డీ విభాగం డైరెక్టరుగా ఉన్న జైన్ 2023 ఆగస్టు నుంచి బెంగళూరు కాంప్లెక్స్ డైరెక్టరుగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మూడు దశాబ్దాల పైగా సుదీర్ఘానుభవం ఉన్న జైన్ పరిశోధన, అభివృద్ధి విభాగాల్లో పలు పురస్కారాలు కూడా అందుకున్నారు.

సాక్షి స్పోర్ట్స్



భారత మహిళల క్రికెట్ జట్టులో షబ్నమ్

విశాఖ స్పోర్ట్స్: దక్షిణాఫ్రికాతో స్వదేశంలో జరుగుతున్న క్రికెట్ సిరీస్‌లో పాల్గొంటున్న భారత జట్టులో అదనంగా మరో ప్లేయర్‌ను చేర్చారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 17 ఏళ్ల మీడియం పేస్ బౌలర్ షబ్నమ్ షకీల్‌ను తొలిసారి భారత సీనియర్ జట్టులోకి ఎంపిక చేశారు. మూడు ఫార్మాట్లలోని (వన్డే, టెస్టు, టి20) టీమిండియాలో షబ్నమ్‌కు చోటు దక్కడం విశేషం. విశాఖపట్నంకు చెందిన షబ్నమ్ గత ఏడాది జనవరిలో జరిగిన అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టులో సభ్యురాలిగా ఉంది. ఈ ఏడాది మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) గుజరాత్ జెయింట్స్ తరఫున నాలుగు మ్యాచ్‌లు ఆడిన షబ్నమ్ నాలుగు వికెట్లు పడగొట్టింది. ప్రస్తుతం దక్షిణాఫ్రికా జట్టుతో జరుగుతున్న సిరీస్‌లో బెంగళూరు వేదికగా జరిగిన తొలి రెండు వన్డేల్లో భారత జట్టు గెలిచింది. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే టీమిండియా సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకుంది. ఈ రెండు జట్ల మధ్య చివరిదైన మూడో వన్డే ఆదివారం బెంగళూరులోనే జరుగుతుంది.

భారత మాజీ క్రికెటర్ డేవిడ్ జాన్సన్ మృతి



బనశంకరి: భారత జట్టు మాజీ క్రికెటర్ డేవిడ్ జాన్సన్ అనుమానాస్పద రీతిలో మృతి చెందారు. బెంగళూరులోని కొత్తనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనకశ్రీ లేఔట్ ఎస్ఎల్‌వీ ప్యారడైజ్ అపార్ట్‌మెంట్‌లో 4వ అంతస్తులోని తన ఫ్లాట్ నుంచి ఆయన కింద పడటంతో తీవ్ర గాయాలై మరణించారు. గురువారం ఉదయం గం. 11:15 సమయంలో ఈ సంఘటన జరిగింది. హాసన్ జిల్లా అరసికెరెకు చెందిన 52 ఏళ్ల డేవిడ్ జాన్సన్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆయన కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆర్థిక సమస్యలు కూడా ఉన్నట్లు సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో ఫ్లాట్ నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానాలున్నాయి. 1996లో డేవిడ్ జాన్సన్ భారత జట్టు తరఫున 2 టెస్టులు ఆడి 3 వికెట్లు పడగొట్టాడు. న్యూఢిల్లీ వేదికగా 1996 అక్టోబర్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టులో అరంగేట్రం చేసిన జాన్సన్ రెండో ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ తీశాడు. అనంతరం అదే ఏడాది డిసెంబర్‌లో దర్బన్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టులో జాన్సన్ తొలి ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు సాధించాడు.

ఇంగ్లండ్, డెన్మార్క్ మ్యాచ్ 'డ్రా'



ఫ్రాంక్‌ఫర్ట్ (జర్మనీ): యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నీలో గత రన్నరప్ ఇంగ్లండ్ జట్టు ఖాతాలో తొలి 'డ్రా' చేరింది. డెన్మార్క్‌తో గురువారం జరిగిన గ్రూప్ 'సి' లీగ్ మ్యాచ్‌ను ఇంగ్లండ్ 1–1 గోల్స్‌తో 'డ్రా'గా ముగించింది. ఇంగ్లండ్ తరఫున ఆట 18వ నిమిషంలో హ్యారీ కేన్ గోల్ చేయగా... 34వ నిమిషంలో హిజుల్‌మండ్ గోల్‌తో డెన్మార్క్ జట్టు స్కోరును సమం చేసింది. ఆ తర్వాత రెండు జట్లు మరో గోల్ చేయలేకపోయాయి. గ్రూప్ 'ఎ'లో స్కాట్లాండ్, స్విట్జర్లాండ్ మధ్య జరిగిన మ్యాచ్ 1–1తో... గ్రూప్ 'సి'లో స్లొవేనియా, సెర్బియా మధ్య జరిగిన మ్యాచ్ కూడా 1–1తో 'డ్రా'గా ముగిశాయి.

అఫ్గాన్‌పై అలవోకగా...

'సూపర్-8'లో భారత్ విజయారంభం

- 47 పరుగులతో అఫ్గానిస్తాన్ చిత్తు
- మెరిసిన సూర్యకుమార్, హార్దిక్
- రాణించిన బుమ్రా, అర్ష్ దీప్
- రేపు బంగ్లాదేశ్‌తో తర్వాతి పోరు

టి20 ప్రపంచ కప్ 'సూపర్-8' దశలో భారత జట్టు తమ స్థాయిని ప్రదర్శించింది. అఫ్గానిస్తాన్ చక్కటి బౌలింగ్‌తో టీమిండియా ఆరంభంలో కాస్త తడబాటుకు గురైనా ఆపై సంపూర్ణ ఆధిపత్యం కొనసాగించింది. ఈ ఫార్మాట్‌లో తన నంబర్‌వన్ హోదాకు న్యాయం చేస్తూ, తనేంటూ నిరూపిస్తూ సూర్యకుమార్ యాదవ్ జట్టు భారీ స్కోరులో కీలకపాత్ర పోషించాడు. ఆ తర్వాత ఛేదనలో అఫ్గాన్ టీమ్ ఏ దశలోనూ కనీస స్థాయి ప్రదర్శన ఇవ్వలేకపోయింది. టీమిండియా పదునైన బౌలింగ్‌ను ఎదుర్కోలేక వరుసగా వికెట్లు కోల్పోయి మ్యాచ్‌ను సమర్పించుకుంది. ఇక మరో ఆసియా జట్టు బంగ్లాదేశ్‌తో శనివారం భారత్ తర్వాతి సమరానికి సిద్ధమైంది.



సూర్యకుమార్

బ్రిడ్జ్‌టౌన్: వరల్డ్ కప్‌లో సెమీఫైనల్ చేరే దిశగా భారత జట్టు కీలక విజయాన్ని అందుకుంది. సూపర్-8 గ్రూప్-1లో భాగంగా గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 47 పరుగుల తేడాతో అఫ్గానిస్తాన్‌ను చిత్తు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సూర్యకుమార్ యాదవ్ (28 బంతుల్లో 53; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా... హార్దిక్ పాండ్యా (24 బంతుల్లో 32; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. రషీద్ ఖాన్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం అఫ్గానిస్తాన్ 20 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటైంది. అజ్మతుల్లా ఒమర్జాయ్ (20 బంతుల్లో 26; 2 ఫోర్లు, 1 సిక్స్)దే అత్యధిక స్కోరు. బుమ్రా (3/7), అర్ష్ దీప్ చెరో 3 వికెట్లు పడగొట్టారు.

కీలక భాగస్వామ్యం...

ఆరంభం నుంచే తడబడుతూ ఆడిన రోహిత్ శర్మ (13 బంతుల్లో 8; 1 ఫోర్) ఎక్కువసేపు నిలవలేకపోయాడు. ఆ తర్వాత రషీద్ రెండు వికెట్లతో భారత్‌ను దెబ్బ తీశాడు. నబీ ఓవర్లో వరుసగా మూడు ఫోర్లతో జోరు ప్రదర్శించిన రిషభ్ పంత్ (11 బంతుల్లో 20; 4 ఫోర్లు) వికెట్ల ముందు దొరికిపోగా...రషీద్ తర్వాతి ఓవర్లో భారీ షాట్ ఆడే క్రమంలో విరాట్ కోహ్లి (24 బంతుల్లో 24; 1 సిక్స్) అవుటయ్యాడు. ఈ దశలో సూర్యకుమార్ దూకుడైన బ్యాటింగ్‌తో స్కోరు వేగంగా సాగింది. రషీద్ ఓవర్లో సూర్య ఫోర్, సిక్స్ కొట్టగా... అదే ఓవర్లో మరో ఎండ్‌లో శివమ్ దూబే (7 బంతుల్లో 10; 1 సిక్స్) పెవిలియన్ చేరాడు. ఇలాంటి సమయంలో సూర్యకు పాండ్యా జత కలిశాడు. వీరిద్దరి భాగస్వామ్యంతో జట్టు మెరుగైన స్థితికి చేరింది. నూర్ ఓవర్లో పాండ్యా వరుసగా 4, 6 కొట్టగా... ఫజల్ ఓవర్లో సూర్య వరుసగా 6, 4 బాది 27 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే తర్వాతి బంతికే అతను అవుట్ కాగా, మరుసటి ఓవర్లో పాండ్యా ఆట ముగిసింది. జడేజా (5 బంతుల్లో 7; 1 ఫోర్) ప్రభావం చూపలేకపోగా, ఆఖరి ఓవర్లో అక్షర్ పటేల్ (6 బంతుల్లో 12; 2 ఫోర్లు) కీలక పరుగులు రాబట్టాడు. తొలి 10 ఓవర్లలో జట్టు 79 పరుగులు చేయగా, తర్వాతి 10 ఓవర్లలో 101 పరుగులు వచ్చాయి. ఈ మ్యాచ్ కోసం భారత్ ఒక మార్పు చేసింది. సిరాజ్ స్థానంలో కుల్దీప్ యాదవ్ వచ్చాడు. మరోవైపు గురువారం మరణించిన భారత మాజీ పేసర్ డేవిడ్ జాన్సన్‌కు నివాళిగా మన ఆటగాళ్లు నలుపు రంగు బ్యాండ్‌లు ధరించారు. అనంతరం లక్ష్య ఛేదనలో అఫ్గానిస్తాన్ బ్యాటర్లు చేతులెత్తేశారు. బుమ్రా తొలి ఓవర్‌లో అనవసర షాట్‌కు ప్రయత్నించి గుర్బాజ్ (11; 1 ఫోర్, 1 సిక్స్) అవుట్ కావడంతో మొదలైన జట్టు పతనం వేగంగా సాగింది. ఎవరు కూడా భారత బౌలింగ్ ముందు పట్టుదలగా నిలవలేకపోయారు. చెప్పుకోదగ్గ బౌలింగ్ వనరులు ఉన్నా ...ఎప్పటిలాగే బ్యాటర్ల వైఫల్యం దెబ్బ తీసింది.



బుమ్రా


స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) రషీద్ (బి) ఫజల్ 8; కోహ్లి (సి) నబీ (బి) రషీద్ 24; పంత్ (ఎల్బీ) (బి) రషీద్ 20; సూర్యకుమార్ (సి) నబీ (బి) ఫజల్ 53; దూబే (ఎల్బీ) (బి) రషీద్ 10; పాండ్యా (సి) అజ్మతుల్లా (బి) నవీన్ 32; జడేజా (సి) గుల్బదిన్ (బి) ఫజల్ 7; అక్షర్ (రనౌట్) 12; అర్ష్‌దీప్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు)** 181. **వికెట్ల పతనం:** 1–11, 2–54, 3–62, 4–90, 5–150, 6–159, 7–165, 8–181. **బౌలింగ్:** ఫజల్‌హక్ 4–0–33–3, నబీ 3–0–24–0, నవీన్ ఉల్ హక్ 4–0–40–1, రషీద్ ఖాన్ 4–0–26–3, నూర్ అహ్మద్ 3–0–30–0, అజ్మతుల్లా 2–0–23–0.

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) పంత్ (బి) బుమ్రా 11; హజ్రతుల్లా (సి) జడేజా (బి) బుమ్రా 2; ఇబ్రహీమ్ (సి) రోహిత్ (బి) అక్షర్ 8; గుల్బదిన్ (సి) పంత్ (బి) కుల్దీప్ 17; అజ్మతుల్లా (సి) అక్షర్ (బి) జడేజా 26; నజీబుల్లా (సి) అర్ష్‌దీప్ (బి) బుమ్రా 19; నబీ (సి) జడేజా (బి) కుల్దీప్ 14; రషీద్ (సి) జడేజా (బి) అర్ష్‌దీప్ 2; నూర్ (సి) రోహిత్ (బి) అర్ష్‌దీప్ 12; నవీన్ (సి) పంత్ (బి) అర్ష్‌దీప్ 0; ఫజల్‌హక్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (20 ఓవర్లలో ఆలౌట్)** 134. **వికెట్ల పతనం:** 1–13, 2–23, 3–23, 4–67, 5–71, 6–102, 7–114, 8–121, 9–121, 10–134. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4–0–36–3, బుమ్రా 4–1–7–3, అక్షర్ పటేల్ 3–1–15–1, హార్దిక్ పాండ్యా 2–0–13–0, కుల్దీప్ 4–0–32–2, జడేజా 3–0–20–1.

చెలరేగిన సాల్ట్

- 'సూపర్-8'లో ఇంగ్లండ్ బోణీ
- విండీస్‌పై 8 వికెట్లతో గెలుపు



సాల్ట్

గ్రాస్ ఐలెట్ (సెయింట్ లూసియా): డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. టి20 ప్రపంచకప్ 'సూపర్-8' దశలో శుభారంభం చేసింది. ఆతిథ్య వెస్టిండీస్‌తో గురువారం జరిగిన గ్రూప్-2 మ్యాచ్‌లో ఇంగ్లండ్ 8 వికెట్లతో ఘనవిజయం సాధించింది. విండీస్ నిర్దేశించిన 181 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ 17.3 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఓపెనర్ ఫిల్ సాల్ట్ (47 బంతుల్లో 87 నాటౌట్; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌తో ఇంగ్లండ్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. కెప్టెన్ జోస్ బట్లర్ (22 బంతుల్లో 25; 2 ఫోర్లు), మొయిన్ అలీ (10 బంతుల్లో 13; 2 ఫోర్లు) తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. ఒకదశలో ఇంగ్లండ్ విజయానికి 42 బంతుల్లో 70 పరుగులు అవసరమయ్యాయి. విండీస్ బౌలర్ రొమారియో షెఫర్డ్ వేసిన ఇన్నింగ్స్ 16వ ఓవర్లో సాల్ట్ చెలరేగిపోయి 4,6,4,6,6,4తో ఏకంగా 30 పరుగులు సాధించి ఫలితాన్ని ఇంగ్లండ్‌వైపు తిప్పాడు. మూడో వికెట్‌కు బెయిర్‌స్టో (26 బంతుల్లో 48 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో కలిసి సాల్ట్ 97 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని జోడించి ఇంగ్లండ్‌ను 15 బంతులు మిగిలి ఉండగానే గెలుపు తీరాన్ని చేర్చాడు. అంతకు ముందు మొదట బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 180 పరుగులు సాధించింది. జాన్సన్ చార్లెస్ (34 బంతుల్లో 38; 4 ఫోర్లు, 1 సిక్స్), నికోలస్ పూరన్ (32 బంతుల్లో 36; 4 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ (17 బంతుల్లో 36; 5 సిక్స్‌లు), షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్ (15 బంతుల్లో 28 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో ఆర్చర్, ఆదిల్ రషీద్, మొయిన్ అలీ, లివింగ్‌స్టోన్ ఒక్కో వికెట్ తీశారు.

టి20 ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X బంగ్లాదేశ్
వేదిక: నార్త్‌సౌండ్; ఉదయం గం. 6 నుంచి

ఇంగ్లండ్ X దక్షిణాఫ్రికా
వేదిక: గ్రాస్‌ఐలెట్; రాత్రి గం. 8 నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

హైదరాబాద్‌లో భారత్, బంగ్లాదేశ్ టి20 మ్యాచ్

స్వదేశంలో టీమిండియా షెడ్యూల్ విడుదల



న్యూఢిల్లీ: ఈ ఏడాది భారత పురుషుల క్రికెట్ జట్టు స్వదేశంలో 5 టెస్టులు, 3 టి20 మ్యాచ్‌లు ఆడనుంది. సెప్టెంబర్‌లో భారత్‌లో బంగ్లాదేశ్ జట్టు పర్యటిస్తుంది. ఈ పర్యటనలో భారత్‌తో బంగ్లాదేశ్ 2 టెస్టులు, 3 టి20 మ్యాచ్‌లు ఆడుతుంది. అక్టోబర్ 12న హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం భారత్, బంగ్లాదేశ్ జట్ల మధ్య మూడో టి20 మ్యాచ్‌కు ఆతిథ్యమివ్వనుంది. న్యూజిలాండ్‌తో సిరీస్ ముగిశాక భారత జట్టు ఆస్ట్రేలియాలో పర్యటించి ఐదు టెస్టులు ఆడుతుంది. ఆస్ట్రేలియా నుంచి తిరిగి వచ్చాక భారత జట్టు స్వదేశంలో ఇంగ్లండ్‌తో ఐదు టి20 మ్యాచ్‌లు, మూడు వన్డేలు ఆడుతుంది.

భారత్ జట్టు షెడ్యూల్

బంగ్లాదేశ్‌తో

తొలి టెస్టు: సెప్టెంబర్ 19–23 (చెన్నై)
రెండో టెస్టు: సెప్టెంబర్ 27–అక్టోబర్ 1 (కాన్పూర్)
తొలి టి20: అక్టోబర్ 6 (ధర్మశాల)
రెండో టి20: అక్టోబర్ 9 (న్యూఢిల్లీ)
మూడో టి20: అక్టోబర్ 12 (హైదరాబాద్)

న్యూజిలాండ్‌తో

తొలి టెస్టు: అక్టోబర్ 16–20 (బెంగళూరు)
రెండో టెస్టు: అక్టోబర్ 24–28 (పుణే)
మూడో టెస్టు: నవంబర్ 1–5 (ముంబై)

ఇంగ్లండ్‌తో

తొలి టి20: జనవరి 22 (చెన్నై)
రెండో టి20: జనవరి 25 (కోల్‌కతా)
మూడో టి20: జనవరి 28 (రాజ్‌కోట్)
నాలుగో టి20: జనవరి 31 (పుణే)
ఐదో టి20: ఫిబ్రవరి 2 (ముంబై)
తొలి వన్డే: ఫిబ్రవరి 6 (నాగ్‌పూర్)
రెండో వన్డే: ఫిబ్రవరి 9 (కటక్)
మూడో వన్డే: ఫిబ్రవరి 12 (అహ్మదాబాద్)

క్లుప్తంగా...

మరణాలకు కారణాల నమోదు తప్పనిసరి

సాక్షి, అమరావతి: ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం మరణాల నమోదు సమయంలో మరణానికి సంబంధించిన కచ్చితమైన కారణాన్ని తప్పనిసరిగా పేర్కొనాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో మరణాల నమోదు ప్రక్రియ అమలు తీరును పరిశీలించాలని అధికారులకు సూచించారు. మంగళగిరిలోని వైద్యశాఖ కార్యాలయంలో గురువారం ఐసీఎంఆర్, ఎన్‌సీడీఆర్, వైద్య శాఖ సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కృష్ణబాబు మాట్లాడుతూ.. 2023లో సవరించిన జనన, మరణాల నమోదు చట్టం ప్రకారం సీఆర్‌ఎస్ పోర్టల్‌లో మార్పులు వచ్చాయన్నారు. ఈ క్రమంలో మరణాలకు కారణాలను ధ్రువీకరించే అంశంపై క్షేత్ర స్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్, ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు, బకాయిలపై శ్వేత పత్రం విడుదల చేయాలి

సీఎంను కలిసి విజ్ఞప్తి చేసిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు, పెండింగ్ బకాయిలపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేశ్ బాబు కోరారు. వెలగపూడి సచివాలయంలో గురువారం సీఎం చంద్రబాబును ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు కలిసి విజ్ఞాపన పత్రం అందించారు. ఈ సందర్భంగా సురేశ్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో జాయింట్ కౌన్సిల్‌లో సభ్యత్వం గల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతోపాటు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రతినిధులకు ప్రాతినిధ్యం లేకపోవడంతో నష్టపోతున్నారన్నారు. రిజిస్టర్డ్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘాల నేతలతో ప్రత్యేక సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన సీఎంను కోరారు. ప్రాధాన్యత క్రమంలో ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కారం అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలి

సీఎస్‌ను కోరిన ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

సాక్షి, అమరావతి: ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు సంబంధించిన 14 సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ప్రధానంగా క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బందికి ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కార్ రావు తెలిపారు. అదేవిధంగా ఇబ్బడిముబ్బడిగా ఉన్న మొబైల్ యాప్‌లను తొలగించాలని విజ్ఞప్తి చేశామని పేర్కొన్నారు. సీఎస్‌ను కలిసిన వారిలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అహరోన్, వర్కింగ్ ప్రెసిడెంట్ సాగర్ తదితరులు ఉన్నారు.

నాన్ సబ్సిడీ సీడ్ పంపిణీ ఎప్పుడో?

- ఎన్నికలకు ముందే విత్తన కంపెనీలను సిద్ధం చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఎన్నికల కోడ్‌తో ఆగిన ఒప్పందాలు
- ఒక్క అడుగూ ముందుకు వేయని నూతన ప్రభుత్వం
- ఆర్బీకేల ద్వారా నాన్ సబ్సిడీ విత్తన పంపిణీపై నీలినీడలు
- విత్తనాలు ఎప్పుడు వస్తాయో తెలియక రైతుల ఆందోళన



సాక్షి, అమరావతి: నాన్ సబ్సిడీ విత్తన పంపిణీ ఈసారి మరింత ఆలశ్యమయ్యేట్టు కన్పిస్తోంది. ప్రతీ ఏటా సబ్సిడీ విత్తనంతో పాటు నాన్ సబ్సిడీ విత్తనాలను కూడా ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచేవారు. కానీ ఈసారి ఆ దిశగా ప్రయత్నాలు జరగడంలేదు. ఎన్నికల వేళ.. ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఇబ్బంది పడకూడదన్న ముందుచూపుతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలను సిద్ధం చేసింది. ఎన్నికల కోడ్ కారణంగా ఈసారి కాస్త ఆలశ్యంగా ప్రారంభమైనప్పటికీ, సబ్సిడీ విత్తన పంపిణీ జోరుగా సాగుతోంది. అగ్రి ల్యాబ్స్‌లో సర్టిఫై చేసిన సీడ్‌ను ఆర్బీకేల్లో నిల్వ చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ పూర్తి కాగా, వేరుశనగ విత్తన పంపిణీ 90 శాతం పూర్తయింది. వరితో సహా ఇతర విత్తనాల పంపిణీ ఊపందుకుంటోంది.

ఇప్పటికే 3.11 లక్షల క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాల పంపిణీ

ఖరీఫ్ సీజన్ కోసం 6.32 లక్షల క్వింటాళ్ల సబ్సిడీ విత్తనం అవసరం కాగా, 6.28 లక్షల క్వింటాళ్ల విత్తనం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అందుబాటులో ఉంచింది. 4.38 లక్షల క్వింటాళ్ల విత్తనాన్ని ఆర్బీకేల్లో ఉంచింది. ఇప్పటి వరకు 34,500 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలతో పాటు 2,55,899 క్వింటాళ్ల వేరుశనగ, 20,340 క్వింటాళ్ల వరి, 95 క్వింటాళ్ల అపరాలు చొప్పున 3.11 లక్షల క్వింటాళ్ల విత్తనాన్ని పంపిణీ చేశారు.

రెండేళ్లలో 305 క్వింటాళ్ల నాన్ సబ్సిడీ విత్తనం

సీజన్‌లో నాణ్యమైన విత్తనం దొరక్క మిరప, పత్తి రైతులు నకిలీల బారిన పడి, కోట్ల విలువైన పెట్టుబడి, ఉత్పత్తి నష్టాల బారిన పడకుండా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లు సర్టిఫై చేసిన నాణ్యమైన నాన్ సబ్సిడీ సీడ్‌నే మార్కెట్‌లో అందుబాటులో ఉంచింది. రైతుల నుంచి వచ్చే డిమాండ్ మేరకు నాన్ సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేసేది. ఇందుకోసం ప్రైవేటు కంపెనీలతో ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ఏటా సీజన్‌కు ముందే ఒప్పందాలు చేసుకునేది. ఇలా గత రెండేళ్లలో 305.43 క్వింటాళ్ల నాన్ సబ్సిడీ విత్తనాన్ని పంపిణీ చేసింది. ఖరీఫ్–2022లో 108.44 క్వింటాళ్ల పత్తి, 2.52 క్వింటాళ్ల మిరప, 2.25 క్వింటాళ్ల సజ్జలు, 37.20 క్వింటాళ్ల సోయాబీన్ విత్తనాల పంపిణీ జరిగింది. గడిచిన ఖరీఫ్–2023లో సైతం 17.38 క్వింటాళ్ల పత్తి, 0.64 క్వింటాళ్ల మిరప, 137 క్వింటాళ్ల సోయాబీన్ విత్తనాలను పంపిణీ చేసింది.

నకిలీల బారిన పడకుండా చర్యలు

ఈసారి కూడా ఖరీఫ్ సీజన్‌కు 3 నెలల ముందుగానే పత్తి, మిరప ఇతర పంటల విస్తీర్ణానికి తగినట్టుగా విత్తనాలు సరఫరా చేసేలా కంపెనీలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సిద్ధం చేసింది. ముఖ్యంగా 29 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు అవసరం కాగా, ప్రస్తుతం మార్కెట్లో 30 లక్షల ప్యాకెట్లు అందుబాటులోకి తెచ్చింది. నకిలీల నివారణకు విస్తృతంగా తనిఖీలు చేసి, ముగ్గురు విత్తన డీలర్లపై 6 ఏ కేసులు నమోదు చేసింది. 7.77 లక్షల విలువైన పత్తి, మిరప విత్తనాలను జప్తు చేసింది. 2.13 కోట్ల విలువైన 435 క్వింటాళ్ల పత్తి, మిరప, ఇతర విత్తనాల అమ్మకాలను నిలిపివేసింది. ఫలితంగా ఎక్కడా నాసిరకం అనే మాటే విన్పించలేదు. సీజన్‌కు ముందే ప్రైవేటు కంపెనీలతో ఒప్పందానికి ఏర్పాట్లు చేసినా ఎన్నికల కోడ్ కారణంగా ముందుకు సాగలేదు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకేయలేదు. దీంతో ఈ ఏడాది ఆర్బీకేల ద్వారా నాన్ సబ్సిడీ విత్తన పంపిణీపై ఈసారి నీలినీడలు కమ్ముకుంటున్నాయి. విత్తనాలు ఎప్పుడు వస్తాయో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు.

జస్టిస్ శేషసాయికి ఘన సన్మానం



జస్టిస్ శేషసాయిని సన్మానించిన సీజే ధీరజ్ సింగ్ ఠాకూర్, హైకోర్టు న్యాయవాదుల సంఘం

సాక్షి, అమరావతి: ఇటీవల పదవీ విరమణ చేసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయిని హైకోర్టు న్యాయవాదుల సంఘం ఘనంగా సన్మానించింది. హైకోర్టులోని న్యాయవాదుల సంఘం హాలులో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, పలువురు న్యాయమూర్తులు, అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కలిగినీడి చిదంబరం, ఉపాధ్యక్షుడు ఎస్.రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి నన్నపనేని శ్రీహరి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ జస్టిస్ శేషసాయి మానవతావాదని ప్రశంసించారు. జస్టిస్ శేషసాయి మాట్లాడుతూ న్యాయవాదులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. మరోవైపు హైకోర్టు ఉద్యోగుల సంఘం కూడా జస్టిస్ శేషసాయిని ఘనంగా సన్మానించింది.

జోసా కౌన్సెలింగ్‌లో జోష్

ఐఐటీల్లో ఈ ఏడాది 900 అదనపు సీట్లు

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయిలో ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపులో ఈ ఏడాది భారీ మార్పు కనిపిస్తోంది. గతేడాది కన్నా ఈసారి కటాఫ్ ర్యాంకులు బాగా పెరిగాయి. దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీలు, ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థల్లో సీట్ల భర్తీకి జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ (జోసా) కౌన్సెలింగ్ చేపట్టింది. ఇందులో భాగంగా గురువారం తొలిదశ సీట్లు కేటాయించింది. అయితే ఈసారి ఐఐటీల్లో 900 సీట్లు అదనంగా పెరిగాయి. దీంతో సీట్ల కేటాయింపులో కటాఫ్ ర్యాంకులు పెరిగాయి. ఐఐటీ బాంబేలో ఓపెన్ కేటగిరీ బాలికల విభాగంలో గతేడాది కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) బ్రాంచ్‌లో 305 ర్యాంకు వరకు సీటు వస్తే.. ఈసారి 421వ ర్యాంకుకు కూడా సీటు లభించడం విశేషం. అలాగే ఐఐటీ హైదరాబాద్‌లో ఓపెన్ కేటగిరీ బాలుర విభాగంలో 585 ర్యాంకుకు సీఎస్ఈలో సీటు వస్తే.. ఈసారి 649 ర్యాంకు వరకూ సీటు లభించింది.

నిట్‌ల్లోనూ ఇదే ట్రెండ్..

కేవలం ఐఐటీల్లోనే కాకుండా నిట్‌ల్లోనూ కటాఫ్ ర్యాంకులు పెరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెం నిట్‌లో ఓపెన్ కేటగిరీ బాలికల విభాగంలో గతేడాది 17,873 ర్యాంకు వరకు సీఎస్ఈలో సీటు వచ్చింది. ఈసారి ఇది 23,130 ర్యాంకుకి పెరిగింది. తెలంగాణలోని వరంగల్ నిట్‌లో ఓపెన్ కేటగిరీ బాలుర విభాగంలో 1,664 ర్యాంకుకు గతేడాది సీఎస్ఈలో సీటొస్తే.. ఈసారి 2,698 ర్యాంకు వరకు సీటు లభించింది. బాలికల విభాగంలో పోయినసారి 3,593 ర్యాంకుకు సీటొస్తే.. ఈసారి 4,625 ర్యాంకుకు కూడా సీటు వచ్చింది. జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన వారికి ఐఐటీలు మినహా అన్ని ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో ర్యాంకును బట్టి సీటు కేటాయిస్తారు. ఐఐటీల్లో జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా సీట్లు ఇస్తారు. జోసా మొత్తం ఐదు రౌండ్ల కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తుంది.

ఐఐటీ బాంబే వైపే టాపర్ల మొగ్గు

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో టాప్ ర్యాంకులు పొందిన విద్యార్థుల్లో ఎక్కువ మంది ఐఐటీ బాంబేకి ప్రాధాన్యమిచ్చారు. టాపర్లంతా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) వైపే మొగ్గు చూపారు. ఓపెన్ కేటగిరీ బాలుర విభాగంలో తొలి ర్యాంకు మొదలుకుని 68వ ర్యాంకు వరకూ మాత్రమే సీట్లు దక్కాయి. బాలికల విభాగంలో 7వ ర్యాంకు నుంచి 421వ ర్యాంకు వరకూ సీట్లు లభించాయి. తర్వాత స్థానంలో ఐఐటీ ఢిల్లీ ఉంది. ఇక్కడ ఓపెన్ కేటగిరీలో బాలురకు 116వ ర్యాంకు వరకే సీట్లు దక్కాయి. హైదరాబాద్ ఐఐటీలో సీఎస్ఈ ఓపెన్ కేటగిరీలో బాలురకు 431వ ర్యాంకుతో మొదలై 649వ ర్యాంకు వరకూ సీట్లు లభించాయి. ఐఐటీ తిరుపతిలో బాలుర విభాగంలో 4,469వ ర్యాంకు వరకు, బాలికల విభాగంలో 6,324వ ర్యాంకు వరకు సీట్లు దక్కాయి.

వివిధ విద్యా సంస్థల్లో సీట్ల వివరాలు

సంస్థ	ఎన్ని కాలేజీలు	సీట్లు
ఐఐటీలు	23	17,740
ఎన్‌ఐటీలు	31	24,226
ట్రిపుల్ ఐటీలు	25	8,546
కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థలు	48	6,000

ప్రధాన ఐఐటీల్లో సీఎస్ఈ బ్రాంచ్‌లో ఓపెన్ కేటగిరీలో ఈ ర్యాంకు వరకూ సీట్లు

ఐఐటీ	క్లోజింగ్	ర్యాంకు
	బాలురు	బాలికలు
బాంబే	68	421
ఢిల్లీ	116	556
మద్రాస్	159	757
కాన్పూర్	248	1,117
ఖరగ్‌పూర్	414	1,579
హైదరాబాద్	649	1,809
తిరుపతి	4,469	6,324
రూర్కీ	481	1697
పాలక్కాడ్	5,556	9,127
భిలాయ్	5,907	11,290

ప్రధాన ఎన్‌ఐటీల్లో సీఎస్ఈ బ్రాంచ్‌లో ఓపెన్ కేటగిరీలో ఈ ర్యాంకు వరకూ సీట్లు

నిట్	బాలురు	బాలికలు
తాడేపల్లిగూడెం	16,278	23,130
వరంగల్	2,698	4,625
తిరుచిరాపల్లి	1,019	1,945
సూరత్‌కల్	1,423	2,433
కాలికట్	4,088	6,233
జలంధర్	9,357	15,718
అగర్తల	18,050	30,270

‘నీట్’ లీకేజీపై నిరసన జ్వాల

- పలుచోట్ల ధర్నాలు, ర్యాలీలతో విద్యార్థులు, విద్యార్థి సంఘాల నిరసనలు
- పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్
- లేకుంటే పార్లమెంట్‌ను ముట్టడిస్తామని హెచ్చరిక
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ స్పందించాలన్న విద్యార్థి సంఘాలు



గుంటూరులో మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, విద్యార్థి సంఘం నేతలు

తిరుపతి సిటీ/గుంటూరు ఎడ్యుకేషన్/లక్ష్మీపురం: నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఉదంతంపై గురువారం రాష్ట్రంలోని పలుచోట్ల నిరసనలు జరిగాయి. విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ధర్నాలు, ర్యాలీలు నిర్వహించారు. పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ, ఎంఆర్ పల్లి దండి మార్చ్ సర్కిల్ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ నీట్ పరీక్ష పత్రం లీకేజీ బీజేపీ ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమని ధ్వజమెత్తారు. మేక్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా అంటూ ప్రగల్భాలు పలికే ప్రధాని మోదీ, రాష్ట్ర సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు కూడా నీట్ పేపర్ లీకేజీపై స్పందించాలని, విద్యార్థులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అధికారులు నైతిక బాధ్యత వహిస్తూ తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షను మళ్లీ పకడ్బందీగా నిర్వహించాలని, దేశంలోని అన్ని విద్యార్థి సంఘాలు ఏకమై పార్లమెంట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు రవి, అక్బర్, రమేష్‌నాయక్, నాగేంద్ర ఏఐఎస్‌ఎఫ్ నాయకులు బండి చలపతి, చిన్న, నవీన్, ప్రవీణ్, పెద్ద సంఖ్యలో నీట్ పరీక్ష రాసిన విద్యార్థులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ గుంటూరు చంద్రమౌళీనగర్ నుంచి లక్ష్మీపురంలోని మదర్‌థెరిసా విగ్రహం వరకు విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ ఎన్‌టీఏ నిర్వహించిన పరీక్షలన్నింటిపైనా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాగా, గుంటూరు కొత్తపేట భగత్ సింగ్ విగ్రహం వద్ద అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో మోకాళ్లపై కూర్చుని నిరసన చేపట్టారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శులు జంగాల చైతన్య, యశ్వంత్‌లు డిమాండ్ చేశారు. లేకుంటే వారి కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆయా కార్యక్రమాల్లో ఏఐవైఎఫ్, ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూరగాయల ‘ధర’ దడ

కొనలేం.. తినలేం

- చుక్కల్లో ధరలు.. జనం బెంబేలు
- ఉమ్మడి పశ్చిమలో 5 వేల ఎకరాల్లో సాగు
- ఎండల తీవ్రతతో తగ్గిన దిగుబడులు
- కిలో రూ.100 వరకు పలు రకాలు
- సెంచరీ దిశగా టమాటా, వంకాయ
- ఉల్లి, బంగాళదుంప, క్యారెట్ ధరలకూ రెక్కలు
- మరికొద్ది రోజులు భారం తప్పదంటున్న వ్యాపారులు

ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు.. అన్నట్టు ఉంది కూరగాయల ధరల పరిస్థితి. ఒక్కసారిగా ధరలు పెరగడంతో వినియోగదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. పది రోజుల వ్యవధిలో దాదాపు అన్నిరకాలు రెట్టింపు కావడం సామాన్యులను దడ పుట్టిస్తోంది. ఎండల తీవ్రతతో కూరగాయల పంటలకు నష్టం వాటిల్లడం, దిగుబడులు తగ్గడం ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు అంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మరికొద్దిరోజుల పాటు ధరలు దిగివచ్చే అవకాశం కనిపించడం లేదని చెబుతున్నారు.



సాక్షి, భీమవరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని గోదావరి పరీవాహక లంక గ్రామాలు, నూజివీడు, చింతలపూడి, కుక్కునూరు, వేలేరుపాడు, ఆగిరిపల్లి తదితర ప్రాంతాల్లోని 5 వేల ఎకరాల్లోను, పక్కనే గల డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలోని లంక గ్రామాల్లోని 15 వేల ఎకరాల్లో బీర, బెండ, దొండ, వంకాయ, దొండ, కాకర, ఆనబ తదితర పంటలు సాగవుతున్నాయి. గతేడాది డిసెంబర్‌లో వచ్చిన మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో రబీ కూరగాయల సాగు ఆలస్యం కావడం, ఈ ఏడాది వేసవి ఎండల తీవ్రత అధికంగా ఉండటం పంటలకు నష్టం కలిగించింది. 45 డిగ్రీలు పైబడి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పూత మాడిపోయి దిగుబడులు దెబ్బతిన్నాయి. వర్షాభావ పరిస్థితులు పంటలకు నష్టం కలిగించాయని ఉద్యాన శాఖ అధికారులు అంటున్నారు.

రెట్టింపైన ధరలు

స్థానిక దిగుబడులు తగ్గిపోవడంతో గత పది రోజుల వ్యవధిలో బీర, బెండ, దొండ, ఆనబ, పచ్చిమిర్చి కూరగాయాల ధరలు రెట్టింపై వినియోగదారులను బెంబేలెత్తిస్తున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా వంకాయలు కిలో రూ.100కు చేరుకున్నాయి. తొలకరి వర్షాలతో వేసిన కూరగాయల పంటలు కొద్ది రోజుల్లో దిగుబడులు వచ్చినా, జూలైలో గోదావరికి వరదలు రానుండటంతో లంక భూములు ముంపునకు గురై పంటలకు నష్టం వాటిల్లే అవకాశముండటం ఆందోళనకు గురిచేస్తోంది. మెట్ట ప్రాంతంలో కూరగాయల పంటలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ధరలు తగ్గుముఖం పట్టే అవకాశముందని వ్యాపార వర్గాలు అంటున్నాయి. కోల్‌కతా, బెంగళూరు ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకునే బంగాళదుంప, బీట్‌రూట్, క్యారెట్, క్యాబేజీ ధరలు కూడా పెరుగుతున్నాయి.

టమాటా మోత

అన్ని కూరల్లో ఎక్కువగా వినియోగించే టమాటా ధర కిలో రూ.100కు చేరుకుంది. చిత్తూరు, బెంగళూరు నుంచి రోజుకు జిల్లాకు 80 టన్నుల వరకు టమాటా దిగుమతి అవుతుంది. ఆయా చోట్ల పంటలు దెబ్బతినడం వలన ప్రస్తుతం 30 టన్నులు కూడా రావడం లేదని వ్యాపారులు అంటున్నారు. మరోపక్క ఉల్లిపాయల ధరలు దిగిరావడం లేదు. పది రోజుల క్రితం కిలో రూ.25లు ఉండగా ప్రస్తుతం రూ.45కు చేరింది. మహారాష్ట్ర దిగుమతులు తగ్గడం ధర పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది. బయటి మార్కెట్‌లో ధరలు ఇలా ఉంటే తోపుడు బండ్లు, సైకిళ్లపై అమ్మకాలు చేసే వారి వద్ద ఈ ధరలు మరింత అధికంగా ఉంటున్నాయని వినియోగదారులు అంటున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మరికొద్ది రోజులు ఇవే ధరలు కొనసాగే అవకాశముందని వ్యాపారస్తులు అభిప్రాయపడుతున్నారు.

కూరగాయల ధరలు (కిలో)

రకం	10 రోజుల క్రితం	ప్రస్తుతం
ఉల్లిపాయలు	రూ.25	రూ.45
వంకాయలు	రూ.40	రూ.100
బీరకాయలు	రూ.40	రూ.80
బెండకాయలు	రూ.40	రూ.80
పచ్చిమిర్చి	రూ.60	రూ.80
టమాటా	రూ.40	రూ.100
దొండ	రూ.30	రూ.60
క్యారెట్	రూ.40	రూ.50
బీట్‌రూట్	రూ.40	రూ.50
బంగాళాదుంప	రూ.25	రూ.40
అల్లం	రూ.150	రూ.200

దిగుబడులు లేకపోవడంతోనే..



అధిక ఎండలు వలన కూరగాయల పంటలు దెబ్బతిని దిగుబడులు తగ్గిపోవడం వలన ధరలు పెరిగిపోతున్నాయి. నాణ్యమైన సరుకు రావడం లేదు. రవాణాలో కూరగాయలు పాడైపోవడం వలన వ్యాపారులు నష్టపోతున్నారు. మరికొద్ది రోజులు ఈ ధరలు కొనసాగే అవకాశం ఉంది.

–గురివెళ్ల నాయుడు, కూరగాయల వ్యాపారి, ఆకివీడు

ధరలు మండిపోతున్నాయి



మార్కెట్‌లో కూరగాయాల ధరలు మండిపోతున్నాయి. కిలో రూ.60 నుంచి రూ.100ల వరకు ఉండటంతో కొనుగోలు చేసేందుకు పేద వర్గాల వారు ఇబ్బంది పడాల్సి వస్తోంది. వంటల్లో ఎక్కువగా ఉపయోగించే ఉల్లిపాయలు, టమాటా ధరలు చూస్తుంటే భయమేస్తోంది.

–రొక్కాల మేరీ, వినియోగదారురాలు, పాలకొల్లు

రాష్ట్రంలో విస్తరించిన నైరుతి రుతుపవనాలు

ఉరుములతో కూడిన తేలికపాటి వర్షాలు

సాక్షి, అమరావతి: నైరుతి రుతుపవనాలు రాష్ట్రం అంతటా విస్తరించాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కర్ణాటక, కేరళ తీరాల మీదుగా ద్రోణి కొనసాగుతోందని పేర్కొన్నారు. దీని ప్రభావంతో శుక్రవారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. శనివారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం పడేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశువులు, గొర్రెల కాపరులు చెట్లు, పోల్స్, టవర్స్ కింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండొద్దని సూచించారు.

సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన అనివార్యం

సాక్షి, అమరావతి: మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో భాగంగా వారికి సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించడం అనివార్యమని డీఎంఈ డాక్టర్ నరసింహం అన్నారు. ఏపీ నర్సింగ్ కౌన్సిల్, ఎకో ఇండియా సంయుక్తంగా మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ నివారణ, గుర్తింపు, ఇతర అంశాలపై నర్సుల్లో నైపుణ్యాల పెంపునకు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించాయి. ఇందులో భాగంగా ఎంపిక చేసిన నర్సులతో గురువారం డీఎంఈ నరసింహం, నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ సుశీల, ఎకో ఇండియా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సందీప్ భల్లా వర్చువల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డీఎంఈ నరసింహం మాట్లాడుతూ.. సర్వైకల్ క్యాన్సర్ నివారణలో నర్సులు కీలక పాత్ర పోషించాలన్నారు. సంక్లిష్ట కేసుల నిర్వహణలో నర్సుల్లో నమ్మకాన్ని పెంచడానికి ఈ కార్యక్రమం తోడ్పడుతుందన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

బస్సుల రాకపోకలు లేక పాట్లు

- 7 కి.మీ.లు కాలి నడకన విద్యార్థులు



బడికి కాలి నడకన వెళుతున్న విద్యార్థులు

రాయచూరు రూరల్: జిల్లాలో పాఠశాలలు ప్రారంభమై 20 రోజులు గడిచినా గ్రామీణ ప్రాంతాల నుంచి నగర ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో విద్యనభ్యసించడానికి రవాణ సౌకర్యం కొరత అధికమైంది. మస్కి తాలూకా కవితాళ మండల కేంద్రానికి చేరడానికి విద్యార్థులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాలూకాలోని నెలకోళ, కాచాపుర, యాతగల్‌లకు చెందిన సుమారు 80 మంది విద్యార్థులు అమీన్‌గడ, హట్టి, నీలగల్, లింగసూగూరులకు వెళ్లాలంటే 7 కిలో మీటర్లు దూరం కాలి నడకన వెళ్లాల్సి వస్తోంది. శాసన సభ్యులు బసనగౌడ, మానప్ప వజ్జల్, హంపయ్య నాయక్ మౌనం వహించడంపై విద్యార్థులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర మంత్రి కుమారకు అభినందన



కేంద్ర మంత్రిని అభినందిస్తున్న అమరేశ్వర నాయక్

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలో భారీ పరిశ్రమల స్థాపనకు చర్యలు చేపట్టాలని రాయచూరు మాజీ ఎంపీ రాజా అమరేశ్వర నాయక్ కేంద్ర భారీ పరిశ్రమల శాఖా మంత్రి కుమారస్వామికి విన్నవించారు. ఆయన గురువారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి పుష్ప గుచ్ఛం అందించి అభినందించి మాట్లాడారు. రాయచూరు, యాదగిరి జిల్లాల్లో భారీ పరిశ్రమలు ప్రారంభిస్తే ప్రజలు వలస వెళ్లకుండా నివారించవచ్చన్నారు.

అంగన్‌వాడీలకు తరగతులు కేటాయించరూ



వినతిపత్రం సమర్పిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాలకు ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను కేటాయించాలని అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం జిల్లాధ్యక్షురాలు పద్మ డిమాండ్ చేశారు. గురువారం నగర శాసన సభ్యుల నివాసం ముందు అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహించే కార్యకర్తలకు ఇప్పటికే ఎల్‌కేజీ, యూకేజీ పాఠాల బోధనకు సంబంధించిన శిక్షణ ఇచ్చారన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలకు కేటాయించే పనులను, పథకాలను విద్యాశాఖకు అప్పగించేందుకు తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్‌కు వినతిపత్రం సమర్పించారు.

నేడు నగరానికి మంత్రి రాక



మంత్రి శరణ ప్రకాష్ పాటిల్

రాయచూరు రూరల్: జిల్లా ఇంచార్జి, రాష్ట్ర వైద్య విద్యా శాఖా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్ శుక్రవారం నగరంలో పర్యటించనున్నారు. జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మంత్రి అనంతరం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కుమార నాయక్ తరపున ప్రచారానికి కూడా గైర్హాజరయ్యారు. వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడినా స్పందించలేదు. తాజాగా నగరంలో మూడు రోజుల పాటు జరగనున్న మున్నూరు కాపు సమాజం ఏర్పాటు చేసిన ముంగారు సాంస్కృతిక ఉత్సవాల ప్రారంభోత్సవానికి హాజరు కానున్నారు. అనంతరం జెడ్పీ సభాంగణంలో అధికారులతో సమావేశంలో పాల్గొంటారని అధికార వర్గాలు తెలిపాయి.

సొంతదార్లకు సొత్తు అప్పగింత



చోరీ సొత్తును సొంతదార్లకు అప్పగిస్తున్న ఎస్పీ శ్రీహరిబాబు

హొసపేటె: దొంగలించిన మొబైల్ ఫోన్లను సొంతదార్లకు పోలీసులు అప్పగించిన ఘటన టౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం జరిగింది. దొంగలించిన సుమారు 15 మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న వారికి విజయనగర జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు ఆధ్వర్యంలో తిరిగి ఇచ్చారు. సుమారు రూ.3.425 లక్షల విలువ చేసే వివిధ కంపెనీలకు చెందిన ఫోన్లు తిరిగి ఇవ్వడంతో వారు పోలీస్ శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఏఎస్పీ సలీం పాషా, డీఎస్పీ మంజునాథ్ పాల్గొన్నారు.

నేడే మేయర్ ఎన్నిక.. వీడని ఉత్కంఠ

- అభ్యర్థిత్వం ఇంకా కొలిక్కిరాని వైనం
- పదవి రేసులో నలుగురు కార్పొరేటర్లు

సాక్షి,బళ్లారి: నగర మేయర్ ఎంపికకు సంబంధించి అధికార కాంగ్రెస్ పార్టీలో తీవ్ర పోటీ నెలకొనడంతో కాంగ్రెస్ రాష్ట్ర హైకమాండ్ రంగంలోకి దిగింది. నగర మేయర్ ఎన్నిక రేపు (ఈనెల 21)వ తేదీన జరిపేందుకు అధికారులు తేదీ ఖరారు చేయడంతో మేయర్ రేసులో నలుగురు కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు వివేక్(విక్కీ), ముల్లంగి నందీష్, ప్రభంజన్‌కుమార్, గాదెప్ప తీవ్రంగా పోటీ పడటంతో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మేయర్ అభ్యర్థి పేరు కొలిక్కి రాకపోవడంతో బుధవారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పెద్దలు రంగంలోకి దిగారు. కేపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ, మేయర్ ఎన్నికకు సంబంధించిన పరిశీలకులు బెంగళూరుకు చెందిన నారాయణస్వామి, కేపీసీసీ ఉపాధ్యక్షుడు సూరజ్ హెగ్డే బళ్లారికి విచ్చేశారు.

పట్టువీడని కార్పొరేటర్లు

వారు నగరంలోని అల్లం భవన్‌లో స్థానిక ఎమ్మెల్యేలు నాగేంద్ర, భరత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు నాసిర్ హుస్సేన్, లోక్‌సభ సభ్యుడు తుకారాం, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అల్లం ప్రశాంత్ సమక్షంలో కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుని చర్చలు జరిపారు. మేయర్ స్థానం జనరల్‌కు కేటాయించడంతో ఆ వర్గానికి చెందిన ఒకే సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు కార్పొరేటర్లు పట్టువీడటం లేదు. ముగ్గురు కార్పొరేటర్లు ఈసారి ఎలాగైనా మేయర్ పదవి దక్కించుకోవాలని ఎవరికి వారు పట్టువీడకుండా తీవ్ర ప్రయత్నాలు చేస్తూ లోలోపల కార్పొరేటర్ల మద్దతు కోరుతూ రాజకీయ హైడ్రామా చేస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో చీలిక వస్తుందనే భయంతో నేతలు రంగంలోకి దిగి కార్పొరేటర్లతో మంతనాలు జరిపారు.

పార్టీ కోసం కష్టపడిన వారికే అందలం

ఈ సందర్భంగా మేయర్ రేసులో ఉన్న కార్పొరేటర్లు మాట్లాడుతూ తాము పార్టీ కోసం ఎంతో కష్టపడ్డామని ఎవరికి వారు కార్పొరేటర్లు తమ అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లు చెప్పుకొచ్చారు. మేయర్ రేసులో ఉన్న వారితో పాటు పలువురు కార్పొరేటర్ల అభిప్రాయాలను కూడా పార్టీ పెద్దలు తెలుసుకున్నారు. అనంతరం పార్టీ పరిశీలకులు, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కష్టపడి పార్టీని బలోపేతం చేసిన వారికి కచితంగా అందలం ఎక్కిస్తామన్నారు. మేయర్ పదవి ఒకటే ఉంటుందని, నలుగురు పోటీలో ఉన్నారని, ఎవరిని మేయర్ ఎంపిక చేయాలో సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు నిర్ణయం తీసుకుని ఒక పేరును సూచిస్తారన్నారు.



బళ్లారి నగర నడిబొడ్డులోని సిటీ మున్సిపాలిటీ కార్యాలయం

విపక్షానికి అవకాశమివ్వొద్దు

అందరూ అందుకు సమ్మతించి ఏకాభిప్రాయంతో ఏకగ్రీవంగా మేయర్ ఎన్నిక జరిగేందుకు తోడ్పాటు నందించాలని, ప్రతిపక్ష బీజేపీకి ఎట్టి పరిస్థితుల్లోను రాజకీయం చేసేందుకు అవకాశం కల్పించకూడదని, కలిసి ఉంటేనే కలదు సుఖం అన్న పెద్దలు హితోక్తిని అనుసరించి ముందుడుగు వేయాలన్నారు. పార్టీ నిర్ణయాన్ని ధిక్కరిస్తే సమంజసంగా ఉండదన్నారు. బుడా అధ్యక్షుడు జే.ఎస్ ఆంజనేయులు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మంజుల తదితరులతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన 26 మంది కార్పొరేటర్లు హాజరయ్యారు.

పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించండి



జిల్లాధికారికి వినతిపత్రాన్ని అందిస్తున్న కరవే నేతలు



ఆటోను తాడుతో లాగుతూ నిరసన తెలియజేస్తున్న దృశ్యం

హొసపేటె: రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడాన్ని ఖండిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా గురువారం రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ శెట్టి ఆదేశాల మేరకు విజయనగర జిల్లా అధ్యక్షుడు షణ్ముక్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం ద్వారా నిత్యావసర వస్తువులు, ఆహార ధాన్యాల ధరలు పెరిగి ఆటోడ్రైవర్లు, కార్ల యజమానులు, పేదలు, అణగారిన వర్గాలు, దళితులు బతకడం కష్టంగా మారిందన్నారు. 5 హామీలను అమలు చేసి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇప్పుడు ధరలు తగ్గించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉధృత పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీసీ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. జిల్లా ఉపాధ్యక్షులు తిప్పన్న, జయశీల్ శెట్టి, హెచ్ పంపాపతి, తాలూకా యూత్ యూనిట్ అధ్యక్షుడు రాఘవేంద్ర, తాలూకా ఉపాధ్యక్షులు ప్రశాంత్, రాఘవేంద్ర తుకారాం, స్వామి, రామప్ప, భీమప్ప పాల్గొన్నారు.

పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి

రాయచూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని బీజేపీ నేతలు ఆందోళన చేపట్టారు. గురువారం సింధనూరు బస్టాండ్ వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు కరియప్ప మాట్లాడారు. ప్రతిపక్షంలో కూర్చొని మాట్లాడిన నేతలు నేడు మౌనం వహించి లోక్‌సభ ఎన్నికలు ముగిసిన వెంటనే ధరలు పెంచడం తగదన్నారు. ఒక వైపు పన్నులు పెంచుతూ, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడాన్ని ఖండిస్తూ వాటిని వెంటనే తగ్గించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు.

హాల్ టికెట్ కోసం విద్యార్థి నిరసన

హొసపేటె: కొప్పళ జిల్లా కుకనూరు తాలూకాలోని మంగళూరు కేపీఎస్(హైస్కూల్ డివిజన్) పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడి నిర్లక్ష్యం వల్ల 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్ష రాయలేకపోయిన విద్యార్థి పాఠశాల ఎదుట తన తండ్రితో కలిసి నిరసనకు దిగిన ఘటన వెలుగు చూసింది. పరశురామ అనే విద్యార్థి టెన్త్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడు. అయితే ఆ విద్యార్థి తన హాల్ టికెట్ కోసం చెల్లించాల్సిన అన్ని రుసుములను ప్రధానోపాధ్యాయుడికి అందించాడు. కానీ విద్యార్థికి బోర్డు నుంచి తన హాల్ టికెట్ అందలేదు. పరీక్ష ఫీజుగా రూ.680లు చెల్లించామని, అయినా తన కుమారుడు పరీక్షకు హాజరు కాలేకపోయాడని విద్యార్థి తండ్రి విశ్వనాథ్ వాపోయారు. తాలూకాలోని మంగళూరు కేపీఎస్ హైస్కూల్ విభాగంలో 10వ తరగతి పరీక్షకు 146 మంది హాజరయ్యారు. వారిలో 53 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. సప్లిమెంటరీ పరీక్షకు హాజరయ్యేందుకు పరీక్ష ఫీజు చెల్లించిన విద్యార్థి పరశురామ తనకు పరీక్ష హాల్ టికెట్ అందలేదని ఆవేదన వ్యక్తం చేశాడు.



ప్రభుత్వ పాఠశాల ఎదుట నిరసన ప్రకటిస్తున్న పరశురామ

హంతకుల్ని కఠినంగా శిక్షించండి

హొసపేటె: చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామిని హత్య చేసిన హంతకులను వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బేడ జంగమ, వీరశైవ లింగాయత సమాజం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సమాజ ప్రముఖులు మాట్లాడుతూ ఈనెల 8న నటుడు దర్శన్, పవిత్రగౌడ తమ గ్యాంగ్‌తో కలిసి చిత్రదుర్గకు చెందిన రేణుకా స్వామిని కిడ్నాప్ చేసి చిత్రహింసకు గురి చేసి చంపడం చాలా హేయమన్నారు. వీధిన పడిన మృతుడి కుటుంబానికి ప్రభుత్వం స్పందించి తగిన భద్రత కల్పించాలన్నారు. ఈ చర్యకు పాల్పడిన, సహకరించిన వారందరినీ ప్రభుత్వ కఠినంగా శిక్షించాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని జిల్లాధికారి దివాకర్‌కు అందజేశారు.



జిల్లాధికారికి వినతిపత్రాన్ని అందిస్తున్న సమాజ పెద్దలు

భూసమితి అధ్యక్షుడిగా తిమ్మనగౌడ

సాక్షి,బళ్లారి: బగర్ హుకుం(ఆక్రమిత ప్రభుత్వ) భూసమితి తాలూకా అధ్యక్షుడిగా సిద్ధమ్మనహళ్లి తిమ్మనగౌడ నియమితులయ్యారు. ఈమేరకు ఆయన గురువారం నగరంలో తాలూకా కార్యాలయంలో సంబంధిత అధికారుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర, నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, ఏపీఎంసీ అధ్యక్షుడు కట్టెమనె నాగేంద్ర, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మీనళ్లి చంద్రశేఖర్ తదితరులు ఆయన్ను కలుసుకుని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి, సంబంధిత రైతులకు న్యాయం చేస్తానన్నారు. రైతులు ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న భూములకు పట్టాలు తీసుకునేందుకు దరఖాస్తుదారులకు పట్టాలు అందజేసేందుకు కృషి చేస్తామన్నారు.



తిమ్మనగౌడను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు నాగేంద్ర, భరత్‌రెడ్డి

చురుగ్గా అభివృద్ధి పనులు చేపట్టాలి

రాయచూరు రూరల్: జిల్లాలో చురుగ్గా జాతీయ రహదారుల అభివృద్ధి పనులు చేపట్టాలని రాష్ట్ర చిన్న నీటిపారుదల శాఖా మంత్రి ఎన్ఎస్ బోసురాజు, లోక్‌సభ సభ్యుడు కుమార నాయక్ పేర్కొన్నారు. బుధవారం బెంగళూరులోని వికాససౌధలో జాతీయ రహదారుల శాఖ అధికారులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాధికార అధికారుల సమావేశంలో హునగుంద-రాయచూరు రహదారి నిర్మాణానికి భూస్వాధీనంలో నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. కృష్ణానదిపై నిర్మిస్తున్న రోడ్డు వంతెన పనులు త్వరగా ముగించాలన్నారు. నగరంలోని ఆర్టీఓ సర్కిల్ నుంచి మలయాబాద్ మలుపు వరకు రహదారి పనులు పూర్తి చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న మంత్రి బోసురాజు

అధికారులపై చర్యలు తీసుకోండి

రాయచూరు రూరల్: మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలిలో రూ.187 కోట్ల అవినీతి జరిగినట్లు రుజువైనందున అధికారులపై చర్యలు చేపట్టాలని జేడీఎస్ జిల్లాధ్యక్షుడు విరుపాక్షి డిమాండ్ చేశారు. ఆయన గురువారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. మంత్రి నాగేంద్ర మౌఖిక ఆదేశాల మేరకు ఎండీ, అధికారులు కలిసి నిధులను స్వాహా చేయడానికి తనపై ఒత్తిడి తేవడంతో అవమానంతో ఆత్మహత్య చేసుకున్నట్లు మండలి అధికారి చంద్రశేఖర్ మరణ వాంగ్మూలంలో పేర్కొన్నాడన్నారు. నిధుల దుర్వినియోగంపై సీబీఐతో విచారణ చేయించాలని, బాధ్యులైన బ్యాంక్ సీఈఓతో పాటు ఆరుగురు మండలి అధికారులపై అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. నరసింహ నాయక్, శివశంకర్, రామకృష్ణ, లక్ష్మీపతి, నాగరాజ్‌లున్నారు.



మాట్లాడుతున్న విరుపాక్షి

విజ్ఞానంపై జాగృతి అవసరం



కార్యక్రమం ప్రారంభిస్తున్న అతిథులు

రాయచూరు రూరల్: విద్యార్థులు విజ్ఞానంపై ప్రజల్లో జాగృతి కల్గించాలని ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు జయణ్ణ సూచించారు. గురువారం రంగమందిరంలో జరిగిన విద్యా శాఖ, భారత జ్ఞాన విజ్ఞాన సమితి, సైన్స్ కేంద్రం, జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు, విద్యార్థులతో సంవాదంలో పాల్గొని మాట్లాడారు. నేడు అధిక ఉష్ణోగ్రతలతో పోరాడుతున్న విషయాన్ని గమనించుకొని మొక్కలు పెంచడం, పరిసరాలను సంరక్షించడం మనందరి కర్తవ్యమన్నారు. సమావేశంలో కమల్ లోదియా, అజిత్ కుమార్, రాకేష్ రాజలబండి, హఫీజుల్లా, మియాజ్‌లున్నారు.

తిరుమలకు పాదయాత్ర షురూ

కేజీఎఫ్: తిరుమల తిరుపతి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో 31వ సంవత్సరం తిరుమల పాదయాత్రను గురువారం నగరంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రారంభించారు. 350 మంది భక్తులు ఉదయం ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ట్రస్టు అధ్యక్షుడు సతీష్, కోశాధికారి వేలు మాట్లాడుతూ గత 30 ఏళ్లగా ప్రతియేటా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లుగానే ఈ యేడాది కూడా చేస్తున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల పాటు ఈ పాదయాత్ర కొనసాగుతుందన్నారు. ప్రతియేటా భక్తుల సంఖ్య పెరుగుతోందన్నారు. భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించామన్నారు.

29న హుబ్లీ-ధార్వాడ పాలికె మేయర్ ఎన్నికలు

హుబ్లీ: హుబ్లీ ధార్వాడ నగర పాలక సంస్థ 23వ అవధికి మేయర్, ఉపమేయర్ ఎన్నికకు ఎట్టకేలకు ముహూర్తం నిర్ణయించారు. ఈ నెల 29న కొత్త డిప్యూటీ మేయర్ అధికార పీఠం ఎక్కనున్నారు. ఎన్నికల అధికారి, డివిజనల్ ప్రాంతీయ కమిషనర్ సంజయ్ శెట్టన్నవర్ ఎన్నికల తేదీని అధికారికంగా ప్రకటించారు. ఆ మేరకు ఈసారి మేయర్ బీసీఏ, డిప్యూటీ మేయర్ ఎస్సీ మహిళలకు కేటాయించినట్లుగా ఆయన స్పష్టం చేశారు. కాగా మొత్తం 81 కార్పొరేటర్లతో పాటు మొత్తం 89 మంది ఈ ఎన్నికల్లో పాల్గొంటారు. గత మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల వేళ బీజేపీ కార్పొరేటర్ సరస్వతి విప్ ఉల్లంఘించిన కారణంగా బీజేపీ అధ్యక్షులు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణలో నిజమని తెలినందున అందుకు ఆమెను కార్పొరేటర్ సభ్యత్వం నుంచి అనర్హురాలిగా ప్రకటించారు. ఈ విషయంపై ఆమె కోర్టును ఆశ్రయించారు. 81 మంది సభ్యుల్లో పాలికెలో బీజేపీకి 38 మంది కార్పొరేటర్లు, ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక లోక్‌సభ సభ్యుడు, ముగ్గురు ఎమ్మెల్సీలు కలుపుకొని మొత్తం 44 మంది ఉన్నారు. అదే విధంగా కాంగ్రెస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలతో పాటు 33 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఒకరు జేడీఎస్ కార్పొరేటర్ ఉండగా తొలిసారిగా పాలికెలో ఖాతా తెరిచిన ఏఐఎంఐఎం ముగ్గురు సభ్యులు ఓటు హక్కును కలిగి ఉన్నారు. ఈ సారి కూడా బీజేపీ సభ్యులే పాలకులుగా రానున్నట్లుగా ఆ పార్టీ నేతలు చెబుతుండగా కాంగ్రెస్ కూడా తన శాయశక్తులా పాలికె హస్తగతానికి ప్రయత్నిస్తుందని పరిశీలకులు భావిస్తున్నారు.

ఒరిగిన ట్రాన్స్‌ఫార్మర్



ట్రాన్స్‌ఫార్మర్‌ను సరి చేసిన దృశ్యం

బళ్లారిటౌన్: నగరంలోని సంగనకల్లు రోడ్డులోని వాజ్‌పేయి లేఅవుట్లో నూతనంగా నిర్మిస్తున్న వీరశైవ విద్యావర్ధక సంఘం పాఠశాల కాంపౌండ్ నిర్మాణ పనులు చేపడుతుండగా ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కసారిగా గోడపైకి వాలిపోవడంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. గురువారం ఉదయం కాంపౌండ్ నిర్మాణం కోసం జేసీబీతో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాల వద్ద తవ్వుతుండగా ఒక్కసారిగా స్తంభాలు ఒరిగి పాఠశాల గోడకు ఆనుకున్నాయి. కేఈబీ సిబ్బంది వెంటనే స్థలాన్ని పరిశీలించి మధ్యాహ్నం కల్లా వాటిని సరి చేశారు.

కిడ్నాప్‌నకు విఫలయత్నం

హుబ్లీ: కారులో వచ్చిన దుండగులు కార్పొరేటర్ నిరంజనయ్య హిరేమఠ వద్ద పని చేస్తున్న ఈరణ్ణను కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారు. ఈరణ్ణ బైక్‌పై వెళుతుండగా కారులో వచ్చిన ముగ్గురు బైక్‌ను అడ్డగించి కారు ఎక్కు అంటూ డిమాండ్ చేశారు. నిరాకరించడంతో చుట్టుముట్టిన దుండగులు అతడిపై దాడి చేశారు. వారి నుంచి తప్పించుకోబోగా కారుతో వెంబడించారు. అయితే అతడు తప్పించుకోవడంతో జోళదవీధి గుండా దుండగులు పరారైనట్లు బాధితుడు గంటికేరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె



సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

బళ్లారిఅర్బన్: వివిధ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు జిల్లాధికారి కార్యాలయం ఎదుట ప్రారంభించిన నిరవధిక సమ్మె మూడో రోజు కూడా కొనసాగింది. సీఐటీయూ జిల్లాధ్యక్షుడు సత్యబాబు, సంయుక్త కార్యదర్శి తిప్పేస్వామి, జేఎంఎస్ నాయకురాలు చంద్రకుమారి, సంఘాల నాయకులు ఎర్రిస్వామి, మల్లమ్మ, గీతమ్మ, ఈరమ్మ, రాణి ఎలిజబెత్, మహంతమ్మ, కే.విమల, రుద్రమ్మ, తదితరులతో పాటు తాలూకా సమితి పదాధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

జలపాతంలో పడి వ్యక్తి మృతి

హుబ్లీ: విహారయాత్ర కోసం సాతొడ్డి జలపాతానికి వెళ్లిన హుబ్లీ నివాసి హసన్(36) ఆ జలపాతంలోని సుడిగుండానికి చిక్కి మృతి చెందాడు. హుబ్లీ మౌలాలి దర్గా ప్రాంత నివాసి అయిన ఇతడు తన బంధువులు, స్నేహితులతో కలిసి జలపాతం వద్దకు వెళ్లాడు. స్నానం చేయడానికి నీటిలోకి దిగగా సుడిగుండానికి చిక్కి మునిగి పోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

నాలుగో రోజుకు చేరిన ధర్నా



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సిరుగుప్ప: కలబుర్గి విభాగ విద్యా శాఖ విడుదల చేసిన ఆదేశాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఒత్తిడి చేస్తూ తాలూకా అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం సీడీపీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె నాల్గోరోజు కొనసాగింది. సమ్మెలో పాల్గొన్న అధ్యక్షురాలు బి.ఉమాదేవి మాట్లాడుతూ ఆ ఆదేశాల వల్ల ఐసీడీఎస్ కార్యకలాపాలను నిర్వీర్యం చేయడానికి విద్యా శాఖ పూనుకొందన్నారు. కళ్యాణ కర్ణాటకలోని 8 జిల్లాల్లో తాలూకాలో 30 ప్రాథమిక పాఠశాలల్లో ఆరంభిక బాల్య పోషణ, ఈసీసీఈని ప్రారంభించాలని ప్రయోగాత్మకంగా ఆదేశించిందన్నారు. ఇలా ఐడీసీఎస్ పనులన్ని విద్యా శాఖకు బదిలీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అందువల్ల తక్షణమే ఆ ఆదేశాలను వాపసు తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా తాలూకా అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సూచన



సమస్యలపై అర్జీలను స్వీకరిస్తున్న జిల్లాధికారి

సిరుగుప్ప: ప్రజా సమస్యలపై అధికారులు సత్వరం చర్యలు తీసుకొని పరిష్కరించాలని జిల్లాధికారి ప్రశాంతకుమార్ మిశ్రా సూచించారు. ఆయన గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనతా దర్శన్‌లో పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ నగరసభ కమిషనర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లపై జిల్లాధికారి చిందులు వేశారు. ఫారం నం-3 ఇవ్వడానికి ఎందుకు ఆలస్యం అవుతుందని నిలదీశారు. అనంతరం వివిధ శాఖల అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్నింటిని ఆయా అధికారులకు పరిష్కరించాలని సూచించారు. ఎమ్మెల్యే బీఎం నాగరాజ్, జెడ్పీ సీఈఓ రాహుల్ శరణప్ప సంకనూరు, డీఎస్పీ వెంకటేష్, తాలూకా అధికారులు పాల్గొన్నారు.

భూకబ్జారాయుళ్లపై చర్యలేవీ?



మాట్లాడుతున్న శ్రీనివాస్

రాయచూరు రూరల్: నగరంలో ప్రభుత్వ భూములను కబళించిన వారిపై చర్యలు చేపట్టాలని ఆర్టీఐ కార్యకర్త శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో ఏపీఎంసీకి కేటాయించిన సర్వే నంబర్ 240-1లో 1.30 ఎకరాలు, 246లో 2.37 ఎకరాలను మాజీ శాసన సభ్యుడు పాపారెడ్డి ఆక్రమించారని ఆరోపించారు. నరసారెడ్డి, దొడ్డ మల్లేశప్ప కుటుంబ సభ్యులు, శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఆర్టీఏ అధ్యక్షుడు రాజ్ కుమార్‌లు తమ స్వార్థం కోసం ఈ భూములను వాడుకున్నారన్నారు.

అక్రమాలపై దర్యాప్తునకు డిమాండ్



దాఖలాలు ప్రదర్శిస్తున్న అంబరీష్

కోలారు: బెంగళూరు ఉత్తర వర్సిటీలో జరిగిన అక్రమాలపై ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపించి నిందితులను శిక్షించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వి.అంబరీష్ తెలిపారు. గురువారం నగరంలోని పాత్రికేయుల భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వవిద్యాలయంలో అధికారిక టెండర్లు లేకుండా వివిధ పనులను నిర్వహించారన్నారు. సమాచార హక్కు చట్టం కింద పొందిన సమాచారం ద్వారా విశ్వ విద్యాలయంలో భారీ స్థాయిలో అక్రమాలు జరిగి కోట్లాది రూపాయలు ప్రభుత్వానికి నష్టం కలుగజేశారని ఆరోపించారు. విశ్వవిద్యాలయంలోని కొంతమంది ఉన్నత స్థాయి అధికారులు ఈ అక్రమాల్లో నేరుగా పాలు పంచుకున్నారన్నారు. సరైన తనిఖీ చేయిస్తే అన్ని విషయాలు బయట పడతాయన్నారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న వర్సిటీలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. కాంట్రాక్టుతో పాటు దినకూలీ ఉద్యోగుల నియామకాల్లో కూడా అక్రమాలు జరిగాయన్నారు. రూ.8 కోట్ల పనులకు రూ.18 కోట్ల వరకు బిల్లులు చేసుకుని లూటీ చేశారన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. సామాజిక కార్యకర్త చంబిమలై రమేష్, దళసగెరె మూర్తి, హూవళ్లి నాగరాజ్ ఉన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రూపా శశిధర్

కేజీఎఫ్: తాలూకాలోని బేతమంగల టి.గొల్లహళ్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నల్లూరు గ్రామంలో గురువారం ఎమ్మెల్యే రూపా శశిధర్ రూ.1.60 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తెచ్చి దశల వారీగా అభివృద్ధి పనులు నిర్వహిస్తామన్నారు. చాలా పాతబడి శిథిలమైన బేతమంగల చెరువు మరువకు, పాపేనహళ్లి, మల్లహళ్లి గ్రామం వద్ద మరువకు మరమ్మతులు చేస్తామన్నారు. జెడ్పీ మాజీ సభ్యుడు లక్ష్మీనారాయణ, జీపీ అధ్యక్షుడు విను కార్తీక్ పాల్గొన్నారు.